సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 15
సంచిక: 323

సోమవారం 13-2-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి శాశ్వత వనరులతో రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలన్నదే నా స్వప్నం'



అదరగొట్టారు

మహిళల టి20 ప్రపంచకప్ తొలిమ్యాచ్‌లో పాక్‌పై 7 వికెట్లతో గెలిచిన భారత్ -12లో



'రికార్డు'తో మెరిసిన జ్యోతి

ఆసియా ఇండోర్ అథ్లెటిక్స్ టోర్నీలో రజతం గెలిచిన ఏపీ అమ్మాయి జ్యోతి -12లో



4 హైకోర్టులకు కొత్త సీజేలు

4 హైకోర్టులకు సీజేలు నియమితులయ్యారు. గుజరాత్ సీజే జస్టిస్ సోనియా గోకానీ.. దేశంలోనే ఏకైక మహిళా సీజే కానున్నారు.

వివరాలు 6లో ▸



ట్రిపుల్ ట్రబుల్ నుంచి కాపాడేది..

త్రిపురను కాంగ్రెస్, సీపీఎం, తిప్రా మోతా అనే ట్రిపుల్ ట్రబుల్ నుంచి కాపాడేది బీజేపీ డబుల్ ఇంజన్ సర్కారేనని అమిత్ షా అన్నారు.

వివరాలు 6లో ▸



మన తెల్ల బంగారం

59 లక్షల టన్నుల లిథియం నిల్వలు జమ్మూ కశ్మీర్‌లో బయటపడ్డాయి. తెల్ల బంగారంగా పిలిచే ఈ ఖనిజం విశేషాలపై కథనం..

వివరాలు 6లో ▸



జీతం బత్తెం లేని చాకిరి

ఇంటి పని అంటే అది మహిళలు చెయ్యాల్సిందేనన్న భావన ఇంకా సమాజంలో పాతుకుపోయి ఉందని ఓ అధ్యయనం వివరించింది.

వివరాలు 6లో ▸

ఒక్క అబద్ధమున్నా

రాజీనామా

మోదీ పాలనలో ఏ రంగంలోనూ వృద్ధి లేదు

అసెంబ్లీలో ముఖ్యమంత్రి కేసీఆర్ సవాల్



- అన్నిట్లోనూ అత్యంత చెత్త పనితీరు..
- వార్షిక వృద్ధి రేటు 6.8% నుంచి 5.5 శాతానికి పడిపోయింది
- తలసరి ఆదాయం, ఎగుమతులు, పారిశ్రామిక వృద్ధి రేట్లు పడిపోయాయి..
- పెట్టుబడి వ్యయం తగ్గిపోయింది..
- జీడీపీలో అప్పుల శాతం, ద్రవ్యలోటు మాత్రం పెరిగిపోయాయన్న సీఎం
- ఎన్డీయే అంటే 'నో డేటా అవైలబుల్' అని ఎద్దేవా

"మన్మోహన్‌సింగ్ హయాంతో పోల్చితే ప్రధాని నరేంద్ర మోదీ హయాంలో వార్షిక వృద్ధిరేటు 6.8 శాతం నుంచి 5.5 శాతానికి పడిపోయింది. తలసరి ఆదాయం వృద్ధి రేటు 12.73 శాతం నుంచి 7.01 శాతానికి, ఎగుమతుల వృద్ధి రేటు 19.5 శాతం నుంచి 4.9 శాతానికి, పారిశ్రామిక వృద్ధి రేటు 5.87 శాతం నుంచి 3.2 శాతానికి పడిపోయింది. పెట్టుబడి వ్యయం 37.5% నుంచి 31 శాతానికి తగ్గింది. రూపాయి విలువ రూ.58.6 నుంచి రూ.82.6 శాతానికి దిగజారింది. మోదీ పాలనను మన్మోహన్ పాలనతో పోల్చుతూ 'ది లాస్ట్ డికేడ్' అనే పుస్తకాన్ని పూజా మెహ్రా రాశారు. మోదీ హయాంలో ఏ ఒక్క రంగంలోనైనా వృద్ధి ఉందా? అంటే లేదు. జీడీపీలో అప్పుల శాతం 52 శాతం నుంచి 56.2 శాతానికి, ద్రవ్యలోటు 4.77 శాతం నుంచి 5.1 శాతానికి పెరిగాయి. నేను చెప్పిన వాటిల్లో ఒక్కమాట అబద్ధమున్నా రాజీనామా చేస్తా. అన్ని రంగాల్లో అత్యంత చెత్తగా పనితీరు చూపిన ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది మోదీ ప్రభుత్వమే. ఎన్పీఏల పేరుతో రూ.14 లక్షల కోట్ల రుణాలు మాఫీ చేశారు. రూ.20 లక్షల కోట్లు ఏ ఎంఎస్ఎంఈలకు ఇచ్చారో భగవంతుడికే తెలుసు. పార్లమెంటులో అడిగితే నో డేటా అవైలబుల్ అన్నారు. ఎన్డీయే అంటే నో డేటా అవైలబుల్ (ఎన్డీఏ)."

-ద్రవ్య వినిమయ బిల్లుపై శాసనసభలో జరిగిన చర్చలో కేసీఆర్

మోదీ గెలిచారు ..

ప్రజలు ఓడారు

అసెంబ్లీలో సీఎం నిప్పులు

సాక్షి, హైదరాబాద్

దేశం ప్రతి రంగంలో డౌన్ అయ్యిందని సీఎం కేసీఆర్ విమర్శించారు. 'మోదీ గెలిచారు, బీజేపీ గెలిచింది. ప్రజలు మాత్రం ఓడిపోయారు..' అని అన్నారు. రాష్ట్ర శాసన సభ వేదికగా ముఖ్యమంత్రి ఆదివారం మరోసారి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో నిప్పులు చెరిగారు. మన్మోహన్ సింగ్ హయాంతో మోదీ హయాన్ని పోలుస్తూ.. దేశం ఘోరాతిఘోరంగా ఓడిపోయిందని మండిపడ్డారు. ద్రవ్య వినిమయ బిల్లుపై ఆదివారం శాసనసభలో జరిగిన చర్చకు ఆయన 2 గంటలకు పైగా బదులిచ్చారు. ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే..

పెనం మీద నుంచి పొయ్యిలోకి..

'దివాళ తీసుకుంటూ మేమే గొప్పోళ్లం అంటుంటారు. దేశంలో ఇదొక విచిత్రమైన పరిస్థితి. చిత్ర విచిత్రమైన పోకడలు, వింత వింత

మిగతా 2వ పేజీలో ▶



జస్టిస్ అబ్దుల్ నజీర్

ఏపీ కొత్త గవర్నర్‌గా జస్టిస్ అబ్దుల్ నజీర్

ఛత్తీస్‌గఢ్‌కు బిశ్వభూషణ్ బదిలీ

6 రాష్ట్రాలకు కొత్త గవర్నర్ల నియామకం.. మరో ఏడుగురి బదిలీలు



బిశ్వభూషణ్

సాక్షి, న్యూఢిల్లీ/ బెంగళూరు శివాజీనగర: ఆంధ్రప్రదేశ్ గవర్నర్‌గా సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ అబ్దుల్ నజీర్ నియమితులయ్యారు. ప్రస్తుత గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్‌ను ఛత్తీస్‌గఢ్ గవర్నర్‌గా నియమించారు. వివాదాస్పద మహారాష్ట్ర గవర్నర్ బీఎస్ కొశ్యారీకి ఉద్వాసన పలికారు. 12 రాష్ట్రాలకు కొత్త గవర్నర్‌లను నియమిస్తూ రాష్ట్రపతి జారీ చేసిన ఉత్తర్వులను కేంద్రం ఆదివారం విడుదల చేసింది. రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌కు ఓ న్యాయమూర్తి గవర్నర్‌గా నియామకం కావడం ఇదే తొలిసారి. ఉమ్మడి రాష్ట్రానికి జస్టిస్ ఓబుల్‌రెడ్డి, జస్టిస్ బీకే దివాన్

మిగతా 10వ పేజీలో ▶

12 రాష్ట్రాలకు కొత్త గవర్నర్లు

- వివరాలు 6లో▶

ఐదు బిల్లులు.. ఒక తీర్మానం

- ముగిసిన అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు
- ప్రజాస్వామ్యబద్ధంగా మండలి, అసెంబ్లీ భేటీలు: మంత్రి వేముల



- వివరాలు 3లో▶

కేసీఆర్ నోట.. ఈటల మాట

- అసెంబ్లీలో ఆయన పేరు 18 సార్లు ప్రస్తావన
- ఈటల ప్రశ్నలకు బదులిచ్చిన కేసీఆర్
- సర్వత్రా చర్చకు దారితీసిన తాజా పరిణామం

2లో

కల్తీ విత్తనాలు అమ్మితే ఉపేక్షించం

- ముఖ్యమంత్రి కేసీఆర్ హెచ్చరిక
- 2 లక్షల జనాభాకు ఒక సమీకృత మార్కెట్ ఏర్పాటుకు హామీ

న్యూస్‌రీల్

ఫిరాయింపు ఎమ్మెల్యేలపై సీబీఐ విచారణ చేపట్టాలి



కాంగ్రెస్ నుంచి గెలిచి, పార్టీ ఫిరాయించిన 12 మంది ఎమ్మెల్యేలపై సీబీఐ విచారణ చేయాలని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రధానమంత్రి, కేంద్ర హోంమంత్రి, సీబీఐ డైరెక్టర్, చీఫ్ సెక్రటరీకి, మొయినాబాద్ పోలీసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశామన్నారు.

- వివరాలు 3లో▶

'అమ్మా'రావం!



లక్షలు పోసినా దొరకని స్వదేశీ, విదేశీ ఆవు జాతులు ఇప్పుడు పంటపొలాల్లో చెంగుచెంగున పరుగెడుతుండటంతో రైతులు సంబరపడిపోతున్నారు. ఇదంతా కేంద్రం 'రాష్ట్రీయ గోకుల్ మిషన్' పథకం తాలూకు ఫలితం.

- వివరాలు 5లో▶

ఇల్లు కొనాలా? అద్దెకు తీసుకోవాలా?



సొంతంగా ఇల్లు సమకూర్చుకోవాలా? లేదంటే అద్దె ఇంట్లో ఉంటే ప్రయోజనమా? ఈ విషయంలో చాలామంది అయోమయపడతారు. నిజానికి గణాంకాల సహితంగా తెలుసుకుంటే కానీ, తీరే సందేహం కాదిది. సొంతింటి కలను రుణం రూపంలో నెరవేర్చుకుంటే లేదా అద్దె ఇంట్లో ఉంటే పన్ను కోణంలో కలిగే లాభనష్టాలపై కథనం..

- వివరాలు 14లో▶





ఇదండీ జగత్



అవన్నీ అబద్ధాలని నిరూపిస్తా

రాజీనామా చేస్తావా?

కేసీఆర్‌కు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ సవాల్



- డేట్, టైం ఫిక్స్ చెయ్.. బహిరంగ చర్చకు సిద్ధం
- రైతుల వద్దకు పోయి 24 గంటల కరెంట్ ఇస్తున్నట్లు చెప్పేధైర్యముందా?
- దేశ జీడీపీ గురించి చెప్పినవన్నీ అసత్యాలు... నువ్వే పెద్ద డిఫాల్టర్ సీఎంవి... నీ మాటలు నమ్మేదెవరు?
- అసెంబ్లీ సాక్షిగా అబద్ధాలు చెప్పినందుకు ప్రజలకు క్షమాపణ చెప్పాలి
- కేసీఆర్‌ను ఇతర రాష్ట్రాల ప్రజలు జోకర్‌లా చూస్తున్నరు

సాక్షి, హైదరాబాద్: 'సీఎం కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా చెప్పినవన్నీ అబద్ధాలని నిరూపిస్తా.... మాటకు కట్టుబడి రాజీనామా చేసే దమ్ముందా? డేట్, టైం ఫిక్స్ చెయ్... బహిరంగ చర్చకు సిద్ధం.. ఆధారాలతో నిరూపిస్తా' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కుమార్ సవాల్ విసిరారు. 24 గంటల కరెంట్ గురించి రైతుల వద్దకు పోయి చెప్పే దమ్ము బీఆర్ఎస్ నేతలకు ఉందా అని ప్రశ్నించారు. రైతులంతా వారిని ఉరికించి కొడతారన్నారు. దేశ జీడీపీ గురించి కేసీఆర్ చెప్పినవన్నీ అబద్ధాలేనని, ప్రపంచంలోనే 5వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని ఐఎంఎఫ్ చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ఆదివారం రాత్రి సంజయ్ మీడియాతో మాట్లాడారు. 'కేసీఆర్ మాటలు నమ్మడానికి ప్రజలు సిద్ధంగా లేరు. పార్టీ నుంచి తెలంగాణ పదాన్నే తీసేసిన కేసీఆర్‌తో ప్రజలకు బంధం తెగిపోయింది. నువ్వే పెద్ద డిఫాల్టర్ సీఎంవి. అసెంబ్లీ సాక్షిగా అసత్యాలు చెప్పినందుకు తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలి' అని బండి డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీల

మిగతా 3వ పేజీలో ▶



మళ్లీ బీఆర్ఎస్ వాళ్లు పిలిచినా పోను

- అసెంబ్లీ మీడియా పాయింట్‌లో బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్

"నాపై బీఆర్ఎస్ నేతలు చేసిన దాడి, ఖర్చు, పెట్టిన ఇబ్బంది మరిచిపోను. మళ్లీ వాళ్లు పిలిచినా పోను. పార్టీలు మారే కల్చర్ నాకు లేదు. నేను ఆ పార్టీని వీడలేదు. వాళ్లే నన్ను బయటకు పంపారు. సీఎం కేసీఆర్ అసెంబ్లీలో పదేపదే నా పేరు ప్రస్తావించారు. అందుకు నేను పొంగిపోను. నన్ను డ్యామేజ్ చేయడానికే సీఎం అలా నా పేరు ప్రస్తావించారు."

2లో

మహారాష్ట్రకు గోదావరి నీటిపై స్పష్టత ఇవ్వాలి



నెహ్రూ స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోండి

- కేసీఆర్‌కు సీఎల్పీనేత భట్టి సూచన
- ద్రవ్య వినిమయ బిల్లుపై అసెంబ్లీలో భట్టి ప్రసంగం

"గుండుసూది కూడా తయారు చేసే స్థితిలో లేని తరుణంలో మన దేశానికి నెహ్రూ మొదటి ప్రధాని అయ్యారు. పంచవర్ష ప్రణాళికలు, సాంకేతిక పరిజ్ఞానం మెరుగు పరుచుకుంటూ దేశాన్ని ప్రగతి బాటలోకి తీసుకొచ్చారు. ఇప్పుడు అందరం కలిసి కష్టపడి తెచ్చుకున్న తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేరాలంటే, ఈ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్ నెహ్రూ స్ఫూర్తిని తీసుకుని ముందుకు సాగాలి. తెలంగాణ వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు దాదాపు 17.39 లక్షల కోట్ల బడ్జెట్‌ను పెట్టుకున్నా ప్రజల ఆశలు, ఆకాంక్షలు మాత్రం నెరవేరడం లేదు."

2లో





దౌసా వద్ద రిమోట్ కంట్రోల్ బటన్ ద్వారా సోహ్నా - దౌసా మార్గాన్ని ప్రారంభిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ

ఢిల్లీ-ముంబై ఎక్స్‌ప్రెస్ వే తొలి దశ ప్రారంభం

సోహ్నా - దౌసా మధ్య రహదారిని ప్రారంభించిన మోదీ

ఎక్స్‌ప్రెస్‌వేల నిర్మాణంలో మరో మైలురాయి.. దేశంలోనే అతి పెద్దదైన జాతీయ ఎక్స్‌ప్రెస్ హైవే ఢిల్లీ-ముంబై మహా రహదారిలో 246 కి.మీ. భాగాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం ఆవిష్కరించారు. ఢిల్లీలోని సోహ్నా నుంచి రాజస్తాన్‌లో దౌసా మధ్య నిర్మాణం జరుపుకొన్న తొలిదశను దౌసా వద్ద రిమోట్ కంట్రోల్ బటన్ ద్వారా ప్రధాని ప్రారంభించారు. ఢిల్లీ - జైపూర్ మధ్య ప్రయాణానికి ఇన్నాళ్లూ 5–6 గంటలు పట్టేది. ఈ మార్గం అందుబాటులోకి రావడంతో ఇక 3 గంటల్లోనే చేరుకోవచ్చు.

- వివరాలు 6లో▶

2 నెలల పసిగుడ్డు.. 128 గంటల తరువాత...



ఇప్పుడిప్పుడే లోకం చూస్తున్న పసిగుడ్డు.. ఒకటీ రెండూ కాదు.. ఏకంగా 128 గంటల పాటు శిథిలాల్లోనే చిక్కుకుపోయింది. భూకంప ప్రభావిత తుర్కియేలోని హతాయ్ పట్టణంలో ఈ రెండు నెలల పసికందును రెస్క్యూ సిబ్బంది సజీవంగా రక్షించారు. అలాగే, మరికొన్ని ఘటనల్లో 151 గంటల తరువాత ఆరేళ్ల బాలుడిని, ఓ బాలికను కూడా కాపాడారు. మరోపక్క భూకంపం ధాటికి తుర్కియే, సిరియా ఇంకా కోలుకోలేదు. మృతుల సంఖ్య 30 వేలు దాటింది. ఇంకా శిథిలాల్లో చిక్కుకున్న వారిని వెలికితీసే పనులు కొనసాగుతున్నాయి.

- వివరాలు 6లో▶

1,500 ఆశ పోస్టుల భర్తీ

జీహెచ్ఎంసీ పరిధిలో భర్తీ చేస్తామన్న మంత్రి హరీశ్

- బస్తీ దవాఖానాల్లో ఇప్పటివరకు కోటి మందికి సేవలు.. త్వరలో వైద్య పరీక్షలు 57 నుంచి 134కు పెంపు



సాక్షి, హైదరాబాద్: జీహెచ్ఎంసీ పరిధిలో 1,500 ఆశ పోస్టుల భర్తీకి ఈ నెలలో నోటిఫికేషన్ జారీ చేస్తామని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు వెల్లడించారు. బస్తీ దవాఖానాల్లో ఇప్పటివరకు కోటి మంది ప్రజలు వైద్య సేవలు పొందినట్లు తెలిపారు. 1.48 లక్షల మందికి రూ.800 విలువ చేసే లిపిడ్ ప్రొఫైల్ టెస్ట్ (ఎల్‌పీటీ)తో పాటు థైరాయిడ్ పరీక్షలు ఉచితంగా చేసినట్లు చెప్పారు. బస్తీ దవాఖానాల్లో ప్రస్తుతం 57 రకాల పరీక్షలు చేస్తున్నామని, త్వరలో వాటిని 134కు పెంచుతామని వివరించారు.158 రకాల మందులు ఉచితంగా ఇస్తున్నామని తెలిపారు. ఆదివారం అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు వివేకానంద, గణేష్, కోరుకంటి చందర్, జాఫర్ హుస్సేన్, అబ్రహం, భూపాల్‌రెడ్డి అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం చెప్పారు.

పెద్ద ఆస్పత్రులపై తగ్గిన ఒత్తిడి

బస్తీ దవాఖానాలు స్థానికంగా సేవలందిస్తుండడం వల్ల పెద్ద ఆస్పత్రుల్లో ఓపీ తగ్గినట్లు హరీశ్‌రావు తెలిపారు. ఉస్మానియా ఆసుపత్రిలో 2019లో 12 లక్షల మంది ఓపీకి రాగా, 2022 నుంచి ఇప్పటి వరకు 5 లక్షల మంది (60 శాతం తగ్గుదల) మాత్రమే వచ్చారన్నారు. గాంధీలో 2019లో 6.5 లక్షల మంది ఓపీకి రాగా, 2022 నుంచి ఇప్పటివరకు 3.7 లక్షల మంది (56 శాతం తగ్గుదల) మాత్రమే వచ్చినట్లు తెలిపారు. నీలోఫర్‌లో 2019లో 8 లక్షల మంది ఓపీకి రాగా, 2022 నుంచి ఇప్పటివరకు 5.3 లక్షల మంది వచ్చినట్లు చెప్పారు. అలాగే ఫీవర్ ఆసుపత్రిలో 2019లో 4 లక్షల ఓపీ ఉంటే, 2022 నుంచి ఇప్పటివరకు 1.12 లక్షలు మాత్రమే ఉందని వివరించారు. అదే సమయంలో పెద్దాసుపత్రుల్లో శస్త్ర చికిత్సల సంఖ్య గణనీయంగా పెరిగిందని మంత్రి చెప్పారు.

కొత్తగా 496 బస్తీ దవాఖానాలు

బస్తీ దవాఖానాల్లో త్వరలో బయోమెట్రిక్ విధానం ఏర్పాటు చేస్తామని మంత్రి హరీశ్‌రావు అన్నారు. వచ్చే ఏప్రిల్‌లో అన్ని జిల్లాల్లో న్యూట్రిషన్ కిట్ పథకం ప్రారంభం అవుతుందని తెలిపారు. కొత్తగా 496 బస్తీ దవాఖానాలు మంజూరయ్యాయని, వాటిలో కొన్ని నిర్మాణంలో ఉన్నాయన్నారు. త్వరలో మేడ్చల్ హెచ్ఎంటీ ప్రాంతంలో మెడికల్ కాలేజీ వస్తుందన్నారు.



మండలి డిప్యూటీ చైర్మన్‌గా బండ ప్రకాశ్ ఏకగ్రీవం

- ఎన్నికను ప్రకటించిన చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి
- బీసీ నేతకు ఇదొక గొప్ప అవకాశం: సీఎం కేసీఆర్

2లో

బాధ్యతలు స్వీకరించిన బండ ప్రకాశ్‌ను అభినందిస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎర్రబెల్లి

క్లుప్తంగా...

గురుకులాల్లో పోస్టులను భర్తీ చేస్తాం

మంత్రి సబిత వెల్లడి



సాక్షి, హైదరాబాద్: గురుకులాలు, రెసిడెన్షియల్ స్కూళ్లను కాలేజీలుగా అప్‌గ్రేడ్ చేశామనీ అప్‌గ్రేడ్ చేసిన చోట్ల పోస్టులను భర్తీ చేస్తామని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రకటించారు. ఏ నియోజకవర్గంలో గురుకులాలు మంజూరైతే అక్కడే ఏర్పాటు అయ్యేలా చేస్తామని చెప్పారు. ఆదివారం అసెంబ్లీలో సభ్యులు గాదరి కిషోర్, హరిప్రియ బానోత్, సండ్ర వెంకటవీరయ్య, మొహినుద్దీన్ అడిగిన ప్రశ్నలకు ఆమె సమాధానం ఇచ్చారు. విద్యార్థులు తమ తాతలు, అవ్వలకు చదువు నేర్పాలన్నారు.

కాళేశ్వరంపై సోలార్ లేదు: జగదీశ్‌రెడ్డి



కాళేశ్వరం ప్రాజెక్టుపై ఫ్లోటింగ్ సోలార్ ప్యానల్ ఏర్పాటు చేస్తే చేపలు దాని కిందకు వెళ్తాయని మత్స్యకారులు అభ్యంతరం చెబుతున్నారనీ దాంతో ఆ నిర్ణయం ఆగిందని విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి స్పష్టం చేశారు. అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో... సభ్యులు కోరుకంటి చందర్, మహేశ్వర్ రెడ్డి అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. చేపల పెంపకం లేనిచోట్ల, కాల్వలపై సోలార్ రూఫ్‌టాప్‌లు పెట్టవచ్చన్నారు.

5.42 లక్షల మందికి రుణాలు మాఫీ చేశాం



సాక్షి, హైదరాబాద్: ఇప్పటివరకు రూ. 36 వేల వరకు రుణాలున్న 5.42 లక్షల మంది రుణాలు మాఫీ చేశామని వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి వెల్లడించారు. ఈ బడ్జెట్‌లో రూ. 90 వేల వరకున్న రుణాల మాఫీకి రూ. 6,385 కోట్లు కేటాయించామన్నారు. శాసనసభలో ఆదివారం సభ్యులు బీరం హర్షవర్ధన్‌రెడ్డి, బిగాల గణేష్, నలమోతు భాస్కర్‌రావు, ఆశన్నగారి జీవన్ రెడ్డి, అంజయ్య యాదవ్, దుర్గం చిన్నయ్య, పొడెం వీరయ్య తదితరులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేస్తామన్నారు. మరో ప్రశ్నకు సమాధానమిస్తూ కొల్లాపూర్ మండలం రాంపూర్‌లో రూ. 5.45 కోట్లతో పండ్ల మార్కెట్ ఏర్పాటు చేసేందుకు నిర్ణయించామని, త్వరలోనే అక్కడ మార్కెట్ నిర్మాణం ప్రారంభిస్తామని చెప్పారు.

అడ్డంకులు సృష్టిస్తున్నా ఆగని ప్రగతి

- కేంద్రం ఒత్తిళ్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ తలొగ్గం... ప్రభుత్వరంగ ఆస్తులు విక్రయించే ప్రసక్తే లేదు
- ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చలో మంత్రి హరీశ్‌రావు




సాక్షి, హైదరాబాద్: కేంద్రం ఎన్ని అడ్డంకులు సృష్టిస్తున్నా రాష్ట్రాన్ని పురోభివృద్ధి దిశగా నడిపిస్తున్నామని ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కేంద్రం ఒత్తిడికి తలొగ్గబోమని, ప్రభుత్వ రంగ ఆస్తులు విక్రయించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఆదివారం శాసనమండలిలో ద్రవ్య వినిమయ బిల్లుపై జరిగిన చర్చకు మంత్రి సమాధానమిచ్చారు. కేంద్రం ఇప్పటివరకు రూ.4.06 లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తులు అమ్మిందని చెప్పారు. రాష్ట్రాలపై కూడా ఈ మేరకు ఒత్తిడి తెస్తోందని, అమ్మితే రాయితీలు ఇస్తామంటూ ప్రలోభ పెడుతోందని, అందుకు అంగీకరించకపోతే నిధులు రాకుండా అడ్డుకుంటోందని ధ్వజమెత్తారు. రాష్ట్ర విద్యుత్ సంస్థలను కార్పొరేట్లకు కట్టబెట్టాలని, రైతుల బోర్లకు మీటర్లు పెట్టాలని వెంటబడ్డా తాము అంగీకరించలేదన్నారు. అలా చేస్తేనే రుణ పరిమితిని పెంచుతామన్నా తలొగ్గలేదని స్పష్టం చేశారు. కేంద్రం చెప్పినట్టు వింటే రూ.30 వేల కోట్లు వచ్చేవని, కానీ ప్రజల శ్రేయస్సే ముఖ్యమని భావించి తిరస్కరించామన్నారు.

సీనియర్లు ఖండించాలి..

రాజకీయ పార్టీల నేతలు ఇటీవల పేల్చేస్తాం, కూల్చేస్తామంటూ బాధ్యతారహితంగా మాట్లాడుతున్నారని, ఆయా పార్టీల్లో టి.జీవన్‌రెడ్డి వంటి సీనియర్ నేతలు అటువంటి వ్యాఖ్యలను ఖండించాలని హరీశ్‌రావు సూచించారు. ఆ పార్టీల విధ్వంస భాషను తెలంగాణ ప్రజలు మన్నించరని, వారికి పడే ఓట్లు కూడా పడవని పేర్కొన్నారు. మిగిలిపోయిన దాదాపు 9.5 కి.మీ శ్రీశైలం ఎడమగట్టు కాలువ సొరంగం పని ప్రస్తుత పద్ధతుల్లోనే వచ్చే సంవత్సరంలో పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందంటూ.. టీచర్ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి జవాబిచ్చారు. ఉద్యోగుల జీతాలు ఒకటో తేదీనే ఇచ్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, అయితే విద్యుత్ కొనుగోళ్ల వంటి వాటికి అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోందని చెప్పారు. వడ్డీలేని రుణాల చెల్లింపునకు కూడా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కాగా ద్రవ్యవినిమయబిల్లుకు ఆమోదం తెలిపాక సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్టు శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రకటించారు.

యూపీఏనే నయం..

మోదీ సర్కార్ కన్నా అంతకుముందు పాలించిన కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏనే కొంత నయమని హరీశ్‌రావు అన్నారు. మోదీ ఏలుబడిలో జీడీపీ తగ్గిందని, అప్పులు పెరిగాయని, ప్రైవేటీకరణతో ఉద్యోగాలు ఊడాయని చెప్పారు. మూలధనం పెంచడంలో మోదీ సర్కారు పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రజల సొమ్మును అదాని దారి మళ్లించిన తీరుపై హిడెన్ బర్గ్ నివేదిక సృష్టించిన కలకలానికి మోదీ సమాధానం చెప్పకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. తప్పు చేయబట్టే ప్రజలకు సమాధానం ఇవ్వడం లేదని అన్నారు.



కల్తీ విత్తనాలు అమ్మితే ఉపేక్షించం

ముఖ్యమంత్రి కేసీఆర్ హెచ్చరిక

- 2 లక్షల జనాభాకు ఒక సమీకృత మార్కెట్

సాక్షి, హైదరాబాద్: కల్తీ విత్తనాలు అమ్మితే ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించబోమని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు హెచ్చరించారు. అసెంబ్లీలో ఆదివారం ప్రశ్నోత్తరాల సమయంలో సమీకృత మార్కెట్లపై ప్రశ్నకు సంబంధించి కల్తీ విత్తనాల బెడద ఉందని సభ్యులు ప్రస్తావించగా సీఎం కేసీఆర్ జోక్యం చేసుకొని సమాధానం ఇచ్చారు. కల్తీ విత్తనాల బెడద ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోనే ఎక్కువగా ఉందన్నారు. వాటిని నియంత్రించేందుకు పీడీ యాక్ట్ తెచ్చామని చెప్పారు. పీడీ యాక్ట్ ఎందుకని కేంద్రం చెప్పినా, మంత్రి నిరంజన్‌రెడ్డి ఢిల్లీ వెళ్లి దీనిపై వారిని ఒప్పించి, పోరాడి సాధించారని వివరించారు. పీడీ యాక్ట్ కింద అనేకమందిపై కేసులు నమోదు చేశామనీ అయినా కొందరు మారడం లేదన్నారు. అవసరమైతే మరిన్ని కఠిన చర్యలు చేపడతామన్నారు.

జనాభాకు అనుగుణంగా మార్కెట్లు లేవు

హైదరాబాద్‌లో జనాభాకు అనుగుణంగా మార్కెట్లు లేవని కేసీఆర్ వ్యాఖ్యానించారు. కోటికి పైగా జనాభా ఉన్న హైదరాబాద్‌లో సరిపడా వెజ్, నాన్‌వెజ్ మార్కెట్లు లేవన్నారు. హైదరాబాద్ మార్కెట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించామని సీఎం తెలిపారు. చాలా కూరగాయల మార్కెట్లు పరిశుభ్రంగా లేకుండా మురికి, మట్టి, దుమ్ములో కూరగాయలు అమ్మే పరిస్థితి ఉండేదని చెప్పారు. ఈ నేపథ్యంలో సమీకృత వెజ్, నాన్‌వెజ్ మార్కెట్లకు శ్రీకారం చుట్టామని వెల్లడించారు.

మోండా మార్కెట్ మోడల్‌గా..: రెండు లక్షల జనాభాకు ఒక మార్కెట్టైనా ఏర్పాటు చేయాలనేది ప్రభుత్వ లక్ష్యమని కేసీఆర్ వివరించారు. నిజాం హయాంలో కట్టిన మోండా మార్కెట్‌ని చూసి తాను ఆశ్చర్యపోయానన్నారు. '125 ఏళ్ల కింద కట్టిన మోండా మార్కెట్ చాలా శాస్త్రీయంగా ఉంది. పాతది అయినా జాలీలు ఉన్నాయి. మాంసమైనా, కూరగాయలు అయినా అక్కడ 2.5 ఫీట్ల ఎత్తులో పెట్టి అమ్ముతారు. ఈ పద్ధతిలోనే సమీకృత మార్కెట్లను అన్ని జిల్లాల్లో నిర్మించాలని సూచించాం' అని సీఎం చెప్పారు.

మండలి డిప్యూటీ చైర్మన్‌గా బండ ప్రకాశ్

సాక్షి, హైదరాబాద్: శాసనమండలి డిప్యూటీ చైర్మన్‌గా ఎమ్మెల్సీ బండ ప్రకాశ్ ముదిరాజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రకాశ్ ముదిరాజ్‌ను డిప్యూటీ చైర్మన్‌గా గిరిజన, మహిళాభివృద్ధి శాఖల మంత్రి సత్యవతి రాథోడ్ ప్రతిపాదించగా, సభ్యులు మధుసుదనాచారి, జాఫ్రీ, ఎంఎస్ ప్రభాకర్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎగ్గె మల్లేశం బలపర్చారు. డిప్యూటీ చైర్మన్ అభ్యర్థిత్వానికి ప్రకాశ్ ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఎన్నిక లాంఛనమైంది. ఈ మేరకు డిప్యూటీ చైర్మన్‌గా బండ ప్రకాశ్ ఎన్నికైనట్లు శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆదివారం సభలో వెల్లడించారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్, చైర్మన్ సుఖేందర్‌రెడ్డిలతోపాటు మంత్రులు కేటీఆర్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, సభ్యులు జీవన్‌రెడ్డి, ఎ.నర్సిరెడ్డి తదితరులు ప్రకాశ్‌ను సాదరంగా ఆహ్వానించి కుర్చీలో కూర్చోబెట్టారు. అనంతరం ప్రకాశ్ అభినందన తీర్మానంపై సభ్యులు మాట్లాడారు. సీఎం కేసీఆర్ మాట్లాడుతూ ప్రకాశ్ తెలంగాణ తొలిదశ ఉద్యమం నుంచి ఉత్సాహంతో పనిచేస్తున్న విద్యాధికుడని అన్నారు. బీసీ సామాజికవర్గం నుంచి ప్రకాశ్ కౌన్సిల్ డిప్యూటీ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టడం గర్వకారణమని, ఆయన సేవలు తెలంగాణ ప్రజానీకానికి ఎంతో అవసరమని చెప్పారు. రాజ్యసభ సభ్యులుగా పార్లమెంటులోనూ పలు అంశాల్లో క్రియాశీలంగా పనిచేశారన్నారు. అనంతరం మంత్రులు మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్‌యాదవ్, మల్లారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్, సత్యవతి రాథోడ్, నిరంజన్‌రెడ్డిలతోపాటు పలువురు సభ్యులు ప్రకాశ్‌ను అభినందించారు. డిప్యూటీ చైర్మన్‌గా తనకు అవకాశం కల్పించినందుకు సీఎం కేసీఆర్‌తోపాటు సహచర సభ్యులకు ప్రకాశ్ ధన్యవాదాలు తెలిపారు.

నెహ్రూ స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోండి

- తొలి సీఎంగా తొలి ప్రధాని స్ఫూర్తితో ముందుకు సాగండి
- సీఎం కేసీఆర్‌కు సీఎల్పీనేత భట్టి సూచన... ప్రతిపక్షాలపై కక్ష సాధింపు ధోరణి వద్దు
- ద్రవ్య వినిమయ బిల్లుపై ప్రసంగం



సాక్షి, హైదరాబాద్: 'గుండు సూది కూడా తయారు చేసే స్థితిలో లేని తరుణంలో మన దేశానికి నెహ్రూ మొదటి ప్రధాని అయ్యారు. పంచవర్ష ప్రణాళికలు, సాంకేతిక పరిజ్ఞానం మెరుగుపరుచుకుంటూ దేశాన్ని ప్రగతి బాటలోకి తీసుకొచ్చారు. ఇప్పుడు అందరం కలిసి కష్టపడి తెచ్చుకున్న తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేరాలంటే, ఈ రాష్ట్ర తొలి సీఎంగా కేసీఆర్ నెహ్రూ స్ఫూర్తిని తీసుకుని ముందుకు సాగాలి' అని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క సూచించారు. తెలంగాణ వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు 17.39 లక్షల కోట్ల బడ్జెట్‌ను పెట్టుకున్నా ప్రజల ఆశలు, ఆకాంక్షలు మాత్రం నెరవేరడం లేదన్నారు. ద్రవ్య వినిమయ బిల్లుపై ఆదివారం అసెంబ్లీలో ఆయన ప్రసంగించారు. నీళ్లు, నియామకాలు, ఆత్మగౌరవం కోసం తెచ్చుకున్న తెలంగాణ ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చాల్సిన బాధ్యత తొలి సీఎంగా కేసీఆర్‌పై ఉందన్నారు.

వారుంటే దేశం గతి ఏమయ్యేదో..

తెలంగాణ వస్తే తప్ప ఈ ప్రాంతంలో ఆశించిన లక్ష్యాలు నెరవేరవని.. ఉవ్వెత్తున సాగిన రాష్ట్ర మలిదశ ఉద్యమాన్ని చూసి సోనియాగాంధీ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడేందుకు చొరవ చూపిన విషయాన్ని గుర్తించాలన్నారు. రాష్ట్రం అన్నాక ప్రతిపక్షాలుంటాయని, వాటిపై కక్ష సాధింపు ధోరణితో కాకుండా కలుపుకొని పోవాలన్న నెహ్రూ తరహాలో ఇక్కడ పాలన సాగాల్సి ఉందన్నారు. ఆ రోజు తొలి ప్రధానిగా నెహ్రూ కాకుండా ప్రస్తుత పాలకులలాంటి వారు ప్రధాని అయి ఉంటే దేశం గతి ఏమై ఉండేదోనని తల్చుకుంటేనే ఆందోళన కలుగుతోందని భట్టి వ్యాఖ్యానించారు. దేశంలో శాస్త్రీయమైన పరిపాలన జరగడం లేదనటానికి, కరోనా వస్తే దీపాలు వెలిగించండి, చప్పట్లు కొట్టండిలాంటి సూచనలే నిదర్శనమని ఎద్దేవా చేశారు. బడ్జెట్‌లో విద్య, వైద్యం, వ్యవసాయానికి కేటాయించిన నిధులు సరిపోవని, వాటిని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. పోడు భూముల పంపిణీ తేదీలను ముఖ్యమంత్రి ప్రకటించాలని కోరారు. పోడు భూముల సాగును అడ్డుకునే క్రమంలో గిరిజనులను బలవంతంగా అడవుల నుంచి తరిమేసేందుకు వారు తాగే నీళ్లను కలుషితం చేసే వికృత చేష్టలకు పాల్పడకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రజాసమస్యలన్నీ చర్చకు రాలేదు

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలను 28 రోజుల పాటు జరపాలని కాంగ్రెస్ శాసనసభాపక్షం కోరితే ప్రభుత్వం కేవలం 7 రోజుల్లో ఈ సమావేశాలను ముగించిందని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. రాష్ట్రంలోని ప్రజలెదుర్కొంటున్న సమస్యలన్నీ చర్చకు రాలేదని విమర్శించారు. అసెంబ్లీ నిరవధిక వాయిదా పడిన అనంతరం ఆదివారం సాయంత్రం మీడియా పాయింట్‌లో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే జగ్గారెడ్డిలతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ద్రవ్యవినిమయ బిల్లు సందర్భంగా సీఎం కేసీఆర్ కాంగ్రెస్ పార్టీనుద్దేశించి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని చెప్పారు. మాజీ ప్రధాని నెహ్రూ వేసిన పునాదులే దేశాన్ని అభివృద్ధి చేసిన విషయాన్ని మర్చిపోవద్దని చెప్పారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇంత తక్కువ రోజులు అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు నిర్వహించడం దేశంలోనే ఇదే మొదటిసారని కాంగ్రెస్ ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. శాసనసభ, మండలిపై బీఆర్‌ఎస్‌కు గౌరవం లేదని, ఈ రోజు రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన బడ్జెట్ ఆమోదంపై చర్చ జరిగిందో, కేంద్ర బడ్జెట్‌పై చర్చ జరిగిందో అర్థం కావడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను పక్కదోవ పట్టించేందుకే కేంద్రంపై నెపం నెట్టారని, కేసీఆర్ చిన్న బుద్ధి బయటపడిందని చెప్పారు. బడ్జెట్ కేటాయింపుల్లో సగం నిధులు కూడా ఖర్చు చేస్తారన్న నమ్మకం తమకు లేదని జీవన్‌రెడ్డి అన్నారు.

మహారాష్ట్రకు గోదావరిపై స్పష్టత ఇవ్వాలి

- అసెంబ్లీలో ఈటల డిమాండ్
- సీఎం మాటలతో ఉత్తర తెలంగాణ రైతుల్లో ఆందోళన



సాక్షి, హైదరాబాద్: మహారాష్ట్రకు గోదావరి నీటినిచ్చే విషయంపై సీఎం కేసీఆర్ చెప్పిన మాటలతో ఉత్తర తెలంగాణ రైతాంగం ఆందోళనలో ఉందని బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ చెప్పారు. తెలంగాణ ప్రయోజనాలకు విఘాతం కలిగేలా వేరే రాష్ట్రాల వారు మాట్లాడితే కేసీఆర్ సహించేవారు కాదని, కానీ బీఆర్‌ఎస్ ఏర్పాటు తర్వాత ఆయన వైఖరి మారిందన్నారు. కేసీఆర్ మహారాష్ట్రలో మాట్లాడినప్పుడు అవసరమైతే ఎస్సారెస్పీ నుంచి, ఆ పైనుంచి నది నుంచి నీటిని ఎత్తిపోసుకునే వెసులుబాటు కనిపిస్తామని అన్నట్టు విన్నానని, వాస్తవంగా కేసీఆర్ చెప్పిందేమిటో ఆయనే స్పష్టత ఇస్తే బాగుంటుందని పేర్కొన్నారు. ఆదివారం శాసనసభలో ద్రవ్య వినిమయ బిల్లుపై ఈటల ప్రసంగించారు. బీఆర్‌ఎస్ నుంచి బయటకు వెళ్లిన తర్వాత కేసీఆర్ సమక్షంలో మాట్లాడటం ఈటలకు ఇదే మొదటిసారి కావడం విశేషం. కేంద్రం నుంచి మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ పథకాలకు ఒక్క రూపాయి కూడా వచ్చే అవకాశం లేదని, అక్కడి నుంచి నిధులు వస్తాయని అంచనా వేసుకోవటం సరికాదని ఈటల చెప్పారు. చాలా గ్రామాలకు ఆర్టీసీ బస్సులు రావట్లేదని, లాభాల కోణంలో చూడకుండా ఆర్టీసీ బస్సులు పెంచి అన్ని గ్రామాలకు వచ్చేలా చూడాలని కోరారు. ఈటల చెప్పిన విషయాలను నోట్ చేసుకోవాలని సీఎం ఈ సందర్భంగా మంత్రులకు సూచించారు. కాగా, ఈటల మాట్లాడుతుండగానే సమయం మించి పోయిందంటూ స్పీకర్ మైక్ కట్ చేసి సీఎం మాట్లాడాల్సిందిగా సూచించారు.

మళ్లీ బీఆర్‌ఎస్ వాళ్లు పిలిచినా పోను

- అసెంబ్లీ మీడియా పాయింట్‌లో బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్
- ప్రజాసమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం పిలిస్తే పోతా

సాక్షి, హైదరాబాద్: 'నా మీద బీఆర్‌ఎస్ నేతలు చేసిన దాడి, ఖర్చు, పెట్టిన ఇబ్బంది మరిచిపోను. మళ్లీ వాళ్లు పిలిచినా నేను పోను. పార్టీలు మారే కల్చర్ ఉన్న వ్యక్తిని కాదు. నేను ఆ పార్టీని వీడలేదు. వాళ్లే నన్ను బయటకు పంపారు. నన్ను డ్యామేజీ చేయడానికే సీఎం కేసీఆర్ అసెంబ్లీలో పదే పదే నా పేరు ప్రస్తావించినంత మాత్రాన పొంగిపోను. సీఎం తన స్టైల్‌లో మాట్లాడారు. భట్టి, అక్బరుద్దీన్ ఒవైసీ, జగ్గారెడ్డి పేర్లను కూడా అలానే పిలుస్తారు' అని బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. ఆదివారం అసెంబ్లీ నిరవధికంగా వాయిదా పడిన అనంతరం ఆయన మీడియా పాయింట్‌లో మాట్లాడారు. సీఎం కేసీఆర్ మెతక మాటలకు తాను పడిపోనని, సొంత ఎజెండా కోసం తాను అసెంబ్లీకి రాలేదని స్పష్టం చేశారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం పిలిస్తే కచ్చితంగా వెళ్తానన్నారు. '2004లో కూడా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్సార్‌ను కలుస్తాడని, ఆపరేషన్ ఆకర్ష్‌లో ఉన్నాడని నాపై ప్రచారం చేశారు. ఆరోజే పార్టీ మారలేదు. ఈ రోజు కూడా మారను' అని అన్నారు. బడ్జెట్‌లో రూ.2.90 లక్షల కోట్లు పెట్టినా సకాలంలో ఉద్యోగులకు జీతాలు ఇచ్చే పరిస్థితిలో ప్రభుత్వం లేదని, బడ్జెట్‌లోని సగం లెక్కలు తప్పులతడక అని ఆరోపించారు.

సీఎం కేసీఆర్ మాటలను ప్రజలు నమ్మరు

కరెంట్ బిల్లు పెంచి సామాన్యులపై భారం మోపడమేకాకుండా ఆర్టీసీ కార్మికులకు పీఆర్సీ, మహిళా సంఘాలకు పావలా వడ్డీ, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలివ్వలేని కేసీఆర్ ఏదేదో మాట్లాడారని, ఆయన మాటలను ప్రజలు నమ్మడంలేదన్నారు.

రెండేళ్ల తర్వాత కేసీఆర్ నోట ఈటల మాట!

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో భుజం భుజం కలిపి పనిచేసిన నేతలు వారు. ఒకరు బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ కాగా మరొకరు మాజీ మంత్రి ఈటల రాజేందర్. ఆరు పర్యాయాలు ఎమ్మెల్యేగా, రెండుసార్లు కేసీఆర్ కేబినెట్‌లో మంత్రిగా పనిచేసిన ఈటల 2021లో శరవేగంగా మారిన రాజకీయ పరిణామాలతో మంత్రివర్గం నుంచి బర్తరఫ్ అయ్యారు. అదే ఏడాది జూన్‌లో బీఆర్‌ఎస్, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి బీజేపీలో చేరారు. 2021 నవంబర్‌లో జరిగిన హుజూరాబాద్ ఉపఎన్నికలో బీజేపీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి అసెంబ్లీలో అడుగు పెట్టారు. ఆ తర్వాత బీజేపీ చేరికల కమిటీ చైర్మన్ వంటి కీలక పదవిలో ఉన్న ఈటల, బీఆర్‌ఎస్ నేతలు తరచూ విమర్శనాస్త్రాలు సంధించుకుంటున్నారు.

గతేడాది సభ నుంచి రెండుసార్లు సస్పెండ్...

గత ఏడాది మార్చిలో జరిగిన అసెంబ్లీ భేటీ నుంచి వెల్‌లోకి వచ్చేందుకు ప్రయత్నించారనే కారణంతో ఆయన్ను స్పీకర్ సస్పెండ్ చేశారు. స్పీకర్ పై చేసిన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలనే అంశంపై గత ఏడాది సెప్టెంబర్‌లో జరిగిన అసెంబ్లీ సమావేశాల నుంచి ఈటల సస్పెండ్ అయ్యారు. ఈ నేపథ్యంలో తాజాగా ముగిసిన వార్షిక బడ్జెట్ సమావేశాల్లో ఈటల పాల్గొనడంపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. అయితే సమావేశాలు ప్రారంభమైన తొలి రోజు నుంచే అందుకు భిన్నమైన వాతావరణం శాసనసభలో కనిపించింది. వార్షిక బడ్జెట్‌పై జరిగిన సాధారణ చర్చ బదులు ద్రవ్య వినిమయ బిల్లుపై జరిగిన చర్చలోనూ ఈటల రాజేందర్‌కు మాట్లాడే అవకాశం లభించింది. మంత్రులు కేటీఆర్, హరీశ్‌తోపాటు పలువురు ట్రెజరీ బెంచ్ సభ్యులు ఈటల పేరును ప్రస్తావిస్తూ 'మా రాజేందర్ అన్న'అంటూ సంబోధించారు. బడ్జెట్ సమావేశాల చివరి రోజు ద్రవ్య వినిమయ బిల్లుపై జరిగిన చర్చలో భాగంగా బీజేపీ నుంచి ఈటలకు మాట్లాడే అవకాశం లభించింది. పలు అంశాలను ప్రస్తావిస్తున్న క్రమంలో ప్రసంగం ముగించాలంటూ స్పీకర్ పోచారం ఒకట్రెండుసార్లు ఈటలకు సూచించారు. చివరకు మైక్ కూడా కట్ చేయడంతో సీఎం కేసీఆర్ జోక్యం చేసుకొని ఈటల ప్రసంగం కొనసాగించాలని కోరారు.

ప్రజాసమస్యలు ప్రస్తావించడం బాధ్యత

అనంతరం ప్రసంగాన్ని ప్రారంభించిన సీఎం కేసీఆర్ తన రెండు గంటల ప్రసంగంలో ఈటల పేరును ఏకంగా 18 పర్యాయాలు ప్రస్తావించారు. ప్రజాస్వామ్యంలో ప్రజాసమస్యలు ప్రస్తావించడం సభ్యుల బాధ్యతంటూ ఈటల ప్రశ్నలకు సమాధానమిచ్చారు. ఇదిలా ఉంటే ఇన్నాళ్లు ఎడమొకం పెడమొకంగా ఉన్న సీఎం, ఈటల అసెంబ్లీ వేదికగా ఎదురుపడడం.. ఈటల పేరును సీఎం ప్రస్తావించడం సర్వత్రా చర్చకు దారితీసింది. కాగా, సభలో సీఎం కేసీఆర్ తనపై చేసిన వ్యాఖ్యలపట్ల ఈటల సభ ముగిసిన తర్వాత మీడియాతో స్పందించారు. అసెంబ్లీ వేదికగా సీఎం తనను డ్యామేజీ చేయాలనుకున్నారని ఆరోపించారు. ఈ డామేజ్‌ని కడుక్కోవడానికి ఎన్ని నెలలు పడుతుందోనన్నారు. ఒక విషయాన్ని రెండు వైపులా చెప్పగల సమర్థతగల నాయకుడు కేసీఆర్ అని చెప్పుకొచ్చారు.

మోదీ గెలిచారు .. ప్రజలు ఓడారు

▶ మొదటి పేజీ తరువాయి

ధోరణలు, పక్షపాత వైఖరులు చూస్తున్నాం. ఎన్నికలు జరిగినప్పుడు పార్టీలు, రాజకీయ నేతలు గెలుస్తున్నారు. ప్రజలు ఓడిపోతున్నారు. కాంగ్రెస్ పనికి రాకుండా పోయిందని 2014లో మోదీని ప్రజలు గెలిపించారు. కానీ మోదీ కన్నా మన్మోహన్ సింగ్ బెహతరీన్ పనిచేశారు. ఇప్పటికి 20 లక్షల మంది భారతీయులు దేశ పౌరసత్వాన్ని వదులుకున్నారు. పారిశ్రామికవేత్తలు పారిపోతున్నారు. పరిశ్రమలు మూతబడుతున్నాయి. ద్రవ్యోల్బణం పెరుగుతూ ఉంది. ప్రజల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్టు అయింది..' అని కేసీఆర్ ధ్వజమెత్తారు.

తెలంగాణకు రూ.3 లక్షల కోట్ల నష్టం

'భారతదేశ ప్రజల ఓటమిలో భాగంగా తెలంగాణ కూడా కొంత ఓడిపోయింది. మన జీఎస్డీపీ రూ.13.27 లక్షల కోట్లు. మోదీ స్థానంలో మన్మోహన్ సింగ్ ఉన్నా లేక భారత ప్రభుత్వం తెలంగాణ తరహాలో పని చేసినా మన జీఎస్డీపీ రూ.16 లక్షల కోట్లు ఉండాలి. ఒక్క తెలంగాణనే రూ.3 లక్షల కోట్లు నష్టపోయింది. కేంద్రం బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసింది. దేశంలో 157 వైద్య కళాశాలలు, మరో 157 నర్సింగ్ కళాశాలలిస్తే రాష్ట్రానికి ఒక్కటంటే ఒక్కటి లేదు. గిరిజన యూనివర్సిటీ రాలేదు. మేము ఇవ్వం కాక ఇవ్వం. ఏం చేసుకుంటరో చేసుకోండి అన్నట్టు ఉంది కేంద్రం ధోరణి..' అని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు.

అదానిపై ప్రధాని మౌనం ఎందుకు?

'మొన్న పార్లమెంట్‌లో ప్రధాని మోదీ ఘోరమైన, అసహ్యకరమైన ప్రసంగం చేశారు. దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉంది. కోట్ల మందికి సంబంధించిన విషయం. అసలు అదాని సంగతి ఏంటి? ఈ దేశం ఉంటదా? చస్తదా? దేశం ఉనికి ఏంటి? ఏం జరగబోతోంది? అని ఢిల్లీలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్, ఇతర పార్టీలు ప్రధానిని అడుగుతున్నా ఆయన నోట ఒక్క మాట రాలేదు. ఒకటే దెబ్బలో రూ.10 లక్షల కోట్ల ఆస్తులు కరిగిపోయాయని పత్రికలు రోజూ



అసెంబ్లీలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్

రాస్తున్నాయి. మన దగ్గర కూడా పెట్టా అని వచ్చాడు. కానీ ఇక్కడ జాగ దొరకలేదు. మనం బతికిపోయాం. నా దోస్తీది బయటపడిందని మోదీ మనస్సులో ఆక్రోశం ఉంది. ఈ విషయం చెప్పకుండా..ఏక్ ఆద్మీ భారీ పడ్‌గయా అంటూ అసలు సంగతి పక్కన పెట్టారు. ఇందిరాగాంధీ చనిపోయి 40 ఏళ్లు అయింది.. నెహ్రూ చనిపోయి 60 ఏళ్లు అయింది. ఇప్పుడు వాళ్ల పేర్లు తీసుకుని ఆమె ఇన్ని గవర్నమెంట్లు కూలగొట్టింది.. అన్ని కూలగొట్టింది అని మోదీ చెబుతారు. రాహుల్ లేచి నువ్వు తక్కువ కూలగొట్టావా? నువ్వు ఇన్ని కూలగొట్టావు అంటారు. 'ఛోటా భాయ్ సుభానల్లా..బడా భాయ్ మాషాఅల్లా' అన్నట్టు ఉంది. ఇదేనా జరగాల్సిన చర్చా?. అదాని అసలు సంగతి బయటపడితే షేర్లు ఇంకా పడిపోతాయని అశ్వత్థామోదర అనే ఎకనామిస్ట్ వ్యాసం రాశారు..' అని తెలిపారు.

5 ట్రిలియన్ ఎకానమీ ఓ జోక్..

'ప్రధాని మోదీ దేశం 2024–25 నాటికి 5 ట్రిలియన్ ఎకానమీ అవుతుందనడం ఓ జోక్. 3.3 ట్రిల్లియన్ దగ్గరే ఇప్పుడు దేశం ఉంది. తలసరి ఆదాయంలో 139వ స్థానంలో ఉంది. మనకంటే బంగ్లాదేశ్, శ్రీలంక, భూటాన్ మెరుగైన స్థితిలో ఉన్నాయి. వీటిపై శాసనసభ, పార్లమెంట్‌లో చర్చ జరగాలి..' అని కేసీఆర్ అన్నారు.

ఈ జులుం 2024 దాటితే ఖతం

'గోద్రాపై కొన్ని నిజాలతో డాక్యుమెంటరీ చూపించినందుకు బీబీసీని నిషేధించాలని అశ్వినీ ఉపాధ్యాయ్ అనే బీజేపీ వకీలు సుప్రీంకోర్టులో కేసు వేశాడు. ఇంత అహంకారమా? ఇంత అసహనమా? ఈడీకి బోడీకి భయపడడానికి బీబీసీ ఏమైనా జీ న్యూసా? మాకు ఎవరు ఖిలాఫ్ ఉంటే వారిని బ్యాన్ చేయి. కోసేయి. లేకుంటే జైల్లో వేయి. జైలులో రూం చూసి పెట్టినం అంటారు..ఇవేనా మాటలు? ఈ జులుం ఎన్ని రోజులు ఉంటది? 2024 దాటితే ఖతమే..' అని చెప్పారు.

నష్టాలు ప్రజలకు..లాభాలు ప్రైవేటుకు

'నష్టాలను ప్రజలపై వేసి లాభాలను ప్రైవేటీకరిస్తున్నారు. ప్రభుత్వం వ్యాపారం చేయాల్సిన అవసరం లేదని ప్రధాని అంటుంటారు. అవసరమైన చోట వ్యాపారం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందని మేమంటున్నాము. దేశ ఆర్థిక మంత్రి బాన్సువాడలోని ఓ రేషన్ షాపు వద్ద నిలబడి ప్రధానమంత్రి ఫోటో లేదని డీలర్‌తో కొట్లాడితే ఆ డీలర్ చావాలా? ఏం గొప్పతనం చేశారని మోదీ ఫోటో పెట్టుకోవాలి? నోట్ల రద్దు చేసినప్పుడు నేను ప్రధానిని కలిశా. ఆయన చెప్పింది వేరు. చేసింది వేరు. ఆయన చెప్పింది నమ్మి నేను సమర్థించా. నోట్ల రద్దుకు ముందు రూ.15-16 లక్షల కోట్ల కరెన్సీ చెలామణిలో ఉంటే ఇప్పుడు రూ.33.42 లక్షల కోట్లు చెలామణిలో ఉన్నట్టు వాళ్లే చెప్పారు. ఏ పాలసీ అయినా సక్సెస్ అయిందా? అన్ని రంగాల్లో దేశం కుప్పకూలినా డప్పు కొట్టుకోవడం మానడం లేదు..' అని సీఎం విమర్శించారు.

తూత్ పాలిష్ పనులకు ప్రధాని వస్తారట!

'వందే భారత్ రైలును ప్రధాని 14 సార్లు ప్రారంభించారు. ఇంత ఘోరమా? ఇప్పుడు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ తూత్ పాలిష్ చేసే పనులు ప్రారంభించేందుకు వస్తారట. కేంద్ర మంత్రి వచ్చి లిఫ్టును జాతికి అంకితం చేశారట? ఇదా పద్ధతి?' అని నిలదీశారు.

జనాభా గణన ఎందుకు చేపట్టడం లేదు?

'జనాభా లెక్కలను కేంద్రం ఎందుకు చేపట్టడం లేదు? తమ బండారం బయటపడ్తదని వీరి బాధ. కుల గణన చేయాలని బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు అడుగుతున్నారు. జనాభా గణన లేకుండా ఏ దేశమైనా పరిపాలన చేస్తుందా? మేము మునిగిందే గంగ.. చెప్పిందే లెక్క. వింటే విన్నవు.. లేకుంటే చంపేస్తా. ఇది భారత దేశాన్ని నడిపే పద్ధతా?' అని కేసీఆర్ ప్రశ్నించారు.

సభలో నవ్వులే నవ్వులు

ప్రధాని భజన బృందంపై పిట్ట కథను వినిపించిన సీఎం కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: ప్రధాని మోదీ చుట్టూ ఉన్న భజన బృందంపై శాసనసభలో ఆదివారం సీఎం కేసీఆర్ వినిపించిన ఓ పిట్ట కథ నవ్వులను పూయించింది. ''తిరుమల రాయుడని ఒకటే కన్ను ఉన్న రాజుంటడు. ఓ కవికి ఆయన్ను పొగడక తప్పని పరిస్థితి ఏర్పడతది. ఆయన్ను పొగిడి సంతోషపెడితే నీకు మంచి లాభం జరుగతది అని అందరూ చెప్తరు. అప్పుడు ఆయన మనస్సులో ఇష్టం లేకపోయినా మజబూరిలో ఇలా చెప్తడు... 'అన్నాతి గూడి హరుడవు.. అన్నాతిని గూడకున్న అసుర గురుడౌ... అన్నా తిరుమల రాయా కన్నొక్కటి కలదుకాని కౌరవ పతివే'... అర్థం ఏమిటంటే... ఒక కన్ను ఉందని నువ్వు రంది పడకు. నీ భార్యతో కూర్చున్నప్పుడు మూడు కళ్ల అయి నువ్వు శివుడికి సమానం. భార్యతో లేనప్పుడు ఒకే కన్ను గల రాక్షసుల గురువు శుక్రాచార్యుడు అంతటి వాడివి. అదీ లేనప్పుడూ నువ్వు కౌరవపతి అయిన ధృతరాష్ట్రుడివి''అని కేసీఆర్ పిట్ట కథను వివరించారు. 'మోదీకి చెప్పేటోళ్లు కూడా.. సార్ కాస్త బాగా చేయాలె అని చెప్పకుండా, బాగుంది.. బాగుంది అని అంటున్నరు. ఆయన మాజీ ప్రధాని అయ్యే వరకు చెప్తరు. దిగిపోతే కూడా మాజీ ప్రధానిగా ఉంటవు.. మనకేం తక్కువ సార్ అన్నట్టు ఉంది పరిస్థితి'అని కేసీఆర్ చెబుతుండగా సభలో ఘొల్లుమని నవ్వులు వినిపించాయి. ఈ కథ చెప్పి పెర్ఫార్మన్స్ లేనప్పుడు అనవసరంగా పొగడటం మంచిది కాదు అని కేంద్రానికి కేసీఆర్ చురకలంటించారు.

త్వరలో డైట్ చార్జీలు పెంపు

శాసనసభలో బీజేపీ సభ్యుడు ఈటల రాజేందర్ చేసిన పలు సూచనలపై ముఖ్యమంత్రి కేసీఆర్ సానుకూలంగా స్పందించారు. డైట్ చార్జీలు పెంచేందుకు రెండు మూడురోజుల్లో జీవో ఇవ్వాలని మంత్రులు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డిలను ఆదేశించారు. కాళేశ్వరం బ్యారేజీ ల కింద ముంపునకు గురైన భూములను సేకరించి నిర్వాసితులకు పరిహారం అందిస్తామని ప్రకటించారు. రైతు రుణమాఫీకి బడ్జెట్‌లో నిధులు పెట్టామని, పూర్తిగా అమలు చేస్తామని చెప్పారు. మహిళా సంఘాలకు ఏ నెలకు ఆ నెల రుణాలు అందించాలని ఆదేశించారు. గెస్ట్ లెక్చరర్లకు పూర్తి స్థాయి వేతనాలు అందించాలని చెప్పారు.ఉద్యోగులకు మళ్లీ పీఆర్సీ అమలు చేస్తామన్నారు. విద్యుత్ గ్రిడ్ కుప్పకూలకుండా పరిరక్షించడానికే అక్కడక్కడ విద్యుత్ కోతలు విధించక తప్పలేదని సీఎం కేసీఆర్ చెప్పారు. ఇక నిమిషం కూడా కరెంట్ పోవద్దు అని ఆదేశించినట్టు తెలిపారు.

కాళ్లు, రెక్కలు విరిచి పడేస్తారు.. : 'అంబేడ్కర్ ప్రతిష్ఠ దిగంతాలకు తెలియజేసే విధంగా సచివాలయానికి ఆయన పేరు పెట్టుకున్నాం. పార్లమెంట్‌కు పెడితే దేశ గౌరవం పెరుగుతుందని అన్నాం. (సచివాలయం) కూలగొడ్తారయ్యా? కాళ్లు రెక్కలు.. విరిచి పడేస్తారు..' అని సీఎం అన్నారు.

మాకు కాల్వల్లో నీళ్లలా ఓట్లు పారుతాయి..

'రాష్ట్రంలో టీఆర్‌ఎస్‌ను గెలిపించి ప్రజలు గెలిచారు. మళ్లీ రెండోసారి గెలిపించారు. రూ.200కి బదులు రూ.2,100 తీసుకుంటూ 45 లక్షల మంది వింతంతువులు, వృద్ధులు, పెన్షన్‌దారులు, తమ ఇళ్లల్లో నల్లాల ద్వారా స్వచ్ఛమైన నీళ్లు తీసుకుంటూ తెలంగాణ మహిళా లోకం, 24 గంటల కరెంట్, రైతుబంధు, రైతు బీమాతో 70 లక్షల మంది రైతన్నలు, వలసలు మానేసి ఇతర జిల్లాల నుంచి పనివాళ్లను తెప్పించుకుంటున్న పాలమూరు బిడ్డలు గెలిచారు. కాల్వల్లోనే కాదు వాగుల్లో కూడా నీళ్లిస్తున్నాం. కాకతీయ కాల్వ, హల్దీ, కుడవెల్లి, మంజీర, ఆకెరు వాగులో ఎలా నీళ్లు పారుతున్నయో రేపు ఎలక్షన్లలో మా డబ్బాల్లో ఓట్లు కూడా అలా పారుతాయి..' అని కేసీఆర్ దీమా వ్యక్తం చేశారు.

శ్రీ రాజ రాజేశ్వర స్వామి దేవస్థానము, వేములవాడ :: రాజన్న సిరిసిల్లా జిల్లా

ఆర్.సి.నెం.సి1/612/2022. ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీస్ తేది: 10-02-2023

శ్రీ రాజ రాజేశ్వర స్వామి దేవస్థానము నందు ఇంజినీరింగ్ విభాగము పనులు 1] రాజేశ్వరపురం నందు గల ధర్మశాలను కూల్చివేయుట 2] శ్రీ బద్దీ పోచమ్మ అమ్మవారి ఆలయము చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మాణం చేయుట. 3] పార్కింగ్ స్థలములో హైమాస్ట్ టవర్లు ఏర్పాటు చేయుట. 4] నందీశ్వర కాంప్లెక్స్ గదులలో స్ప్లిట్ ఎయిర్ కండిషనర్స్ ఏర్పాటు చేయుటకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్లు కోరబడుచున్నవి. టెండరు ప్రకటన మరియు టెండరు వివరాలు https://tender.telangana.gov.in కు లాగాన్ అవ్వండి. కరంట్ టెండర్స్ పై క్లిక్ చేసి శ్రీ రాజ రాజేశ్వర స్వామి దేవస్థానము, వర్క్స్ సెలెక్ట్ చేయండి.

సం/-డిప్యూటీ కమిషనర్ & కార్యనిర్వహణాధికారి (F.A.C)

DIPR RO No.12470-PP/CL/ADVT/1/2022-23, Dt: 12-02-2023

తెలంగాణ ప్రభుత్వం
నీటిపారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ

హనుమకొండ జిల్లా, కార్యనిర్వహణ ఇంజినీర్, ఇరిగేషన్ డివిజన్ నంబర్ 1, పరకాల పరిధిలోని రెండు (2) మరమ్మతు పనులకూను టెండర్లు ఆహ్వానించడమైనది. 1) ఒక పనికి గాను అంచనా విలువ మొత్తం : రూ.0.818 లక్షలకు టెండర్లు జనరల్ కేటగిరిలో, 2) మరొక పనికి అంచనా విలువ మొత్తం : రూ.1.11 లక్షలకు, G.O.Ms.Dt:21.05.2018 ప్రకారము ఎస్.సి/ఎస్.టి/[illegible] సొసైటీ మరియు వ్యక్తిగత వ్యక్తుల రిజర్వేషన్‌తో ఆహ్వానించడమైనది. టెండర్ల లభ్యమగు తేది : 09.02.2023 ఉ.11.00 నుండి 21.02.2023 సా. 5.00 గం. వరకు లభించును. గమనిక: మిగతా వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ https://tender.telangana.gov.in లో చూడగలరు.

సం/- (సి.హెచ్.సునీత), కార్యనిర్వహణ ఇంజినీర్, ఇరిగేషన్ డివిజన్ నంబర్. 1, పరకాల

DIPR RO.No.12467-PP/CL/Advt/1/2022-23, Dt: 12.02.2023

క్లుప్తంగా...

మహాశివరాత్రి జాతరకు సీఎంకు ఆహ్వానం



వేములవాడ : ఈ నెల 18న జరిగే వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో జరిగే మహా శివరాత్రి జాతరకు హాజరు కావాల్సిందిగా సీఎం కేసీఆర్‌ను వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ ఆహ్వానించారు. ఆలయ ఈవో కృష్ణప్రసాద్, వేద పండితులు సీఎంకు శాలువాకప్పి ఆహ్వాన పత్రిక, తీర్థ ప్రసాదాలు అందజేశారు. 33 జిల్లాల్లో కార్మిక భవనాలు మంజూరు చేసినందుకు కేసీఆర్‌కు మంత్రి మల్లారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

మండలి చీఫ్ విప్‌గా భానుప్రసాద్

సాక్షి, హైదరాబాద్: శాసనమండలిలో ప్రభుత్వ చీఫ్ విప్‌గా భానుప్రసాద్‌రావు, విప్‌లుగా శంభీపూర్ రాజు, పాడి కౌశిక్‌రెడ్డిని నియమిస్తున్నట్లు మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తెలిపారు. భానుప్రసాద్ ఇప్పటికే చీఫ్ విప్‌గా కొనసాగుతున్నారు. కాగా శాసన మండలి చీఫ్ విప్‌గా నియమితులైన ఎమ్మెల్సీ భానుప్రసాద్ రావు, కొత్తగా విప్ పదవులు పొందిన పాడి కౌశిక్‌రెడ్డి, శంభీపూర్ రాజు ఆదివారం శాసన మండలి ఆవరణలో సీఎం కేసీఆర్, మంత్రి కేటీ రామారావును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కొత్తగా పదవులు చేపట్టిన నేతలను సీఎం కేసీఆర్ అభినందించారు

మనది మిగులు రాష్ట్రమా, లోటు రాష్ట్రమా?: అక్బరుద్దీన్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ వచ్చినప్పటి నుంచి ప్రవేశపెడుతున్న బడ్జెట్ అంచనాలకు, వాస్తవ లెక్కలకు పొంతన కుదరటం లేదని మజ్లిస్ సభ్యుడు అక్బరుద్దీన్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అంచనాలను అందుకోలేకపోతున్నప్పుడు తెలంగాణ ధనిక రాష్ట్రమెలా అవుతుందని ప్రశ్నించారు. మనది మిగులు రాష్ట్రమా, లోటు రాష్ట్రమా అన్న విషయాన్ని ప్రభుత్వం స్పష్టం చేయాలని కోరారు. ఆదివారం ద్రవ్య వినిమయ బిల్లుపై ఆయన అసెంబ్లీలో మాట్లాడుతూ, 2014–15 నుంచి బడ్జెట్ అంకెలు ఉటంకిస్తూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. యువతలో మత్తు పదార్థాల వినియోగం విపరీతంగా పెరిగిపోతోందని, దీని వల్ల కుటుంబాలు నాశనమవుతున్నాయని చెప్పారు. దీన్ని నిరోధించే వ్యవస్థను పటిష్టం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. కాగ్ రిపోర్టును సభలో ఎందుకు ప్రవేశపెట్టలేదో చెప్పాలని, ప్రతీసారి సమావేశాల చివరి రోజు కాకుండా, ముందుగానే సభలో కాగ్ రిపోర్టును ఉంచాలని డిమాండ్ చేశారు.

గజ్వేల్‌లో ఎన్ని గంటల కరెంట్ ఇస్తున్నారు: షర్మిల



జనగామ: వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ ఇస్తున్నామని అబద్ధాలు చెబుతున్న సీఎం కేసీఆర్.. ఆయన ఇలాకా గజ్వేల్‌లో ఎన్ని గంటల విద్యుత్ ఇస్తున్నారో చెప్పాలని వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రశ్నించారు. తన పాదయాత్ర సందర్భంగా జనగామ జిల్లా నర్మెట మండలం అమ్మాపూర్ క్యాంపు వద్ద ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్రంలో ఎక్కడ చూసినా కరెంటు కోతలతో వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయన్నారు. కరెంటు మిగులు రాష్ట్రం అంటూ పచ్చి అబద్ధాలు చెబుతున్న కేసీఆర్, రూ.50 వేల కోట్ల నష్టాల్లో విద్యుత్ సంస్థలు ఎలా కూరుకుపోయాయో చెప్పాలన్నారు. విద్యుత్ ఉత్పత్తి, కొనుగోలు అంశాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

బీసీ బిల్లుకు ఎస్పీ మద్దతు

ఎంపీ ఆర్.కృష్ణయ్య వెల్లడి




సాక్షి, హైదరాబాద్: పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టడానికి సమాజ్‌వాది పార్టీ మద్దతు ప్రకటించిందని వైఎస్సార్ సీపీ రాజ్యసభ ఎంపీ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఒక ప్రకటనలో వెల్లడించారు. పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టి అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో 50% రిజర్వేషన్లు కల్పించడానికి తమ పార్టీ మద్దతునిస్తుందని ఎస్పీ జాతీయ అధ్యక్షుడు, ఉత్తర్ ప్రదేశ్ మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్ హామీ ఇచ్చారని చెప్పారు. శనివారం తాను లక్నోలో అఖిలేశ్‌ను కలిసి మద్దతివ్వాలని కోరినట్లు తెలిపారు.

అసెంబ్లీని ప్రచారానికి వాడుకున్నారు: పొంగులేటి

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలను తన ప్రచారానికి వేదికగా వాడుకుందని బీజేపీ నేత పొంగులేటి సుధాకర్‌రెడ్డి ధ్వజమెత్తారు. ప్రజల పన్నులతో నడిచే అసెంబ్లీలో కేసీఆర్ ఎన్నికల సభలో మాదిరిగా మాట్లాడటం శోచనీయమన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, నిరుద్యోగ భృతి, దళితులకు మూడెకరాలు, రైతు రుణమాఫీ, డబుల్ బెడ్రూంల గురించి కేసీఆర్ ఎందుకు ప్రస్తావించలేదని ప్రశ్నించారు.

మధుమేహ భారతం!



దేశంలో అధిక బరువు, ఊబకాయంతో 73 శాతం మందికి షుగర్ వచ్చే ఛాన్స్

98.4% మంది సరిపడా కూరగాయలు, పండ్లు తినడంలేదు

2040 నాటికి ఊబకాయుల సంఖ్య మూడింతలు పెరిగే ప్రమాదం

- దీర్ఘకాలిక వ్యాధులపై ఐసీఎంఆర్, ఎన్ఐఎన్ వంటి సంస్థల సర్వేలో వెల్లడి
- పట్టణాల్లో 34 శాతం మందికి బీపీ... పురుషుల్లోనే ఎక్కువ
- 2019లో దీర్ఘకాలిక వ్యాధులతో 61 లక్షల మంది మృతి
- 65 శాతం మరణాలకు ఆయా జబ్బులే ప్రధాన కారణం

సమాజాన్ని దీర్ఘకాలిక వ్యాధులు పట్టిపీడిస్తున్నాయి. దేశంలో జరుగుతున్న మరణాల్లో 65 శాతం దీర్ఘకాలిక వ్యాధుల వల్లే సంభవిస్తున్నాయని... అధిక బరువు, ఊబకాయం వల్ల షుగర్ వచ్చే ప్రమాదం ప్రజల్లో 73 శాతం ఎక్కువగా ఉందని కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని భారతీయ వైద్య పరిశోధనా మండలి (ఐసీఎంఆర్) తేల్చిచెప్పింది. ఈ మేరకు దీర్ఘకాలిక వ్యాధులపై ఐసీఎంఆర్, ఎన్ఐఎన్ సహా 21 సంస్థలు సర్వే చేశాయి. దేశవ్యాప్తంగా 600 ప్రాంతాల నుంచి దీర్ఘకాల వ్యాధులతో బాధపడుతున్న 10,659 మందిని (18–69 ఏళ్ల వయసు వారు) సర్వే చేసి ఈ వివరాలు వెల్లడించాయి. తెలంగాణలో జాతీయ పోషకాహార సంస్థ (ఎన్ఐఎన్) సర్వే చేసింది. సర్వే నివేదికపై పార్లమెంటు ఇటీవల చర్చించింది. దేశంలో దీర్ఘకాలిక వ్యాధులపై జరిగిన మొట్టమొదటి సర్వే ఇదేనని కేంద్రం తెలిపింది.


– సాక్షి, హైదరాబాద్

సర్వేలో వెల్లడైన అంశాలు...

- 2019లో దేశంలో దీర్ఘకాలిక జబ్బులతో 61 లక్షల మంది చనిపోయారు. అందులో షుగర్‌తో 1.70 లక్షల మంది మరణించారు. 1990తో పోలిస్తే దీర్ఘకాలిక వ్యాదులతో మరణించే వారి సంఖ్య రెట్టింపు అయింది.
- ధూమపానం వల్ల గుండె జబ్బులు వచ్చే అవకాశం 15.5 శాతం ఎక్కువ. అధికంగా పొగతాగడం వల్ల కేన్సర్ ముప్పు సైతం 39 శాతం పెరుగుతుందని సర్వే తేల్చింది.

'పొగ'బారిన 33% మంది

సర్వే ప్రకారం దేశంలో 32.8 శాతం మంది పొగతాగుతున్నారు. అందులో పురుషులు 51.2 శాతం, మహిళలు 13 శాతం ఉన్నారు. పట్టణాల్లో 25 శాతం, పల్లెల్లో 36.8 శాతం పొగ తాగుతున్నారు.



- 15.9 శాతం మంది మద్యం సేవిస్తున్నారు. అందులో పురుషులు 28.3 శాతం, మహిళలు 2.4 శాతం ఉన్నారు. పట్టణాల్లో 14.2 శాతం, పల్లెల్లో 16.7 శాతం ఉన్నారు. అందులో అధిక మద్యం సేవించేవారు 5.9 శాతం మంది ఉన్నారు. అధిక మద్యం సేవించేవారిలో పురుషులు 10.9 శాతం, 0.5 శాతం మహిళలున్నారు. పట్టణాల్లో 10.7 శాతం, పల్లెల్లో 6.1 శాతం అధిక మద్యం సేవిస్తున్నారు. దేశంలో మద్యం వినియోగించే వారిలో 20–35 ఏళ్లవారే ఎక్కువగా ఉన్నారు.

ఉప్పుతో పెరుగుతున్న ముప్పు...

- సర్వేలో పాల్గొన్న వారిలో సగటు ఉప్పు వినియోగం 8 గ్రాములుగా వెల్లడైంది. అందులో పురుషుల్లో ఉప్పు సగటు వినియోగం 8.9 గ్రాములుకాగా, మహిళలు 7.1 గ్రాములు వాడుతున్నారు. పట్టణాల్లో 8.3 గ్రాములు, పల్లెల్లో 8 గ్రాముల మేర వాడుతున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ చెప్పినదానికంటే దేశంలో రెట్టింపు ఉప్పు వినియోగం జరుగుతోంది.

వేధిస్తున్న ఊబకాయం...

- సర్వేలో పాల్గొన్న వారిలో 41.3 శాతం మంది శారీరక శ్రమ చేయడం లేదు. అందులో పురుషులు 30.9 శాతం మంది, మహిళలు 52.4 శాతం ఉన్నారు. పట్టణాల్లో 51.7 శాతం, గ్రామాల్లో 36.1 శాతం మంది చేయడం లేదు.
- 26.1 శాతం మంది అధిక బరువుతో బాధపడుతున్నారు. అందులో పురుషులు 23.3 శాతం, మహిళలు 29.3 శాతం ఉన్నారు. పట్టణాల్లో 42.5 శాతం మంది అధిక బరువు సమస్యతో బాధపడుతున్నారు, గ్రామాల్లో ఇది 18 శాతంగా ఉంది.



పెరుగుతున్న బీపీ, షుగర్...

- 28.5 శాతం మందిని బీపీ పట్టిపీడిస్తోంది. పురుషుల్లో 29.9 శాతం, మహిళల్లో 27 శాతం బీపీతో బాధపడుతున్నారు. ఇక పట్టణాల్లో 34 శాతం, గ్రామాల్లో 25.7 శాతం మంది బీపీతో ఉన్నారు.
- 9.3 శాతం మంది షుగర్‌తో బాధపడుతున్నారు. అందులో పురుషుల్లో 8.5 శాతం, మహిళల్లో 10.2 శాతం షుగర్ ఉంది. పట్టణాల్లో 14.4 శాతం, గ్రామాల్లో 6.9 శాతంగా ఉంది.

2040 నాటికి 'బరువు'మూడింతలు

- సర్వే అంచనాల ప్రకారం 2040 నాటికి అధిక బరువు బాధితుల సంఖ్య రెట్టింపు కానుంది. ఊబకాయం బాధితుల సంఖ్య మూడింతలు అవుతుంది. బీఎంఐ 25–30 మధ్య ఉంటే అధిక బరువు అంటారు. బీఎంఐ 30 కంటే ఎక్కువగా ఉంటే ఊబకాయం అంటారు. నడుము చుట్టు కొలత పురుషుల్లో 90 సెంటీమీటర్లు, మహిళల్లో 80 సెంటీమీటర్ల కంటే ఎక్కువ ఉంటే అధిక పొట్ట ఉన్నట్లు లెక్క.
- బీపీ 140/90 కంటే ఎక్కువ ఉంటే అధికంగా ఉన్నట్లు. షుగర్ ఫాస్టింగ్ 126 కంటే ఎక్కువ ఉంటే మధుమేహం ఉన్నట్లు లెక్క.

ప్రతి మూడు మరణాల్లో రెండు అవే...



గత 30 ఏళ్లలో జీవనశైలి జబ్బుల ప్రభావం భారతీయుల్లో రెట్టింపైంది. దేశంలో ప్రస్తుతం సంభవించే ప్రతి 3 మరణాలలో రెండు వీటికి చెందినవే. తగిన శారీరక శ్రమ, బరువును అదుపులో ఉంచుకోవడం, తాజా కూరగాయలు, పండ్లు రోజుకు 400 గ్రాములకు తగ్గకుండా తీసుకోవడం ద్వారా ఈ జబ్బులను దూరం చేయవచ్చు.

– డాక్టర్ హరిత, వైద్యురాలు, నిజామాబాద్

వ్యాయామానికి విరామం...

- ఈ సర్వే ప్రకారం దేశంలో 98.4 శాతం మంది నిర్ణీత పరిమాణంలో కూరగాయలు, పండ్లు తీసుకోవడంలేదు.
- వారానికి కనీసం 150 నిమిషాలపాటు తేలికపాటి నుంచి మధ్యస్థ స్థాయి లేదా 75 నిమిషాలపాటు తీవ్రస్థాయిలో శారీరక శ్రమ చేయాలి. ఆ ప్రకారం శారీరక శ్రమ చేయనివారు 41.3 శాతం మంది ఉన్నారు.

పారదర్శకత కోసమే టీఎస్‌బీపాస్



- పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కేటీఆర్
- ఈ విధానంలో అవినీతికి తావులేకుండా భవన నిర్మాణాలకు అనుమతులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో భవన నిర్మాణ అనుమతులను అత్యంత పారదర్శకంగా జారీ చేసేందుకు టీఎస్ బీపాస్‌ను ప్రవేశపెట్టినట్లు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కేటీ రామారావు స్పష్టం చేశారు. ఇదివరకు భవన నిర్మాణ అనుమతుల జారీలో భారీగా అవినీతి జరిగేదని, లంచాలు ఇచ్చి అనుమతులు పొందిన ఘటనలు అనేకమని అన్నారు. కానీ అక్రమాలకు తావు లేకుండా పారదర్శకంగా అనుమతులు ఇచ్చేందుకే టీఎస్ బీపాస్‌ను ప్రవేశపెట్టామని చెప్పారు. కేవలం 21 రోజుల్లోనే భవన నిర్మాణాలకు అనుమతులు ఇస్తున్నామని, నిర్దేశించిన గడువులోగా ఒకవేళ అనుమతి రాకుంటే ఆటోమేటిక్‌గా ఇచ్చినట్టే పరిగణించాలని పేర్కొన్నారు. టీఎస్ బీపాస్‌తో నిబంధనల మేరకే భవన నిర్మాణాలు ఉంటాయన్నారు. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా ఆదివారం శాసనమండలిలో జరిగిన చర్చలో మంత్రి కేటీఆర్ ఈ అంశంపై మాట్లాడారు. గృహ నిర్మాణ శాఖను రద్దుచేసి.. రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు. ప్రజల కోరిక మేరకు జీవో 111 స్థానంలో జీవో 69 తీసుకొచ్చామని తెలిపారు. హిమాయత్‌సాగర్ కలుషితం కాకుండా చర్యలు చేపడతామని వెల్లడించారు.

మెట్రోరైలు రెండోదశకు శ్రీకారం

మెట్రోరైలు రెండోదశకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, శంషాబాద్ నుంచి మైండ్ స్పేస్ వరకు 31 కిలోమీటర్ల మార్గాన్ని పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వమే రూ. 650 కోట్ల వ్యయంతో నిర్మించనుందని మంత్రి కేటీఆర్ తెలిపారు. ఈ లైన్ కేవలం ఎయిర్‌పోర్టుకు వెళ్లే వారి కోసమనే భావన ఉందని, కానీ అందులో వాస్తవం లేదని ఎవరైనా ఈ మార్గంలో ప్రయాణించవచ్చని స్పష్టం చేశారు. ప్రజారవాణాను అభివృద్ధి చేయాలనే కోణంలోనే మెట్రో రైలు మార్గాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి వివరించారు. మరో రెండు మార్గాలకు సంబంధించిన డీపీఆర్‌లను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి నివేదించిందని, కానీ ఈ అంశంపైన కేంద్ర ప్రభుత్వం స్పందించలేదని, కనీసం బడ్జెట్లో నిధులు కూడా కేటాయించలేదని పేర్కొన్నారు. అనంతరం మండలిలో తెలంగాణ మున్సిపల్ చట్ట సవరణ బిల్లును మంత్రి ప్రవేశపెట్టగా సభ ఆమోదించింది. కాగా, తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం 2018 అనుసూచి–8కి సవరణ ద్వారా భద్రాచలం, సారపాక, రాజంపేట ఏజెన్సీ గ్రామాలను ఒకటి లేక అంతకు మించి గ్రామపంచాయతీలుగా ఏర్పాటు, ఆచార్య జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయ చట్టం సవరణ బిల్లుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది.

ఫిరాయింపు ఎమ్మెల్యేలపై సీబీఐ విచారణ

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ డిమాండ్



అశ్వాపురం: కాంగ్రెస్ నుంచి గెలిచి, పార్టీ ఫిరాయించిన 12 మంది ఎమ్మెల్యేలపై సీబీఐ విచారణ చేయాలని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం గొల్లగూడెంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఫిరాయింపు ఎమ్మెల్యేలపై సీబీఐ విచారణ చేయించాలని పీఎం, కేంద్ర హోం మంత్రి, సీబీఐ డైరెక్టర్, చీఫ్ సెక్రటరీకి, మొయినాబాద్ పోలీసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశామన్నారు. మొయినాబాద్ పోలీసులు ఇచ్చే నివేదిక, తమ ఫిర్యాదు ఫైల్‌ను సీబీఐకి పంపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. పోలీసులు సీఎం కేసీఆర్ ఒత్తిడికి లొంగి సీబీఐకి కేసు సమాచారం ఇవ్వకుంటే హైకోర్టును ఆశ్రయిస్తామని తెలిపారు. కేసీఆర్ అవినీతి, అక్రమాలతో పాటు పార్టీ ఫిరాయింపులే పనిగా పెట్టుకుని రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్‌పై విమర్శలు చేస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్.. పార్టీ ఫిరాయించిన 12 మంది ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాల్సిందిగా పీఎం, కేంద్ర హోం మంత్రి, సీబీఐ డైరెక్టర్‌కు లేఖలు రాయాలని కోరారు. లేదంటే కేసీఆర్‌తో వారు కుమ్మక్కయ్యారని భావించాల్సి వస్తుందన్నారు.

అవన్నీ అబద్ధాలని నిరూపిస్తా.. రాజీనామా చేస్తావా?

▶ మొదటి పేజీ తరువాయి

అమలు విషయంలో ప్రజల దృష్టిని మళ్లించేందుకే అసెంబ్లీలో అడ్డగోలుగా అబద్ధాలు చెప్పారని విమర్శించారు. హైకోర్టు చీవాట్లు పెట్టినా 56 వేల జీవోలను వెబ్ సైట్లో పెట్టకుండా దాచిన కేసీఆర్... కేంద్రంలో నరేంద్ర మోదీ పాలన గురించి మాట్లాడటం సిగ్గు చేటన్నారు. రాష్ట్రంలో గొప్పలు చెప్పి చేసిన సమగ్ర కుటుంబ సర్వే నివేదిక ఏమైందో, ప్రజల ముందు ఎందుకు పెట్టడం లేదో సమాధానం చెప్పాలని నిలదీశారు. అబద్ధాలతో అసెంబ్లీని మలినం చేసిన కేసీఆర్ రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాల్సిందేనన్నారు.

ఈ ఏడాదే కేసీఆర్ ఖేల్ ఖతం కాబోతోంది...

2024లో మోదీ ప్రభుత్వం పనైపోతోందన్న కేసీఆర్ వ్యాఖ్యలను ఉటంకిస్తూ... "ఈ ఏడాదే కేసీఆర్ ఖేల్ ఖతం కాబోతోంది. ప్రజలు బీఆర్‌ఎస్ ను పాతిపెట్టబోతున్నారు" అని సంజయ్ అన్నారు. మోదీని తిట్టడానికి, కేంద్రాన్ని బదనాం చేసేందుకు తప్ప అసెంబ్లీలో మాట్లాడిందేమీలేదు. బడ్జెట్ ప్రస్తావనే లేదు. అని మండిపడ్డారు. పార్లమెంట్ లో మోదీ ప్రసంగాన్ని ప్రపంచమంతా మెచ్చుకోవడంతో...ఆయనతో పోల్చుకోవడానికి కేసీఆర్ నానా తంటాలు పడ్డారని ఎద్దేవాచేశారు. 'అసెంబ్లీలో లేని వ్యక్తి గురించి మాట్లాడొచ్చా? గతంలో నేను పార్లమెంట్‌లో మాట్లాడితే నాపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు కదా...ఇవాళ మీరు చేసిందేమిటి? కేసీఆర్ ను ఇతర రాష్ట్రాల ప్రజలు, పార్టీలు జోకర్‌లా చూస్తున్నరు' అని ఎద్దేవా చేశారు. 'నీ బిడ్డ లిక్కర్ స్కాంపై ఇంతవరకు నోరు మెదపలేదు... ఇవాళ ఎవరో పుస్తకం రాస్తే అసెంబ్లీలో చదివి వినిపించి మోదీని తిడతావా?... నీపై లక్షల పుస్తకాలు రాశారు. ఎవడి పాలైందిరో తెలంగాణ అని పాటలు రాశారు.. అవి అసెంబ్లీలో చదివి వినిపిస్తావా?' అని ప్రశ్నించారు.

అవి పాకిస్తాన్, చైనా ఇచ్చాయా..?

'కేంద్రం ఒక్క మెడికల్ కాలేజీ ఇవ్వలేదా? మరి ఎవరిచ్చారు? పాకిస్తాన్, చైనా ఇచ్చిందా? ప్రతి నియోజకవర్గంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి హామీ ఏమైంది? ఆసుపత్రుల్లో కనీస సౌకర్యాల్లేవు. స్టాఫ్ నియామకాల్లేవు. నీకు ఇష్టమైన పాకిస్తాన్‌లో పిండికోసం కొట్టుకుని చస్తున్నారు. శ్రీలంక బిచ్చమెత్తుకుంటోంది. చైనా అల్లాడుతోంది' అని సంజయ్ పేర్కొన్నారు. 'బీజేపీకి ఓటేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు. రూ.లక్ష కోట్లతో తెలంగాణలో రోడ్లు వేసినం.. కేంద్ర నిధులవల్లే పంచాయతీలు నడుస్తున్నయ్.. తెలంగాణకు కేంద్రం అన్ని విధాలా సహకరిస్తున్నందుకు ప్రజలు ఓట్లేసేందుకు సిద్ధంగా ఉన్నారు' అని బండి ధీమా వ్యక్తంచేశారు.

తాజ్ పోలికలతో సచివాలయాన్ని సమాధి చేస్తారా?

కోరుట్ల: 'కొత్త సచివాలయం డోమ్‌లతో తాజ్‌మహల్ లెక్క ఉందని ఎంఐఎం నేత ఒవైసీ అన్నడు. తాజ్‌మహల్ అనేది సమాధి, కొత్త సచివాలయాన్ని సమాధి చేస్తారా? అట్లా జరగనివ్వం. నిజాం వారసత్వ చిహ్నాలు, నెత్తుటి మరకలు తెలంగాణలో ఉండనివ్వం. ఒవైసీ కోసం కడుతున్న డోమ్‌లు కూల్చేస్తం' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ హెచ్చరించారు. జగిత్యాల జిల్లా కోరుట్లలో ఆదివారం జరిగిన కార్నర్ మీటింగ్‌లో సీఎం కేసీఆర్ తీరుపై ఆయన మండిపడ్డారు. ఆరువేల మంది ప్రజలను కర్కశంగా పొట్టనబెట్టుకున్న నిజాం పాలనాచిహ్నాలు ఉండనివ్వబోమని సంజయ్ స్పష్టం చేశారు. వాటిని తొలగించి మన భారతీయ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా నిర్మిస్తామని అన్నారు.



అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ముగిసిన అనంతరం ఆదివారం రాష్ట్ర ఆర్థిక, వైద్య, ఆరోగ్య శాఖల మంత్రి టి.హరీశ్‌రావు నాంపల్లి పబ్లిక్ గార్డెన్‌లో ఇచ్చిన విందుకు హాజరైన స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి తదితరులు

ఐదు బిల్లులు.. ఒక తీర్మానం

- ముగిసిన అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు
- పూర్తి ప్రజాస్వామ్యబద్ధంగా జరిగాయన్న మంత్రి వేముల



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఒక తీర్మానంతో పాటు ఐదు బిల్లులను శాసనసభ ఆమోదించింది. వాల్మీకి బోయలను, కాయస్థ లంబాడీలను ఎస్టీ జాబితాలో చేర్చాలని కేంద్రాన్ని కోరుతూ అసెంబ్లీ తీర్మానించింది. మున్సిపల్, పంచాయతీరాజ్, జయశంకర్ యూనివర్సిటీ సవరణ బిల్లులు, రెండు ద్రవ్య వినిమయ బిల్లులు కలుపుకొని మొత్తం ఐదు బిల్లులను ఆమోదించింది. అసెంబ్లీ చివరి రోజు ఆదివారం ప్రశ్నోత్తరాల తర్వాత తెలంగాణ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ పత్రాలను మంత్రి జగదీశ్‌రెడ్డి సభకు సమర్పించారు. రాష్ట్రంలో ఫీజుల రీయింబర్స్‌మెంటుపై బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని స్పీకర్ తిరస్కరించారు. అనంతరం ద్రవ్య వినిమయ బిల్లులపై జరిగిన చర్చలో ఎమ్మెల్యేలు అక్బరుద్దీన్ ఒవైసీ, భట్టి విక్రమార్క, గండ్ర వెంకటరమణారెడ్డి, బాల్క సుమన్, ఈటల రాజేందర్ పాల్గొన్నారు. అనంతరం సీఎం కేసీఆర్ రెండు గంటల పాటు సమాధానం ఇచ్చారు. బిల్లులను ఆమోదించిన తర్వాత సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు.

రెండు భేటీలు బేరీజు వేసుకోండి: మంత్రి వేముల

అసెంబ్లీ, మండలి సమావేశాలు ఎలాంటి అంతరాయం లేకుండా ప్రశాంతంగా పూర్తి ప్రజాస్వామ్యబద్ధంగా జరిగాయని శాసనసభ వ్యవహారాల మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి చెప్పారు. పద్దులపై సవివరంగా రాత్రి పొద్దుపోయే వరకు చర్చలు జరిగినా మంత్రులు ఓపిగ్గా సమాధానాలు ఇచ్చారన్నారు. 'ఉభయ సభల్లో ప్రతిపక్ష సభ్యుల బలం తక్కువగా ఉన్నప్పటికీ మేము ఎక్కడా బుల్డోజ్ చేయడానికి ప్రయత్నించలేదు. ప్రభుత్వం తరఫున మంత్రులు పద్దులపై సమాధానం చెప్పే సమయంలో ప్రతిపక్ష సభ్యులు లేక పోవడం విచారకరం. వారికి ప్రజా సమస్యలపై ఎంత చిత్తశుద్ధి ఉందో, చట్ట సభలపై ఏపాటి గౌరవం ఉందో ప్రజలకు అర్థమయ్యింది. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నపుడే పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు కూడా జరిగాయి. ఈ రెండింటినీ విజ్ఞులు ఓసారి బేరీజు వేసుకోవాలి. ఇక్కడ ప్రతిపక్షాలు అడిగిన వాటితో పాటు అడగని వాటికి కూడా మేం సమాధానం చెప్పాం. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రధాన సమస్యల నుంచి తప్పించుకునే ప్రయత్నం చేసింది. అసలు విషయంపై ప్రధాని ముఖం చాటేస్తే.. శాసన సభలో సీఎం కేసీఆర్ అన్ని అంశాలపై సుదీర్ఘంగా సమాధానం ఇచ్చారు. ప్రతిపక్ష సభ్యులు ఇచ్చిన సలహాలు, సూచనలు పాటిస్తామని చెప్పడం ద్వారా ముఖ్యమంత్రి ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటారు..' అని ప్రశాంత్‌రెడ్డి మీడియాతో వ్యాఖ్యానించారు.

సంగారెడ్డికి మెట్రో వేయండి..

సీఎం కేసీఆర్‌ను కలిసి వినతిపత్రం అందజేసిన జగ్గారెడ్డి



సాక్షి, హైదరాబాద్: మియాపూర్ నుంచి సంగారెడ్డి రాం మందిర్ మీదుగా సదాశివపేట వరకు మెట్రో రైలును మంజూరు చేయాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి సీఎం కేసీఆర్‌ను కోరారు. ఈ మేరకు ఆయన ఆదివారం శాసనసభలో కేసీఆర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. తన వినతి పట్ల సీఎం సానుకూలంగా స్పందించారని, ఈ మెట్రోలైన్ సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారని జగ్గారెడ్డి విలేకరులకు తెలిపారు. అదే విధంగా గ్రూప్–1 మెయిన్స్‌కు 1:50 కాకుండా 1:100 నిష్పత్తిలో అభ్యర్థులకు అవకాశం ఇవ్వాలని సీఎంను కోరగా, ఇందుకు కూడా ఆయన సానుకూలంగా స్పందించారని ఆయన వెల్లడించారు. సంగారెడ్డి నియోజకవర్గంలో బాలురు, బాలికల ఉన్నత పాఠశాలలు, కళాశాలలు, హాస్టల్ భవనాల నిర్మాణానికి నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే జగ్గారెడ్డి కోరారు. ఈ మేరకు అసెంబ్లీ లాబీల్లోని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి చాంబర్‌లో ఆదివారం ఆమెను కలిసి వినతిపత్రం అందజేశారు.

వినతులు ఇస్తున్నావ్.. పనులవుతున్నాయా?

ఎమ్మెల్యే జగ్గారెడ్డిని ఆరా తీసిన ఈటల

సాక్షి, హైదరాబాద్: బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్.. సంగారెడ్డి కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డిల మధ్య ఆసక్తికర చర్చ జరిగింది. ఆదివారం అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సమయంలో ఈటల రాజేందర్ సీఎల్పీ కార్యాలయానికి వచ్చారు. ఆ సమయంలో తన చేతిలో వినతిపత్రాలతో ఉన్న జగ్గారెడ్డిని ఉద్దేశించి రాజేందర్ మాట్లాడుతూ 'వినతుల మీద వినతులు ఇస్తున్నావ్.. అన్ని పనులు అవుతున్నాయా?'అని ఆరా తీశారు. ఇందుకు స్పందించిన జగ్గారెడ్డి అయినా కాకపోయినా ఇవ్వడమైతే మన బాధ్యత కదా అని వ్యాఖ్యానించారు.

ఏడుగురు ఎమ్మెల్సీలకు సత్కారం

సాక్షి, హైదరాబాద్: రానున్న మార్చి, మే నెలల్లో ఆరేళ్ల పదవీ కాల పరిమితి పూర్తి చేసుకుంటున్న ఏడుగురు ఎమ్మెల్సీలను మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సత్కరించారు. ఆదివారం మండలి సమావేశాలు ముగిసిన తర్వాత ఎమ్మెల్సీలు గంగాధర్‌గౌడ్, ఎలిమినేటి కృష్ణారెడ్డి, నవీన్ కుమార్, అమీనుల్ జాఫ్రీ, కాటేపల్లి జనార్దన్ రెడ్డి, డి.రాజేశ్వర్‌రావు, ఫారూక్ హుస్సేన్‌కు సన్మానం చేశారు. మంత్రులు హరీష్, వేముల ప్రశాంత్‌రెడ్డి, మహమూద్ అలీతో పాటు పలువురు ఎమ్మెల్సీలు పదవీ కాలం పూర్తి చేసుకుంటున్న ఈ ఏడుగురు ఎమ్మెల్సీలను సన్మానించారు.







"నీకు ప్రియమైనవాళ్లను మానవ ప్రేమతో ప్రేమించగలవు. కానీ శత్రువును ప్రేమించడం దైవిక ప్రేమతోనే సాధ్యం."
- లియో టాల్‌స్టాయ్

సాక్షి
సోమవారం, ఫిబ్రవరి, 13

అమృత వేణువు

'లోకంలో ఇన్ని చెట్లు, లతలు, తీవెలు ఉన్నాయి. కొన్నింటికి పండ్లు, కొన్నింటికి పూలు, కొన్నింటి పత్రాలు వర్ణభరితం... కాని ఈ వెదురు పొదను చూడండి. నిరాడంబరమైన ఈ వెదురులోని ప్రతి చిన్న భాగానికి అమృతమయమైన నాదాన్ని వెలువరించే శక్తి ఉంది... వేణుగానాన్ని వినిపించే జీవం ఉంది' అంటాడు హరిప్రసాద్ చౌరాసియా.

'మా నాన్న అలహాబాద్‌లో పహిల్వాన్. ఆరేళ్ల వయసులో నేను తల్లిని కోల్పోతే ఆయన తిరిగి పెళ్లి చేసుకోలేదు. తల్లి లేని పిల్లాడు క్రమశిక్షణలో ఉండాలంటే అఖాడాలో దించి కుస్తీ లడాయిస్తూ ఉండాలని భావించాడాయన. నాకేమో చెవిన సరిగమలు పడితే ఆత్మ ఆగదు. గాత్రం నేర్చుకోవాలనుకున్నాను. తొలి రోజుల్లో పాఠాలు చెప్పిన గురువు... హరిప్రసాద్... నీకు పైస్వరం పలకదు. కాని దమ్ము చాలాసేపు నిలబెట్టగలవు. దమ్ము నిలిపే వాద్యం నేర్చుకో పైకి వస్తావు అన్నాడు. నాకు వేణువు గుర్తుకు వచ్చింది. అది ఖరీదైన వాద్యం కాదు. తీగలు ఉండవు. చర్మ వాద్యం కాదు పాడవడానికి. ఏ సంతలోనైనా దొరుకుతుంది. ఎక్కడికైనా తీసుకెళ్లడం సులభం. పెదాలతో గాలి నింపితే శబ్దాన్ని వెలువరిస్తుంది. అందుకని వేణువును ఎంచుకున్నాను' అంటాడాయన.

ఇక్కడ మీరు చదవడం ఆపి తలత్ మెహమూద్ ప్రఖ్యాత గీతం 'ఫిర్ వహీ షామ్...' వినండి. అందులో ఎంతో మృదువైన తలత్ గొంతును అనుసరిస్తూ మరింత మృదువైన వేణుగానం వినిపిస్తుంది. అది హరిప్రసాద్ చౌరాసియా తొలి సినీ పాట వాద్యకారుడిగా. ఇంకా అర్థం కావాలంటే 'విధాత తలపున ప్రభవించినది' వినండి... అందులో పాటంతా కొనసాగే వేణువును అంత అద్భుతంగా ఎవరు పలికిస్తారు చౌరాసియా తప్ప. 'సిరివెన్నెల'లో హీరో పాత్ర పేరు అదే- హరిప్రసాద్.

ఇప్పుడు దేశంలో రెండు గురుకులాలను వేణుగాన ఉపాసకుల కోసం నిర్వహిస్తున్నాడు హరిప్రసాద్ చౌరాసియా. ఒకటి భువనేశ్వర్‌లో ఉంది. ఒకటి ముంబైలో. 'పిల్లలకు వేణువు నేర్పిస్తాను' అని చౌరాసియా అడిగిందే తడవు నాటి ఒరిస్సా ముఖ్యమంత్రి బిజూ పట్నాయక్ స్థలం కేటాయించాడు. ముంబైలో కూడా ప్రభుత్వమే స్థలం ఇచ్చింది. 'ముంబైలో గురుకులం కట్టడానికి డబ్బు లేదు. రతన్ టాటాను వెళ్లి అడిగాను. సంగీతం కోసం ఇబ్బందులా... అని రెండు కోట్లు ఇచ్చాడు. రెండు చోట్లా పిల్లలకు ఉచితంగానే నేర్పిస్తాను. నిజానికి వాళ్ల నుంచి నేను నేర్చుకుంటాను... నా నుంచి వాళ్లు... తుది శ్వాస వరకూ నేర్చుకుంటూ ఉండటమే నాకు ఇష్టం' అంటాడు చౌరాసియా.

నేర్చుకోవడాన్ని ఒక దశలో కొందరు మానేస్తారు. ఒక దశ నుంచి కొందరు అక్కర్లేదనుకుంటారు. వేణువులో పాండిత్యం గడించాక, కటక్ రేడియో స్టేషన్‌లో ఆ తర్వాత ముంబై రేడియో స్టేషన్‌లో పని చేశాక, వందల సినిమా పాటలకు, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌లకు వేణువు పలికించాక, విపరీతంగా డబ్బు గడించాక 'నేనింకా నేర్చుకోవాలి' అనుకున్నాడు తప్ప చాలు అనుకోలేదు చౌరాసియా. 'సినిమాలో వాయించే ఆ కాసేపుతో నా ఆత్మ ఆకలి తీరడం లేదు... నేను శాస్త్రీయ సంగీతపు కెరటాలలో మునకలు వేయాలి..' అనుకున్నాడు చౌరాసియా. కాని గురువు ఎవరు? శిష్యుల్ని ఎంచుకోవడంలో అతి కఠినంగా, అతి పరిమితంగా ఉండే అన్నపూర్ణా దేవి దగ్గర నేర్చుకోవాలని సంకల్పించాడు. అన్నపూర్ణా దేవి మహామహుడైన ఉస్తాద్ అల్లావుద్దీన్ ఖాన్ కుమార్తె. సితార్ మేస్ట్రో పండిట్ రవిశంకర్ భార్య. కాని ఆమె ఇతడికి కనీసం తలుపు కూడా తీయలేదు. ఒకటి కాదు.. రెండు కాదు... మూడేళ్లు ఆమె ఇంటి చుట్టూ తిరిగి చివరకు శిష్యుడిగా స్వీకరించబడ్డాడు. 'నువ్వు నేర్చుకున్నదంతా మర్చిపోవాలి' అనేది ఆమె చెప్పిన మొదటి పాఠం. అంతవరకూ చౌరాసియా అందరిలా కుడివైపు వేణువు ధరించేవాడు. ఇప్పుడు ఎడమవైపున. నవ శిశువుగా మళ్లీ జన్మించాడు.

ఒకప్పుడు ఆల్ ఇండియా రేడియోలో బి గ్రేడ్ అర్టిస్టుగా సెలెక్ట్ అయిన హరిప్రసాద్ చౌరాసియా ఇవాళ ప్రపంచానికి వేణునాద గురువు. ఒక నెల నెదర్లాండ్స్‌లో పాఠాలు చెప్తాడు. ఒక నెల కెనడాలో చెప్తాడు. ఒక రోజు అచట కచ్చేరి. మరో రోజు ఏదో దేశ ఔన్నత్య పురస్కార స్వీకరణ. అలహాబాద్‌లో రణగొణ ధ్వనుల మధ్య ఏకాంత సాధన కోసం స్థలాన్ని వెతుక్కుంటూ తిరిగిన హరిప్రసాద్ చౌరాసియాకు ఇవాళ ప్రపంచ దేశాలన్నీ స్వాగతం చెప్పి తమ దగ్గర ఉండిపొమ్మంటాయి. ఆ గౌరవం అతనిలోని కళకా? దాని పట్ల అతని అర్పణకా?

నిరంతర అభ్యాసం, వినమ్రత, లోపలి ఎదుగుదలపట్ల తపన, పంచేగుణం, స్వీకరించే తత్త్వం, స్థిరాభిప్రాయాలను త్యజించగలిగే నిరహంభావం, ఎదుటి వారిని గుర్తించి ప్రోత్సహించే గుణం... ఇవి లేకుంటే మనిషి మహనీయుడు ఎలా అవుతాడు? మహనీయుడే కానక్కర్లేదు... ప్రేమాస్పదుడు ఎలా అవుతాడు? ఇవాళ సంఘంలో ప్రతి రంగంలో ఎందరో పెద్దలు. కాని కొందరే గౌరవనీయులు. అతికొద్దిమందే ప్రేమాస్పదులు. చౌరాసియా నుంచి నేర్చుకోవచ్చా మనం ఏదైనా?

తాజాగా వెలువడ్డ హరిప్రసాద్ చౌరాసియా అఫిషియల్ బయోగ్రఫీ 'బ్రెత్ ఆఫ్ గోల్డ్' చదువుతున్నప్పుడు వెదురు పొదల మధ్య తిరుగాడినట్టు ఉంటుంది. త్రివేణీ సంగమంలో దేహాన్ని కడిగినట్టు ఉంటుంది. ముంబైలో మదన్ మోహన్ పాట రికార్డింగ్‌ను చూస్తున్నట్టు ఉంటుంది. శివ్‌తో కలిసి హరి చేస్తున్న జుగల్‌బందీకి ముందు వరుస సీటు దొరికినట్టు ఉంటుంది.

మన జీవిత పాఠాలు మనల్ని చేరే దరులు, దారులు పరిమితం. ఇదిగో ఇలాంటి మహనీయులే చరిత్రలే మున్ముందుకు నడిపే ప్రభాత నాదం.

ట్రెజర్ హంట్ - ఎంపవర్‌మెంట్!



జనతంత్రం

వర్ధెల్లి మురళి

ఆశయాల నడుమ సంఘర్షణ సహజం. సిద్ధాంతాల నడుమ వైరుధ్యాలు సహజం. ఈ వైరుధ్యాల్లోంచే, సంఘర్షణలోంచే సత్యం ప్రభవిస్తుందని నమ్ముతారు. అందుకే వికాస ప్రియులందరూ భిన్న ఆశయాలను స్వాగతిస్తారు. విభిన్నమైన ఆలోచనల స్వేచ్ఛా ప్రసారానికి కిటికీలు తెరుస్తారు. జగమెరిగిన మావో జెడాంగ్ సుభాషితాన్ని కూడా మరోసారి ప్రస్తావించవచ్చు. నూరు పువ్వులు వికసించాలి, వెయ్యి భావాలు పోటీ పడాలన్నారు మావో. ఈ భావ సంఘర్షణ కాలక్రమంలో రకరకాల పరిణామాలకు లోనై ఉండవచ్చు. ఎన్నెన్నో సరికొత్త ఛాయలను ఆవిష్కరించి ఉండవచ్చు. నేటి ఆంధ్రప్రదేశ్‌లో అది కొందరి ఆశలకు, కోట్లాదిమంది ఆకాంక్షలకు మధ్యన ఏర్పడిన ఘర్షణగా మారింది. ఇక్కడ ప్రధాన రాజకీయ భూమికగా మారిన ఇతివృత్తం కూడా ఇదే. కొందరి ఆశ - ట్రెజర్ హంట్ అనే మృగయా వినోదం. కోట్లమంది ఆకాంక్ష -ఎంపవర్‌మెంట్‌తో సమకూరే ఆత్మగౌరవం.

ఈ ట్రెజర్ హంట్ (నిధుల వేట) అనేది ఎంత అమానవీయమైనదో, ఎంత నేరపూరితమైనదో, ఎంత క్రూరముఖీనమైనదో మనకు తెలియని విషయం కాదు. 'మెకన్నాస్ గోల్డ్' నుంచి 'పైరేట్స్ ఆఫ్ ది కరేబియన్' సిరీస్ వరకు ఎన్నెన్నో సినిమాలు ఆ కర్కశ స్వభావాన్ని మనకు తెరపరిచాయి. నవలల్లో, కథల్లో కూడా చదివి వుండవచ్చు. విని ఉండవచ్చు. ఇక్కడున్న ట్రెజర్ హంట్ ముఠా కార్యస్థానం రాజకీయం కనుక, ప్రజల ఓట్లతోనే పబ్బం గడుస్తుంది కనుక దూసే కత్తులు మెత్తగా, పువ్వుల గుత్తుల్లా ఉంటాయి. మోముల్లో క్రౌర్యానికి బదులు మోసపూరితమైన నవ్వులుంటాయి. కానీ స్వభావం నేరపూరితమే. లక్ష్యం స్వార్థమే. అప్పుడప్పుడూ ఈ వ్యాఘ్రం తగిలించుకున్న గోముఖం ముఖోటా జారిపోతూనే ఉంటుంది. కప్పుకున్న మేక తోలు చెదిరిపోతూనే ఉంటుంది. సాధికారత కోరుకుంటున్న బలహీన వర్గాలపై ఛీత్కారాలు బహిరంగమవుతూనే ఉంటాయి.



ఈ చర్చలో ముఖోటాలకూ, ముసుగులకూ తావు లేదు. ఆ ట్రెజర్ హంట్ ముఠా తెలుగుదేశం పార్టీ, దాని అనుంగు ఎల్లో కూటమే. ఇది ఆరోపణ కాదు. విభజిత రాష్ట్రంలో ఐదేళ్లు అధికారంలో ఉండగా ఆ పార్టీ తీసుకున్న విధాన నిర్ణయాలు, ప్రతిపక్షంగా ఈ మూడున్నరేళ్లలో చేపట్టిన కార్యక్రమాల విశ్లేషణ అనంతరమే ఈ నిర్ధారణ. తెలుగుదేశం పార్టీ తీసుకున్న విధానాలు, కార్యక్రమాలు తెలిసినవే కనుక సొంతంగా విశ్లేషించడానికి ఎవరైనా పూనుకోవచ్చు. సత్యాన్ని నిర్ధారించుకోవచ్చు. పరంపరగా వస్తున్న కొన్ని సంక్షేమ కార్యక్రమాలను అరకొరగా అమలు చేయడం తప్ప పేదవర్గాల అభ్యున్నతి కోసం తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ఏ ఒక్క పథకాన్ని అమలు చేయలేదు. రాజధాని పేరుతో అమరావతి పలవరింత, కమీషన్ల కోసం పోలవరాన్ని పట్టాలు తప్పించడం మినహా మరో మహత్కార్యం తెలుగుదేశం పార్టీ ఖాతాలో లేదు. ఈ రెండూ ట్రెజర్ హంట్‌లో భాగం కావడమే అవి చేసుకున్న మహద్భాగ్యం.

ఆంధ్రప్రదేశ్ విభజన నేపథ్యంలో పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించారు. కేంద్ర నిధులతో కేంద్రమే ఆ ప్రాజెక్టును నిర్మించి ఇవ్వాలి. కేంద్రమే నిర్మిస్తే తమకు కమీషన్లు ముట్టవు కదా అనే దుగ్ధ తెలుగుదేశం అధినేతలకు ఏర్పడింది. అప్పుడు ఎన్డీఏ కూటమి భాగస్వాములుగా ఉన్నారు కనుక ఆ పలుకుబడిని వాడుకొని నిర్మాణ కార్యక్రమాన్ని తామే చేపట్టేలా కేంద్రాన్ని ఒప్పించుకున్నారు. ఇందుకోసం ప్రత్యేక హోదాను కూడా తాకట్టుపెట్టారు. తమ పార్టీ ఎంపీ కంపెనీకి పనులు అప్పగించారు. ఆ కంపెనీకి అంత సామర్థ్యం లేదని తెలిసినా కమీషన్ల కక్కుర్తితో లక్ష్యపెట్టలేదు. చేతగాని సంస్థ బిల్లులెత్తుకోవడమే తప్ప పనులు చేయకుండా కాలయాపన చేసింది. పుణ్యకాలం గడిచిపోతున్న నేపథ్యంలో పట్టిసీమ పేరుతో ఎత్తిపోతల పథకాన్ని రంగంలోకి తెచ్చారు. పోలవరానికి దిగువ నుంచి నీళ్లు ఎత్తి ప్రధాన ప్రాజెక్టు కుడి కాల్వలో పోసే పథకం. ఈ పోలవరం కుడి కాలువ 90 శాతం రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే పూర్తయింది. పోలవరం పూర్తయితే ఈ ఎత్తిపోతల ఆరో వేలు అవుతుంది. అయినా 1900 కోట్లు దీని మీద తగలేయడమంటే, సదరు ఔదార్యం వెనుకనున్న మతలబు కమీషన్లేనన్న విషయం సామాన్యుడికి కూడా అర్థమైంది. అలాగే ఎడమ కాలువ గట్టుమీద 1900 కోట్లతో పురుషోత్తమపట్నం ఎత్తిపోతలను తలకెత్తుకున్నారు. ఈ 3800 కోట్లు ప్రధాన ప్రాజెక్టుపై ఖర్చు చేసి ఉంటే కథ వేరుగా ఉండేది.

ప్రధాన ప్రాజెక్టులో ఇంకో ఘనకార్యముంది. కాలూ చెయ్యి కదిలించలేకపోయిన సొంత పార్టీ కాంట్రాక్టర్‌ను తప్పించి మరో అస్మదీయ సంస్థను రంగంలోకి దించారు. ప్రాజెక్టుల ప్రొటోకాల్ ప్రకారం ప్రధాన డ్యామ్ కట్టే ప్రదేశానికి ఎగువన... దిగువన మట్టి కట్టలు (కాఫర్ డ్యామ్) కట్టి, స్పిల్‌వే, స్పిల్ ఛానల్ గుండా ప్రవాహాన్ని మళ్లించిన తర్వాతనే ప్రధాన డ్యామ్‌కు పునాది వేయాలి. ఈ పునాదినే డయాఫ్రమ్ వాల్ అంటారు. మట్టి కట్టలు కడితే కమీషన్లేం గిట్టుబాటవుతాయి. అందుకని ఎగువ కాఫర్ డ్యామ్‌ను కొంత మేరకు కట్టి డయాఫ్రమ్ వాల్ నిర్మాణాన్ని చేపట్టారు. 2019లో వరదలు వచ్చినప్పుడు మట్టి కట్ట గ్యాప్‌లోంచే మొత్తం ప్రవాహం వెళ్లాల్సి రావడంతో ఉరవడి పెరిగి డయాఫ్రమ్ వాల్ దెబ్బతిన్నది. దాంతో కథ మొదటికి వచ్చింది. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత స్పిల్‌వే, స్పిల్ ఛానల్, కాఫర్ డ్యామ్‌లను పూర్తిచేసినప్పటికీ డయాఫ్రమ్ వాల్ సంగతి తేలవలసి ఉన్నది. 'చిత్తం శివుడి మీద, భక్తి చెప్పుల మీద' అనే సామెత తెలుగుదేశం పార్టీ వ్యవహారానికి అతికినట్టు సరిపోతుంది. ట్రెజర్ హంట్ వ్యామోహంలో పడి ప్రాజెక్టు పనిని కోతిపుండు బ్రహ్మరాక్షసిగా మార్చిపారేసింది.

రాజధాని వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం వేసిన స్పెషల్ లీవ్ పిటీషన్‌పై సుప్రీంకోర్టులో కేసు నడుస్తున్నది. న్యాయస్థానం ఆదేశాల మేరకు కేంద్రం మొన్న ఒక అఫిడవిట్‌ను దాఖలు చేసింది. అఫిడవిట్‌లో పేర్కొన్న అంశాలను ఎల్లో మీడియా కవర్ చేసిన తీరును చూస్తే చాలు, ట్రెజర్ హంట్ ముఠా అమరావతి విషయంలో ఎంత ఆకలితో ఉన్నదో, ఎంత ఆత్రంతో ఉన్నదో అర్థమవుతుంది. అమరావతే రాజధానిగా కేంద్రం అఫిడవిట్‌లో పేర్కొన్నట్టు, రాజధాని మార్చే అధికారం రాష్ట్రానికి లేదని తేల్చినట్టు పత్రికల్లో, ఛానళ్లలో పెద్దఎత్తున ప్రచారం చేసుకున్నారు. కేంద్రం ఆ మాట ఎక్కడా అనలేదు. అందులో కేంద్రం ప్రస్తావించిన అంశాలు ఇవి. 1. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం 2014, సెక్షన్ 5 ప్రకారం పదేళ్లపాటు హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా ఉంటుంది. 2. సెక్షన్ 6 ప్రకారం ఆంధ్రప్రదేశ్‌కు కొత్త రాజధానిని సూచించడానికి నిపుణుల కమిటీని నియమించాలి. ఆమేరకు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కేసీ శివరామకృష్ణన్‌ను నియమించడం, ఆ కమిటీ నివేదికను సమర్పించడం జరిగింది. కమిటీ ఇచ్చిన నివేదికను తదుపరి చర్యల నిమిత్తం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి పంపించడం జరిగింది. 3. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం అమరావతిని రాజధానిగా నోటిఫై చేయడం జరిగింది. 4. సెక్షన్ 94 ప్రకారం కొత్త రాజధానిలో వసతుల ఏర్పాటుకు కేంద్రం ఆర్థిక సాయం చేయవలసి ఉన్నది. ఇందుకోసం 2500 కోట్ల రూపాయలను కేంద్రం రాష్ట్రానికి అందజేసింది. 5. 2020లో రాష్ట్ర ప్రభుత్వం రెండు చట్టాలను తీసుకొచ్చింది. సీఆర్‌డీఏ (తొలగింపు) చట్టంతోపాటు వికేంద్రీకరణ - అన్ని ప్రాంతాల సమ్మిళిత అభివృద్ధి చట్టాలను రాష్ట్రం చేసింది. దీని ప్రకారం అమరావతి శాసన రాజధానిగా, కర్నూలు న్యాయ రాజధానిగా, విశాఖపట్నం కార్యనిర్వాహక రాజధానిగా ఉంటాయి. ఈ వ్యవహారాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో సంప్రదింపులు జరపలేదు, కనుక పిటిషన్‌లో లేవనెత్తిన అంశాలతో కేంద్రానికి సంబంధం లేదని మాత్రమే అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

రాజధాని అంశం రాష్ట్రానికి సంబంధించినదిగానే కేంద్ర ప్రభుత్వం పరిగణిస్తున్నది. పార్లమెంట్ సభ్యులు గతంలో అడిగిన ప్రశ్నలకు కూడా ఇదే వైఖరితో సమాధానాలు ఇచ్చింది. అఫిడవిట్‌ను పరిశీలిస్తే కూడా అదే అంశం స్పష్టమవుతుంది. చట్టం ప్రకారం కేంద్రం నిపుణుల కమిటీని వేసిందనీ, ఆ నివేదికను రాష్ట్రానికి పంపించిందనీ పేర్కొన్నారు. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం అమరావతిని నోటిఫై చేసిందనే చెప్పారు తప్ప నిపుణుల కమిటీ సిఫారసులకు భిన్నంగా రాజధానిని ఎంపిక చేయడాన్ని కూడా ఎత్తిచూపలేదు. ఎందుకంటే మొదటినుంచీ కేంద్రం దీనిని రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన విషయంగానే పరిగణిస్తున్నది కనుక! రాజధాని కోసం కేంద్రం ఇచ్చిన 2500 కోట్లతో చంద్రబాబు ప్రభుత్వం ఏం చేసిందన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. 600 కోట్లతో అద్భుతంగా నిర్మించిన తెలంగాణా కొత్త సచివాలయం కళ్లెదుట కనిపిస్తుంటే అంత డబ్బును బాబు ఏం చేసి ఉంటాడనే ప్రశ్న మెదులుతూనే ఉంటుంది.

ప్రజాస్వామ్య వ్యవస్థలో అధికార వికేంద్రీకరణ ఒక కీలకమైన అంశం. తద్వారా పాలనలో పారదర్శకత, ప్రజల భాగస్వామ్యం పెరుగుతుంది. అవినీతి తగ్గుతుంది. ఆమేరకు ప్రజల సాధికారత పెరుగుతుంది. రాష్ట్ర విభజనకు ముందు వేసిన జస్టిస్ శ్రీకృష్ణ కమిషన్, రాజధాని గుర్తింపు కోసం వేసిన శివరామకృష్ణన్ కమిటీ కూడా ఈ అంశాలను ప్రస్తావించాయి. వెనుకబడిన ప్రాంతాల్లో ఉన్న ప్రజలు నిర్లక్ష్యానికి గురయ్యామన్న అభిప్రాయంతో ఉన్నారని విభజనకు ముందే శ్రీకృష్ణ కమిషన్ గుర్తించింది. పరిపాలనను వీలైనంతమేరకు వికేంద్రీకరించాలని శివరామకృష్ణన్ కమిటీ చెప్పింది. కొత్తగా రాజధాని నిర్మాణానికి (గ్రీన్‌ఫీల్డ్) పూనుకోవద్దనీ, రాజధాని కోసం పంట భూములను వాడుకోవద్దనీ, విజయవాడ - గుంటూరు నగరాల మధ్యన అసలే వద్దని నిపుణుల కమిటీ సూచించింది. ఈ మూడు కీలక సూచనలనూ చంద్రబాబు ప్రభుత్వం నగ్నంగా ఉల్లంఘించింది.

అమరావతిని రాజధానిగా ఎంపిక చేయడానికి కూడా చంద్రబాబు అప్పటి మంత్రి నారాయణ ఆధ్వర్యంలో ఓ కమిటీని వేశారు. అది నిపుణుల కమిటీ కాదు. నారాయణ రిటైర్డ్ న్యాయమూర్తో, రిటైర్డ్ ఐఏఎస్ అధికారో కాదు. పట్టణాభివృద్ధి వ్యవహారాల నిపుణుడో, ఆర్థికవేత్తో కాదు. విద్యను వ్యాపారంగా దిగజార్చిన బేహారుల్లో ముఖ్యుడు. 'ఆకలితో చావనైనా చస్తాను గానీ సరస్వతీ దేవిని అంగట్లో పెట్టన'ని ప్రతిన చేసి, అమ్మవారి కాటుక కంటి నీరు తుడిచిన పోతన పుట్టిన తెలుగు నేలపై చదువుకు ఖరీదు కట్టి తూకం వేసిన వారిలో అగ్రగణ్యుడు నారాయణ. అటువంటి నారాయణతో కమిటీ వేయడమంటే అది అక్షరాలా ట్రెజర్ హంట్ కాకుంటే మరేముంటుంది? అదే నిజమని ఆచరణలో తేలిపోయింది. బినామీ పేర్లతో వేలాది ఎకరాల సమీకరణ వెనుకనున్న రహస్యం, సింగపూర్ కంపెనీలతో కుదుర్చుకున్న అభివృద్ధి ఒప్పందాల వెనుకనున్న లోగుట్టు లక్షలకోట్ల కుంభకోణంగా అంచనా వేస్తున్నారు. అరవైమంది ఆందోళనకారులు ఆధార్ కార్డులను చూపలేక చేతులెత్తేయడంతో అమరావతి రైతుల ఉద్యమం బినామీల ఉద్యమంగా తేలిపోయింది. ఈ మూడున్నరేళ్లలో అమరావతి ట్రెజర్ హంట్ కోసం ఆందోళన చేయడం, అడ్డుగా ఉన్న వైఎస్ జగన్ ప్రభుత్వంపై శాపనార్థాలు పెట్టడం, ఆడిపోసుకోవడం, విష ప్రచారాలు ఎక్కుపెట్టడం తప్ప ఎల్లో కూటమి చేసిన ఘన కార్యాలేమీ లేవు.

ఇందుకు పూర్తి భిన్నంగా పేద ప్రజల పక్షాన వైఎస్ జగన్ ప్రభుత్వం నిలబడింది. పరిపాలనా వికేంద్రీకరణను అత్యున్నత స్థాయికి తీసుకొని వెళ్లి పేదవాడి ఇంటి తలుపు తట్టింది. ధనికుల పిల్లలతో సమానంగా నాణ్యమైన విద్యను అభ్యసించే అవకాశాన్ని పేద పిల్లలకూ కలుగజేసింది. రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాలలోని కడగొట్టు వ్యక్తికి కూడా ఆరోగ్య హక్కును కల్పించి, ప్రజారోగ్య విప్లవ పతకాన్ని ఎగురవేసింది. చిన్నరైతు కూడా తలెత్తుకొని నిలబడగలిగేలా చేయందిస్తున్నది. మహిళా సాధికారత కోసం చేపట్టిన పలు కార్యక్రమాలు విజయవంతంగా ఫలాలనందిస్తున్నాయి. పేద ప్రజల సాధికారత ఈ మూడున్నరేళ్లలో ఉద్యమ రూపం దాల్చింది. పేద ప్రజల ఎంపవర్‌మెంట్‌కూ - పెత్తందార్ల ట్రెజర్ హంట్‌కూ పొత్తు పొసగదు. యుద్ధం జరగవలసిందే. అదే జరుగుతున్నది. పెత్తందార్లది స్వార్థపూరిత యుద్ధం. పేద ప్రజలది న్యాయమైన పోరాటం. న్యాయమే గెలవాలి. గెలుస్తుంది.

vardhelli1959@gmail.com

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్‌నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, **తిథి:** బ.అష్టమి తె.4.06 వరకు (తెల్లవారితే మంగళ వారం), తదుపరి నవమి, **నక్షత్రం:** విశాఖ రా.10.20 వరకు తదుపరి అనూరాధ, **వర్జ్యం:** రా.2.14 నుండి 3.45 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.36 నుండి 1.23 వరకు, తదుపరి ప.2.54 నుండి 3.40 వరకు, **అమృతఘడియలు:** ప.1.35 నుండి 3.11 వరకు.

సూర్యోదయం : 6.33
సూర్యాస్తమయం: 5.56
రాహుకాలం : ఉ.7.30 నుండి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుండి 12.00 వరకు

హోమ్‌వర్క్ మజా



హోమ్‌వర్క్‌ను ఎంత ఆనందం కలిగించేదిగా పాఠశాలలు రూపొందించాలంటే, విద్యార్థులు తామే సొంతంగా చేయడానికి ఉత్సాహపడాలి. ఆ 'ఛాట్ జీపీటీ'(కృత్రిమ మేధ)కి ఎందుకు ఆ సంతోషాన్ని ఇవ్వాలి?
- ఆండ్రూ ఎన్జీ, ఏఐ నిపుణుడు

అదీ తేడా !



పరిశోధనల్లో వైఫల్యం అనేది సాధారణంగా ఆ పరిశోధకుల ధైర్యానికి సూచిక, అంతేగానీ అది సమర్థతకు కొలమానం కాదు.
- జెన్ హీమ్‌స్త్రా, ప్రొఫెసర్

దోస్తీ కచ్చి



చిన్నతనంలో మనం ఎవరికైనా ఇవ్వగలిగే అతిపెద్ద శిక్ష ఏమిటంటే, 'కట్టి' (కటీఫ్) చెప్పడం. మనం మళ్లీ అలా అవగలిగితే బాగుండు.
- హర్ష్ గోయెంకా, పారిశ్రామికవేత్త

ఇదీ అదే



ట్విట్టర్‌లో ఎవరినైనా 'బ్లాక్' చేయడం కూడా 'కట్టి' చెప్పడం లాంటిదే. చాలాసార్లు ఇది కూడా కట్టి చెప్పినంత సేపే ఉంటుంది.
- జిగీశ్ ఎస్., సీఈఓ

అదేంటో... ప్రతి పాత్రా గుర్తుంటుంది!

ఒక సినిమా హీరో, హీరోయిన్‌కో... లేదా డైరెక్టర్, మ్యూజిక్ డైరెక్టర్‌కో పేరు తెస్తుంది. కానీ కె. విశ్వనాథ్ సినిమాలు నటీనటులకి, టీచర్స్‌కి కూడా గొప్ప పేరు తెస్తాయి. ఆడియన్స్‌గా మనకి కూడా! ఆయన సినిమాలో ఏ పాత్ర మనకి గుర్తు లేదు? 'శంకరాభరణం' శంకర శాస్త్రి సరేసరి! ఆఖరికి కాసేపు కనిపించే అప్పు ఇంక ఇవ్వలేనని చెప్పే షాప్ వాడి పాత్ర కూడా గుర్తుండి పోతుంది... అదేంటో!

జీవితం, విలువలు ఇవన్నీ పుట్టుకతో రావాలి, పుట్టుకతో మాత్రమే రావాలి అని అనుకునే వారికి... ముక్కున వేలేసుకునేలా ఉంటుంది ఆ సినిమాలో మంజు భార్గవి పాత్ర. ఒక వేశ్య కూతురు, అయితేనేం? విలువల్లో ఏ మాత్రం తీసిపోదు. మన ఇళ్లల్లో మర చెంబు చూసిన ప్రతీసారీ నిర్మలమ్మ తిట్లు గుర్తు రానివారుంటారా?



ఏ సినిమాకు ఆ సినిమా ఓ కళాఖండం! 'ఆత్మగౌరవం' సినిమాతో మొదలు పెట్టి, ఎన్నో మంచి సినిమాలు, మరెన్నో గొప్ప సినిమాలు తీసి, తెలుగువారి ఆత్మగౌరవం కొన్ని లక్షల పాళ్లు పెంచారు విశ్వనాథ్.

'శంకరాభరణం'లో పంచె కట్టుకుని పాశ్చాత్య సంగీతం పాడినా, 'స్వయంకృషి'లో సూట్ వేసుకుని చెప్పులు కుట్టినా, 'స్వర్ణకమలం'లో రోడ్ మీద హోర్డింగ్స్‌పై పెయింటింగ్ వేసుకుంటూ కూడా కళని ప్రోత్సహించాలనీ, కళాకారుల్ని గౌరవించాలనీ తపన కలిగి ఉన్నా, 'స్వాతి కిరణం'లో గొప్ప కళ ఉండి, తన శిష్యుడు నేర్పిన జీవిత పాఠంతో మళ్ళీ అదే కళలో 'అఆ'లు నేర్చుకునే స్థితికి వెళ్ళినా, 'ఆపద్బాంధవుడు'లో మట్టితో శివలింగాన్ని చేసి మరీ శివుడి మీద కోపం తెచ్చుకున్నా, 'సాగర సంగమం'లో అంత మైకంలో కూడా బొట్టు చెదరకుండా చెయ్యి అడ్డు పెట్టినా, 'స్వాతిముత్యం'లో కడిగిన ముత్యం లాంటి మనసున్న స్వభావం అడుగడుగునా ప్రదర్శించే శివయ్య అయినా... ఇంకా ఇలా చెప్పుకుంటూ పోతే ఇప్పటికయ్యేనా! ఎప్పటికయ్యేను? అలాంటి పాత్రలు ఊహించడమే కష్టం. వాటితో సినిమాలు తీయడం, నటులతో చేయించడం ఎలా సాధ్యం?

తీసిన ప్రతి సినిమా, అందులో చేసిన ప్రతి పాత్రా మనకెందుకు గుర్తుంది? ఒక సినిమాలో... క్లైమాక్స్‌లో ఎమోషనల్ అవ్వొచ్చు, లేదా కొన్ని సీన్లలో కళ్లు చెమర్చవచ్చు. ప్రతీ సినిమా, ప్రతీ సీన్‌కి అష్టగా మన ఎమోషన్స్ కూడా మారడం అనేది, గొప్ప విషయం. కేవలం విశ్వనాథ్ సినిమాలకే సాధ్యం. పేజీలకి పేజీలు డైలాగ్‌లు అయినా, ఒక్క కనుసైగ అయినా, పాత్రలు మనతో మాట్లాడు తున్నట్లే ఉంటాయి.

అలాంటి గొప్ప వ్యక్తిని కలిసి, సెల్ఫీ అడిగితే 'గౌరవం లేదా?' అని కసురుకుంటారేమో అని, చిన్న జంకుతో అడగకుండా, దాదాపు రెండు గంటలకుపైగా ఆయన్నే అలా చూస్తూ ఒక ఈవెంట్‌లో ఆడియన్స్‌లో ఉన్న నాకు... ఆయనతో ఒక ఫొటో దిగే ఛాన్స్ అనుకోకుండా దొరకడంతో ఆయన సినిమాలోనే ఒక గొప్ప పాత్ర లభించినంత కేరింతతో గెంతేసిన రోజు ఇప్పటికీ నాకు గుర్తే!

'శంకరాభరణం' రిలీజ్ అయిన రోజే (ఫిబ్రవరి 2న) సరిగ్గా ఆయన నిజంగా శంకరుడికి మరో ఆభరణంగా వెళ్ళడం కేవలం యాదృచ్ఛికమే అంటే నమ్మగలమా? అసలు, మరింకెప్పుడైనా మనకి దొరకునా ఇటువంటి సేవ?!

- ముప్పి (తెంపల్లె) సహజ
కొలంబస్ (ఇండియానా)

మాటలు చెబుతున్నారు సరే! చేస్తున్నదేమిటి?

అభిప్రాయం



బచ్చు శ్రీనివాస్

రాష్ట్రపతి బడ్జెట్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపేందుకు పార్లమెంట్‌కు వస్తూ ప్రధాని మోదీ ప్లాస్టిక్ బాటిళ్లను రీసైకిల్ చేసి తయారు చేసిన జాకెట్ ఒకటి వేసుకున్నారు. బెంగళూరులో నిర్వహించిన 'ఇండియా ఎనర్జీ వీక్-2023'లో భాగంగా ప్లాస్టిక్ బాటిళ్లను రీసైకిల్ చేసి తయారు చేసిన జాకెట్‌ను ధరించి... ఆయన సుస్థిరత, హరిత వృద్ధి, పర్యావరణం గురించిన సందేశం ఇచ్చారు. ఆయన సందేశాలకు, వ్యాఖ్యానాలకు కొదవ ఉండదు కానీ ఆచరణ లోపమే కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. ప్రపంచంలో అత్యధికంగా ప్లాస్టిక్ వ్యర్థాలను ఉత్పత్తి చేసే దేశాల్లో భారత్ ఐదో స్థానంలో ఉండటం ఇందుకు నిదర్శనం. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2019లో తన స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో భారత దేశాన్ని సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నుంచి విముక్తి చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అయితే దీని రీసైక్లింగ్ విషయంలో మన దేశం పరిస్థితి ఎలా ఉందనే విషయం ఇక్కడ చెప్పుకోవాల్సిన అవసరం ఉన్నది.

గ్రీన్ ఎనర్జీకి ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెబుతున్న మోదీ ప్రభుత్వం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విషయంలో పేద ఆఫ్రికా దేశాల కంటే వెనుకబడి ఉండటం గమనార్హం. రువాండా, టాంజానియా, కెన్యా వంటి కొన్ని తూర్పు ఆఫ్రికా దేశాలు ప్లాస్టిక్ విషయంలో ఆచరణీయ పరిష్కారాలను రూపొందించి విజయవంతంగా అమలు చేస్తున్నాయి.

కేంద్ర స్థాయిలో ప్లాస్టిక్ వినియోగం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నియంత్రణకు సంబంధించి సరైన విధానాల రూపకల్పన చేయకపోవడం, చేసినా వాటిని పక్కాగా అమలు చేయకపోవడం... వెరసి దేశం ప్లాస్టిక్ కట్టడిలో వెనకబడి ఉంది. భారత ప్రభుత్వం 2022 జూలై 1 నుంచి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ప్లేట్లు, కప్పులు, స్ట్రాలు, ట్రేలు, పాలీస్టయిరిన్ వంటి గుర్తించిన వస్తువుల... తయారీ, అమ్మకం, వినియోగాన్ని నిషేధించింది. ఈ లిస్ట్‌లో ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు కూడా ఉన్నాయి.

ప్లాస్టిక్ మేనేజ్మెంట్, హ్యాండ్లింగ్ రూల్స్ 2011 ప్రకారం... 40 మైక్రాన్ల కంటే తక్కువ మందంతో చేసే ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు నిషిద్ధం. తర్వాత ఆ మందాన్ని 50 మైక్రాన్లు, 75 మైక్రాన్లకు సవరించింది. 2023 జనవరి 1 నుంచి సవరించిన నిబంధనల ప్రకారం 120 మైక్రాన్లకు పెంచింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం గల ప్లాస్టిక్ క్యారీ బ్యాగులపై నిషేధం ఉన్నా, దేశంలో అవి విచ్చలవిడిగా ఉత్పత్తి అవుతున్నాయి. జనం వాడుతున్నారు కూడా. దీన్ని నియంత్రించే పని కేంద్ర ప్రభుత్వం చేయడం లేదు. ఈ విషయంలో మన కంటే చిన్న దేశాలు, అత్యంత పేద దేశాలు ఆదర్శంగా నిలుస్తున్నాయి. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై నిషేధాన్ని కఠినంగా అమలు చేస్తున్నాయి.



కెన్యాలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ బ్యాగ్‌ల దిగుమతి, తయారీ లేదా అమ్మకం చేసే కంపెనీలకు 40 వేల డాలర్లు, వ్యక్తులకు 500 డాలర్లు జరిమానాగా విధిస్తారు. కెన్యా మాదిరిగానే రువాండా కూడా క్యారీబ్యాగ్‌ల మందంతో సంబంధం లేకుండా వాటిపై పూర్తిగా నిషేధం విధించింది. 2019 అక్టోబర్‌లో రువాండా... ఆఫ్రికాలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ బ్యాగ్‌లపై పూర్తి నిషేధాన్ని జారీ చేసిన మొదటి దేశంగా అవతరించింది. మరో చిన్న దేశమైన టాంజానియా అదే దారిలో నడుస్తోంది. వైద్య సేవలు, పారిశ్రామిక ఉత్పత్తులు, నిర్మాణ పరిశ్రమ లేదా వ్యవసాయ రంగం వంటి వాటి కోసం ఉపయోగించే కొన్ని పరిమిత ప్లాస్టిక్ ప్యాకేజింగ్ సామగ్రికి మినహాయింపులు ఉన్నాయి.

జింబాబ్వే 2010లోనే ప్లాస్టిక్ ప్యాకేజింగ్, బాటిళ్లను నిషేధించింది. ఆంటిగ్వా, బార్బుడా 2016లో సింగిల్ యూజ్ క్యాటరింగ్, టేక్ ఎవే వస్తువులను నిషేధించాయి. పసిఫిక్ ద్వీపం వనాటు కూడా 2018లో డిస్పోజబుల్ కంటైనర్ల కోసం అదే పని చేసింది. ఈ దేశాల నుంచి ఇండియా ఎన్నో అంశాలకు సంబంధించి పాఠాలు నేర్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కాలుష్యం కలిగించే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఉత్పత్తి 2019 నుంచి 2021 వరకు 6 మిలియన్ టన్నులు పెరిగిందని ఆస్ట్రేలియా నుంచి వెలువడే 'వేస్ట్ మేకర్స్ ఇండెక్స్' ఇటీవల పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా నిబంధనలు ఉన్నా, ఆశించిన స్థాయిలో కట్టడి జరగడం లేదని ఈ రిపోర్ట్ పేర్కొంది.

భారత ప్రభుత్వం సింగిల్ యూజ్ ప్లాస్టిక్స్ (ఎస్‌యూపీల)పై నిషేధం విధించినా, దేశవ్యాప్తంగా ప్రబలంగా 21 ఎస్‌యూపీలు చలామణిలో ఉన్నాయి. నిషేధం విధించిన తరువాత ఉల్లంఘనలపై ఎలాంటి జరిమానాలూ విధించిన దాఖలాలు లేవు. భారతదేశంలో ఒక వ్యవస్థీకృత ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ వ్యవస్థ లేదు. దీని ఫలితంగా నదులు, మహా సముద్రాలు, ఖాళీ ప్రదేశాల్లో విచ్చలవిడిగా ప్లాస్టిక్ చెత్త పారబోత కొనసాగుతున్నది. తక్షణం కఠినమైన నిర్దిష్ట చర్యలతో కేంద్రం పరిస్థితిని చక్కదిద్దాలి.

వ్యాసకర్త బీఆర్‌ఎస్ నాయకులు | 93483 11117

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899

క్లుప్తంగా...

శ్రీరామనగరంలో ముగిసిన సమతా కుంభ్ ఉత్సవాలు



శంషాబాద్ రూరల్: శ్రీరామనగరంలో సమతా కుంభ్ ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. పది రోజుల పాటు జరిగిన ఈ ఉత్సవాల్లో చివరి రోజు దివ్యసాకేతాలయంలో దేవతా మూర్తులకు ప్రోక్షణ జరిపారు. చినజీయర్ స్వామి పర్యవేక్షణలో ఘనంగా శ్రీపుష్పయాగంతో పాటు యాగశాలలో మహా పూర్ణాహుతి నిర్వహించారు. భక్తులకు తీర్థ, ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో శ్రీఅహోబిల జీయర్‌స్వామి, మైహోం గ్రూపు అధినేత జూపల్లి రామేశ్వర్‌రావు పాల్గొన్నారు.

విభజన హామీలు నెరవేర్చని కేంద్రం



హుజూర్‌నగర్: ఏపీ విభజన చట్టంలోని హామీలను కేంద్ర ప్రభుత్వం నెరవేర్చడం లేదని కనీసం పట్టించుకోవడం లేదని టీపీసీసీ మాజీ అధ్యక్షుడు, నల్లగొండ ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి ధ్వజమెత్తారు. తెలంగాణపై కేంద్రం సవతి తల్లి ప్రేమ చూపించడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లోని క్యాంప్ కార్యాలయంలో ఆదివారం మీడియాతో మాట్లాడారు. ఖాజీపేట్‌లో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారంలో స్టీల్ ఫ్యాక్టరీ, ములుగులో కేంద్ర గిరిజన యూనివర్సిటీ, బీబీనగర్ ఎయిమ్స్ తదితరాలు విభజనచట్టంలో లిఖిత పూర్వక హామీలుగా పొందుపరిచారని ఆయన గుర్తు చేశారు. తొమ్మిదేళ్లు అయినా బీజేపీ ప్రభుత్వం వాటిని పట్టించుకోవడం లేదన్నారు. కేంద్ర గిరిజన యూనివర్సిటీకి అనుమతి ఇచ్చి రూ.1,000 కోట్లు కేటాయిస్తున్నట్లు పేపర్లో ప్రకటించి కేవలం రూ.10 కోట్లు విడుదల చేశారని మండిపడ్డారు. కేంద్ర బడ్జెట్‌లో కూడా తెలంగాణకు తీవ్ర అన్యాయం చేశారని ఆరోపించారు. మఠంపల్లి మండలంలోని ముగ్గుమిల్లుల (లైమ్‌స్టోన్) వారి దగ్గర స్థానిక పోలీసులు రూ.16 లక్షలు వసూలు చేశారని, తమ దగ్గర అన్ని ఆధారాలు ఉన్నాయని..ఇందులో ఎవరెవరికి ఎంత వాటా ఉందో చెప్పాలని ఉత్తమ్ డిమాండ్ చేశారు.

రూ. 2 కోట్ల విలువైన గంజాయి స్వాధీనం!

ఖమ్మంక్రైం: ఖమ్మం బైపాస్ రోడ్డుగుండా డీసీఎం వాహనంలో తరలిస్తున్న గంజాయిని ఆదివారం టూటౌన్ పోలీసులు పట్టుకున్నారు. ఈ గంజాయి విలువ రూ.2 కోట్ల వరకు ఉంటుందని సమాచారం. గంజాయిని ఎక్కడికి తరలిస్తున్నారు.. దీని వెనుక ఎవరున్నారనే దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఖమ్మం సీపీ విష్ణు ఎస్ వారియర్‌కు అందిన సమాచారం మేరకు పోలీసులు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. దీనిపై టూటౌన్ పోలీసులను వివరణ కోరగా, గంజాయిని పట్టుకున్నది వాస్తవమేనని, వివరాలను తర్వాత వెల్లడిస్తామని తెలిపారు.

కొత్తకోటలో ఆర్టీసీ బస్సు బోల్తా

ఇద్దరు డ్రైవర్లు సహా 15 మంది ప్రయాణికులకు గాయాలు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట డిపో నుంచి తిరుపతి వెళ్తున్న ఆర్టీసీ బస్సు బోల్తా పడటంతో ఇద్దరు డ్రైవర్లు సహా 15 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. శనివారం సాయంత్రం 5.30 గంటలకు బయల్దేరిన బస్సు అర్ధరాత్రి 12.30 గంటలకు వనపర్తి జిల్లా కొత్తకోట వద్ద బోల్తా పడింది. ఈ సమయంలో బస్సులో 37 మంది ప్రయాణికులు, ఇద్దరు డ్రైవర్లు ఉన్నారు. ప్రమాదంలో యాదగిరిగుట్ట ఆర్టీసీ డిపోకు చెందిన ఇద్దరు డ్రైవర్లతో పాటు 15 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న యాదగిరిగుట్ట డిపో మేనేజర్ ప్రమాద స్థలానికి చేరుకున్నారు. గాయపడిన ప్రయాణికులను 108 అంబులెన్స్‌లో స్థానిక ప్రభుత్వాస్పత్రికి, డ్రైవర్లను తార్నాకలోని ఆర్టీసీ ఆస్పత్రికి తరలించారు.

'ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలి'

వీపనగండ్ల: ఉద్యమాన్ని వదిలి జనజీవన స్రవంతిలో కలిసే సమయంలో తమకు ప్రభుత్వం అనేక హామీలను ఇచ్చిందని, వాటిని తక్షణమే నెరవేర్చాలని మాజీ నక్సలైట్ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలంలో వారు సమావేశం నిర్వహించారు. వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లోని వివిధ ప్రాంతాల్లో తమలో కొందరికి బంజరు భూములు, ఇళ్ల స్థలాలు, బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పిస్తామని హామీ ఇచ్చి.. ప్రభుత్వ జీఓలను సైతం జారీ చేసిందని తెలిపారు. కానీ, తమకు ఎలాంటి ప్రయోజనం కలగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్నిచోట్ల తమకు ఇచ్చిన భూములను స్వాధీనం చేసుకొని డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మిస్తున్నారని, అందులోనైనా తమకు ఇళ్లను కేటాయించాలని కోరారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నామని వాపోయారు. ఇప్పటికైనా ఉన్నత స్థాయి అధికారులు స్పందించి ఆక్రమణకు గురైన తమ భూములను తిరిగి ఇప్పించాలని, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, బ్యాంకుల ద్వారా లేని రుణాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

'అమ్మో'రావం!

- కామారెడ్డి జిల్లాలో పైలట్ ప్రాజెక్ట్.. పుట్టిన వాటిలో 94% ఆడ ఆవు దూడలే
- అధిక పాలనిచ్చే సాహివాల్, గిర్, ముర్రా, జెర్సీ, హెచ్‌ఎఫ్ జాతుల ఆవులు రైతుల సొంతం
- సత్ఫలితాలనిస్తున్న 'రాష్ట్రీయ గోకుల్ మిషన్'
- వచ్చే నెల నుంచి రాష్ట్రవ్యాప్తంగా విస్తరణ

కోరుకున్న వారికి.. కోరుకున్న జాతి ఆవు దూడలు



సాక్షి ప్రత్యేక ప్రతినిధి

ఇలా అంతా కోరుకున్న రీతిలో వస్తున్న ఆవు దూడలు పాడి రంగంలో కొత్త క్షీర విప్లవానికి నాందిగా నిలుస్తున్నాయి. స్వదేశీ ఆవుల సంఖ్యను పెంచడం.. అలాగే అధికంగా పాలిచ్చే జాతి ఆవులను పెంపొందించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం 2019లో 'రాష్ట్రీయ గోకుల్ మిషన్' అనే పథకానికి శ్రీకారం చుట్టింది. దీన్ని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు మరో పది రాష్ట్రాల్లో పైలట్ ప్రాజెక్ట్‌గా చేపట్టింది. ఇందులోభాగంగా కామారెడ్డి జిల్లా తిప్పాపూర్, ఎర్రపహాడ్, కొండాపూర్, చిన్నమల్లారెడ్డి, లింగంపల్లి, ఎల్లంపేట, మోతె, కొయ్యగుట్ట, మహ్మదాపూర్, కరత్‌పల్లి పది గ్రామాలను ఎంపిక చేశారు. ఇక్కడ వివిధ రకాల జాతులకు చెందిన 160 ఆవుల్లో లింగ నిర్ధారణ చేసి సాహివాల్, గిర్ తదితర స్వదేశీ జాతులతోపాటు అధిక పాలనిచ్చే హెచ్‌ఎఫ్, జెర్సీ కోడెల వీర్యంతో కృత్రిమ గర్భధారణ చేశారు. ఇందులో ఇప్పటివరకు 134 ఆవులు గర్భం దాల్చి 126 (94 శాతం) ఆడ దూడలు, 8 కోడె దూడలకు జన్మనిచ్చాయి. దీంతో రైతులు స్వదేశీ గిర్, సాహివాల్ ఆడ దూడలతోపాటు అధిక పాలనిచ్చే ఆవులకు యజమానులయ్యారు. లక్షలు పోసినా దొరకని స్వదేశీ, విదేశీ ఆవుజాతులు ఇప్పుడు తమ పంటపొలాల్లో పరుగెడుతుండటంతో సంబరపడిపోతున్నారు.



'స్వదేశీ ఆవును పెంచుకోవాలన్నది నా జీవితాశయం. ఎవరి వద్దనైనా కొందామంటే ధర.. రూ.లక్షల్లో చెబుతున్నారు. అంత సొమ్ము భరించే స్తోమత లేదు. నా కల ఇక నెరవేరదు అనుకున్నా..! కానీ ఓ రోజు కేంద్ర పశుసంవర్ధక శాఖ వారు మా ఊరిలో క్యాంప్ పెట్టి.. నా వద్ద ఉన్న విదేశీ జాతి హెచ్‌ఎఫ్ ఆవుకు కృత్రిమ గర్భధారణతో కోరుకున్న స్వదేశీ ఆవు దూడ పుట్టేలా ఉచితంగా చేస్తామన్నారు. అందులో ఆడ-మగ.. ఏది కోరుకుంటే అదే పడుతుందన్నారు. నాకు సాహివాల్ రకం ఆడ దూడ కావాలని అడిగాను. నా దగ్గర ఉన్న ఆవు గర్భంలో లింగ నిర్ధారణ వీర్యం ప్రవేశపెట్టి 9 నెలల్లో సాహివాల్ ఆడ దూడను కానుకగా ఇచ్చారు. ఇలా మా ఊరి ఆవుల్లో చేసిన కృత్రిమ గర్భధారణతో అందరికీ కోరుకున్న జాతి ఆడ దూడలే పుట్టాయి. ఇది మాకు ఆశ్చర్యంతోపాటు ఐశ్వర్యాన్ని ఇచ్చింది' అంటూ కామారెడ్డి జిల్లా తిప్పాపూర్ పాడిరైతు ఏలేటి గణేశ్‌రెడ్డి ఆనందంతో గంతేశాడు.. ఈ ఆనందం ఇప్పుడు ఈయన ఒక్కడిదే కాదు కామారెడ్డి జిల్లాలో మరికొందరిది కూడా.

ఇక అన్ని పల్లెలకు..

కేంద్ర ప్రభుత్వం-విజయ డెయిరీ సహకారంతో చేపట్టిన కామారెడ్డి పైలెట్ ప్రాజెక్ట్ విజయవంతం కావడంతో వచ్చే నెల నుంచి అన్ని జిల్లాలకు విస్తరించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,192 మంది వైద్య నిపుణుల ఆధ్వర్యంలో ప్రత్యేక క్యాంపులతో కృత్రిమ గర్భధారణ శిబిరాల్లో రైతు రూ.250 చెల్లిస్తే వారు కోరుకున్న దూడలకు జన్మనిచ్చేలా ఆవులను సిద్ధం చేయనున్నారు. అయితే 90 శాతం ఆడ దూడలు, 10 శాతం కోడె దూడలుండే విధంగా సమతౌల్యం పాటించనున్నారు. ఈ పథకం విస్తృతంగా రైతుల్లోకి వెళ్తే వచ్చే ఏడేళ్లలో టాప్-10 రాష్ట్రాల జాబితాలోకి తెలంగాణ చేరే అవకాశం ఉందని పాడి నిపుణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పశువుల గణన (2019 సెన్సెస్ ప్రకారం)

రాష్ట్రం	సంఖ్య	వృద్ధి/క్షీణత (2012తో పోలిస్తే)
పశ్చిమ బెంగాల్	1.90 కోట్లు	+15.8శాతం
ఉత్తరప్రదేశ్	1.88 కోట్లు	-3.93
మధ్యప్రదేశ్	1.87 కోట్లు	-4.42
బీహార్	1.53 కోట్లు	+25.8
మహారాష్ట్ర	1.39 కోట్లు	+4.41
తెలంగాణ (15వ స్థానం)	42.31 లక్షలు	-13.30

తెలంగాణలోని పశువుల సంఖ్య

1983లో: 72,36,000
2012లో: 48,80,000
2019లో: 42,31,000

2012-19 మధ్య రాష్ట్రంలో తగ్గిన పశుసంపద 13.30%

దేశంలో తెలంగాణ స్థానం ఇలా..

పశుసంతతిలో: 15 | పాల ఉత్పత్తిలో: 13

వెరీవెరీ స్పెషల్..

- గిర్, సాహివాల్ ఆవుల పాలల్లో పోషకాలు, ఔషధ గుణాలు ఎక్కువ. సంతానోత్పత్తి సమర్థత కూడా అధికం. తక్కువ మేత, ఎక్కువ పాల దిగుబడితో ప్రస్తుతం ఈ స్వదేశీ జాతి ఆవులకు రూ.లక్షల్లో డిమాండ్ ఉంది.
- హెచ్‌ఎఫ్ ఆవుల్లో ఎక్కువ పాల దిగుబడితోపాటు ప్రసవించే పదిహేను రోజుల ముందు వరకు పాలు ఇవ్వడం ప్రత్యేకం.



పాడిలో పెను మార్పులు

పైలట్ ప్రాజెక్ట్‌గా పది గ్రామాల్లో చేసిన ప్రయోగం విజయవంతం కావడం శుభపరిణామం. ఈ పథకాన్ని మార్చిలో రాష్ట్రమంతా విస్తరిస్తాం. దీంతో పాడి రంగంలో పెనుమార్పులు రానున్నాయి.
–డాక్టర్ మంజువాణి, సీఈఓ, లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ

మా ఇంట్లో పోషకాల గోవు..



స్వదేశీ గిర్ ఆవుకు కృత్రిమ గర్భధారణతో మళ్లీ గిర్ ఆడ దూడ పుట్టింది. గిర్ ఆవు పాలల్లో అనేక ఔషధ గుణాలున్నాయి. నా ఆవు రోజుకు 16 లీటర్ల వరకు పాలు ఇస్తుంది. ఒక్క స్వదేశీ ఆవు ఉంటే ఆరోగ్యం మన వెంట ఉన్నట్టే.
–మన్నె గంగారెడ్డి, తిప్పాపూర్, కామారెడ్డి

పుణేలో.. ఫలించిన ప్రయోగంతో..

అంతరిస్తున్న దేశీ జాతులతోపాటు అధిక పాలనిచ్చే విదేశీ జాతి సంతతి వృద్ధి కోసం భారతీయ ఆగ్రో ఇండస్ట్రీస్ ఫౌండేషన్ (పుణే).. ఫ్లో సైటీమెట్రీ (బయాలాజికల్ విశ్లేషణ)తో తొలి అడుగు వేసింది. లింగ నిర్ధారణ వీర్యంతో పుణేలో చేసిన ప్రయోగం విజయవంతం కావడంతో, అక్కడి నుంచి తొలుత దేశీ జాతులు, ఆపై విదేశీ జాతుల లింగ నిర్ధారణ వీర్యాన్ని సిద్ధం చేశారు. దేశవ్యాప్తంగా 12 రాష్ట్రాల్లో ఎంపిక చేసిన ఆవుల్లో కృత్రిమ గర్భధారణ చేయగా, ఆశించిన విధంగానే ఎక్స్ క్రోమోజోమ్‌తో అండ ఫలదీకరణ ప్రయోగంతో కోరుకున్న స్థాయిలో ఆడ ఆవుదూడలు పుట్టాయి. దీంతో హిమాచల్ ప్రదేశ్, జమ్ము,కశ్మీర్, ఒడిశాల్లో కృత్రిమ గర్భధారణ వేగవంతం చేశారు. మిగతా రాష్ట్రాల్లో వచ్చే నెల నుంచి ఈ పథకాన్ని విస్తృతం చేయనున్నారు.





ఇది 'పైలట్' పుణ్యమే..
కృత్రిమ గర్భధారణతో పుట్టిన హెచ్‌ఎఫ్ ఆడ దూడలతో రైతు భాస్కర్‌రెడ్డి

విద్యుత్ కోతలపై పెట్రోల్ బాటిళ్లతో రైతుల ఆందోళన



వరంగల్ ప్రధాన రహదారిపై పెట్రోల్ బాటిళ్లతో ఆందోళన చేస్తున్న రైతులు

వరంగల్ జిల్లా నెక్కొండలో రోడ్డెక్కిన రైతులు

నెక్కొండ: వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని కోరుతూ వరంగల్ జిల్లా నెక్కొండ మండలం పత్తిపాక గ్రామానికి చెందిన రైతులు నెక్కొండ-వరంగల్ (సూర్య సినిమా థియేటర్) రహదారిపై పెట్రోల్ బాటిళ్లతో ఆది వారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఆ గ్రామ రైతులు మాట్లాడుతూ...వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని చెబుతున్నా క్షేత్రస్థాయిలో అధికారులు మాత్రం వ్యవసాయానికి పగటిపూట విద్యుత్ సరఫరా చేయడం లేదని మండిపడ్డారు. విద్యుత్ అంతరాయంతో పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు విద్యుత్ అధికారులకు చెప్పినా ఫలితం లేదని వాపోయారు. విద్యుత్ సక్రమంగా సరఫరా కాకపోవడం, అప్రకటిత కోతల కారణంగా విద్యుత్ మోటార్లు, స్టార్టర్లు కాలిపోతున్నాయన్నారు. రైతుల ఆందోళన విషయం తెలుసుకున్న చెన్నారావుపేట ఎస్సై(ఇన్‌చార్జ్) మహేందర్ సంఘటన స్థలికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. రైతుల సమస్యలను విద్యుత్‌శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అధికారుల సూచనలు, ఎస్సై హామీతో రైతులు ఆందోళన విరమించారు.

ఏకకాలంలో ఒక్కటైన 220 జంటలు

నాగర్‌కర్నూల్‌లో కనులపండువగా సామూహిక వివాహాలు



సాక్షి, నాగర్‌కర్నూల్: ఒకేసారి 220 జంటలు ఒక్కటైన అపురూప దృశ్యం ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఆవిష్కృతమైంది. ఎంజేఆర్ ట్రస్ట్, ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి, ఆయన సతీమణి జమున ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక వివాహాల మహోత్సవం కన్నులపండువగా సాగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి, ఎంపీ కె.కేశవరావు, పార్లమెంటరీ పక్షనేత, ఎంపీ నామా నాగేశ్వరరావు హాజరయ్యారు. ప్రధాన వేదికపై యాదాద్రి లక్ష్మీనర్సింహస్వామి, అమ్మవార్లకు ప్రధాన అర్చకులు కల్యాణం నిర్వహించగా.. ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ముత్యాల పందిరి, పురోహితుల ఆధ్వర్యంలో 220 కొత్త జంటలు ఒకే వేదిక ద్వారా ఒక్కటయ్యాయి. తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి వధూవరులకు కంకణాలను అందజేశారు. కొత్తజంటలకు అవసరమైన సామగ్రిని అందజేశారు. సామూహిక వివాహాలకు హాజరైన వారందరికీ భోజనాలు ఏర్పాటుచేశారు.

సంపాదనలో సగం పేదలకే..

ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి సంపాదించిన దాంట్లో సగం పేదల కోసం ఖర్చు చేయాలనుకోవడం గొప్ప నిర్ణయం అని ఎంపీ కె.కేశవరావు అన్నారు. ఎమ్మెల్యే సొంతంగా రూ.3 కోట్లు వెచ్చించి కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలను నిర్మించడం అభినందనీయమని ప్రశంసించారు. ఎంపీ నామా నాగేశ్వరరావు మాట్లాడుతూ, తనకు అవకాశం వస్తే అనాథలు, బడుగు, బలహీనులకు వివాహాలు జరిపిస్తానని పేర్కొన్నారు. తాను గెలిచినా, ఓడినా వివాహ కార్యక్రమాలు కొనసాగిస్తానని ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, గిడ్డంగుల సంస్థ చైర్మన్ సాయిచంద్, కలెక్టర్ ఉదయ్‌కుమార్, ఎస్పీ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రిలో మెట్ల నృత్యోత్సవం



యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి జన్మ నక్షత్రం స్వాతిని పురస్కరించుకొని భావనాలయ నాట్యాచార్యుడు డాక్టర్ వట్టికోట యాదగిరి చార్యులు, ఆయన శిష్య బృందం ఆదివారం మెట్ల నృత్యోత్సవం నిర్వహించాయి. మొదట శ్రీస్వామి వారి వైకుంఠద్వారం వద్ద మెట్ల పూజను నిర్వహించారు. అనంతరం మెట్లపై నృత్యం చేస్తూ కొండపైకి వెళ్లారు. కొండపైన తూర్పు రాజగోపురం వద్ద కుంభ నీరాజనంతో కార్యక్రమాన్ని ముగించారు. యాదాద్రి వైభవాన్ని నలు దిశలా చాటేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వట్టికోట యాదగిరి చార్యులు స్పష్టం చేశారు.

యాదాద్రి తరహాలో 'కొండగట్టు'

వాస్తు సలహాదారు, ఆర్కిటెక్ట్ ఆనంద్‌సాయి



ఆలయ నమూనాపై చర్చిస్తున్న ఆనంద్‌సాయి

కొండగట్టు(చొప్పదండి): జగిత్యాల జిల్లా కొండగట్టు శ్రీఆంజనేయస్వామి ఆలయాన్ని ఆగమశాస్త్రం ప్రకారం యాదాద్రి తరహాలో అభివృద్ధి చేసేందుకు సీఎం కేసీఆర్ చర్యలు తీసుకుంటున్నారని వాస్తు సలహాదారు, ఆర్కిటెక్ట్ ఆనంద్ సాయి వెల్లడించారు. సీఎం కేసీఆర్ ఈ నెల 14న కొండగట్టు పర్యటనకు రానున్న నేపథ్యంలో ఆనందసాయి ఆదివారం స్వామివారి సన్నిధికి చేరుకున్నారు. అంజన్న దర్శనం తర్వాత కలెక్టర్ యాస్మిన్ బాషా, ఎస్పీ భాస్కర్, ఇతర అధికారులు, నాయకులతో సమావేశమై ఆలయ మాస్టర్‌ప్లాన్‌పై చర్చించారు. ఆలయంలో ఇప్పుడున్న ప్రాకారంతోపాటు మరోదానిని నిర్మించాల్సి ఉందన్నారు. పుణ్యక్షేత్రంలో 1980 నాటి భవనాలు ఉన్నాయని, గర్భగుడిలోని స్వామివారు భక్తులకు కనిపించడంలేదని చెప్పారు. ఆలయానికి నాలుగువైపులా గోపురాలు, ముఖమండపం నిర్మాణాన్ని ప్రత్యేకంగా డిజైన్ చేస్తామని ఆనందసాయి వివరించారు. ఆలయంలోకి వచ్చే భక్తులకు స్వామివారి చరిత్ర తెలిసేలా ప్రతీస్తంభంపై రాసి ఉంచుతామని చెప్పారు. ఆలయంలో 108 అడుగుల పొడవైన ఆంజనేయ స్వామి విగ్రహం ఏర్పాటు చేయాలని సీఎం యోచిస్తున్నారని పేర్కొన్నారు. భేతాళ స్వామి, శ్రీరాముడి ఆలయం, సీతమ్మ కన్నీటిధారలు పరిశీలించిన ఆనంద్‌సాయి ఆలయంలో చాలామార్పులు ఉంటాయని వెల్లడించారు. ఈ సమాచారం మొత్తాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు.

ఇద్దరు కొడుకులతో కలసి బావిలోకి దూకిన తల్లి

- ఒక కుమారుడు, తల్లి మృతి
- మరో కొడుకును కాపాడిన గ్రామస్తులు



కావ్య



శశిధర్

నడికూడ: ఇద్దరు కొడుకులతో కలసి తల్లి బావిలో దూకగా.. ఒక కొడుకు, తల్లి మృతిచెందిన ఘటన హనుమకొండ జిల్లా నడికూడ మండలం కంఠాత్మకూర్ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మామిడి కుమారస్వామితో దేశాయిపేటకు చెందిన కావ్య అలియాస్ లావణ్య (30)కు 12 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కొడుకు విద్యాధర్ 3వ తరగతి చదువుతుండగా.. చిన్న కొడుకు శశిధర్ (7) ఒకటో తరగతి చదువుతున్నాడు. కాగా, కావ్య ఆదివారం మధ్యాహ్నం తన ఇద్దరు కుమారులతో కలసి గ్రామంలోని ఓ వ్యవసాయ బావి వద్దకు వెళ్లింది. ముందుగా ఇద్దరు కుమారులను బావిలోకి తోసి.. ఆ తర్వాత తానూ బావిలోకి దూకింది. వీరిలో పెద్ద కుమారుడు బావిలోని విద్యుత్ మోటార్ పైపును పట్టుకొని గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు, వ్యవసాయ కూలీలు వచ్చి విద్యాధర్‌ను పైకి తీశారు. అప్పటికే తల్లి, చిన్న కుమారుడు శశిధర్ మృతిచెందారు. కావ్య ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. కొడుకు విద్యాధర్‌ను ప్రశ్నించగా నానమ్మతో తల్లికి గొడవ జరిగిందని తెలిపాడు. మృతురాలు కావ్యకు మతిస్థిమితం సరిగా లేదని తెలిసింది.

క్షణికావేశం.. పెను విషాదం..!

- ఉరేసుకుని భార్య ఆత్మహత్య..
- తట్టుకోలేక భర్త ఆత్మహత్యాయత్నం

భైంసాటౌన్: క్షణికావేశంలో మూడు నెలల గర్భిణి ఆత్మహత్యకు పాల్పడగా, మనస్తాపంతో భర్త ఆత్మహత్యాయత్నం చేసి ప్రాణాల మీదకు తెచ్చుకున్నాడు. ఈ ఘటన నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలో ఆదివారం జరిగింది. పట్టణంలోని నర్సింహనగర్‌కు చెందిన సాయినాథ్‌కు మహారాష్ట్రలోని ఉమర్‌ఖేడ్ తాలూకా డాంకి గ్రామానికి చెందిన లావణ్య ఉరఫ్ దీప(22)తో ఏడాది క్రితం వివాహమైంది. లావణ్య ప్రస్తుతం మూడునెలల గర్భిణి. సాయినాథ్ స్థానికంగా కూలీ పనులు చేసుకుంటూ భార్య, అమ్మ విమలాబాయితో కలిసి ఉంటున్నాడు. ఆదివారం ఉదయం భార్యభర్తల మధ్య చిన్నపాటి గొడవ జరిగింది. అత్త, భర్త బయటకు వెళ్లిన సమయంలో దీప ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. విమలాబాయి ఇంటికి వచ్చి పిలువగా ఎంతకీ తలుపు తీయలేదు. అరుపులు విన్న స్థానికులు భర్త సాయినాథ్‌కి తెలపగా వెంటనే ఇంటికి చేరుకుని తలుపు బద్దలు కొట్టి లోనికి వెళ్లి చూడగా అప్పటికే చనిపోయింది. భార్య ఆత్మహత్య చేసుకోవడాన్ని తట్టుకోలేక సాయినాథ్ పరుగున వెళ్లి కుబీర్ రోడ్డులోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తీగలు పట్టుకున్నాడు. స్థానికులు విద్యుత్ సరఫరా నిలిపివేయించారు. అయితే అప్పటికే అతడి రెండు చేతులు కాలిపోయాయి.

హాస్టల్‌లో ఉండలేక ఆత్మహత్యాయత్నం



భవనం పైనుంచి దూకుతున్న విద్యార్థిని

గంగాధర(చొప్పదండి): చదువంటే ఇష్టం లేక, హాస్టల్‌లో ఉండలేక ఓ పదో తరగతి విద్యార్థిని పాఠశాల భవనం మూడో అంతస్తు నుంచి కిందకు దూకి ఆత్మహత్యకు యత్నించింది. అయితే ప్రాణాపాయం తప్పిపోగా, కాలువిరిగి ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. గంగాధర ఎస్సై రాజు వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం కమాన్‌పూర్ గ్రామానికి చెందిన స్వప్న- లక్ష్మినారాయణ కూతురు హాసిని గంగాధర మండల కేంద్రంలోని జ్యోతిబాపూలే విద్యాలయంలో పదోతరగతి చదువుతోంది. అయితే చదువంటే ఇష్టం లేదని, హాస్టల్‌లో ఉండనని మొండికేసి కొద్దిరోజులుగా ఇంట్లోనే ఉంటోంది. ఈ క్రమంలో తల్లిదండ్రులు కుమార్తెను బ్రతిమిలాడి ఒప్పించి ఐదు రోజుల క్రితం హాస్టల్‌లో చేర్పించి వెళ్లారు. ఆదివారం సాయంత్రం హాసిని వసతిగృహం మూడో అంతస్తుపైకి వెళ్లింది. అక్కడికి ఎవరూ రాకుండా తలుపులు బిగించి వెళ్లి రెయిలింగ్‌పై కూర్చొంది. ఉపాధ్యాయు లు, విద్యార్థులు గమనించి వారించినా వినకుండా పైనుంచి దూకేసింది. అయితే ఎడమకాలు విరిగి, ప్రాణాపాయం తప్పింది. తీవ్రంగా గాయపడిన హాసినిని కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు.

వైద్యుల నిర్లక్ష్యంతో బాలింత మృతి?

- రక్తం తక్కువున్నా ఆపరేషన్ చేశారనే ఆరోపణలు..
- మణుగూరు ఆస్పత్రిలో సిజేరియన్..
- అక్కడ పరిస్థితి సీరియస్ కావడంతో భద్రాచలం ఆస్పత్రికి తరలింపు
- మాదేం తప్పు లేదంటూ ఇరు ఆస్పత్రుల వాదనలు



రేష్మ

భద్రాచలం అర్బన్: ప్రభుత్వ ఆస్పత్రిలో సిజేరియన్ చేయించుకున్న ఓ మహిళ తీవ్ర రక్తస్రావంతో మృతి చెందడం వివాదాస్పదమవుతోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు పట్టణానికి చెందిన రేష్మ(21)ను ఆదివారం మొదటి కాన్పు కోసం కుటుంబ సభ్యులు మణుగూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. సాధారణ ప్రసవం చేసేందుకు వీలుకాక పోవడంతో అక్కడి వైద్యులు సిజేరియన్ చేసి డెలివరీ నిర్వహించారు. రేష్మ సుమారు రెండు కేజీలు బరువు ఉన్న మగ బిడ్డకు జన్మనిచ్చింది. ఆపరేషన్ సమయంలో, ఆ తర్వాత అధికంగా రక్తస్రావం కావడంతో రేష్మను మెరుగైన వైద్యం కోసం భద్రాచలం ప్రభుత్వాస్పత్రికి రిఫర్ చేశారు. దీంతో కుటుంబీకులు వెంటనే అక్కడికి తరలించినప్పటికీ రక్తస్రావం అదుపులోకి రాకపోవడంతో ఆమె మృతి చెందింది. భద్రాచలం ఆస్పత్రి వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లనే రేష్మ మృతి చెందిందన్న వాదనలు తొలుత వెల్లువెత్తాయి. అయితే భద్రాచలం డాక్టర్లు మాత్రం ఆస్పత్రికి వచ్చేలోగానే రేష్మ మృతి చెందిందని, తమ నిర్లక్ష్యం లేదని చెబుతున్నారు. మణుగూరులో రేష్మకు ఆపరేషన్ చేస్తున్న సమయంలో వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించారా? రక్తస్రావం కావడంతో పాటు రక్తం తక్కువగా ఉన్న విషయం ముందే తెలిసినప్పటికీ ఆపరేషన్ చేసేశారా? అనే విషయాలపై స్పష్టత రావాల్సిఉంది. జిల్లావైద్యాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని మృతురాలి కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

భద్రాచలం వచ్చేలోపే మృతి చెందింది

మణుగూరు ఆస్పత్రి నుంచి భద్రాచలంఆస్పత్రికి వచ్చేలోపే బాలింత ఆరోగ్య పరిస్థితి విషమించింది. స్పృహ కోల్పోయి, అప్పటికే మృతి చెందింది. మా దగ్గర వైద్యులు సకాలంలోనే స్పందించారు. కుటుంబ సభ్యుల కోరిక మేరకు పంచనామా నిర్వహించాం. –డాక్టర్ రామకృష్ణ, భద్రాచలం ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్

మా నిర్లక్ష్యం లేదు..

రేష్మకు సిజేరియన్ చేసి కాన్పు జరిపారు. చికిత్స అందించడంతో మా దగ్గర వైద్యుల నిర్లక్ష్యమేమీ లేదు. ఆపరేషన్ తర్వాత బ్లీడింగ్ ఎక్కువ కావడంతో భద్రాచలం ఆస్పత్రికి రిఫర్ చేశాం.
–డాక్టర్ విజయ్ కుమార్, మణుగూరు ఆస్పత్రి సూపరింటెండెంట్

క్లుప్తంగా...

వాలెంటైన్స్ డే స్పెషల్...
చాట్‌జీపీటీతో ప్రేమలేఖలు



న్యూఢిల్లీ: వాలెంటైన్స్ డే వచ్చేస్తోంది. ప్రేమికులంతా ఈ ఉత్సవాన్ని జరుపుకోవడానికి కొత్త జోష్‌తో ఉన్నారు. మనసులో ప్రేమ భావనలు ఉప్పొంగుతున్నా వాటిని చక్కగా కాగితంపై పెట్టలేని వారు చాట్‌జీపీటీ సాయంతో ప్రేమలేఖలు రాయడానికి సన్నాహాలు చేసుకుంటున్నారు! 62% మంది ప్రేమికులు ఈ వాలెంటైన్స్‌డేకి చాట్‌జీపీటీ సాయంతో తమ మనసులో ఉన్న మాటల్ని రాస్తామని ఒక సర్వేలో వెల్లడించారు. 30% మంది తమ లవర్‌కి ఈ టూల్ సాయంతో ప్రేమలేఖ రాస్తామని చెప్పారు. మోడరన్ లవ్ రీసెర్చ్ తొమ్మిది దేశాల్లో 5 వేల మందిని ప్రశ్నించి ఒక నివేదిక రూపొందించింది. సహజసిద్ధంగా పుట్టే ప్రేమను వ్యక్త పరచడానికి కృత్రిమ మేధపై ఆధారపడతామని చెప్పిన వారిలో అత్యధికులు భారతీయులే!

వాట్సాప్ కాల్ సాయంతో ప్రసవం


శ్రీనగర్: నొప్పులతో విలవిల్లాడుతున్న గర్భిణికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ) సిబ్బంది వాట్సాప్ కాల్ సాయంతో సురక్షితంగా ప్రసవం చేసిన సంఘటన జమ్మూకశ్మీర్‌లో జరిగింది. కుప్వారా జిల్లాలోని కెరాన్ పీహెచ్‌సీకి నెలలు నిండి, నొప్పులు మొదలైన గర్భిణిని కుటుంబ సభ్యులు శుక్రవారం రాత్రి తీసుకొచ్చారు. ఎక్లామ్‌ప్సియా, ఎపిసియోటోమీతో బాధపడుతున్న ఆమెకు ప్రసవం జరగడం కష్టతరంగా మారింది. తీవ్రంగా మంచు కురుస్తుండడంతో హెలికాప్టర్‌లో జిల్లా ఆసుపత్రికి తరలించడం వీలు కాలేదు. దీంతో కెరాన్ పీహెచ్‌సీ డాక్టర్లు క్రాల్‌పొరాలోని జిల్లా ఉప ఆసుపత్రి వైద్యులను సంప్రదించారు. ఆ ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ పర్వేజ్ వాట్సాప్ కాల్‌లో సూచనలు ఇస్తుండగా, కెరాన్ పీహెచ్‌సీ వైద్యులు మహిళకు విజయవంతంగా ప్రసవం చేశారు. ఆడ శిశువు జన్మించిందని, తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నారని వైద్యులు చెప్పారు.

రాహుల్‌కు నోటీసులు

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ నేత, ఎంపీ రాహుల్ గాంధీకి లోక్‌సభ సెక్రెటేరియట్ నోటీసులిచ్చింది. లోక్‌సభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై చేసిన వ్యాఖ్యలపై ఈ నెల 15వ తేదీలోగా వివరణ ఇవ్వాలని సూచించింది. ఈ మేరకు ఆయనకు ఓ లేఖ రాసింది. రాష్ట్రపతి ప్రసంగానికి ధర్మాసనం తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా ప్రధాని మోదీపై రాహుల్ చేసిన విమర్శల పట్ల బీజేపీ సభ్యులు నిశికాంత్ దూబే, ప్రహ్లాద్ జోషీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆయనకు వ్యతిరేకంగా సభా హక్కుల ఉల్లంఘన నోటీసులు ఇచ్చారు. వీటిపై లోక్‌సభ సెక్రెటేరియట్ రాహుల్‌కు లేఖ రాసింది.

మన తెల్ల బంగారం

కశ్మీర్‌లో 59 లక్షల టన్నుల లిథియం
- బ్యాటరీల తయారీలో అత్యంత కీలకం
- అంతరిక్ష పేలుళ్ల వల్ల ఏర్పడిన అరుదైన లోహం
- అమెరికా కంటే భారత్‌లోనే అధిక నిల్వలు



రియాసీ జిల్లాలో లిథియం ఖనిజం ఉన్న శిలలను చూపుతున్న గ్రామస్థుడు

ఆధునిక యుగంలో ఎలక్ట్రిక్ వాహనాల ప్రాధాన్యం నానాటికీ పెరిగిపోతోంది. సౌర విద్యుదుత్పత్తిని పెంచుకోవాల్సిన ఆవశ్యకతను ప్రపంచ దేశాలు ఎప్పుడో గుర్తించాయి. ఇక స్మార్ట్‌ఫోన్ చేతిలో లేకపోతే పొద్దు గడవదు. మరి ఈ అవసరాలన్నీ తీరాలంటే ఏం కావాలో తెలుసా? లిథియం. అత్యంత విలువైన ఈ ఖనిజాన్ని పూర్తిగా విదేశాల నుంచే దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. ఇకపై ఆ అవసరం పెద్దగా ఉండదు. ఎందుకంటే 59 లక్షల టన్నుల నాణ్యమైన లిథియం నిల్వలు జమ్మూకశ్మీర్‌లోని రియాసీ జిల్లాలో మాతా వైష్ణోదేవి పుణ్య క్షేత్రం కొలువైన కొండల దిగువన సలాల్ హైమన గ్రామం వద్ద ఉన్నట్లు జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(జీఎస్ఐ) ఇటీవల గుర్తించింది. భారత్‌లో ఈ స్థాయిలో లిథియం నిల్వలు బయటపడడం ఇదే తొలిసారి!

- సాక్షి, నేషనల్ డెస్క్

తవ్వకాలతో నీటి నిల్వలకు ముప్పు!

ఖనిజ తవ్వకాల వల్ల పర్యావరణానికి ముప్పు తప్పదు. లిథియం తవ్వకాల కారణంగా విపరీతమైన కాలుష్యం ఏర్పడుతుందని, ప్రకృతిపై ప్రతికూల ప్రభావం పడుతుందని నిపుణులు అంటున్నారు. ముఖ్యంగా లిథియం తవ్వకాలు చేపట్టిన ప్రాంతాల్లో నీటి నిల్వలు అంతరించి పోతాయని హెచ్చరిస్తున్నారు. భూమిపై తేమ తగ్గిపోయి, కరువు నేలగా మారుతుందని పేర్కొంటున్నారు. ఒక టన్ను లిథియం కోసం తవ్వకాలు సాగిస్తే ఏకంగా 15 టన్నుల కార్బన్ డయాక్సైడ్ విడుదల అవుతుందని సమాచారం. ఒక టన్ను లిథియం తవ్వకానికి దాదాపు రూ.64 లక్షల ఖర్చవుతుంది. లిథియం వెలికితీతకు భారీస్థాయిలో నీరు అవసరం.

ఏ దేశంలో ఎన్ని నిల్వలు(టన్నుల్లో)

దేశం	లిథియం నిల్వలు
బొలీవియా	3,90,00,000
చిలీ	1,99,03,332
ఆస్ట్రేలియా	77,17,776
చైనా	66,90,180
భారత్	59,00,000
అమెరికా	57,62,917

3.9 కోట్ల టన్నులతో బొలీవియా ప్రపంచంలో తొలిస్థానంలో ఉంది. చిలీ, ఆస్ట్రేలియా, చైనా, అమెరికా, అర్జెంటీనా తదితర దేశాల్లో కోట్ల టన్నుల నిల్వలున్నట్లు కనిపెట్టారు. భారత్‌లో కర్ణాటకలోని మండ్యా జిల్లాలో 1,600 టన్నుల లిథియం ఉన్నట్లు రెండేళ్ల క్రితం గుర్తించారు. తాజాగా కశ్మీర్‌లో బయటపడ్డ 59 లక్షల టన్నులతో కలిపితే ప్రపంచంలో భారత్ ఐదో స్థానంలో నిలుస్తోంది. అమెరికాలో కంటే భారత్‌లోనే అధిక నిల్వలున్నాయి. ఉత్పత్తి, ఎగుమతుల్లో ఆస్ట్రేలియా, చిలీ, చైనా తొలి మూడు స్థానాల్లో నిలిచాయి. ఆస్ట్రేలియా, చిలీ, అర్జెంటీనా నుంచి భారత్ లిథియంను దిగుమతి చేసుకుంటోంది. ముడి లిథియంను శుద్ధి చేసి, బ్యాటరీల తయారీకి అనువైన లోహంగా మార్చడం కఠినమైన ప్రక్రియ. ఇందులో సాధించేదాకా మరో రెండేళ్లపాటు దిగుమతులపై ఆధారపడక తప్పదని నిపుణులు చెబుతున్నారు.

ఐదో స్థానంలో భారత్

లిథియం అంటే?



తెల్ల బంగారంగా పిలిచే లిథియం అనే పదం గ్రీక్ భాషలోని లిథోస్ (రాయి) నుంచి పుట్టింది. ఇది ఆల్కలీ మెటల్ గ్రూప్‌కు చెందినది. తేలికగా, మృదువుగా, తెల్లటి రంగులో వెండిలాగా మెరిసే లోహం. పీరియాడిక్ గ్రూప్ 1(ఐఏ)లో లిథియంను చేర్చారు. ఇది భూగోళంపై సహజంగా ఏర్పడింది కాదు. అంతరిక్షంలో సంభవించిన పేలుళ్ల వల్ల ఏర్పడినట్లు గుర్తించారు. బిగ్‌బ్యాంగ్ వల్ల విశ్వం పుట్టిన తొలినాళ్లలో భూగోళంపై లిథియం నిల్వలు మొదలైనట్లు తేల్చారు. ఇతర గ్రహాలపైనా లిథియం ఉంది.

500 పీపీఎం నాణ్యత

సాధారణ లిథియం నాణ్యత 220 పీపీఎం (పార్ట్స్ పర్ మిలియన్) ఉంటుంది. కానీ కశ్మీర్‌లో కనుగొన్న లిథియం నాణ్యత ఏకంగా 500 పీపీఎంగా ఉండటం విశేషం. లిథియంను ఇతర లోహాలతో కలిపి మిశ్రమ లోహాలను తయారు చేస్తారు. విద్యుత్‌తో నడిచే వాహనాల బ్యాటరీల తయారీకి లిథియం కీలకం. ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్లు, డిజిటల్ కెమెరాలు, కంప్యూటర్లు, ఇతర విద్యుత్ పరికరాల బ్యాటరీల తయారీలోనూ ఉపయోగిస్తారు. గాజు, సెరామిక్ పరిశ్రమల్లో లిథియం వాడకం అధికంగా ఉంది. పవన, సౌర విద్యుత్‌ను నిల్వచేసే బ్యాటరీలు లిథియంతో తయారవుతాయి. రీచార్జి చేయడానికి వీల్లేని బ్యాటరీల్లోనూ వాడుతారు. పేస్‌మేకర్లు, బొమ్మలు, గడియారాల్లోని బ్యాటరీల్లో లిథియం ఉంటుంది. 2030 నాటికి మన దేశంలో 27 గిగావాట్ల గ్రిడ్–స్కేల్ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్స్ కావాలని అంచనా. అంటే రానున్న రోజుల్లో లిథియం అవసరం ఎన్నో రెట్లు పెరిగిపోనుంది. అంతర్జాతీయంగా లిథియం మార్కెట్ వేగంగా విస్తరిస్తోంది. 2008 నుంచి 2018 నాటికి దీనికి వార్షిక ఉత్పత్తి 25,400 టన్నుల నుంచి 85,000 టన్నులకు చేరింది.

అదే ధైన్యం..!

కోలుకోని తుర్కియే, సిరియా
- 33 వేలు దాటేసిన భూకంప మృతులు
- సంక్షోభంగా మారుతున్న పెను విపత్తు
- బాధితుల్లో కట్టలు తెంచుకుంటున్న ఆగ్రహం
- 128 గంటల తర్వాత బయటపడ్డ పసికందు



హతాయ్‌లో 150 గంటల తర్వాత సజీవంగా బయటపడ్డ చిన్నారి



హతాయ్‌లోనే 151 గంటల తర్వాత బయటపడ్డ ఓ వ్యక్తి

అంటాక్యా (తుర్కియే): ఆరు రోజులు గడిచినా భూకంప ప్రకోపం ప్రభావం నుంచి తుర్కియే, సిరియా ఏమాత్రమూ తేరుకోలేదు. కుప్పకూలిన వేలాది భవనాల శిథిలాల నుంచి ఇంకా మృతదేహాలు బయట పడుతూనే ఉన్నాయి. మరోవైపు లక్షలాది మంది సర్వం పోగొట్టుకుని కట్టుబట్టలతో నిరాశ్రయులుగా మిగలడంతో ఈ విపత్తు క్రమంగా పెను మానవీయ సంక్షోభంగా మారుతోంది. వారికి కనీస వసతులు కల్పించడం కూడా ప్రభుత్వానికి సవాలుగా పరిణమిస్తోంది. దాంతో బాధితుల్లో ఆక్రోశం ఆగ్రహంగా మారి కట్టలు తెంచుకుంటోంది. మరోవైపు రెండు దేశాల్లో మృతుల సంఖ్య ఇప్పటికే 33 వేలు దాటేసింది. తుర్కియేలోనే కనీసం 80 వేల మందికి పైగా గాయపడ్డారు. మృతదేహాలను సామూహికంగా ఖననం చేస్తున్న దృశ్యాలు కంటతడి పెట్టిస్తున్నాయి. వెలికితీత, సహాయ కార్యక్రమాలు నత్తనడకన నడుస్తుండటం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. భూకంపం రావచ్చని ముందే సమాచారమున్నా దాన్ని ఎదుర్కొనేందుకు సరైన చర్యలు తీసుకోలేదంటూ కూడా ఇంటా బయటా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భవన నిర్మాణ నిబంధనలను ఉల్లంఘించి భారీ జన నష్టానికి కారకులయ్యారంటూ తుర్కియేలో వందలాది మంది కాంట్రాక్టర్లను అరెస్టు చేస్తున్నారు. తుర్కియేలో ఈ శతాబ్ది విపత్తుగా పరిగణిస్తున్న ఈ భూకంపం ధాటికి 500 కిలోమీటర్ల పరిధిలో 1.3 కోట్ల మంది తీవ్రంగా ప్రభావితులయ్యారు. సిరియాలోనూ పరిస్థితులు దారుణంగా ఉన్నాయి. భూకంప ప్రభావిత ప్రాంతాలు ప్రభుత్వ, వేర్పాటువాదుల అధీనంలోని ప్రాంతాల మధ్య విస్తరించడం సహాయ చర్యలకు అడ్డంకిగా మారింది. ఇప్పటిదాకా 4,000కు పైగా మరణించారని అంచనా.

వీరంతా మృత్యుంజయులు

తుర్కియేలో ఓ రెండు నెలల చిన్నారిని ఏకంగా 128 గంటల తర్వాత శిథిలాల నుంచి సజీవంగా రక్షించారు! అదియమాన్ నగరంలో ఓ ఆరేళ్ల బాలున్ని ఏకంగా 151 గంటల అనంతరం ఆదివారం కాపాడారు. ఈ కార్యక్రమాన్ని టీవీల్లో ప్రత్యక్ష ప్రసారం చేయడం విశేషం! మరో చిన్నారి బాలికను కూడా 150 గంటల తర్వాత కాపాడారు. అంటాక్యాలో మరో 35 ఏళ్ల వ్యక్తిని 149 గంటల తర్వాత కాపాడారు. శిథిలాల కింద చిక్కిన వారిని గుర్తించేందుకు థర్మల్ కెమెరాలు తదితర మార్గాల్లో తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. భారత్‌తో పాటు పలు దేశాల నుంచి వచ్చిన సిబ్బంది అహోరాత్రాలు సహాయ, పునరావాస కార్యక్రమాల్లో చెమటోడుస్తున్నారు.



అంటాక్యాలో ఆప్తులను కోల్పోయి రోదిస్తున్న మహిళ


నాలుగు హైకోర్టులకు సీజేలు

వీరిలో ఇద్దరు ఈ నెలాఖరులో పదవీ విరమణ

న్యూఢిల్లీ: దేశంలోని నాలుగు హైకోర్టులకు నూతనంగా ప్రధాన న్యాయమూర్తు(సీజే)లు నియమితులయ్యారు. వీరిలో ఇద్దరు ఈ నెలాఖరుకు పదవీ విరమణ చేయనుండటం గమనార్హం. గుజరాత్ హైకోర్టులో అత్యంత సీనియర్ జడ్జి అయిన జస్టిస్ సోనియా గిరిధర్ గోకానీని అదే హైకోర్టు సీజేగా నియమించారు. అదేవిధంగా, ఒరిస్సా హైకోర్టులో అత్యంత సీనియర్ జడ్జి జస్టిస్ జస్వంత్ సింగ్ త్రిపుర హైకోర్టు సీజేగా నియమితులయ్యారు. ఈయన ఈ నెల 22న రిటైర్ కానున్నారు. ఇంతకుముందు జస్టిస్ సింగ్‌ను ఒరిస్సా హైకోర్టు సీజేగా నియమించాలంటూ చేసిన సిఫారసును కొలీజియం ఆతర్వాత ఉపసంహరించుకుంది. రాజస్తాన్ హైకోర్టుకు చెందిన జడ్జి జస్టిస్ సందీప్ మెహతాను గౌహతి హైకోర్టు సీజేగా నియమించారు. గౌహతి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్ జమ్మూకశ్మీర్ అండ్ లద్దాఖ్ హైకోర్టు సీజేగా నియమితులయ్యారు. తాజా నియామకాలను న్యాయశాఖ మంత్రి కిరెన్ రిజిజు ఆదివారం ట్విట్టర్‌లో ప్రకటించారు. కాగా, జస్టిస్ గోకానీ బాధ్యతలు స్వీకరించాక దేశంలో ఉన్న 25 హైకోర్టుల్లో ఏకైక మహిళా ప్రధాన న్యాయమూర్తి అవుతారు. గుజరాత్ జ్యుడీషియల్ సర్వీస్ నుంచి వచ్చిన ఈమెకు 62 ఏళ్లు నిండటంతో ఫిబ్రవరి 25న పదవీ విరమణ చేయనున్నారు. జస్టిస్ సబీనా ప్రస్తుతం హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు తాత్కాలిక సీజేగా ఉన్నారు. గుజరాత్ హైకోర్టు చీఫ్ జస్టిస్ అరవింద్ కుమార్ సుప్రీంకోర్టు జడ్జిగా పదోన్నతి పొందిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో జస్టిస్ గోకానీని తక్షణమే నియమించాలంటూ గత వారం కేంద్రానికి సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసింది. ఇలా ఉండగా, రెండు రోజుల క్రితం సుప్రీంకోర్టు జడ్జిలుగా నియమితులైన జస్టిస్ రాజేశ్ బిందాల్, జస్టిస్ అరవింద్ కుమార్‌లతో సోమవారం సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ ప్రమాణ స్వీకారం చేయించనున్నారు.

ట్రిపుల్ ట్రబుల్ నుంచి త్రిపురను కాపాడేది

డబుల్ ఇంజిన్ సర్కారే: అమిత్ షా



చండీపూర్(అగర్తలా): త్రిపురను కాంగ్రెస్, సీపీఎం, తిప్రా మోతా అనే ట్రిపుల్ ట్రబుల్ నుంచి బీజేపీ డబుల్ ఇంజిన్ సర్కారే కాపాడుతుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెప్పారు. త్రిపుర రాష్ట్రం ఉనాకోటి, సెపాహిజలా జిల్లాల్లో ఆదివారం జరిగిన ఎన్నికల ప్రచార ర్యాలీలో మంత్రి మాట్లాడారు. ఈ మూడు సమస్యల నుంచి బయటపడాలనుకుంటే బీజేపీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వానికే ఓటేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఏళ్లపాటు రాష్ట్రంలోని గిరిజనులను నిర్లక్ష్యం చేసిన సీపీఎం ప్రజలను మోసగించడానికే ఇప్పుడు గిరిజన నేతను ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించిందని ఆయన విమర్శించారు. బీజేపీని ఓడించటానికే సీపీఎం, కాంగ్రెస్ ఏకమయ్యాయని మంత్రి ఆరోపించారు. ఈ మూడు పార్టీలకు అధికారమిస్తే రాష్ట్రంలో తిరిగి ఆటవిక పాలన వచ్చినట్లేనన్నారు. సీపీఎం, కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో పలు కుంభకోణాలు జరిగాయని చెప్పారు. ఈ నెల 16న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఎం, కాంగ్రెస్ కలిసి పోటీ చేస్తున్న విషయం తెలిసిందే.

ఢిల్లీ–ముంబై ఎక్స్‌ప్రెస్ వే
తొలి దశ ప్రారంభం

సోహ్నా-దౌసాల మధ్య రహదారిని ప్రారంభించిన ప్రధాని ● ఎక్స్‌ప్రెస్‌వేలతో దేశం ఆర్థికంగా బలోపేతమవుతుందన్న మోదీ



ఎక్స్‌ప్రెస్‌వేను ప్రారంభించి ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ

దౌసా (రాజస్తాన్): కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎక్స్‌ప్రెస్‌వేల నిర్మాణంలో మరో మైలు రాయిని అందుకుంది. దేశంలో అతి పెద్దదైన జాతీయ ఎక్స్‌ప్రెస్ హైవే ఢిల్లీ–ముంబై మహా రహదారిలో 246కి.మీ. భాగాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం ఆవిష్కరించారు. ఢిల్లీలోని సోహ్నా నుంచి రాజస్తాన్‌లో దౌసా మధ్య నిర్మాణం జరుపుకున్న తొలిదశను దౌసా వద్ద రిమోట్ కంట్రోల్ బటన్ ద్వారా ప్రధాని ప్రారంభించారు. 8 లేన్లతో నిర్మించిన ఢిల్లీ–దౌసా–లాస్‌సాట్ రహదారి అందుబాటులోకి రావడంతో ఢిల్లీ, జైపూర్ మధ్య దూరం సగానికి సగం తగ్గిపోతుంది. ఇన్నాళ్లు 5 గంటలు పట్టే ప్రయాణం ఈ ఎక్స్‌ప్రెస్ వే మీదుగా వెళితే మూడున్నర గంటలే పడుతుంది. దీంతోపాటు రూ.5,940 కోట్ల జాతీయ హైవే ప్రాజెక్టులకి శంకుస్థాపన చేశారు. తమ ప్రభుత్వం హైవే ప్రాజెక్టులు, పోర్టులు, రైల్వేలు, ఆప్టికల్ ఫైబర్, మెడికల్ కాలేజీల మీద అత్యధికంగా దృష్టి సారించిందని ఈ సందర్భంగా మోదీ చెప్పారు. ఇలాంటి హైవేలతో పారిశ్రామికవేత్తలతో పాటు, వ్యాపారులు, చిరు వ్యాపారులు కూడా ఆర్థికంగా బలోపేతమవుతారని తెలిపారు. మౌలిక సదుపాయాలపై ఖర్చు చేస్తే మరిన్ని పెట్టుబడుల్ని ఆకర్షించవచ్చునని మోదీ చెప్పారు. ఢిల్లీ–ముంబై తొలిదశతో ఈ ప్రాంతం ఆర్థికంగా మరింత బలోపేతమవుతుందన్నారు. ఎక్స్‌ప్రెస్‌వే అందుబాటులోకి రావడంతో జైపూర్, అజ్మీర్‌లకు మరిన్ని ప్రయోజనాలు చేకూరుతాయన్నారు.

సరిహద్దు ప్రాంతాలపై కాంగ్రెస్ నిర్లక్ష్యం: ప్రధాని

మన దేశ సైనికుల శక్తి సామర్థ్యాలను కాంగ్రెస్ తక్కువగా అంచనా వేసిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నన్నాళ్లూ సరిహద్దు ప్రాంతాల్లో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదని, దేశంలోకి చొరబడడానికి మన శత్రువులు కొత్త మార్గాలు వెతుక్కుంటారన్న భయంతో ఏమీ చేయలేదని ధ్వజమెత్తారు. దౌసాలో ఎక్స్‌ప్రెస్‌వేను ప్రారంభించిన తర్వాత బీజేపీ ర్యాలీలో ఆయన మాట్లాడుతూ రాజస్తాన్‌లో అభివృద్ధి కార్యక్రమాలన్నీ కాంగ్రెస్ కాగితాలకే పరిమితం చేసిందని ఆరోపించారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఉంటేనే రాజస్తాన్ అభివృద్ధి పథంలో దూసుకువెళుతుందని అన్నారు.

దయానంద సరస్వతి 200వ జయంత్యుత్సవాలు

ఆర్యసమాజ్ వ్యవస్థాపకుడు స్వామి దయానంద సరస్వతి 200వ జయంత్యుత్సవాలను మోదీ ఆదివారం ప్రారంభించారు. ఆయన చూపిన మార్గం కోట్లాది మందిలో ఆశల్ని నింపుతోందని ఈ సందర్భంగా ఆయనన్నారు. నిరుపేదలకు సేవ చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, అణగారిన వర్గాల అభ్యున్నతి మొట్టమొదటి యజ్ఞంగా చేపట్టామని తెలిపారు.

ఢిల్లీ ముంబై ఎక్స్‌ప్రెస్ వే విశేషాలు

మొత్తం పొడవు: 1,380 కి.మీ.
మొత్తం వ్యయం: దాదాపుగా రూ. లక్ష కోట్లు
ఢిల్లీ ముంబై మధ్య ప్రయాణ సమయం: 12 గంటలు (ప్రస్తుతం 24 గంటలు పడుతోంది)
తొలి దశ పొడవు : 246 కి.మీ. (సోహ్నా నుంచి దౌసా)
వ్యయం: రూ.12,150 కోట్లు
➡ ఢిల్లీ నుంచి జైపూర్ మధ్య సగానికి సగం తగ్గనున్న ప్రయాణ సమయం. (ఇన్నాళ్లూ 5 గంటలు పట్టేది. ఇకపై మూడున్నర గంటల్లో చేరుకోవచ్చు).
➡ ఆరు రాష్ట్రాల మీదుగా వెళ్లనున్న ఎక్స్‌ప్రెస్ వే

90 గంటలు, 10 సమావేశాలు, 10,800కి.మీ..

నాలుగు రోజుల వ్యవధిలో ప్రధాని నరేంద్ర మోదీ అక్షరాలా సుడిగాలి పర్యటనలు చేపట్టారు. మొత్తం 90 గంటల్లో ఏకంగా 10 బహిరంగ సమావేశాల్లో పాల్గొంటున్నారు. ఈ క్రమంలో ఆయన 10,800 కి.మీ. దూరం ప్రయాణిస్తారు. ఫిబ్రవరి 10న ఢిల్లీ నుంచి యూపీకి వెళ్లి ప్రపంచ పెట్టుబడుల సదస్సుని ప్రారంభించారు. ముంబైకి వచ్చి వందేభారత్ రైళ్లకు పచ్చ జెండా ఊపారు. ఫిబ్రవరి 11న త్రిపురలో రెండు బహిరంగ సదస్సుల్లో పాల్గొన్నారు. ఆదివారం ఢిల్లీ నుంచి రాజస్తాన్ వెళ్లి దౌసాలో ఎక్స్‌ప్రెస్ వేను ప్రారంభించారు. రెండు బహిరంగ సమావేశాల్లో ప్రసంగించారు. సోమవారం బెంగుళూరులో ఏరో ఇండియా 2023ను ప్రారంభిస్తారు. అక్కడ్నుంచి మళ్లీ త్రిపురకి వెళ్లి అగర్తాలా ర్యాలీలో పాల్గొని సోమవారం రాత్రి ఢిల్లీకి చేరుకుంటారు.

ఓం, అల్లా.. ఒక్కటే: మౌలానా మదానీ

న్యూఢిల్లీ: జామియత్ ఉలెమా–ఇ–హింద్(అర్షద్ వర్గం) అధ్యక్షుడు మౌలానా సయ్యద్ అర్షద్ మదానీ వ్యాఖ్యలు వివాదమయ్యాయి. ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ఆదివారం 'జామియత్ ఉలెమా–ఇ–హింద్' 34వ సదస్సులో ఓం, అల్లా ఒక్కటేనని వ్యాఖ్యానించారు. 'దైవస్వరూపం అందుబాటులో లేకుంటే ఓంను పూజిస్తామని కొందరు నాతో చెప్పారు. అంటే ఒకే ఓం లేదా అల్లా ఉన్నట్లు లెక్క. అవి రెండూ ఒక్కటే. ఓంను మేము అల్లా అంటాం. హిందువులు ఈశ్వరుడంటారు. పార్సీలు ఖుదా అంటారు. ఆంగ్లేయులు గాడ్ అంటారు' అని చెప్పుకొచ్చారు. సదస్సులో పాల్గొన్న జైన మతపెద్ద ఆచార్య లోకేశ్ ముని తదితరులు ఈ వ్యాఖ్యలపై ఆగ్రహిస్తూ నిష్క్రమించారు.

మరో 'వస్తువు'ను కూల్చేసిన అమెరికా

వాషింగ్టన్: గగనతలంలో అనుమానాస్పదమైన వస్తువుల్ని అమెరికా వరసగా రెండో రోజూ కూల్చేసింది. కెనడా గగనతలంలోకి వచ్చిన గుర్తు తెలియని సిలిండర్ ఆకారంలోని వస్తువును అమెరికా యుద్ధ విమానం ఎఫ్–22 కూల్చేసినట్టు కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడియో చెప్పారు. అమెరికా అధ్యక్షుడు బైడన్‌తో మాట్లాడి ఈ చర్య తీసుకున్నట్టు తెలిపారు.

50 లీటర్ల పెట్రోల్ ట్యాంకుకు 57 లీటర్ల బిల్లు!

మధ్యప్రదేశ్ హైకోర్టు జడ్జికి బంకు నిర్వాహకుల టోకరా

జబల్పూర్: మధ్యప్రదేశ్‌లోని జబల్పూర్‌లో ఓ పెట్రోల్ పంపు సిబ్బంది ఏకంగా హైకోర్టు న్యాయమూర్తికే టోకరా ఇచ్చారు! ఆయన కారు ట్యాంక్ సామర్థ్యమే 50 లీటర్లయితే ఏకంగా 57 లీటర్ల పెట్రోల్ కొట్టినట్టు బిల్లు చేతికిచ్చారు. న్యాయమూర్తి ఫిర్యాదు మేరకు అధికారులు పెట్రోల్ బంకును సీల్ చేశారు.ఆ ప్రాంతంలోని ఇతర బంకుల నిర్వహణ తీరుపై విచారణకు ఆదేశించారు. ఈ నెల 9వ తేదీన ఈ ఘటన చోటుచేసుకుంది.

12 రాష్ట్రాలకు కొత్త గవర్నర్లు



రమేశ్ బైస్

సాక్షి, న్యూఢిల్లీ: అయోధ్య రామాలయ వివాదంతో పాటు ట్రిపుల్ తలాక్ వంటి పలు చరిత్రాత్మక తీర్పులు వెలువరించిన సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్‌ను ఆంధ్రప్రదేశ్ గవర్నర్‌గా కేంద్రం నియమించింది. ఏపీ గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్‌ను ఛత్తీస్‌గఢ్ గవర్నర్‌గా పంపింది. మొత్తం ఆరుగురు కొత్త గవర్నర్లను నియమించడంతో పాటు ఏడుగురిని మారుస్తూ ఆదివారం నిర్ణయం తీసుకుంది. ఈ నియామకాలకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోద ముద్ర వేశారు. వివాదాస్పద మహారాష్ట్ర గవర్నర్ భగత్ సింగ్ కోశ్యారీతో పాటు లద్దాఖ్ లెఫ్టినెంట్ గవర్నర్ ఆర్.కె.మాథుర్ రాజీనామా చేశారు. కొత్త గవర్నర్లలో నలుగురు బీజేపీకి చెందినవారు. జస్టిస్ నజీర్ కర్నాటక హైకోర్టు న్యాయమూర్తిగా ఉంటూ 2017లో నేరుగా సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. గత జనవరిలో రిటైరయ్యారు. ఇక 80 ఏళ్ల కోశ్యారీ మహారాష్ట్ర గవర్నర్‌గా ఛత్రపతి శివాజీ, ముంబైపై వివాదాస్పద వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచారు. ఎన్సీపీ, కాంగ్రెస్, శివసేన (ఉద్ధవ్) కోశ్యారీ రాజీనామాను స్వాగతించాయి.

కొత్త గవర్నర్లు

ఆంధ్రప్రదేశ్	జస్టిస్ ఎస్.ఎ.నజీర్
మహారాష్ట్ర	రమేశ్ బైస్
బిహార్	విశ్వనాథ్ రాజేంద్ర అర్లేకర్
ఛత్తీస్‌గఢ్	విశ్వభూషణ్ హరిచందన్
జార్ఖండ్	సి.పి.రాధాకృష్ణన్
హిమాచల్‌ప్రదేశ్	శివప్రతాప్ శుక్లా
అస్సాం	గులాబ్‌చంద్ కటారియా
అరుణాచల్‌ప్రదేశ్	త్రివిక్రమ్ పర్నాయక్
మణిపూర్	అనసూయ ఉయికె
సిక్కిం	లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య
నాగాలాండ్	ఎల్.ఎ.గణేశన్
మేఘాలయ	ఫగు చౌహాన్
లద్దాఖ్	బి.డి.మిశ్రా

మహిళలది జీతం బత్తెం లేని చాకిరి

- రోజుకి 7.2 గంటల ఇంటి పనిలో మహిళలు
- అహ్మదాబాద్ ఐఐఎం అధ్యయనంలో వెల్లడి

అహ్మదాబాద్ : మహిళలు ఇంట్లో జీతం బత్తెం లేకుండా బండెడు చాకిరీ చేస్తున్నారని, రోజుకున్న 24 గంటల సమయం సరిపోవడం లేదని గుజరాత్‌లోని అహ్మదాబాద్ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) తాజా అధ్యయనంలో వెల్లడైంది. జీతం లేని ఇంటి పనిని పురుషులు 2.8 గంటలు చేస్తే మహిళలు 7.2 గంటల సేపు ఇంటిపనుల్లోనే ఉంటున్నారని ఆ అధ్యయనంలో తేలింది.

అధ్యయనం ఏం చెప్పిందంటే..

ఆఫీసులో పని చేస్తూ సంపాదిస్తున్న మహిళలు కూడా పురుషుల కంటే రెండు రెట్లు ఎక్కువగా ఇంటి పనుల్లో నిమగ్నమైపోతున్నారు. ఇల్లు శుభ్రం చేయడం, వంట చేయడం, పిల్లల్ని చూసుకోవడం వంటి పనులన్నీ మగవారి కంటే మహిళలే ఎక్కువగా చేస్తున్నారు. 15 నుంచి 60 ఏళ్ల వయసున్న మహిళలందరూ రోజుకి 7 గంటలకు పైగా ఇంటి పనులు చేస్తున్నారు. ఈ విషయం జగమెరిగిన సత్యమే అయినప్పటికీ ''టైమ్ యూజ్ డేటా : ఏ టూల్ ఫర్ జెండర్ పాలసీ అనాలిసిస్'' పేర ఎంత సేపు మహిళలు జీతం లేని చాకిరీ చేస్తున్నారో సర్వే చేయగా మహిళలు సగటున రోజుకి 7.2 గంటలు ఇంటి పనులు చేస్తూ వస్తూ ఉంటే , మగవాళ్లు 2.8 గంటలు మాత్రమే చేస్తున్నారని తేలినట్టుగా ఐఐఎంఏ ప్రొఫెసర్ నమ్రత చందార్కర్ తెలిపారు.

దేశంలోనే ఖరీదైన పెంట్ హౌస్

రూ.240 కోట్లు!



ముంబై: దేశంలోనే అత్యంత ఖరీదైన పెంట్‌హౌస్‌ను వెల్‌స్పన్ గ్రూప్ చైర్మన్ బీకే గోయెంకా ఇటీవలే కొనుగోలు చేశారు. ముంబైలోని వర్లీ ప్రాంతం అన్నీబీసెంట్ రోడ్డులో ఉన్న లగ్జరీ టవర్లలో త్రీసిక్స్టీ వెస్ట్ ఒకటి. ఇందులోని పెంట్‌హౌస్ ఖరీదు రూ.240 కోట్లు. టవర్ 63, 64, 65 ఫ్లోర్లలోని 30 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ పెంట్ హౌస్ కొనుగోలుకు సంబంధించిన వ్యవహారాలను గత బుధవారం బీకే గోయెంకా పూర్తి చేసినట్లు టైమ్స్ ఆఫ్ ఇండియా కథనం తెలిపింది. దేశంలో ఇప్పటి వరకు ఇదే అత్యంత ఖరీదైన అపార్ట్‌మెంటని పేర్కొంది. దీనిని ఆనుకునే ఉన్న మరో పెంట్‌హౌస్‌ను కూడా నిర్మాణ సంస్థ యజమాని వికాస్ ఒబెరాయ్ రూ.240 కోట్లు పెట్టి కొన్నట్లు ఆ కథనంలో వివరించింది.



వసతుల నిలయం గురుకులం
ఉమ్మడి జిల్లాలోని గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు తెలంగాణ ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. 8లో▸



రాజన్న ఆలయంలో రద్దీ
వేములవాడ: వేములవాడ రాజన్నను ఆదివారం 20వేల మంది భక్తులు దర్శించుకున్నారు. స్వామివారికి రూ.20వేల ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
33.0/17.0
పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. ఎండతీవ్రత, ఉక్కపోత ఉంటుంది. రాత్రి చలిగాలులు వీస్తాయి. చలితీవ్రత ఉంటుంది.

పరీక్షల వేళ.. ఫీజుల గోల



కరీంనగర్: తమ పిల్లలను ఎలాగైనా ఉన్నతంగా చదివించాలనే లక్ష్యంతో ప్రైవేట్ కళాశాలలు, పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. అయితే ఇప్పుడు వారి భవిష్యత్ ప్రశ్నార్థకరంగా మారుతోంది. ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్ వార్షికపరీక్షలు సమీపిస్తుండడంతో ప్రైవేట్ విద్యాసంస్థల నిర్వాహకులు ఫీజుల కోసం వేధిస్తున్నారు. ప్రతిరోజు పిల్లల తల్లిదండ్రులకు ఫోన్లు చేయడంతో పాటు సందేశాలు పంపిస్తున్నారు. ఫీజులు చెల్లించకుంటే హాల్‌టికెట్లు ఇవ్వబోమని తెగేసి చెబుతున్నారు. దీంతో పరీక్షల ముందు విద్యార్థులు మానసికవేదనకు గురవుతున్నారు. ఇంత జరుగుతున్నా విద్యాశాఖ అధికారులు చూసిచూడనట్లు ఉంటున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారు.

'తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్‌కు చెందిన కుమారస్వామి కూతురు కరీంనగర్‌లోని ఓ పేరున్న కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతోంది. ఫస్టియర్‌లో అడ్మిషన్ తీసుకున్న సమయంలో ఒప్పందం ప్రకారం ఫీజు చెల్లించాడు. రెండో సంవత్సరం ప్రాక్టికల్స్ ప్రారంభం అవుతున్న నేపథ్యంలో హాల్‌టికెట్ కోసం వెళ్లితే ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు కలిపి మరో రూ.75 వేలు చెల్లించాలని, హాస్టల్ ఫీజు అదనం అనడంతో లెక్క తేలక, ఏం చేయాలో తోచక రూ.55 వేలు చెల్లించి కుమారస్వామి రశీదు తీసుకున్నాడు.'

జిల్లాకేంద్రంలోని భగత్‌నగర్‌లో ఉన్న ఓ కార్పొరేట్ పాఠశాలలో పదోతరగతి చదువుతున్న అబ్బాయికి అడ్మిషన్ సమయంలో పీఆర్‌వో చెప్పిన ఫీజు కాకుండా అదనంగా రూ.40 వేలు చెల్లించాలని యాజమాన్యం పట్టుపట్టింది. అబ్బాయి తండ్రి పదోతరగతి పరీక్ష ఫీజు చెల్లించే సమయంలో ప్రాధేయపడి చివరికి రూ.25వేలు చెల్లించాడు.

ఇది ఏ ఒక్కరి ఇద్దరి సమస్య అనుకుంటే పొరపాటే. జిల్లాలోని ప్రైవేట్ జూనియర్ కళాశాలలు, పాఠశాలల్లో వార్షిక పరీక్షల సమయంలో ట్యూషన్‌ఫీజుకు, పరీక్షఫీజుకు, హాస్టల్‌ఫీజుకు లెంకగడుతూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఇబ్బడిముబ్బడిగా ఫీజులు వసూలు చేస్తుండడంతో లబోదిబోమంటున్నారు.

- ఫీజుల కోసం వేధిస్తున్న ప్రయివేటు విద్యాసంస్థలు
- విద్యార్థులకు హాల్‌టికెట్లు ఇవ్వమని బెదిరింపులు
- పరీక్ష ఫీజుకు.. ట్యూషన్ ఫీజుకు లింకు
- అధికారుల ఆదేశాలు బేఖాతరు

→ జిల్లాలో 57 ప్రయివేటు జూనియర్ కళాశాలల్లో 35వేల మందికిపైగా విద్యార్థులు ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. అదే విధంగా జిల్లాలోని 293 ప్రైవేట్ స్కూళ్లలో 10,080 విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు.

→ మార్చి 15 నుంచి ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు, వెనువెంటనే జరిగే ఇంటర్, ఎస్ఎస్‌సీ వార్షిక పరీక్షలకు హాజరయ్యేందుకు పరీక్ష ఫీజు కట్టాల్సి ఉంటుంది.

→ ఇదే అదునుగా భావించిన ప్రైవేట్ కళాశాలలు, పాఠశాలల యాజమాన్యాలు పరీక్షఫీజుకు, ట్యూషన్ ఫీజుకు ముడిపెడుతున్నారు.

→ జిల్లాలోని కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల్లో రెసిడెన్షియల్ క్యాంపస్‌లో ఫీజు రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు, డేస్కూళ్లు లేదా కళాశాలల్లో రూ.30వేలకు పైగా ఫీజులు వసూలు చేస్తున్నారు.

→ ఇక సాధారణ పాఠశాలలు, ప్రైవేట్ కళాశాలల్లో రెసిడెన్షియల్ విభాగంలో రూ.40వేల నుంచి రూ.70 వేల వరకు ఫీజులు ఉన్నాయి. విద్యార్థి కళాశాల, పాఠశాలతో కుదుర్చుకున్న మొత్తం ఫీజును రెండు విడుతలుగా విభజించి ప్రథమ, ద్వితీయ టర్మ్ ఫీజులుగా వసూలు చేస్తారు.

→ ముఖ్యంగా ఇంటర్ కళాశాలల యాజమాన్యాలు ఫీజుల కోసం పీడిస్తున్నాయి. మార్చి 15నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్, తరువాత ఎసెస్సీ పరీక్షలు ప్రారంభం అవుతుండడంతో ఫీజుల వసూళ్లను వేగిరం చేశాయి.

ఫీజు చెల్లించకుంటే ఇంటికే

ఫోన్‌కాల్స్‌కు భయపడి కొంతమంది తల్లిదండ్రులు పిల్లలచదువు కోసం అప్పు చేసి ఫీజు కడుతున్నారు. మరోవైపు ప్రైవేట్ యాజమాన్యాలు ఫీజుల కోసం బరితెగించడంపై విద్యావేత్తలు, విద్యార్థి సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంటర్మీడియట్ డీఐఈవో, డీఈవోలు మాత్రం ఫీజుల పేరిట విద్యార్థులను వేధించవద్దని సూచిస్తూ చేతులు దులుపుకుంటున్నారు. ఈ పరీక్షల సమయంలో ఫీజుల కోసం ఒత్తిడి తేస్తే విద్యార్థి మానసిక వేదనకు గురయ్యే ప్రమాదముందని యాజమాన్యాలు విద్యను వ్యాపార కోణంలో చూడకుండా సహనం పాటించాలని పలువురు విద్యావేత్తలు సూచిస్తున్నారు.

హాల్‌టికెట్లు ఇవ్వాల్సిందే



పరీక్ష ఫీజుకు, ట్యూషన్ ఫీజుకు ముడిపెట్టి విద్యార్థులను ఇబ్బందులకు గురి చేయవద్దు. విద్యార్థులను ఫీజుల పేరిట ఇబ్బందులకు గురి చేస్తూ హాల్‌టికెట్లు ఇవ్వని కళాశాలల వివరాలను తమకు అందిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఫీజుల పేరుతో వేధింపులకు గురి చేయడం తగదు, మానవీయ కోణంలో ఆలోచించి విద్యార్థులకు సహకరిస్తే బాగుంటుంది.
– రాజ్యలక్ష్మి, డీఐఈవో, కరీంనగర్

ఆదేశాలు బేఖాతరు



ప్రైవేట్ యాజమాన్యాలు బరితెగించి ఫీజులు వసూలు చేస్తున్నాయి. వాటిని నిరోధించాల్సిన అధికారులు మామూళ్లకు అలవాటు పడి వారిపై చర్యలు తీసుకోవడం లేదు. బలవంతంగా ఫీజులు వసూలు చేయడం అన్యాయం. హాల్‌టికెట్లు ఇవ్వకుంటే ఊరుకునేది లేదు. ఇకనైనా డీఐఈవో, డీఈఓలు జోక్యం చేసుకొని ప్రైవేట్ కళాశాలల, పాఠశాలల ఫీజులంపై దృష్టిసారించాలి.
– మచ్చ రమేశ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

న్యూస్‌రీల్

బండ ప్రకాశ్‌కు మంత్రి గంగుల అభినందనలు



అభినందనలు తెలుపుతున్న మంత్రి కమలాకర్

కరీంనగర్: శాసనమండలి డిప్యూటీ చైర్మన్‌గా ఎన్నికైన బండ ప్రకాశ్‌ను రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ శాసన మండలి ప్రాంగణంలో పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. సీఎం కేసీఆర్‌కు బీసీలపై అనంతమైన ప్రేమ ఉందని, సంక్షేమం, అభివృద్ధిలో బీసీలకు ఎనలేని ప్రాధాన్యం ఇస్తున్నారని, రాజకీయ పదవులలోనూ అగ్రతాంబూలం ఇస్తున్నారని అన్నారు. అందుకు తార్కాణమే బీసీనేతకు శాసనమండలి డిప్యూటీ చైర్మన్ పదవి కట్టబెట్టడం అన్నారు. శాసనమండలి ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, తలసాని శ్రీనివాస్ యాదవ్, తదితరులు ఉన్నారు.

బీసీల సమస్యలు పరిష్కరించాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కరీంనగర్: దేశంలో జనాభాపరంగా అధికసంఖ్యలో ఉన్న బీసీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శులు రాచమల్ల రాజు, దొగ్గలి శ్రీధర్ ఆధ్వర్యంలో ఆదివారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్‌కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు ఏవిధంగానైతే ఫీజురీయింబర్స్‌మెంట్ కోసం 60శాతం నిధులు ఇస్తుందో బీసీలకు కూడా ఇవ్వాలని కోరారు. జనాభాలెక్కల్లో బీసీ లెక్క తేల్చాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వంలో బీసీ మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలని కోరారు. బీసీలకు క్రిమిలేయర్ విధానాన్ని ఎత్తివేయాలని తెలిపారు. దీనికి ఎంపీ బండి సంజయ్ సానుకూలంగా స్పందించారని వివరించారు. ఈ కార్యక్రమంలో బీసీ మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగిపెల్లి అరుణ, బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దుంపటపెల్లి మురళి, తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన ప్రభుత్వ విప్ కౌశిక్‌రెడ్డి



కేసీఆర్‌కు మొక్క అందిస్తున్న పాడి కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్: ప్రభుత్వ విప్‌గా నియామకమైన పాడి కౌశిక్‌రెడ్డి ఆదివారం ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. పూలమొక్క అందించి ఆశీర్వాదం తీసుకున్నారు. తనపై నమ్మకంతో విప్ పదవి బాధ్యతలు అప్పగించినందుకు గాను ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

ఉద్యోగ,ఉపాధ్యాయ పెండింగ్ బిల్లులు తక్షణమే చెల్లించాలి

కరీంనగర్: ఉద్యోగ,ఉపాధ్యాయ, పెన్షనర్లకు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న బిల్లులను తక్షణమే చెల్లించాలని తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ఎం.ఏ.ఖాద్రీ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన సప్లిమెంటరీ సాలరీ , సరెండర్, మెడికల్, జీపీఎఫ్ ఫైనల్ పేమెంట్,పార్ట్ ఫైనల్, పీఆర్సీ ఏరియర్స్ బిల్స్ తదితర బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో చాలామంది అసహనానికి గురవుతున్నారన్నారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగుల పీఆర్సీ ఏరియర్స్, గ్రాట్యుటీ వివిధ రకాల చెల్లింపుల కోసం నెలల తరబడి ఎదురు చూస్తున్నారని, అకాలమరణం చెందిన ఉద్యోగ ఉపాధ్యాయుల మరణాంతర ఆర్థిక చెల్లింపుల కోసం వారి కుటుంబ సభ్యులు నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతుండడం చాలా బాధాకరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. జీతాలు, ఇతరత్రా బిల్లులు సత్వరమే చెల్లింపు చేయాలని కోరారు.

పొదుపు భవితకు మలుపు

- మోసాలకు గురవకుండా టోల్ ఫ్రీ 1930
- అదనపు కలెక్టర్ శ్యాం ప్రసాద్‌లాల్



2కె వాక్‌లో అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్

కరీంనగర్ అర్బన్: ప్రతి ఒక్కరూ తమ ఆదాయంలో కొంత భాగం పొదుపు చేయడం అలవాటు చేసుకోవాలని అదనపు కలెక్టర్ జి.వి.శ్యాంప్రసాద్ లాల్ అన్నారు. ఆర్బీఐ ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా లీడ్ బ్యాంకు, స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 2కె వాక్ ర్యాలీని ఆదివారం కలెక్టరేట్ వద్ద జిల్లా అదనపు కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వృథా ఖర్చులు తగ్గించుకొని పొదుపు చేసుకోవాలని సూచించారు. సైబర్ నేరగాళ్ల నుంచి తప్పించుకోవాలంటే బ్యాంకు ఓటీపీలు కానీ ఇతర లింక్లు కానీ ఓపెన్ చేయవద్దని, ఫ్రీగా వచ్చే డబ్బులకు ఆశ పడకుండా జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. మోసగాళ్ల బారిన పడకుండా 1930, 14448 టోల్ ఫ్రీ నంబర్‌లను వాడాలని సూచించారు. జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ ఆంజనేయులు మాట్లాడుతూ ఆర్‌బీఐ ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు ఈ నెల 13నుంచి 17వరకు జిల్లాలోని అన్ని బ్యాంకుల ద్వారా వివిధ గ్రామ పంచాయతీ, మునిసిపల్ ప్రాంతాలలో నిర్వహించబడుతాయని అన్నారు. 13న జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఆర్బీఐ ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల కార్యక్రమాల పట్టికను విడుదల చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ సీఈఓ సత్యనారాయణ, ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ రామచంద్రుడు, మేనేజర్ కలీం, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి రాజవీరు, పోచయ్య, మునిరాజు సంతోశ్, తదితరులు పాల్గొన్నారు.

నేటి ప్రజావాణి రద్దు

కరీంనగర్ అర్బన్: రాష్ట్ర మంత్రి సమీక్ష నేపథ్యంలో ప్రజావాణిని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ ఆర్వీ కర్ణన్ తెలిపారు. సోమవారం ప్రజావాణి ఉండదని, జిల్లా ప్రజలు గమనించి సహకరించాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

'సహకారా'నికి అవినీతి మరక!

- గట్టుదుద్దెనపల్లి సొసైటీలో వరుస అక్రమాలు
- ఇప్పటికే సంఘంలో రూ.కోట్ల కుంభకోణం
- ఇటీవల రూ.5.96 లక్షలతో ఉడాయించిన ఉద్యోగి
- సదరు వ్యక్తిపై ఇదివరకే అవినీతి ఆరోపణలు
- వరుస సంఘటనలతో ఆందోళనలో సభ్యులు



మానకొండూర్: మండలంలోని గట్టుదుద్దెనపల్లి విశాల సహకార పరపతి సంఘం ప్రపంచవ్యాప్తంగా పేరుగాంచింది. సంఘంలో సభ్యులు, రుణలక్ష్యం.. చెల్లింపులు.. వ్యాపార రంగం.. తదితర అంశాల్లో మంచి గుర్తింపు పొందింది. దేశవిదేశాల నుంచి వచ్చిన ప్రతినిధులు, రైతులు సంఘాన్ని సందర్శించిన సందర్భాలు అనేకం. అయితే ఇదంతా గతం.. గతమెంతో ఘనం.. ఇప్పుడు అంతా శూన్యం అన్న చందంగా తయారైంది గట్టుదుద్దెనపల్లి విశాల సహకార పరపతి సంఘం పరిస్థితి. పాలకవర్గం, సిబ్బంది చేతివాటం కారణంగా అభాసుపాలవుతోంది. గతంలో పాలకవర్గం స్వాహా చేసిన రూ.4.17 కోట్ల కుంభకోణం మరువకముందే.. మరో అవినీతి జరిగింది. తాజాగా సంఘం పెట్రోల్ బంకులో పనిచేసే ఓ ఉద్యోగి రూ.5.96 లక్షలతో ఉడాయించడం చర్చనీయాంశమైంది.

● గట్టుదుద్దెనపల్లి విశాల సహకార సంఘంలో మల్లాపూర్, పోలంపల్లి, చింతగట్టు, గట్టుదుద్దెనపల్లి గ్రామాల రైతులు సభ్యులుగా కొనసాగుతున్నారు. సంఘం పరిధిలో సీడ్ వరి, బియ్యం, పెట్రోలు బంకుతోపాటు పలు వ్యాపారాలు కొనసాగిస్తున్నారు.

● కొంతకాలంగా పెట్రోలు బంకులో గిరిధర్ అనే వ్యక్తి విధులు నిర్వహిస్తున్నాడు. పెట్రోలు, డీజిల్ అమ్మకాల ద్వారా డబ్బులు సంఘానికి అప్పజెప్పకుండా మూడు రోజులు సెలవుపెట్టి కొద్దిరోజులుగా కనిపించకుండా పోయాడు.

● గిరిధర్ విధులకు హాజరు కాకపోవడంతో అనుమానం వచ్చిన సొసైటీ కార్యదర్శి ఆరా తీశాడు. గిరిధర్ కుటుంబ సభ్యుల నుంచి ఎలాంటి సమాచారమూ లేదు. దీంతో సంఘం కార్యదర్శి రామయ్య ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

● కాగా.. గిరిధర్ మూడేళ్లక్రితమే సంఘానికి సంబంధించిన రూ.2లక్షలకు పైగా నిధులు సొంతానికి వాడుకున్నాడు. ఈ విషయం సంఘం విచారణలో బయట పడింది. కొద్దిరోజులకు అతడి నుంచి పాలకవర్గం రూ.4 లక్షలపైచిలుకు డబ్బులు వడ్డీతో సహా వసూలు చేసి ఉద్యోగం నుంచి పక్కన పెట్టారు.

● కొద్దిరోజుల తరువాత ఇద్దరు వ్యక్తులు అతడికి పూచీకత్తు ఇవ్వడంతో తిరిగి విధుల్లోకి తీసుకున్నారు. అయినా అతడిలో మార్పురాలేదు.

● పెట్రోలు బంకులో విధులు నిర్వహిస్తూ.. డీజిల్, పెట్రోల్ విక్రయించగా వచ్చిన రూ.5.96 లక్షలను సంఘానికి అప్పజెప్పకుండా సొంతానికి వాడుకున్నాడు. దీంతో అతడికి పూచీకత్తు ఇచ్చిన ఇద్దరికి సంఘం నోటీసులు జారీ చేసింది.

● అయితే డబ్బులు స్వాహా చేసిన గిరిధర్ స్థానికంగానే ఉన్నాడా..? ఇతర దేశాలకు వెళ్లాడా..? అని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గిరిధర్ దూర ప్రాంతాలకు వెళ్లి వేరే ఉద్యోగం చేసుకుంటున్నట్లు కొందరు చెబుతున్నారు. కాగా.. సొమ్ము రికవరీ కోసం పూచీకత్తు ఉన్న వ్యక్తులకు మరోమారు నోటీసులు ఇవ్వనున్నట్లు సమాచారం.

● కాగా.. మంచి పేరున్న గట్టుదుద్దెనపల్లి సహకార సొసైటీలో వరుస అవినీతి సంఘటనలతో సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కంచే చేను మేసినట్లు గతంలో పాలకవర్గమే భారీ కుంభకోణానికి పాల్పడడం.. అది మరువకముందే మరో రెండు అవినీతి ఆరోపణలు రావడం.. ఇప్పుడు ఏకంగా సొసైటీలో పనిచేసే ఉద్యోగి డబ్బుతో పరారీ కావడం సంఘం ప్రతిష్టకు మచ్చ అని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం



మాట్లాడుతున్న బోయినపల్లి వినోద్‌కుమార్

- రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్
- సుడా చైర్మన్ కప్ కరాటే పోటీలకు స్పందన

కరీంనగర్‌స్పోర్ట్స్: ఆత్మరక్షణకు, ఆత్మస్థైర్యానికి కరాటే దోహదమని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. స్థానిక డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో సుడా చైర్మన్ జీవీ.రామకృష్ణారావు సౌజన్యంతో ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ రూపకర్త వసంత్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సుడా చైర్మన్ కప్–2023 ఇంటర్ స్టేట్ కరాటే చాంపియన్ షిప్ పోటీలను ప్రారంభించారు. వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. ఇంతమంది విద్యార్థులను ఈ కరాటే పోటీలో పాల్గొనడానికి ప్రోత్సాహం చూపిన వారి తల్లిదండ్రులను ప్రశంసించారు. తాను ఎంపీగా ఉన్నప్పుడు స్మార్ట్‌సిటీ కింద తెచ్చిన నిధులతో ఇండోర్‌స్టేడియం నిర్మించడం జరిగిందని గుర్తు చేశారు. కరాటే యుద్ధ విద్యయే కాకుండా క్రమశిక్షణకు మారుపేరుగా చెప్పుకోవచ్చు అని, గత 40 సంవత్సరాలుగా వసంత్‌కుమార్ ఎంతో మందికి కరాటే విద్యను అందించారని కొనియాడారు. ఈ పోటీలలో సుమారుగా 1000 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మేయర్ వై.సునీల్‌రావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ పొన్నం అనిల్‌గౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారదాసు లక్ష్మణ్‌రావు, షిహాన్ సంపత్ కుమార్, కె.మొండయ్య, సీనియర్ బ్లాక్‌బెల్ట్స్ ప్రదీప్‌కుమార్, మన్సూన్, లింగయ్య, శ్రీనివాస్, నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

'ఆశ నిండిన శ్వాస' ఆవిష్కరణ



కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న రామకృష్ణారావు

కరీంనగర్‌కల్చరల్: ఆశ నిండిన శ్వాస కవితా సంపుటిలో వ్యక్తిత్వ వికాసానికి దోహదపడే కవితలున్నాయని సుడా చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ.రామకృష్ణారావు అన్నారు. ఆదివారం గణాంక భవన్‌లో భవానీ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో కసిరెడ్డి జలంధర్‌రెడ్డి రాసిన ఈ కవితా సంపుటిని ఆవిష్కరించారు. అనంతరం ప్రముఖ కవి దాస్యం సేనాధిపతి మాట్లాడుతూ కసిరెడ్డి కవిత్వంలో ఒక మెరుపు, వ్యంగ్యం, చమత్కారం, విరుపు కనిపిస్తున్నాయని అన్నారు. వైరాగ్యం ప్రభాకర్, మానకొండూరు జెడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, శంకరపట్నం జెడ్పీటీసీ లింగంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కవులు అన్నాడి గజేందర్ రెడ్డి, బొమ్మకంటి కిషన్, గులాబీల మల్లారెడ్డి, గాజోజు నాగభూషణం, రావుల రాజేశం, కసిరెడ్డి చైతన్యరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ల ఇళ్లున్న చోటే రోడ్లు

కరీంనగర్ టౌన్: కార్పొరేటర్ల ఇళ్లున్నచోటే రోడ్లు, మురికి కాలువలు వేసుకున్నారని, మిగతా ప్రాంతాలు అధ్వానంగా ఉన్నాయని కాంగ్రెస్ కరీంనగర్ నగరశాఖ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఆరోపించారు. హాథ్ సే హాథ్ జోడో పాదయాత్రలో భాగంగా 5, 27, 28వ డివిజన్లలో ఆదివారం పర్యటించారు. బీఆర్ఎస్ పాలకులకు మైనారిటీల ఓట్లు దండు కోవడమే తెలుసుగానీ వారికి కనీస సౌకర్యాలు కల్పించాలన్న సోయిలేదని విమర్శించారు. మూడు డివిజన్ల ప్రజలకు రాహుల్ గాంధీ సందేశంతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై చార్జిషీట్ కరపత్రాలను పంపిణీ చేశారు. షబానా మహమ్మద్, షేక్ షహన్ షా, మహమ్మద్ అబ్దుల్ బారీ, హనీఫ్, సిరాజొద్దీన్, అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. సమద్ నవాబ్, శ్రీనివాస్ రెడ్డి, విలాస్ రెడ్డి ఉన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్ల ఆక్రమణకు యత్నం


- చింతకుంటలో ప్లాట్లపై తమపేర్లు రాసుకున్న మహిళలు



డబుల్ బెడ్రూం ఇళ్లను ఆక్రమించుకున్న మహిళలు

కొత్తపల్లి(కరీంనగర్): మొన్న బద్దిపల్లిలో వందలాది మంది మహిళలు ప్రభుత్వ భూమిని ఆక్రమించే ప్రయత్నం చేయగా.. ఆదివారం చింతకుంటలో డబుల్ బెడ్‌రూం సముదాయాల్లోని ఇళ్లలో ప్రవేశం చేసి ఆక్రమించుకునే ప్రయత్నం చేశారు. కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని లబ్ధిదారుల కోసం కొత్తపల్లి మండలం చింతకుంటలో 660 ఇళ్ల భవన సముదాయాలను ప్రభుత్వం నిర్మించింది. వాటి పంపిణీలో జాప్యాన్ని నిరసిస్తూ ఆదివారం సుమారు 40మంది మహిళలు డబుల్‌బెడ్ రూం ఇళ్ల సముదాయాల్లోని ప్లాట్లను ఆక్రమించే ప్రయత్నం చేశారు. అందులోని ఒక్కో ప్లాటుపై వారి పేర్లు రాసుకొని, తమకే కేటాయించారన్న భావనను కల్పించారు. పలువురు మహిళలు మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా అద్దెఇళ్లల్లో ఉండలేక, అద్దె కట్టలేని పరిస్థితుల్లో తమకు డబుల్‌బెడ్ రూం ఇళ్లు కేటాయించాలని గత నాలుగేళ్లుగా ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు చెప్పారు. ఎన్నికల సమయంలో ఇళ్లు ఇస్తామని చెప్పి ఇప్పటి వరకు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. విసిగివేసారిన తాము చింతకుంటలో నిర్మించిన ఇళ్లను ఆక్రమించుకున్నట్లు వివరించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తమబాధను అర్థం చేసుకోవాలని కోరారు.

సేంద్రియ సాగుకు ప్రాధాన్యం



మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్

విద్యానగర్(కరీంనగర్): సేంద్రియ వ్యవసాయానికి కేంద్రప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని నాగ్‌పూర్ ప్రాంతీయ సేంద్రియ వ్యవసాయ కేంద్రం జూనియర్ సైంటిఫిక్ అధికారి డాక్టర్ ఊట్ల ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం కరీంనగర్‌లోని కృషి భవన్‌లో అగ్రికల్చరల్ ఆఫీసర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేంద్రియ, సహజ వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం సేంద్రియ వ్యవసాయానికి పెద్దపీట వేస్తూ నేషనల్ మిషన్ ఆన్ నాచురల్ ఫార్మింగ్‌కు రూ.6వేల కోట్లు కేటాయించిందని తెలిపారు. రసాయన ఎరువులకు స్వస్తి చెప్పి రైతులు సేంద్రియ పద్ధతులు పాటించాలని అన్నారు. అగ్రికల్చరల్ ఆఫీసర్స్ క్లబ్ అధ్యక్షుడు స ముద్రాల జనార్దన్‌రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆర్‌కే ఆర్గానిక్స్ అధినేత బంగారి రాజేంద్రప్రసాద్, గ్రామభారతి, గ్రామవికాస్ రాష్ట్ర అధ్యక్షుడు జిన్న సత్యనారాయణరెడ్డి, గ్రామభారతి కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి సింగరి సత్యనారాయణ, పొలాడి దామోదర్‌రావు, వరికిల్ల మొగిలి, బండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

108 అంబులెన్స్‌లలో ఉద్యోగావకాశాలు

సిరిసిల్లఅర్బన్: రాజన్నసిరిసిల్ల జిల్లాలోని 108 అంబులెన్స్ వాహనాలలో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సిరిసిల్ల జిల్లా ప్రోగ్రాం మేనేజర్ సలీం, జిల్లా కోఆర్డినేటర్ ఇమ్రాన్ సయ్యద్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. మెడికల్ టెక్నీషియన్, డ్రైవర్ పోస్టులు ఖాళీ ఉన్నాయని పేర్కొన్నారు. మెడికల్ టెక్నీషియన్‌కు బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం, బీ ఫార్మసీ, డీ ఫార్మసీ చదివిన వారు అర్హులని పేర్కొన్నారు. డ్రైవర్ పోస్టుకు లైట్‌మోటార్‌వెహికల్ బ్యాడ్జి కలిగి, 23 నుంచి 35 ఏళ్లలోపు ఉండాలని తెలిపారు. అర్హులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈ నెల 14న సిరిసిల్లలోని సినారె కళామందిరంలో హాజరుకావాలని కోరారు. వివరాలకు 90141 51667లో సంప్రదించాలని కోరారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరు అరెస్ట్

చందుర్తి(వేములవాడ): మద్యం తాగుతున్న వ్యక్తుల వద్దకు వెళ్లి అకారణంగా గొడవకు దిగడమే కాకుండా దాడికి పాల్పడిన జనశక్తి మాజీ నక్సలైట్‌తో పాటు మరో ముగ్గురిపై హత్యాయత్నం కేసు నమోదైంది. చందుర్తి సీఐ కిరణ్‌కుమార్ కథనం ప్రకారం.. కోనరావుపేట వైన్స్ పక్కన గల పర్మిట్ రూంలో మర్రిమడ్ల గ్రామానికి చెందిన గంట పరుశరాములు ఇద్దరు బంధువులతో కలిసి ఈ నెల 9న మద్యం సేవిస్తున్నాడు. అక్కడికి వెళ్లిన జనశక్తి మాజీ నక్సలైట్ ముదాం ప్రసాద్‌తోపాటు మేరుగు లక్ష్మణ్, మరో ఇద్దరు ఇక్కడెందుకు కూర్చొని మద్యం తాగుతున్నారంటూ పరుశరాములు అతడి బంధువులను నిలదీశారు. వాగ్వాదం పెరగడంతో ఆగ్రహానికి లోనైనా ప్రసాద్, లక్ష్మణ్, మరో ఇద్దరు బీరుసీసాతో దాడికి దిగగా, పరుశరాములు అతడి బంధువులు తప్పించుకుని పారిపోయారు. ఈనెల 10న పరుశరాములు ఫిర్యాదు మేరకు నలుగురిపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఆదివారం పక్కా సమాచారం మేరకు కోనరావుపేట కమాన్‌వద్ద ముదాం ప్రసాద్, లక్ష్మణ్‌లను అరెస్టు చేశారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు.

పిచ్చికుక్క దాడిలో పలువురికి గాయాలు

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ మండలం నర్సింహులపల్లె గ్రామంలో ఆదివారం పిచ్చికుక్క రోడ్డుపై, ఇళ్లలో ఎవరు కనిపిస్తే వారిపై దాడి చేస్తూ గాయపరిచింది. గ్రామానికి చెందిన గుడిసె కమల, వెయ్య చంద్రయ్య, ఆవునూరి సత్తెమ్మ (గ్రామ ఉపసర్పంచ్), దోసారపు బక్కన్న, సాకపురపు లక్ష్మి, కొండూరు భూమక్క, ఎండీ అయూబ్‌ఖాన్‌లతో పాటు మరికొంత మందిని కరిచింది. అలాగే గ్రామంలోని పశువులు, మేకలు, గొర్రెలపై కూడా దాడి చేసింది. గాయపడినవారికి సారంగాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స నిర్వహించి, యాంటి రాబిస్ ఇంజక్షన్ ఇచ్చారు. గ్రామాల్లో కుక్కలు, కోతులను అదుపు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

లారీ బోల్తా



మల్లాపూర్(కోరుట్ల): మండలంలోని రాఘవపేట శివారులో సబ్‌స్టేషన్ సమీపంలో శనివారం రాత్రి లారీ అదుపుతప్పి బోల్తాపడింది. పోలీసుల కథనం ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన కాంక్రీట్ మిక్సర్ కంపెనీకి చెందిన లారీ మండలంలోని రాఘవపేట శివారులో అతివేగంతో అదుపుతప్పి పొలంలోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఉత్తరప్రదేశ్‌కి చెందిన డ్రైవర్ అంజత్ గాయపడగా, చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో నిజామాబాద్‌కి తరలించినట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు.

వసతుల నిలయం 'గురుకులం'

- గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి ప్రవేశాలు మరూ
- ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- మార్చి 6 వరకు గడువు
- ఏప్రిల్ 23న ప్రవేశ పరీక్ష
- ఇంగ్లిష్ మీడియంలో బోధన
- ఉమ్మడి జిల్లాలో 23 గురుకులాలు.. 1,840 సీట్లు



గురుకుల పాఠశాలలో ప్రార్థన చేస్తున్న విద్యార్థులు, టీచర్లు (ఫైల్)

కరీంనగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉచిత కేజీ టు పీజీ మిషన్‌లో భాగంగా 2023–24 విద్యాసంవత్సరానికి గాను సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. ఇంగ్లిష్ మీడియంతో విజయవంతంగా నడుస్తున్న గురుకులాల్లో ప్రవేశాలకు కొన్నేళ్లుగా తీవ్ర పోటీ నెలకొంది. కరీంనగర్ జిల్లాలో రుక్మాపూర్, చింతకుంట, హుజూరాబాద్, జమ్మికుంట, మానకొండూర్, జగిత్యాల జిల్లాలో మేడిపల్లి, కోరుట్ల, మెట్‌పల్లి, జగిత్యాల, గొల్లపల్లి, పెద్దపల్లి జిల్లాలో మంథని, గోదావరిఖని, రామగుండం, నందిమేడారం, మల్లాపూర్, రాజన్నసిరిసిల్ల జిల్లాలో బద్దెనపల్లి, వేములవాడ, చిన్నబోనాల, బోయిన్‌పల్లి, ముస్తాబాద్, నర్మాల, ఇల్లంతకుంటలో గురుకుల పాఠశాలలు ఉన్నాయి. ఈనెల 9 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కాగా మార్చి 6 వరకు గడువు ఉంది.

ఉమ్మడి జిల్లాలో 1,840 సీట్లు

ఉమ్మడి జిల్లాలోని 23 గురుకులాల్లో 5వ తరగతిలో 80 చొప్పున 1,840 సీట్లు ఉన్నాయి. ప్రైవేటుకు దీటుగా విద్యాబోధనతో పాటు, భోజనవసతి, సకల సదుపాయాలు ఉంటాయి. ఎస్సీలకు 65 సీట్లు, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీలకు 15 సీట్ల చొప్పున కేటాయించారు. ఒక్కసారి ప్రవేశం పొందితే 10వ తరగతి వరకు ఉచితంగా చదువు, హాస్టల్‌తో పాటు అన్నిరకాల వసతులు కల్పిస్తారు. బట్టలు, పుస్తకాలు, కాస్మొటిక్ చార్జీలు అందించనున్నారు.

మార్చి 6 వరకు గడువు

5వ తరగతి ప్రవేశం పొందే విద్యార్థులు దరఖాస్తులను http:// tresidential. cgg. gov. in, http:// tgcet. cgg. gov. in వెబ్‌సైట్ ద్వారా మార్చి 6వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. రూ.100 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి. ఒక ఫోన్‌నెంబరుతో ఒక దరఖాస్తు మాత్రమే చేసుకోవచ్చు. వేరే వారి ఫొటోలు పెట్టి దరఖాస్తు చేస్తే వారిపై సెక్షన్ 416 ఐపీసీ 1,860 ప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకుంటారు. ఇతర సమాచారం కోసం హెల్ప్‌లైన్ నంబర్ 180042 545678 లేదా ప్రాస్పెక్టస్‌లో పేర్కొన్న సంబంధిత జిల్లా ప్రధానోపాధ్యాయులను ఫోన్‌లో సంప్రదించవచ్చు. 2022–23 విద్యా సంవత్సరంలో నాల్గో తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే అర్హులు. ప్రవేశ పరీక్షను ఏప్రిల్ 23న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అన్ని జిల్లాల్లో గుర్తించిన కేంద్రాల్లో ఉంటుంది.

పేద విద్యార్థులకు వరం

గురుకుల పాఠశాలలు పేద విద్యార్థులకు వరం. నాణ్యమైన భోజనం అందించడంతో పాటు ఇంగ్లిష్ మీడియం బోధన కావడంతో పాఠశాలల్లో ప్రవేశాలకు తీవ్ర పోటీ నెలకొంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

– ఆర్.అనంతలక్ష్మి, గురుకుల విద్యాలయాల రీజనల్ కో ఆర్డినేటర్

అదిరిపోయే మెనూ..

- వారానికి నాలుగు రోజులు కోడిగుడ్డు, ఆరు రోజులు పండ్లు.
- ఒకటో, మూడవ, ఐదవ ఆదివారం చికెన్
- రెండో, నాల్గో ఆదివారం మటన్
- ప్రతిరోజు నెయ్యి, సాయంత్రం లేదా రాత్రి భోజన సమయంలో స్నాక్స్
- ప్రతిరోజు పాలు, వారంలో కనీసం నాలుగైదు రకాల ఆకుకూరలు, ఎనిమిది రకాల కూరగాయలతో భోజనం. ప్రతీ శనివారం స్వీట్లు.

మెడికవర్‌లో అరుదైన గుండె శస్త్రచికిత్స



పేషెంట్‌తో వైద్యులు సదాశివ్ తదితరులు

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రిలో అత్యంత అరుదైన గుండె శస్త్రచికిత్సను జిల్లాలో మొట్ట మొదటి సారి విజయవంతంగా నిర్వహించినట్లు ఆసుపత్రి కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ సదాశివ్ బి తమగొండ తెలిపారు. ఆదివారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. మంచిర్యాలకు చెందిన సీహెచ్ కాంతయ్య (43)కు తీవ్రమైన గుండెనొప్పి రాగా మెడికవర్ ఆసుపత్రిలో చేర్చారు. అతడిని పరీక్షించగా హార్ట్ ఫెయిల్యూర్ అయి గుండె నుంచి పంపింగ్ నిలిచిపోయింది. అతడికి పుట్టుకతోనే గుండెకు రంధ్రం కూడా ఉన్నట్లు గుర్తించారు. దీంతో గుండెకు రక్తసరఫరా అయ్యే పెద్దనాళం కుడివైపునకు రక్తం లీకవుతూ ప్రాణాపాయ స్థితికి చేరాడు. వెంటనే అతడికి సైనస్ ఆఫ్ వాల్సల్వ అన్యూరిజం ద్వారా ఆర్ఎస్ఓవీ రిపేర్ చేసి ప్రాణాలు కాపాడినట్లు వెల్లడించారు. 5 లక్షల గుండె జబ్బు కేసుల్లో ఒకరికి మాత్రమే అత్యంత అరుదుగా ఇలాంటి క్లిష్టమైన జబ్బు వస్తుందన్నారు. ఇది ముఖ్యంగా మగవారిలోనే ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని, ఈ శస్త్రచికిత్సను పూర్తిగా ఆరోగ్యశ్రీలోనే చేసినట్లు వివరించారు. ఈ సందర్భంగా పేషెంట్ కాంతయ్య మాట్లాడుతూ.. తనకు వచ్చిన గుండె జబ్బుతో తాను బతుకుతానని కుటుంబ సభ్యులు అనుకోదని, అలాంటి స్థితి నుంచి ప్రాణాలు కాపాడిన మెడికవర్ వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ గుర్రం కిరణ్, అనెస్థెషియా డాక్టర్ ప్రత్యూష, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అక్షయ్, సిబ్బంది పాల్గొన్నారు.

బాలికను బెదిరించి.. గర్భవతిని చేసి

- ఏడాదికాలంగా కామంధుడి అఘాయిత్యం
- న్యాయం కోసం ఠాణా మెట్లెక్కిన బాధితురాలు

వీణవంక(హుజూరాబాద్): మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక (17)పై అదే గ్రామానికి చెందిన మేకల శ్రీనివాస్‌రెడ్డి(38) ఏడాది కాలంగా లైంగికదాడి చేస్తున్నాడు. ఫలితంగా ఆ బాలిక గర్భం దాల్చింది. ప్రస్తుతం ఆమె ఐదు నెలల గర్భిణి. దీంతో ఆమె న్యాయం చేయాలని ఠాణా మెట్లెక్కింది. పోలీసుల కథనం ప్రకారం.. బాలిక తల్లిదండ్రులు బతుకుదెరువు కోసం ఇతర ప్రాంతానికి వలస వెళ్లారు. ఇంట్లో బాలికతోపాటు ఆమె సోదరుడు ఉంటున్నారు. శ్రీనివాస్‌రెడ్డి ఇల్లు కూడా బాలిక ఇంటికి సమీపంలో ఉంది. దీంతో బాలికకు మాయమాటలు చెప్పి లోబర్చుకున్నాడు. తాను చెప్పినట్లు వినకుంటే కుటుంబాన్ని చంపుతానని బెదిరిస్తూ.. ఏడాదికాలంగా శారీరకంగా వాడుకున్నాడు. దీంతో సదరు బాలిక ఐదు నెలల గర్భవతి. బాధితురాలు ఆదివారం సాయంత్రం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మోసం చేసిన శ్రీనివాస్‌రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితుడిపై ఎస్సీ, ఎస్టీ, పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు. శ్రీనివాస్‌రెడ్డి అధి కార పార్టీలో కార్యకర్తగా పనిచేస్తున్నట్లు తెలుస్తోంది.

"ప్రజాపంథా'తో ఐఎఫ్‌టీయూకి సంబంధం లేదు'



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని(రామగుండం): ప్రజాపంథా పార్టీతో సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ అనుబంధ ఐఎఫ్‌టీయూ యూనియన్‌కు ఏలాంటి సంబంధం లేదని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జేవీ చలపతిరావు పేర్కొన్నారు. ఆదివారం యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. మొన్నటి వరకు సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ అనుబంధ ఐఎఫ్‌టీయూలో కొనసాగిన తోకల రమేష్, జూపాక శ్రీనివాస్, గుమ్మడి వెంకన్న ఏడాది కిందట ఏర్పాటైన ప్రజాపంథా పార్టీలో చేరారన్నారు. ప్రజాపంథా కూడా ఏడాది కిందట తమ నుంచి విడిపోయిన ఒక విభాగం అన్నారు. పార్టీలో అంతర్గత పోరాటమనేది కమ్యూనిస్టు పార్టీలో ఉంటుందన్నారు. ఈక్రమంలో ఆ ముగ్గురితో యూనియన్, పార్టీకి ఏలాంటి సంబంధం లేదన్నారు. ఆర్ఎఫ్‌సీఎల్‌లో లోడింగ్ కాంట్రాక్టు ఉద్యోగాలపై కొంతమంది సబ్ కాంట్రాక్టర్లు దళారులను ఏర్పాటు చేసుకొని రూ.కోట్లు వసూళ్లకు పాల్పడి వందల మంది నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడారన్నారు. దళారుల వద్ద ఉన్న మిగతా మొత్తాన్ని ఇప్పించాల్సిన బాధ్యత స్థానిక ఎమ్మెల్యే తీసుకోవాలన్నారు. సమస్య పరిష్కారం కోసం కలిసి ఉద్యమం చేయడానికి పార్టీలకతీతంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు కె.రాజన్న, ఐ.కృష్ణ, ఇ.నరేష్, ఎ.వెంకన్న, సీహెచ్.భూమేశ్వర్, బి.అశోక్, కె.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో కార్మికులకు రక్షణ కరువు

- ఏఐటీయూసీ కేంద్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి వైవీ రావు



మాట్లాడుతున్న వైవీ రావు

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): సింగరేణిలో పనిచేస్తున్న కార్మికులకు రక్షణ కరువైందని ఏఐటీయూసీ కేంద్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి వైవీ రావు అన్నారు. ఆదివారం ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సంస్థ సేఫ్టీ జీఎంగా ఉన్న గురువయ్య రక్షణ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. దీంతో ఆర్జీ–1,2,3లోని పలు ఏరియాల్లో విధులు నిర్వహిస్తున్న అధికారులతో పాటు కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు ప్రమాదాలకు గురై చాలా మంది ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. ఇందుకు పూర్తి బాధ్యత సింగరేణి యాజమాన్యం వహించాలన్నారు. తక్షణమే సేఫ్టీ జీఎంపై విచారణ జరిపి విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. లక్షల విలువైన డంపర్లు, షావల్‌కు లాక్‌లను వెల్డింగ్ చేసి బిగించడం సరైన పద్ధతి కాదన్నారు. సేఫ్టీ జీఎంను ఏరియా జీఎంగా నియమించకపోవడంతోనే కార్మికులపై కక్ష సాధింపుతో వారిని ఒత్తిడికి గురిచేస్తున్నారని ఆరోపించారు. గతంలో ఆయనపై ఎన్నో ఆరోపణలు ఉన్నాయని, ఇప్పటికైనా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో నాయకులు జూపాక రామ్‌చందర్, కందికట్ల సమ్మయ్య, రవి, మల్లేష్, కిరణ్, మొండయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆధిపత్య పోరులోనే ముగిసిన పదవీకాలం

- ఏడాది కాలంలో చేసింది మాత్రం శూన్యమే..
- పైగా అదనపు ఖర్చులే చేశారంటూ విమర్శలు
- ట్రస్టు బోర్డు ఏర్పాటు చేయాలంటున్న భక్తులు
- పదవీకాలం పొడిగించాలని ప్రస్తుత పాలకమండలి పైరవీలు?



కొండగట్టు ఆలయం

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు ఆంజనేయస్వామి పాలకమండలి పదవీకాలం ఆదివారంతో ముగిసింది. కాగా పాలకమండలి కొలువుదీరిన నాటి నుంచి ముగిసే వరకు ఈవోకు చైర్మన్ మధ్య వాగ్వాదాలు చోటు చేసుకున్నాయి. ఈవోపై చైర్మన్ ఫిర్యాదు చేయడం, కొన్ని సమయాల్లో ఎడమొహం పెడమొహం అన్నట్లు వ్యవహరించారు. పాలకమండలి సభ్యుల ఆధిపత్య పోరును ఒకరికంటే ఒకరు ఎక్కువ అన్నట్లు పలు టెండర్లలో బహిరంగంగానే బయటపెట్టారు. అర్చకులు, అధికారుల తీరుపై పాలక మండలి సభ్యులు దేవాదాయ కమిషనర్‌కు ఫిర్యాదు చేయడం ఇలా తమ పదవికాలం మొత్తం ఎవరికి వారే ఇష్టమొచ్చినట్లు వ్యవహరించారు. పాలకమండలి సభ్యులు మధ్య సఖ్యత కొరవడడంతో ఇదే అదునుగా భావించిన అధికారులు నిబంధనలు మరిచి ఇష్టానుసారంగా ఖర్చులు పెట్టారనే ఆరోపణలు వచ్చాయి.

గతేడాది ఫిబ్రవరి 12న..

కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయ ట్రస్టు బోర్డు గతేడాది ఫిబ్రవరి 12న కొలువు దీరగా.. ఈ నెల 12తో పదవీకాలం ముగిసింది. 14 మంది సభ్యులు గన్ను శ్రీనివాస్‌రెడ్డి, గొల్లపల్లి శ్రవన్‌కుమార్, పులకం నర్సయ్య, ఉప్పుల గంగాధర్, బండపెల్లి యాదగిరి, దాసరి రాజేందర్‌రెడ్డి, జన్న సురేందర్, పోచమల్ల ప్రవీణ్‌కుమార్, కొంక నర్సయ్య, బొడ్ల సతీశ్, వొల్లాల లింగాగౌడ్, బెంద్రం మాధవరెడ్డి, ముద్దం రవి, ఎక్స్ ఆఫీషియో సభ్యుడిగా ప్రధాన అర్చకుడు తిరుకోవెల జితేంద్రప్రసాద్ పదవీకాలం పూర్తయింది. ప్రస్తుతం చైర్మన్‌గా ఉన్న మారుతిస్వామి మరో ఏడాది పాటు కొనసాగనున్నారు.

ఎవరికివారే ఇష్టారాజ్యంగా..

ఆంజనేయస్వామి ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులుగా తమకు అవకాశం ఇవ్వాలని చాలామంది స్థానిక ఎమ్మెల్యే, ఇతర నాయకులను సంప్రదించగా పలువురికి అవకాశం దక్కింది. కొలువుదీరిన పాలకమండలి సభ్యులు ఆలయంలో భక్తుల సౌకర్యార్థం సేవ చేయాలి. అవినీతి జరగకుండా, వృథా ఖర్చులను అరికట్టాలి. అయితే పాలక మండలి పదవీ ద్వారా తమ కుటుంబ సభ్యులు, తమ దగ్గరి వ్యక్తులు, అనుయాయులకు దర్శనాలు చేయించడం, ఇష్టారాజ్యంగా కండువాలతో సన్మానించడం, లడ్డూ ప్రసాదాలు అందించడం మాత్రమే చేశారనే నిందలు మూటగట్టుకున్నారు. అలాగే కొంతమంది సభ్యుల ద్వారా లక్షల రూపాయలు వృథా అయ్యాయని, మరోసారి ఆలయ అభివృద్ధికి మాత్రమే దోహదపడే సభ్యులకు మాత్రమే పదవి కట్టబెట్టలాని అంజన్న భక్తులు పేర్కొంటున్నారు.

పదవీకాలం పెంపునకు పైరవీలు?

నిన్నటి వరకు పాలక మండలి సభ్యులుగా కొనసాగిన సభ్యులు మళ్లీ తమనే కొనసాగించాలని స్థానిక ఎమ్మెల్యేను కలిసినట్లు సమాచారం. అయితే సదరు సభ్యుల్లో కొంత మార్పులు, చేర్పులు చేద్దామనుకున్నా మొత్తం సభ్యులను మాత్రమే మార్పు చేసే అవకాశం ఉంది. కాగా ఆలయానికి రూ.100 కోట్ల నిధులు మంజూరైన నేపథ్యంలో ప్రస్తుతం పాలక మండలికి నోటిఫికేషన్ వస్తే చాలా మంది ఇతర ప్రాంతాల నుంచి మంత్రుల పైరవీతో వచ్చే అవకాశాలున్నాయి. దీంతో మళ్లీ పాతవారికే గడువు పెంచేందుకు కసరత్తులు జరుగుతున్నట్లు సమాచారం. ఏడాదిపాటు ఎలాంటి అభివృద్ధికి దోహదపడని వీరికే గడువు పెంచుతానా.. నోటిఫికేషన్ విడుదల చేసి కొత్తవారికి అవకాశం ఇస్తారా వేచిచూడాల్సిందే.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

1) Iconic Infra(Hyd) సాగర్ హైవే ఫేసింగ్ యాచారం DTCP ప్లాట్లు Nr. ఫార్మాసిటీ & 85ఎ॥ HMDA లేఅవుట్ విజయవాడ హైవే@ చౌటుప్పల్ RRR ప్రక్కన 9154102338 [HA-10737]

SERVICES

వ్యక్తిగత, వ్యాపారం, వ్యవసాయ ఆస్తి, టేక్‌ఓవర్ లోన్, NPA కేసులు తక్కువ సిబిల్ స్కోర్ కూడా రుణానికి వర్తిస్తాయి. సంప్రదించండి: 9463846068. [T-1745]

ఆధార్‌కార్డ్, పాన్‌కార్డ్, కలిగి స్వంత ఇల్లు ఉన్న ప్రతి ఒక్కరికి 1 లక్ష నుండి 10 లక్షల వరకు ఋణాలు ఇవ్వబడును. సంప్ర: 9014653011, 9391225462 [H-793602]

సిబిల్‌తో పనిలేదు,గ్యారంటారులు అవసరం లేదు, ప్రభుత్వ ఉద్యోగులకు తక్కువ వడ్డీతో పర్సనల్,బిజినెస్,ప్రాపర్టీ,వ్యవసాయంలోన్లు ఇవ్వబడును. 9988199941. [T-1753]

ASTROLOGY

కేరళ భద్రకాళి మాంత్రిక జ్యోతిష్యం: మీ ఎటువంటి గుప్త కఠిన సమస్యలకైనా 2 రోజులలో శాశ్వత పరిష్కారం. స్త్రీ, పురుష వశీకరణ గ్యారంటీ. సంప్ర॥ పం॥ వామన్ భట్ 6304163239. [W-775816]

WANTED

ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-779895]

మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. 9573633520, 9059633520 [M-1190572]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact: 9951602933, 9951602824

వేర్వేరు కారణాలతో నలుగురి బలవన్మరణం

ఉమ్మడి జిల్లా పరిధిలో వేర్వేరు కారణాలతో నలుగురు ఆత్మహత్య చేసుకున్నారు. వివరాలు..

ఉద్యోగం రాలేదని మానసిక వేధనతో..

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం తుర్కలమద్దికుంట గ్రామానికి చెందిన లెక్కల వెంకటేశ్ (28) తనకు ఉద్యో గం రావడం లేదన్న మానసిక వేదనతో ఆదివారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, కుటుంబీకుల వివరాలు.. డిగ్రీ వరకు చదివిన వెంకటేశ్ కుటుంబపోషణ భారం కాకుండా ఏదైనా ఓ ఉద్యోగం చేయాలని ప్రయత్నించి విఫలమయ్యాడు. గతంలోనూ ఓ సారి క్రిమిసంహారక మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని గ్రామస్తులు తెలిపారు. నాలుగైదు నెలలు గా బొంపల్లిలోని పెట్రోల్‌పంపులో పనిచేస్తున్న వెంకటేశ్ ఆదివారం ఇంటికి వచ్చి భార్య కావ్యను భోజనం తేవాలంటూ చెప్పి.. భోజనం తెచ్చేలోగా ఉరేసుకుని అఘాయిత్యానికి పాల్పడ్డాడు. మృతుడికి భార్య కావ్యతో పాటు పది నె లల వయసున్న కుమారుడున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మద్యానికి బానిసై ఒకరు..

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం పోరండ్ల గ్రామానికి చెందిన కోరె ధర్మరాజు(52) అనే వ్యక్తి శనివారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కొంతకాలంగా మానసికంగా ఇబ్బంది పడుతున్న ధర్మరాజు మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య జమున ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో..

వేములవాడఅర్బన్: వేములవాడలోని మార్కెట్ ఏరియాలో కవ్వాల విక్రమ్ (35) అనే యువకుడు ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు. వేములవాడలో టైలరింగ్ చేసే విక్రమ్ ఇటీవల ఆర్థిక ఇబ్బందులతో మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలోనే జీవితంపై విరక్తి చెంది, ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకున్నాడు. బంధువుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వేములవాడ టౌన్ సీఐ వెంకటేశ్ తెలిపారు.


కుటుంబ పోషణ భారమై..

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): కుటుంబ పోషణ భారమైన ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని గొల్లపల్లిలో ఆదివారం విషాదం నింపింది. ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల జిల్లా మాటూరు మండలం ద్రోనాదుల గ్రామానికి చెందిన గుంజి రవి(36) గొల్లపల్లిలో కొన్నాళ్లుగా వివిధ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో ఇటీవల ఆర్థిక ఇబ్బందులు పెరిగాయి. పనులు సరిగ్గా దొరక్కపోవడంతో కుటుంబ పోషణ భారమైంది. ఈక్రమంలో మనోవేదనకు గురై ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు.

చికిత్స పొందుతూ ఒకరు మృతి

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ కోతిరాంపూర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ ఆదివారం చనిపోయాడు. వన్‌టౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. కరీంనగర్ కార్పొరేషన్‌లో విలీనమైన సదాశివపల్లి గ్రామానికి చెందిన జార్తి సంపత్(41) జనవరి 31న సదాశివపల్లి నుంచి కరీంనగర్ వస్తున్నాడు. కోతిరాంపూర్ వద్ద ముందుగా వెళ్తున్న కారు సడెన్‌గా బ్రేక్ వేయడంతో వెనక బైక్‌పై వెళ్తున్న సంపత్ కారును ఢీకొట్టాడు. ఈ ఘటనలో సంపత్ తీవ్రంగా గాయపడ్డాడు. కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం చనిపోయాడు. మృతుడి భార్య కనకలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు



గాయపడిన సతీశ్ కుమార్

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): సుల్తానాబాద్ పరిధిలోని రైస్‌మిల్ అసోసియేషన్ వద్ద రాజీవ్ రహదారిపై ఆదివారం ద్విచక్ర వాహనాన్ని కారు ఢీ కొన్న సంఘటనలో ద్విచక్రవాహనదారుడు సతీశ్ కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోదావరిఖనికి చెందిన సతీశ్ కుమార్ రైస్‌మిల్ అసోసియేషన్ ముందు గల వేబ్రిడ్జి నుంచి ద్విచక్ర వాహనంపై సుల్తానాబాద్‌కు యూటర్న్ తీసుకుంటున్న క్రమంలో కరీంనగర్‌కు వెళ్తున్న కారు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలైనాయి. దీంతో బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్స్ వెంటనే 108లో కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు.


ట్రాక్టర్‌ను ఢీకొట్టి అంబులెన్స్ బోల్తా

- నలుగురికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న అంబులెన్స్

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని గోపాల్‌పూర్ చౌరస్తాలో ఆదివారం తెల్లవారుజామున ఓ ట్రాక్టర్‌ను అంబులెన్స్ ఢీకొట్టి, బోల్తా పడింది. ఈ ఘటనలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. ఆదివారం తెల్లవారుజామున గోదావరిఖనికి చెందిన వ్యక్తికి గుండెపోటు రావడంతో అంబులెన్స్‌లో కరీంనగర్ తరలిస్తున్నారు. ఈ క్రమంలో గోపాల్‌పూర్ నుంచి రోడ్డు దాటి కరీంనగర్ వైపు వస్తున్న ట్రాక్టర్‌ను వేగంగా ఢీకొట్టి, బోల్తా పడింది. ప్రమాదంలో బాధితుడు, అతనితో ఉన్న ఇద్దరికి, డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. బ్లూకోల్ట్స్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని, బాధితులను కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని కరీంనగర్ రూరల్ ఎస్సై అశోక్ తెలిపారు.



చిట్టి చిలుకమ్మ.. కల్లు కావాలా..!

చిలుకమ్మ దాహార్తితో తాటిచెట్టు పైకి వచ్చి వాలింది. అటూ ఇటూ చూస్తూ ఎవరూ లేరులే అనుకున్నదేమో మెల్లిగా బొట్టుబొట్టుగా వస్తూ కుండలో పడే తాటికల్లు చుక్కల్నీ ఆస్వాదిస్తూ సంబరపడింది. ఈ దృశ్యాన్ని పెద్దపల్లి జిల్లా బసంత్‌నగర్ శివారులో 'సాక్షి' బంధించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

ఉమ్మడి కుటుంబం జీవితంలో ఆనందం

- నలుగురు అన్నదమ్ములు సహా 16 మంది కుటుంబసభ్యులు ఒకేచోట జీవనం
- పిల్లల చదువులు, ఇతర ఏ ఖర్చులైనా ఉమ్మడిగానే..
- ఆదర్శం.. పెరుక రాజయ్య కుటుంబం


పెరుక రాజయ్య కుటుంబసభ్యులు

కరీంనగర్ అర్బన్: వారు నలుగురు అన్నదమ్ములు.. వీరిలో ముగ్గురు ఆర్టీసీ ఉద్యోగులు కావడం విశేషం. అందరికీ వివాహాలు జరిగి, పిల్లలున్నా ఉమ్మడి కుటుంబంగా ఉంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు. కరీంనగర్‌లోని గణేశ్‌నగర్‌లో స్థిరపడిన పెరుక రాజయ్య–లక్ష్మీదేవి దంపతుల స్వస్థలం తిమ్మాపూర్ మండలంలోని పొలంపల్లి గ్రామం. వీరికి పుష్పలత, నర్సయ్య, సత్యనారాయణ, రవీందర్, విజయ, సంతోష్‌లు సంతానం. 20 ఎకరాల భూమి ఉండగా వ్యవసాయం చేస్తూ పిల్లలను పోషించారు. రాజయ్యకు వాహనాలంటే మక్కువ. ఆయన ట్రాక్టర్‌తో పొలం దున్నుతుంటే తీరిక వేళల్లో కుమారులందరూ డ్రైవింగ్ నేర్చుకున్నారు. డిగ్రీ, పీజీలు పూర్తి చేసినా డ్రైవింగ్‌నే ఉద్యోగంగా ఎంచుకోవాలని భావించారు. మొదట నర్సయ్య అగ్నిమాపక శాఖలో డ్రైవర్ ఉద్యోగం సాధించారు. స్నేహితుల ప్రభావంతో డీఎస్సీ ద్వారా టీచర్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. మిగిలిన ముగ్గురు సోదరులు తండ్రి నేర్పిన డ్రైవింగ్ వృత్తినే ఇష్టపడి, రెండేళ్ల వ్యవధిలో ఒక్కొక్కరుగా ఆర్టీసీలో చేరారు. సత్యనారాయణ కరీంనగర్–1 డిపోలో విధులు నిర్వహిస్తుండగా రవీందర్ ఆర్‌ఎం కార్యాలయంలో, సంతోష్ కరీంనగర్–2 డిపోలో ఉద్యోగం చేస్తున్నారు.

తండ్రి, పెద్దన్న మాటే వేదం..

తల్లిదండ్రులతో కలిపి మొత్తం 16 మంది కుటుంబసభ్యులు కాగా అందరూ కలిసే ఉంటూ జీవితాన్ని ఆనందంగా గడుపుతున్నారు. పిల్లల చదువులైనా, ఇతరత్రా ఏ ఖర్చులైనా ఉమ్మడిగానే చేస్తున్నారు. తండ్రి రాజయ్య, పెద్దన్న నర్సయ్య మాటే వారికి వేదం. స్వగ్రామంలో ఉన్న భూమిలో వ్యవసాయం ద్వారా వచ్చే ఆదాయాన్ని ఎవరికెంతని కాకుండా అవసరాలను బట్టి ఖర్చు పెడుతున్నారు. యోగక్షేమాలు చర్చించుకోవడం, ఆహ్లాదకర వాతావరణంలో గడపడం తమకు ఇష్టమని చెబుతున్నారు. పిల్లలకు కుటుంబ విలువలు నేర్పడం, అనుబంధాలను వివరించడం చేస్తున్నారు. ఎవరికి ఏ కష్టమొచ్చినా అంతా కలిసికట్టుగా ముందుకెళ్తున్నారు.

కుటుంబాలను వదులుకోవద్దు



ఎక్కడో ఉండి, కొన్నేళ్లకు కలుసుకొని, మళ్లీ వెళ్లేటప్పుడు బాధపడే కన్నా ఒకేచోట ఉండటం ఉత్తమం. మా సోదరులందరం కలిసి ఉండాలన్నది మా కోరిక. కాలాన్ని బట్టి మారాలి గానీ కుటుంబాలను వదులుకోవద్దు.

– నర్సయ్య, హెచ్‌ఎం

ఆప్యాయంగా మాట్లాడాలి



పర్యటనలైనా, శుభకార్యాలకైనా మా కుటుంబసభ్యులందరం కలిసే వెళ్తాం. ఎప్పుడైనా ఎవరైనా మిస్సయితే చాలా బాధ పడతాం. అందరూ కలిసే తినాలి. అమ్మానాన్నతో ఆప్యాయంగా మాట్లాడాలి. ఇది చాలు జీవితానికి.

– సత్యనారాయణ, ఆర్టీసీ డ్రైవర్

వ్యక్తిత్వం ముఖ్యం



జీవితంలో బతకడానికి డబ్బు కావాలి. కానీ డబ్బే శాశ్వతం అనుకుంటే మానసిక ప్రశాంతత ఎండమావే. కుటుంబానికి ప్రాధాన్యమిస్తే అన్ని రకాలుగా వృద్ధి చెందినట్లే. నాన్న, అన్నలు చెప్పే మాటలే మాకు మార్గదర్శకత్వం.

– రవీందర్, ఆర్టీసీ డ్రైవర్

సంతోషంగా ఉంది



అన్నయ్యలు ఆర్టీసీలో ఉద్యోగం చేస్తుండటంతో నాకు అదే సంస్థలో చేరాలనిపించింది. చిన్నతనంలో నాన్న ట్రాక్టర్ నడపడం నేర్పించారు. అదే మాకు ఉపాధిగా మారింది. కుటుంబసభ్యులందరితో కలిసుండటం సంతోషంగా ఉంది.

– సంతోష్, ఆర్టీసీ డ్రైవర్

ప్రేమ కానుక.. మనసు దోచెనిక

- ప్రేమికుల దినోత్సవం సందర్భంగా మార్కెట్లోకి వెరైటీ బహుమతులు
- ఖర్చుకు చూడకుండా కొనుగోలు చేస్తున్న ప్రేమికులు







విద్యానగర్: ఫిబ్రవరి 14.. ప్రేమికుల రోజు.. ఒకరికొకరు తమ ప్రేమను వ్యక్తం చేసే సందర్భం. ప్రేమలో ఉన్నవారు ఆరోజు ఎప్పటికీ గుర్తుండిపోయేలా ప్లాన్ చేసుకుంటున్నారు. తమ మనసులో మాట చెప్పేందుకు ఎదురుచూస్తున్నారు. మదిలో ప్రేమ సందేశాలను ఇచ్చిపుచ్చుకునేందుకు మార్కెట్లో ఎన్నో వస్తువులు అందుబాటులోకి వచ్చాయి. కేక్‌లు ప్రత్యేక డిజైన్లలో ఆకట్టుకుంటున్నాయి. ఆయా దుకాణాలు యువతీ యువకులతో కళకళలాడుతున్నాయి. వారు మెచ్చిన, నచ్చిన ఫొటోలు ఫ్రేమ్‌లో బంధించి ఇవ్వడంతోపాటు లవర్స్ స్పెషల్ కీచైన్‌లు, టుడే అండ్ టుమారో, జస్ట్ ఫర్ యూ అనే హార్ట్ పిల్లోస్‌పై ఆసక్తి చూపుతున్నారు. అలాగే ప్రేమికుల కోసం ఎన్నో రకాల విదేశీ చాక్లెట్లు నోరూరిస్తున్నాయి. గతంలో కంటే ఈసారి వెరైటీ గిఫ్ట్‌లు అందుబాటులో ఉన్నాయని వ్యాపారులు అంటున్నారు. ముఖ్యంగా చైనా క్రిస్టల్‌తో తయారైన ఉత్పత్తులు యువతను ఆకర్షిస్తున్నాయి. ఇష్టమైన వారి ప్రేమను పొందేందుకు కానుకలు మంచి సాధనాలుగా పని చేస్తాయని నమ్మేవాళ్లు వాటిని కొనుగోలు చేస్తున్నారు.

ఏటా ఒక బహుమతి ఇస్తా



మాది ప్రేమ వివాహం. ఏటా ప్రేమికుల దినోత్సవం రోజు తప్పనిసరిగా మా వారికి ఏదో ఒక బహుమతి ఇస్తా. ఈసారి అది ప్రత్యేకంగా ఉండాలని షాపింగ్ చేస్తున్నా. ప్రేమ జీవితంలో భాగం కావాలి.

– తాటి అమల పవన్, సవరన్ స్ట్రీట్

ప్రేమను ఇచ్చిపుచ్చుకోవాలి



బహుమతుల కన్నా ప్రేమను ఇచ్చిపుచ్చుకుంటే అది జీవితాంతం చెదిరిపోకుండా ఉంటుంది. నాకు కాబోయే శ్రీవారి కోసం ఈ సంవత్సరం ప్రత్యేక బహుమతి కొనుగోలు చేసి, పంపిస్తున్నాను.

– ఉపాధ్యాయుల రుత్విక, సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని, మంకమ్మతోట

అందుబాటులో లవ్ గిఫ్ట్స్..



ఈసారి మా స్టోర్‌లో రూ.100 నుంచి రూ.2 వేల విలువైన లవ్ గిఫ్ట్స్ అందుబాటులో ఉంచాం. ప్రేమికులు రేటు ఆలోచించకుండా అందమైన బహుమతులు కొనుగోలు చేస్తున్నారు.

– ఈశ్వర్, గణేశ్ జనరల్ స్టోర్, శాస్త్రీరోడ్

లవ్ సింబల్స్ ఉన్నవే ఎక్కువ..



లవ్ సింబల్స్ ఉన్న వస్తువులు, బొమ్మల విక్రయాలు ఎక్కువగా ఉన్నాయి. గతంలో మంచి కొటేషన్లతో గ్రీటింగ్ కార్డులు వచ్చేవి. ఇప్పుడు రావడం లేదు. ఇంటర్నెట్ నుంచి తీసుకొని, ఇచ్చుకుంటున్నారు.

– ఉప్పుగల్ల మురళీకృష్ణ, వాణిశ్రీ బుక్స్, స్టేషనరీ, 7హిల్స్

క్లుప్తంగా

నేడు అభివృద్ధి పనులపై మంత్రి సమావేశం

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ నియోజకవర్గ అభివృద్ధి పనులపై సోమవారం ఉదయం 11 గంటలకు కలెక్టరేట్ ఆడిటోరియంలో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులతో రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్ ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులందరూ సకాలంలో హాజరు కావాలని ఎంపీడీవో జగన్మోహన్‌రెడ్డి కోరారు.

శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు


స్వామివారి కల్యాణానికి హాజరైన భక్తులు

కరీంనగర్ కల్చరల్: కరీంనగర్‌లోని విద్యానగర్ 39వ డివిజన్ పరిధి శ్రీవేంకటేశ్వరస్వామి స్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు నాలుగు రోజులుగా ఘనంగా జరుగుతున్నాయి. స్థానిక పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో పద్మశాలీ కులస్తులు ఆదివారం పట్టు వస్త్రాలు, పుస్తె, మెట్టెలు, తలంబ్రాలు సమర్పించారు. స్వామివారికి 17వ డివిజన్ నుంచి ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. కల్యాణం ఘనంగా జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

శ్రీమార్కండేయ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



కొత్తపల్లి: మండలంలోని బావుపేటలో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన శ్రీ శివభక్త మార్కండేయస్వామి ఆలయంలో స్వామివారి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ ఆలయంలో మూడు రోజులుగా ప్రత్యేక పూజలు చేస్తున్నారు. పద్మశాలీ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు వాసాల రమేశ్, అనుమండ్ల సత్యనారాయణ, ఎంపీపీ పిల్లి శ్రీలత, సర్పంచ్ శాంత, ఏఎంసీ చైర్మన్ రెడ్డవేణి మధు, పద్మశాలీ సంఘం మండల అధ్యక్షుడు గాలి పెల్లి రవీందర్, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురిని శాలువాలతో సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు.

కోతల్లేని కరెంట్ ఇవ్వాలి

జమ్మికుంట(హుజూరాబాద్): రాష్ట్ర ప్రభుత్వం రైతాంగానికి 24 గంటల విద్యుత్ అందిస్తున్నామని చెబుతున్నా, కరెంట్ కోతలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు చెల్పూరి రాములు ఒక ప్రకటనలో అన్నారు. కోతల్లేని కరెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

భక్తిశ్రద్ధలతో గంగామాత కల్యాణం


బోనాలు సమర్పిస్తున్న మహిళలు


అమ్మవారికి పూజ చేస్తున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ కల్చరల్: తెలంగాణ బెస్త, గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో మానేరు డ్యాం వద్ద గల గంగామాత ఆలయంలో ఆదివారం బోనాలు, అమ్మవారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. జరిగాయి. ముఖ్య అతిథులుగా హాజరైన ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, కరీంనగర్ మేయర్ యాదగిరి సునీల్‌రావు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్పొరేటర్లు ఆకుల నర్సయ్య, చొప్పరి జయశ్రీ, దిండిగాల మహేశ్, పెద్దపల్లి జితేందర్, ఐలేందర్ యాదవ్, తోట రాములు, సంఘం జిల్లా అధ్యక్ష, కోశాధికారులు దేశ శివకుమార్, డోలి రాజన్న, పట్టణ అధ్యక్షుడు కూర ధర్మరాజు, ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మీనారాయణ, ఆనంద్, కోశాధికారి సత్యనారాయణ తదితరులున్నారు.

ముస్తాబైన శ్రీఅమృతేశ్వర మహాశివాలయం

- రేపటి నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు
- 18న శివపార్వతుల కల్యాణం


శ్రీఅమృతేశ్వర మహాశివాలయం

కొత్తపల్లి: రేకుర్తి ద్వారకనగర్ శ్రీ అమృతేశ్వర మహాశివాలయం మహాశివరాత్రి ఉత్సవాలను ముస్తాబైంది. 2017 నుంచి తాత్కాలిక ఆలయంలో వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. అయితే శాశ్వత ఆలయం నిర్మించాలని భావించిన ఆలయ కమిటీ సభ్యులు 2021లో పనులు ప్రారంభించారు. 70 మంది దాతలు వారికి తోచిన రీతిలో విరాళం అందించగా స్థానిక కార్పొరేటర్ సుదగోని మాధవికృష్ణ గౌడ్ రూ.21,11,116 ఇచ్చి, ఆలయ నిర్మాణ పనులు వేగంగా జరిగేలా చొరవ చూపారు. అలాగే ఇక్కడ మౌలిక వసతుల కల్పనకు కరీంనగర్ నగర పాలక సంస్థ రూ.19.50 లక్షలు మంజూరు చేయగా పనులు కొనసాగుతున్నాయి. కోరిన కోర్కెలు నెరవేరుతుండటంతో శ్రీఅమృతేశ్వరుని దర్శనానికి ఈసారి భక్తుల తాకిడి పెరిగే అవకాశం ఉందని ఆలయ కమిటీ అంచనా వేస్తోంది.

ఈ నెల 19 వరకు కార్యక్రమాలు

మంగళవారం నుంచి ఈ నెల 19వ తేదీ వరకు యంత్ర, విగ్రహ, ప్రతిష్ఠ, కల్యాణ మహోత్సవం, అన్నదాన కార్యక్రమాలు జరపనున్నారు. శివాలయంలో ఉత్సవాల నిర్వహణకు ఆలయ కమిటీ వారు ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యేలా కార్పొరేటర్ ఆధ్వర్యంలో ప్రచారం చేపట్టడంతోపాటు ప్రత్యేకంగా ఆహ్వాన పత్రాలు అందిస్తున్నారు.

ప్రజాప్రస్థానం పాదయాత్రలో జిల్లా నాయకులు


షర్మిలతో నడుస్తున్న కుమార్, నాయకులు

కొత్తపల్లి: వైఎస్సార్‌టీపీ అధినేత్రి షర్మిల ఆదివారం జనగామలో చేపట్టిన ప్రజాప్రస్థానం పాదయాత్రలో జిల్లా నాయకులు పాల్గొన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు అక్కనపల్లి కుమార్, కరీంనగర్ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ వరాల శ్రీనివాస్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఎండీ.సలీం, మహిళా అధ్యక్షురాలు వెన్నం రైతారెడ్డి ఉన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


అభినందిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

హుజూరాబాద్: కరీంనగర్‌లో ఇటీవల గుజురియా కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో హుజూరాబాద్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి, మెడల్స్ సాధించినట్లు కరాటే మాస్టర్ ఎస్కే.జలీల్ తెలిపారు. పోటీల్లో ఏడుగురు విద్యార్థులు పాల్గొనగా కట్టాస్, స్పారింగ్ విభాగాల్లో ప్రతిభ కనబర్చి గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించారన్నారు. విద్యార్థులను ప్రజాప్రతినిధులు, అధికారులు ఆదివారం అభినందించారు.

'స్వార్థ రాజకీయాల కోసమే బీఆర్‌ఎస్'


మాట్లాడుతున్న శ్రీనివాస్

కరీంనగర్‌టౌన్: 60వ డివిజన్ జ్యోతినగర్‌లోని హనుమాన్ చౌరస్తాలో ఆదివారం సాయంత్రం బీజేపీ స్ట్రీట్ కార్నర్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పార్టీ అసెంబ్లీ కన్వీనర్ దుబాల శ్రీనివాస్ మాట్లాడుతూ.. టీఆర్‌ఎస్ పార్టీ తెలంగాణ అమరవీరుల త్యాగాలను, ఉద్యమ ఆకాంక్షలను విస్మరించి, స్వార్థ రాజకీయాల కోసమే బీఆర్‌ఎస్‌గా ఆవిర్భవించిందని ఆరోపించారు. టీఆర్‌ఎస్‌తో తెలంగాణను ఉద్ధరించనోళ్లు.. బీఆర్‌ఎస్‌తో దేశాన్ని ఉద్ధరిస్తామనడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. బీఆర్‌ఎస్ ఏర్పాటుతో సీఎం కేసీఆర్‌కు, తెలంగాణ రాష్ట్రానికి ఉన్న బంధం తెగిపోయిందని అన్నారు. రాష్ట్రంలో రాబోయేది బీజేపీ సర్కారేనని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఇంటింటికీ వెళ్లి, ప్రజలకు వివరించాలని సూచించారు. నాయకులు మంతెన కిరణ్, జానపట్ల స్వామి, శానగొండ శ్రీనివాస్, తణుకు సాయి, పుల్లెల రమేశ్, స్థానికులు పాల్గొన్నారు.

జోరుగా రేషన్ బియ్యం దందా


ద్విచక్రవాహనాలపై బియ్యం తరలిస్తున్న దృశ్యం

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని పలు గ్రామాల్లో రేషన్ బియ్యం దందా జోరుగా సాగుతోంది. రేషన్ దుకాణాల్లో ప్రతినెలా 1 నుంచి 15వ తేదీ వరకు లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేస్తుండగా దళారులు గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ కిలోకు రూ.10 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. ప్రధానంగా దుబ్బపల్లి, తీగలగుట్టపల్లి, రేకుర్తి, దుర్శేడ్, గర్రెపల్లి తదితర ప్రాంతాలకు చెందినవారు ద్విచక్రవాహనాలు, ఆటోల్లో తిరుగుతూ బియ్యం కొని, రహస్య ప్రాంతాల్లో నిల్వ చేస్తున్నారు. కరీంనగర్, సుల్తానాబాద్, పెద్దపల్లి ప్రాంతాలకు చెందిన వ్యాపారులకు కిలోకు రూ.12 నుంచి రూ.14 వరకు విక్రయిస్తున్నారు.

పట్టించుకోని అధికారులు..

రేషన్ బియ్యం కొనుగోలు చేసిన దళారులు ఆదివారం రెండు ద్విచక్రవాహనాలపై బియ్యం బస్తాలతో చెర్లభూత్కూర్ రోడ్డులో దర్జాగా వెళ్లిపోయారు. పోలీసులు, సివిల్ సప్లై అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తుండటం వల్లే పాత ఇనుప సామగ్రి, న్యూస్ పేపర్లు, ప్లాస్టిక్ సీసాలు కొనుగోలు చేసిన వ్యాపారులు ప్రస్తుతం రేషన్ బియ్యం కొనుగోలు చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అందుబాటులోకి డ్రోన్ స్ప్రేయర్లు

- ఎకరానికి అద్దె రూ.500



కరీంనగర్‌రూరల్: పంటలపై రసాయన ఎరువులు పిచికారీ చేసేందుకు రైతులు డ్రోన్ స్ప్రేయర్లు వాడుతున్నారు. కూలీల కొరత తీరడం, సమయం ఆదా అవుతుండటం, రైతులకు శారీరక శ్రమ తగ్గుతుండటంతో వాటివైపు మొగ్గు చూపుతున్నారు. యాసంగి సీజన్ వరి పంటకు అగ్గితెగులు, సల్ఫైడ్, జింక్ లోపం తదితర తెగుళ్లు ఆశించడంతో పలువురు అన్నదాతలు పెద్ద ఎత్తున రసాయన మందులను పిచికారీ చేస్తున్నారు. అయితే సాధారణ, పవర్ స్ప్రేయర్లతో వారిపై ఆర్థిక భారం పడుతోంది. ప్రత్యామ్నాయంగా మార్కెట్‌లోకి డ్రోన్ స్ప్రేయర్లు అందుబాటులోకి వచ్చాయి.

10 నుంచి 15 నిమిషాల్లో పిచికారీ..

కరీంనగర్‌కు చెందిన ఎక్సెల్ అగ్రి సొల్యూషన్స్‌లో డ్రోన్ స్ప్రేయర్లను ఎకరానికి రూ.500 చొప్పున అద్దెకు ఇస్తున్నారు. రైతులు సంప్రదిస్తే కంపెనీ ప్రతినిధులు వచ్చి, డ్రోన్ స్ప్రేయర్‌తో పంటలపై రసాయన మందు పిచికారీ చేస్తారు. 10 నుంచి 15 నిమిషాల వ్యవధిలో ఎకరం పంటపై స్ప్రే చేసే అవకాశం ఉంది. ఆదివారం కరీంనగర్ మండలంలోని మొగ్దుంపూర్‌కు చెందిన రైతు పడాల తిరుపతి మూడెకరాల్లో డ్రోన్ స్ప్రేయర్‌తో రసాయన మందు పిచికారీ చేయించాడు. దీన్ని గ్రామానికి చెందిన పలువురు రైతులు ప్రత్యక్షంగా చూశారు. డ్రోన్‌తో మందు పిచికారీ చేసే విధానం, కలిగే ప్రయోజనాలపై కంపెనీ ప్రతినిధులు రైతులకు వివరించారు.

పోచమ్మతల్లికి బోనం, ఎదురు పట్నం


పట్నం వేస్తున్న బైండ్ల పూజారులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని చెర్లభూత్కూర్‌లో పోచమ్మ, బొడ్రాయి, భూలక్ష్మి, మహాలక్ష్మి దేవతల విగ్రహ ప్రతిష్ఠ చేసి, ఏడాది పూర్తయిన సందర్భంగా ఆదివారం పోచమ్మతల్లికి బోనం తీసి, ఎదురు పట్నం వేశారు. ముందుగా బైండ్ల పూజారులు బొడ్రాయి ఎదుట పట్నం వేశారు. అనంతరం పోచమ్మ దేవాలయంలో ఎదురు పట్నం వేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. డప్పుచప్పుళ్ల మధ్య మహిళలు బోనాలతో ఊరేగింపుగా తరలివచ్చి, మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచు దబ్బెట రమణారెడ్డి, ఉపసర్పంచు చిట్కూరి శేఖర్, ఎంపీటీసీ సభ్యుడు బుర్ర తిరుపతిగౌడ్, కరీంనగర్ సింగిల్‌విండో చైర్మన్ పెండ్యాల శ్యాంసుందర్‌రెడ్డి, వార్డుసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

25, 26 తేదీల్లో ఎంఐఎం జాతీయ సదస్సు


మాట్లాడుతున్న గులాం అహ్మద్ హుస్సేన్

విద్యానగర్: ముంబయిలో ఈ నెల 25, 26 తేదీల్లో జరిగే ఎంఐఎం జాతీయ సదస్సును విజయవంతం చేయాలని ఆ పార్టీ కరీంనగర్ నగర అధ్యక్షుడు, తెలంగాణ హజ్ కమిటీ సభ్యుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ పిలుపునిచ్చారు. ఆదివారం కరీంనగర్‌లోని ఎంఐఎం కార్యాలయంలో పార్టీ కార్పొరేటర్లతో ఆయన సమావేశమయ్యారు. ముంబయిలో జరిగే సమావేశానికి పార్టీకి చెందిన సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ సభ్యులు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, ఎంపీ, ఎమ్మెల్యేలు, జిల్లా, నగర కమిటీల బాధ్యులు హాజరవుతారని పేర్కొన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ఎంఐఎం కౌన్సిలర్లు, కార్పొరేటర్లు హాజరు కావాలన్నారు. రాష్ట్రంలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో 50 స్థానాల్లో అభ్యర్థులను నిలబెట్టేందుకు పార్టీ సన్నాహాలు చేస్తోందన్నారు. రానున్న కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో పార్టీ తరఫున 35 డివిజన్లలో అభ్యర్థుల గెలుపునకు కృషి చేసేలా డివిజన్ సందర్శన కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. సమావేశంలో కార్పొరేటర్లు గౌసియా బేగం, జహెరాబాను, షాకిరా అంజుమ్, ఇఫ్రా తరీన్, కో–ఆప్షన్ సభ్యురాలు రాఫియా సుల్తానా, నాయకులు అతీఫ్ ఆతిన, అజర్ దబీర్ తదితరులు పాల్గొన్నారు.

హాఫ్ మారథాన్‌కు సైదాపూర్ విద్యార్థులు



సైదాపూర్(హుస్నాబాద్): సిద్దిపేట కమిషనరేట్ ఆధ్వర్యంలో హుస్నాబాద్‌లో ఆదివారం నిర్వహించిన 3వ విడత హాఫ్ మారథాన్‌కు సైదాపూర్ నుంచి విద్యార్థులు తరలివెళ్లారు. 5 కె రన్‌ను హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్, సీపీ శ్వేత, ఏసీపీ మహేందర్, సీఐలు రఘుపతిరెడ్డి, ఎర్రల కిరణ్ జెండా ఊపి, ప్రారంభించారు. గాదెపాక కుమార్‌రాజా కూతురు విద్యాన్‌రెడ్డి కృష్ణమూర్తి, అశోక్‌ల ఆధ్వర్యంలో సోమారం మోడల్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కరీంనగర్ జిల్లా :
9951602933, 9951602958, 9951602824
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
కరీంనగర్ : రాజశేఖర్ - 9618304759
చొప్పదండి : ముండయ్య - 7997958217
మానకొండూర్ : మహేశ్ - 9573106760
హుజూరాబాద్ : ప్రశాంత్ - 7331119941
టోల్ ఫ్రీ నం. : 1800 425 9899

క్లుప్తంగా...

'కొత్తపల్లె' కరెంటు బిల్లు.. రూ. 11.41 కోట్లు!

- కొత్త పంచాయతీకి విద్యుత్ షాక్



మాచారెడ్డి: ఇటీవల పంచాయతీల పునర్విభజనలో కొత్త పంచాయతీగా ఏర్పడిన కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలంలోని కొత్తపల్లె పంచాయతి భవనానికి రూ. కోట్లలో వచ్చిన కరెంటు బిల్లును చూసి ప్రజలు షాక్ అవుతున్నారు. పంచాయతీ వాటర్ వర్క్స్‌కు సంబంధించిన సర్వీస్ నంబర్ 3801-02321పై ఈనెల 3న ట్రాన్స్‌కో బిల్లింగ్ సిబ్బంది మీటర్ రీడింగ్ నమోదు చేశారు. జనవరి 2 నుంచి ఫిబ్రవరి 3 వరకు 1,88,15,257 యూనిట్లు వాడినట్టు పేర్కొన్నారు. దీనికి ఏకంగా రూ. 11,41,63,672 బిల్లు విధించారు. ఏసీడీ డ్యూ కింద మరో రూ.8,716 వడ్డించారు. ఈనెల 17 లోపు బిల్లు చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. ఈ బిల్లును చూసిన సర్పంచ్, పంచాయతీ సిబ్బంది షాక్‌కు గురయ్యారు. గతనెల విద్యుత్ బిల్లు రూ.3,257 వచ్చిందని సర్పంచ్ తెలిపారు. ఈ విషయాన్ని ట్రాన్స్‌కో అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా సాంకేతిక సమస్యతో బిల్లు ఇలా వచ్చిందని చెప్పారు.

కరెంటు బిల్లు అంటూ దోచేస్తారు..

వినియోగదారులను అప్రమత్తం చేస్తున్న ఎన్పీడీసీఎల్

జనగామ: 'మీ విద్యుత్ బిల్లు పెండింగ్‌లో ఉంది.. చెల్లించకుంటే కరెంటు కట్ చేస్తాం'అంటూ అపరిచిత వ్యక్తులు వ్యాపార, వాణిజ్య, గృహ వినియోగదారుల వద్దకు వస్తున్నారని, వారిపట్ల అప్రమత్తతతో ఉండాలని ఎన్పీడీసీఎల్ అధికారులు జనగామలో ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఇందుకు సంబంధించి సీసీ పుటేజీల్లో రికార్డయిన సదరు వ్యక్తి ఫొటోను సైతం సంస్థ వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేస్తూ... వినియోగదారులను హెచ్చరిస్తున్నారు. అపరిచిత వ్యక్తులు వచ్చి కరెంటు బిల్లు కట్టాలని అడిగితే స్పందించవద్దని సూచిస్తున్నారు. సైబర్ నేరాలు.. ఓటీపీతో నగదు చోరీ.. ఇలా సాంకేతికతను ఆసరా చేసుకుని డబ్బులు స్వాహా చేస్తున్న నేరగాళ్లు.. ఇప్పుడు కొత్తగా కరెంటు బిల్లుల పేరిట ఊళ్లమీద పడటంతో ఎన్పీడీసీఎల్ సంస్థ ముందస్తుగా అప్రమత్తమైంది.

కొత్త గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు శుభాకాంక్షలు

ఏపీ సీఎం జగన్



సాక్షి, అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్‌గా నియమితులైన జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన మార్గనిర్దేశంలో రాష్ట్రం మరింత పురోగమిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. న్యాయ నిపుణులైన జస్టిస్ నజీర్ అనుభవం ప్రజాస్వామ్యాన్ని పరిపుష్టం చేయడంలో, రాష్ట్రానికి చక్కటి మార్గనిర్దేశం చేయడంలో ఉపయోగపడుతుందని ఆకాంక్షిస్తూ ఆదివారం ట్వీట్ చేశారు. ఇప్పటి దాకా రాష్ట్ర గవర్నర్‌గా వ్యవహరించిన విశ్వభూషణ్ హరిచందన్ ఛత్తీస్‌గఢ్ గవర్నర్‌గా నియమితులవ్వడం పట్ల శుభాకాంక్షలు తెలిపారు. గవర్నర్‌గా ఆయన రాష్ట్రానికి అందించిన సేవలను కొనియాడారు. రాష్ట్ర ప్రజలు ఆయన్ను ఎప్పటికీ గుర్తుంచుకుంటారని అన్నారు. మచ్చలేని వ్యక్తిత్వం హరిచందన్ సొంతమని పేర్కొన్నారు. కోవిడ్ లాంటి విపత్కర పరిస్థితులను దాటుకుని రాష్ట్రం ప్రగతి పథంలో పయనించడానికి ఆయన మరువలేని సహకారాన్ని అందించారని చెప్పారు. అధికార కార్యకలాపాల నిర్వహణలో ప్రజాస్వామ్య స్ఫూర్తి పరిఢవిల్లేలా, నిండైన హుందాతనంతో వ్యవహరించారని, అత్యుత్తమ రాజ కీయ పరిణతి చూపించారన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల మధ్య సమన్వయంలో, వాటి మధ్య సంబంధాలు సజావుగా సాగడంలో అత్యంత కీలక పాత్ర పోషించి, రాజ్యాంగానికి వన్నె తెచ్చారన్నారని ముఖ్యమంత్రి జగన్ కొనియాడారు. తండ్రి తరహాలో వాత్సల్యాన్ని చూపారని, తెలుగు ప్రజలకు ఆత్మీయతను పంచారని ప్రశంసించారు. రాష్ట్రం నుంచి ఆయన వెళ్లిపోవడం బాధాకరమైనా, దేశంలో మరో రాష్ట్రానికి ఆయన గవర్నర్‌గా వెళ్లడం అక్కడి ప్రజలకు తప్పకుండా మేలు చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తూ ట్వీట్ చేశారు.

ఏపీ కొత్త గవర్నర్‌గా జస్టిస్ అబ్దుల్ నజీర్

▶ మొదటి పేజీ తరువాయి

గవర్నర్‌గా బాధ్యతలు నిర్వర్తించిన విషయం విదితమే. జస్టిస్ అబ్దుల్ నజీర్ కర్ణాటకలోని దక్షిణ కన్నడ జిల్లా బెళువాయికానాలో 1958 జనవరి 5న జన్మించారు. ఈ పట్టణం మంగళూరుకు 35 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. మూడబిద్రిలోని మహావీర్ కాలేజీలో బీకాం, మంగళూరులోని ఎస్‌డీఎం లా కాలేజీలో ఎల్ఎల్‌బీ పట్టా పొందారు. 1983లో కర్ణాటక హైకోర్టులో న్యాయవాద వృత్తిని ప్రారంభించారు. 2003 మే 12న కర్ణాటక హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. అనంతరం పూర్తి స్థాయి న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టాక 2017 ఫిబ్రవరిలో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. మూడో స్థానంలో ఉన్న న్యాయమూర్తి ఏ హైకోర్టులోనూ ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టకుండా నేరుగా సుప్రీంకోర్టుకు పదోన్నతి పొందడం అదే తొలిసారి. 2023 జనవరి 4న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదవీ విరమణ పొందారు. ఆ సందర్భంగా నిర్వహించిన అభినందన సభలో జస్టిస్ అబ్దుల్ నజీర్ గురించి సీజేఐ డీవై చంద్రచూడ్ మాట్లాడుతూ.. 'జస్టిస్ అబ్దుల్ నజీర్ సౌమ్యుడు, సామాన్యుడు. ఇటీవలి వరకు డ్రైవింగ్ లైసెన్స్ లేదా న్యాయమూర్తి కార్డును గుర్తింపు కార్డుగా ఉపయోగించారు. 2019లో పాస్‌పోర్టు తీసుకున్నారు. అదీ అత్యవసరంగా మాస్కో వెళ్లాల్సివచ్చినపుడు తీసుకున్నారు. పాస్‌పోర్టుపై తొలిస్టాంపు అదే' అని వ్యాఖ్యానించారు.

కీలక ధర్మాసనాల్లో బాధ్యతలు

జస్టిస్ అబ్దుల్ నజీర్ సుప్రీంకోర్టులో పలు కీలక ధర్మాసనాల్లో న్యాయమూర్తిగా పని చేశారు. 2017లో ట్రిపుల్ తలాక్ కేసులో ఏకైక ముస్లిం న్యాయమూర్తిగా ఉన్నారు. ఐదుగురు న్యాయమూర్తులున్న ఈ ధర్మాసనంలో ముస్లిం షరియా చట్టం ప్రకారం ట్రిపుల్ తలాక్ ఆచరణకు అనుమతి ఉందని జస్టిస్ నజీర్ తన తీర్పులో పేర్కొన్నారు. 3:2తో ట్రిపుల్ తలాక్ చెల్లదని ఆ ధర్మాసనం తీర్పు చెప్పిన విషయం విదితమే. 2019లో అయోధ్య రామ మందిరం కేసులోనూ రాజ్యాంగ ధర్మాసనంలో సభ్యుడిగా ఉన్నారు. వివాదాస్పద ప్రాంతంలో హిందూ నిర్మాణం ఉనికి గురించి ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా పేర్కొన్న విషయాన్ని జస్టిస్ నజీర్ సమర్థించారు. రామ మందిరానికి అనుకూలంగా తీర్పునిచ్చారు. పదవీ విరమణకు ముందు రాజ్యాంగ ధర్మాసనానికి నేతృత్వం వహించిన జస్టిస్ నజీర్ పెద్దనోట్ల రద్దు సహా పలు కేసులు విచారించారు.



ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనుపమా చక్రవర్తి

భద్రాచలం పాదయాత్రకు భట్టి

సాక్షి, హైదరాబాద్: హాథ్‌సే హాథ్ జోడో యాత్రలో భాగంగా ఈనెల 14న భద్రాచలం నియోజకవర్గంలో జరిగే పాదయాత్రలో సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క పాల్గొంటారు. ఈనెల ఆరో తేదీ నుంచి ప్రారంభమైన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ పాదయాత్ర 14న భద్రాచలం చేరుకుంటుందని టీపీసీసీ వర్గాలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపాయి. 15 నుంచి వరంగల్ పార్లమెంటరీ నియోజక వర్గం పరిధిలో యాత్ర సాగుతుందని, 15న పాలకుర్తి, 16న వర్ధన్నపేట, 17న స్టేషన్ ఘన్‌పూర్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో జరిగే యాత్ర లో రేవంత్ పాల్గొంటారని పేర్కొన్నాయి.

టీడీపీ గూండాల బరితెగింపు



వద్దాది రమణ

వించిపేట (విజయవాడ పశ్చిమ): ఏపీలో టీడీపీ నేతల అరాచకాలకు అంతులేకుండా పోయింది. తమ కుటుంబంలోని మహిళను ఎందుకు వేధించారని ప్రశ్నించిన పాపానికి విజయవాడలో టీడీపీ నేత ఒకరు ఏకంగా 20 మందికి పైగా అనుచరులతో కలిసి.. కత్తులతో ఆ మహిళ కుటుంబంపై విచక్షణ రహితంగా దాడి చేయడం ఆ పార్టీ దిగజారుడుతనానికి నిదర్శనంగా నిలిచింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. విజయవాడ నగరంలోని 55వ డివిజన్ (వించిపేట) టీడీపీ అధ్యక్షుడు వద్దాది రమణ తమ్ముడు వద్దాది నరేశ్ నెల రోజులుగా ఓ వివాహితను లైంగిక వేధింపులకు గురి చేస్తున్నాడు. ఈ క్రమంలోనే ఆదివారం సాయంత్రం బయటకు వెళ్తున్న ఆమెపై చేతులు వేసి, అనుచిత వ్యాఖ్యలు చేశాడు. బాధితురాలు ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పగా ఆమె అత్త, మామ, మరిది కలిసి టీడీపీ నాయకుడు వద్దాది నరేశ్ ఇంటి వద్దకు వెళ్లారు. ఆ సమయంలో టీడీపీ నేతలు రమణ, నరేశ్ ఇంటి వద్ద లేరు. జరిగిన విషయాన్ని వారి కుటుంబ సభ్యులకు చెప్పి.. మరోసారి ఇలా జరిగితే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. బాధితులు తమ ఇంటి వద్దకు వచ్చి వెళ్లారనే విషయం తెలుసుకున్న టీడీపీ నేతలు వద్దాది రమణ, నరేశ్.. 20 మంది అనుచరులతో కలిసి వివాహిత ఇంటిపైకి దాడికి వెళ్లారు. 'మా ఇంటికే వచ్చి హెచ్చరిస్తారా.. మీకెంత ధైర్యం.. ఇప్పుడు మీకు ఎవరు అడ్డువస్తారో చూస్తాం..' అని తిడుతూ వివాహిత మామ ఏడుకొండలు, అత్త భారతి, మరిది అరుణ్‌కుమార్‌తో పాటు మరో యువకుడు హేమంత్‌పై కత్తులతో దాడి చేశారు. అరుణ్‌కుమార్‌కు పొత్తి కడుపులో, మిగిలిన వారి ఒంటిపై పలు చోట్ల గాయాలయ్యాయి. స్థానికులు వారిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. టూటౌన్ పోలీసులు వద్దాది రమణ, వద్దాది నరేశ్, మరో నలుగురిపై కేసు నమోదు చేశారు.



సీనియర్ పాత్రికేయుడు రామచంద్రమూర్తికి పురస్కారం అందజేస్తున్న జూలూరి గౌరీశంకర్. చిత్రంలో అల్లం నారాయణ, ఘంటా చక్రపాణి



కుప్పిలి పద్మకు పురస్కారం అందజేస్తున్న సాక్షి మీడియా గ్రూప్ ఎడిటర్ వర్ధెల్లి మురళి

లోపాలను ప్రశ్నించిన వ్యక్తి.. అరుణ్‌సాగర్

- విశిష్ట పురస్కారాల ప్రదాన సభలో వక్తలు
- సీనియర్ పాత్రికేయుడు రామచంద్ర మూర్తికి జీవన సాఫల్య పురస్కారం
- కుప్పిలి పద్మకు విశిష్ట సాహితీ పురస్కారం

భద్రాచలంటౌన్: ఎప్పుడైనా, ఎక్కడైనా తన అభిప్రాయాలను నిక్కచ్చిగా చెప్పి వ్యవస్థలోని లోపాలను ప్రశ్నించే తత్వం ఉన్న వ్యక్తి అరుణ్ సాగర్ అని పలువురు సీనియర్ పాత్రికేయులు చెప్పారు. అరుణ్‌సాగర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అరుణ్‌సాగర్ విశిష్ట పురస్కారాల ప్రదాన కార్యక్రమం ఆదివారం భద్రాచలంలో జరిగింది. మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయుడు కె.రామచంద్రమూర్తికి జీవన సాఫల్య పురస్కారం, ప్రముఖ కవయిత్రి, రచయిత్రి కుప్పిలి పద్మకు విశిష్ట సాహితీ పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అల్లం నారాయణ మాట్లాడుతూ.. మరణం తర్వాత జీవించి ఉన్న అరుదైన వ్యక్తుల్లో అరుణ్ సాగర్ ఒకరని, ఏడేళ్లుగా ఆయనను తలచుకుంటూనే ఉన్నామన్నారు. సీనియర్ జర్నలిస్టులకు గురువులాంటి వ్యక్తి రామచంద్రమూర్తిని అరుణ్‌సాగర్ అవార్డుతో సన్మానించుకోవడం గర్వంగా ఉందని చెప్పారు. ఆధునిక రచన, కవితా శైలికి కుప్పిలి పద్మ ఉదాహరణ అని పేర్కొన్నారు.

కవిత్వంలో తన తరం వాళ్లకంటే ముందే...

సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్ మాట్లాడుతూ.. అల్లూరి, కొమురం భీమ్ తరహాలో గిరిజన ప్రాంతమైన భద్రాచలం నుంచి వచ్చిన అరుణ్‌సాగర్ నిర్వాసిత గిరిజనుల జీవితాన్ని తన రచనల్లో చూపారని చెప్పారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. ఎదిరించే తత్వం ఈ గడ్డ నుంచే మొదలైందని, ఆనాడు భక్త రామదాసు తానీషాను ఎదిరించి రాముడి గుడి నిర్మించాడని గుర్తుచేశారు. ఈ గడ్డపై పుట్టిన అరుణ్‌సాగర్‌ది కూడా ఎదిరించి నిలిచే తత్వమని గుర్తు చేసుకున్నారు. అనంతరం సాక్షి మీడియా గ్రూప్ ఎడిటర్ వర్ధెల్లి మురళి మాట్లాడుతూ.. తన తరం జర్నలిస్టుల్లో అరుణ్‌సాగర్ అత్యంత ప్రతిభావంతుడని, అదేవిధంగా కవిత్వంలో తన తరం వాళ్లకంటే ఎంతో ముందుండేవారని కొనియాడారు. తెలుగు పత్రికా రంగాన్ని ప్రజల పక్షం చేయడంలో ఏబీకే ప్రసాద్ తర్వాత పేర్కొనదగిన వ్యక్తి కె. రామచంద్రమూర్తి అని అన్నారు. సాహిత్య రంగానికి కుప్పిలి పద్మ ఎంతో సేవ చేశారని చెప్పారు. ఈ పురస్కారాన్ని స్వీకరిస్తున్న సందర్భంగా అరుణ్ సాగర్ జ్ఞాపకాలను మరోసారి గుర్తు తెచ్చుకున్నామని రామచంద్రమూర్తి అన్నారు. అరుణ్‌సాగర్ కవితలు తన తరం, ఆ తర్వాత వారికి దిశానిర్దేశం చేస్తాయని కుప్పిలి పద్మ చెప్పారు. కార్యక్రమంలో టీఎస్‌పీఎస్సీ మాజీ చైర్మన్ ఘంటా చక్రపాణి, ఎమ్మెల్సీ, కవి గోరటి వెంకన్న, సంపాదకుడు కె.శ్రీనివాస్, మువ్వా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అంబేడ్కర్ వర్సిటీ బీఎడ్ స్పాట్ అడ్మిషన్లు

బంజారాహిల్స్ (హైదరాబాద్): బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం బీఎడ్ స్పెషల్ ఎడ్యుకేషన్ హెచ్ఐ కేటగిరీలో మిగిలిన సీట్ల కోసం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నారు. సోమవారం ఉదయం 10 నుంచి 11 గంటల లోపు రిపోర్ట్ చేసిన వారిని పరిగణనలోకి తీసుకుంటామని విశ్వవిద్యాలయ వర్గాలు తెలిపాయి. ఇక్కడి పరిపాలన భవనంలో స్పాట్ అడ్మిషన్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు విద్యార్థి సేవల విభాగం ఇన్‌చార్జి డైరెక్టర్ ఎల్‌వీకే రెడ్డి వెల్లడించారు. ఆసక్తి గల అభ్యర్థులు స్పాట్ అడ్మిషన్‌కు కావాల్సిన అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఒక సెట్ జిరాక్స్ కాపీలు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు తీసుకురావాలని సూచించారు. విశ్వవిద్యాలయం నిర్వహించిన ఎంట్రన్స్ పరీక్ష రాసి అందులో ర్యాంకు పొందిన అభ్యర్థులు మాత్రమే హాజరుకావాలని స్పష్టంచేశారు. ఇతర వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

అపూర్వం.. అపురూపం



సావనీర్ విడుదల చేస్తున్న జీఎం సంజీవరెడ్డి



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

- ఒకేచోటకు 1978–2022 బ్యాచ్‌ల పదో తరగతి పూర్వ విద్యార్థుల
- 3500 మంది హాజరు
- దేశ విదేశాల నుంచి రాక
- సందడిగా సీసీసీ సింగరేణి పాఠశాల

శ్రీరాంపూర్: అదో జ్ఞాపకాల జాతర.. ఎవరి కంట చూసిన ఆనంద బాష్పాలే.. నన్ను గుర్తు పట్టావా అంటూ ఒకరు.. ఓరేయ్ నువ్వా... అంటూ ఆత్మీయ పలకరింపులు, కౌగిలింతలు... ఆనంద కేరింతలు... నాటి తరగతి గదిలో జరిగిన చిలిపి చేష్టల జ్ఞాపకాల దొంతరలతో సీసీసీ సింగరేణి హైస్కూల్ ప్రాంగణమంతా నిండిపోయింది. వేలాది మంది పూర్వ విద్యార్థుల మహా సమ్మేళనం చూస్తే ఇక్కడ ఏదైన జాతర జరుగుతుందా అనిపించింది. సీసీసీలోని సింగరేణి హైస్కూల్‌లో 1978 నుంచి 2022 వరకు చదివిన 76 బ్యాచ్‌లకు చెందిన 3500 మంది పూర్వ విద్యార్థులు ఆదివారం ఒకేచోటకి చేరారు. ఈ సమ్మేళానికి తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచే కాకుండా దేశ, విదేశాల నుంచి పూర్వ విద్యార్థులు, సుమారు 150 మందికి పైగా ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఉదయం నుంచి పొద్దుపోయేంత వరకు నాటి తరగతి గదిలో జరిగిన తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు.

కమిటీగా ఏర్పడి..

ఈ కార్యక్రమం కోసం ఐదు నెలల క్రితం నిర్వాహక కమిటీని ఏర్పాటు చేసుకొని సమ్మేళనం సక్సెస్ చేశారు. సమన్వయ కర్తలు రాజారెడ్డి, వాణిశ్రీతో పాటు విష్ణువర్ధన్‌రావు, శ్యాంసుందర్‌రెడ్డి, దప్పు సమ్మయ్య, రవి వర్మ, బండారి శారద, జక్కుల మల్లేశ్, గోషిక మనోజ్, రమేశ్‌లతో పాటు పలువురు కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు..

పూర్వ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. తెలంగాణ కళాకారుడు, పూర్వ విద్యార్థి దప్పు సమ్మయ్య ఆధ్వర్యంలో కొద్ది రోజులుగా ఈ పూర్వ విద్యార్థులకు ఈ సాంస్కృతిక కార్యక్రమాలపై శిక్షణ ఇచ్చిన అనంతరం వేదికపై నేడు ప్రదర్శన ఘనంగా నిర్వహించారు.

సేవా కార్యక్రమాల్లో ముందుండాలి



మాట్లాడుతున్న జీఎం బి.సంజీవరెడ్డి

పూర్వ విద్యార్థులంతా కలిసి ట్రస్ట్ ఏర్పాటు చేసుకోవాలనుకోవడం హర్షనీయం. దీని ద్వారా ఇక సేవా కార్యక్రమాలు చేయడంలో కూడా ముందుండాలని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు స్కూల్ ప్రధాన గేట్ నుంచి జీఎంతో పాటు ఇతర కంపెనీ అధికారులకు ఘన స్వాగతం పలికారు. జీఎం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్, డీజీఎం(పర్సనల్) గోవిందరాజు, పీఎం రాజేశ్వర్‌రావు, హెచ్ఎం రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు.

అమెరికా నుంచి వచ్చాను



నాది 1988 టెన్త్ బ్యాచ్. మళ్లీ ఈ స్నేహితులను కలుసుకొనే అవకాశం రాలేదు. ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లి అక్కడే ఉద్యోగం చేస్తూ స్థిర పడ్డాను. చాలా ఏళ్ల తరువాత నా చిన్న నాటి మిత్రులను కలుసుకొనే అవకాశం వచ్చింది. అందుకే ప్రత్యేకించి దీని కోసం ఇండియా వచ్చాను. చాలా సంతోషంగా ఉంది. మాటల్లో చెప్పలేని అనుభూతి. బాల్య జ్ఞాపకాలు గుర్తుకు వస్తుంటే కళ్లలో నీళ్లు తిరుగుతున్నాయి.

– ఎస్.సురేష్, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, యూఎస్ఏ



నృత్యాలు చేస్తున్న పూర్వ విద్యార్థినులు



హాజరైన పూర్వ విద్యార్థులు

సింగరేణి రుణం తీర్చుకోలేనిది



ఇంత మందిని ఏకం కావడానికి సింగరేణి సంస్థ కారణం. ఆ రోజుల్లో ఇంత పెద్ద స్కూల్ ఇక్కడ ఉండడం వల్ల చాలా మందికి మంచి విద్య లభించి గొప్పగా స్థిరపడ్డారు. ఏమిచ్చిన సింగరేణి రుణం తీర్చుకోలేనిది. అప్పటికి సింగరేణి స్కూల్ ఉన్నత చదువులనే అందిస్తుంది.

– జి.కృష్ణమూర్తి, 1992 టెన్త్ బ్యాచ్

జ్ఞాపకాలను వెంట తీసుకెళ్తా..



నా క్లాస్‌మేట్స్‌ను, సీనియర్స్‌ని, ఉపాధ్యాయులను కలుసుకోవడం ఎంతో సంతోషంగా ఉంది. లండన్‌లో ఉద్యోగం చేస్తున్న ఎంత సంపాదించి ఎంత ఎదిగిని కూడా ఇక్కడ ఇంత మంది మధ్య దొరికిన ఆనందం మరెక్కడ దొరకదు. ఈ రోజు ఇక్కడి జ్ఞాపకాలను వెంట తీసుకొని తిరిగి లండన్ వెళ్తున్నాను.

– బి.వెంకటేశ్, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, లండన్

సంతోషంగా ఉంది



ఈ పూర్వ విద్యార్థులకు ఉపాధ్యాయులపై ఉన్న ప్రేమ అభిమానాలు చూస్తే చాలా సంతోషంగా ఉంది. విద్యార్థులు, నా తోటి ఉపాధ్యాయులను ఈ వేదిక సాక్షిగా కలుసుకోవడం ఆనందంగా ఉంది. ట్రస్ట్‌గా ఏర్పడి సేవాచేయడానికి ముందుకు రావడం సంతోషంగా ఉంది.

– ఎ. గోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయుడు

ఫైర్ ఎస్టింగ్‌షర్‌లపై సింగరేణి పోస్టుమార్టం

- కొనుగోలు చేసిన సిలిండర్లు ఎన్ని..?
- ప్రస్తుతం వాటి పరిస్థితి ఏమిటి..?
- కూలంకషంగా సాగుతోన్న దర్యాప్తు
- కార్మికుడి మృతిపై యాజమాన్యం సీరియస్



ఓసీపీ-1 సర్‌ఫేజ్ క్రషర్ వద్ద ప్రమాదం జరిగిన ప్రాంతం

గోదావరిఖని(రామగుండం): నాసిరకం బాడీ వల్లే సిలిండర్ పేలిందా..?, తయారీ లోపం వల్ల ఘటన జరిగిందా..? అడుగు భాగం తుప్పుపట్టి విడిపోయిందా..? అనే అంశాలపై సింగరేణి ఉన్నతాధికారుల స్థాయిలో సీరియస్‌గా విచారణ జరుగుతోంది. ఫైర్‌ఎస్టింగ్‌షర్ పేలి సింగరేణి కార్మికుడు మృతి చెందిన ఘటనను యాజమాన్యం సీరియస్‌గా తీసుకుంది. సంస్థ వ్యాప్తంగా కొనుగోలు చేసిన సిలిండర్లు ఎన్ని, అవి ఏ పరిస్థితుల్లో ఉన్నాయి, ఏ సంస్థ నుంచి కొనుగోలు చేశారు, ఎప్పుడు చేశారు అనే అంశాలపై యాజమాన్యం దృష్టి సారించింది. ఈనెల 4న ఆర్జీ-3 ఏరియా ఓసీపీ-1 సీహెచ్‌పీలో ఫైర్ ఎస్టింగ్‌షర్ పేలి జయంత్‌కుమార్ అనే ట్రెయినీ వెల్డర్ మృతిచెందాడు. ఈ ఘటనపై యాజమాన్యం విచారణకు ఆదేశించింది. అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు మంటలను ఆర్పేందుకు కొనుగోలు చేసిన సిలిండర్లు పేలడంపై అధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. ప్రమాదానికి కారణమైన సిలిండర్‌ను స్వాధీనం చేసుకున్న అధికారులు సిలిండర్ల బాడీ ఏ విధంగా ఉంది, అందులో ఉన్న పౌడర్‌లో ఒత్తిడి కలిగినప్పుడు తట్టుకునేలా ఉన్నాయ.. అనే కోణంలో సంస్థాపరంగా విచారణ చేపట్టారు. మరో వైపు డిప్యూటీ డైరెక్టర్ మైన్స్ సేఫ్టీ ఆధ్వర్యంలో విచారణ జరుపుతున్నారు. అయితే సిలిండర్ పేలడానికి కారణం దాని బాడీ అనుకున్న స్థాయిలో మందంగా ఉండకపోవడమేనని భావిస్తున్నారు.

మూడేళ్ల కిందటే భారీగా కొనుగోలు

మూడేళ్ల కిందట సింగరేణి యాజమాన్యం ఓ ప్రైవేట్ సంస్థ ద్వారా 450 సిలిండర్లు కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. వీటిలో 50 సిలిండర్లు ఓసీపీ-1 ప్రాజెక్టుకు కేటాయించినట్లు చెబుతున్నారు. మిగతా 400 సిలిండర్లు సంస్థ వ్యాప్తంగా ఉన్న అన్ని ఏరియాలకు సరఫరా చేసినట్లు తెలుస్తోంది. కాగా కొనుగోలు చేసిన సిలిండర్ల బాడీ నాసిరకంగా ఉన్నట్లుగా దర్యాప్తులో తేలిందని పేర్కొంటున్నారు. సంబంధిత సంస్థను పిలిపించి ఈఅంశంపై లోతుగా విచారించనున్నారు.

మిగతా సిలిండర్ల సంగతేంటి..?

నిత్యం కార్మికులు సంచరించే ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఫైర్ ఎస్టింగ్‌షర్‌ల సంగతి ఏమిటని ప్రశ్నలు తలెత్తుతున్నాయి. భారీయంత్రాలు, అగ్నిప్రమాదాలు జరిగే ప్రాంతాలు, ఓసీపీ కోల్‌క్వారీలు, సీహెచ్‌పీలు తదితర ప్రాంతాల్లో మంటలు లేచినప్పుడు ఫైర్ ఎస్టింగ్‌షర్ ఉపయోగిస్తున్నారు. ఓసీపీ-1లో పేలుడు జరిగిన సమయంలో అక్కడ ఒక్క కార్మికుడు ఉండటంతో మృత్యువాత పడ్డాడు. అదే ఎక్కువమంది ఉన్న సమయంలో పేలుడు సంభవిస్తే పరిస్థితి ఏమిటని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. 2018లో ఇదే ఓసీపీ-1లో ఈపీ ఆపరేటర్ ఫైర్ ఫైటింగ్ డెమో ఫైర్‌ఎస్టింగ్‌షర్ ద్వారా చేస్తున్న క్రమంలో సిలిండర్ ముందు భాగం లేచి వచ్చి బలంగా తాకడంతో ఒక కన్ను శాశ్వతంగా కోల్పోయాడు. రెండు ఘటనలు జరిగిన నేపథ్యంలో ఇవే సిలిండర్లు సురక్షితమా లేక అధునాతన టెక్నాలజీ ఉన్న మరేదైనా ప్రత్యామ్నాయ మార్గాన్ని ఎంచుకోవాలా అనే కోణంలో అధికారులు చూస్తున్నారు. ప్రస్తుతం సంస్థ వ్యాప్తంగా ఉన్న 450 సిలిండర్లను ఏమి చేస్తారో వేచిచూడాల్సిందే. ఇదే క్రమంలో మంటలు ఆర్పేందుకు ఫైల్‌బాల్స్, ఆటోఫైర్ ఫైటింగ్ తదితర ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై యాజమాన్యం దృష్టిసారించింది.



సిలిండర్ అడుగు భాగం

యాదాద్రి తరహాలో 'కొండగట్టు'

- వాస్తు సలహాదారు, ఆర్కిటెక్ట్ ఆనందసాయి

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు శ్రీఆంజనేయ స్వామి ఆలయాన్ని ఆగమశాస్త్రం ప్రకారం యాదాద్రి తరహాలో అభివృద్ధి చేసేందుకు సీఎం కేసీఆర్ చర్యలు తీసుకుంటున్నారని వాస్తు సలహాదారు, ఆర్కిటెక్ట్ ఆనందసాయి వెల్లడించారు. సీఎం కేసీఆర్ ఈనెల 14న కొండగట్టు పర్యటనకు రానున్న నేపథ్యంలో ఆనందసాయి ఆదివారం స్వామివారి సన్నిధికి చేరుకున్నారు. అంజన్న దర్శనం తర్వాత కలెక్టర్ యాస్మిన్‌బాషా, ఎస్పీ భాస్కర్, అధికారులు, నాయకులతో సమావేశమయ్యారు. ఆలయ మాస్టర్‌ప్లాన్‌పై చర్చించారు. కొండగట్టును అభివృద్ధి చేయడాన్ని సీఎం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారని ఆనందసాయి తెలిపారు. ఆలయంలో ఇప్పుడున్నదానితోపాటు మరో ప్రాకారం నిర్మించాల్సి ఉందన్నారు. పుణ్యక్షేత్రంలో 1,980 నాటి భవనాలు ఉన్నాయని, గర్భగుడిలోని స్వామివారు భక్తులకు కనిపించడం లేదని వెల్లడించారు.



పూజలు చేస్తున్న ఆర్కిటెక్ట్ ఆనందసాయి

ప్రతి ఒక్కరికీ అంజన్న చరిత్ర తెలిసేలా..

ఆలయానికి నాలుగువైపులా గోపురాలు, ముఖ మండపం నిర్మాణం కోసం ప్రత్యేకంగా డిజైన్ చేస్తామని ఆనందసాయి వివరించారు. ఆలంలోకి వచ్చే ప్రతీ భక్తుడికి స్వామివారి చరిత్ర తెలిసేలా ప్రతీస్తంభంపై చరిత్ర రాసిఉంచుతామని పేర్కొన్నారు. అలాగే అంజన్న సన్నిధిలో 108 అడుగుల పొడవైన ఆంజనేయస్వామి విగ్రహం ఏర్పాటు చేసేందుకు సీఎం ఆలోచన చేస్తున్నారని వివరించారు. భేతాళ స్వామి, శ్రీరాముని ఆలయం, సీతమ్మ కన్నీటిధారలు పరిశీలించిన ఆనందసాయి ఆలయంలో చాలా మార్పులు ఉంటాయని తెలిపారు. ఈ సమాచారం మొత్తాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు.

సన్నిధి

భయం నుండి విడుదల

సువార్త



కీడు వచ్చునన్న భయము లేక నెమ్మదిగా ఉండును (సామె 1:33). మానవుని పట్టి పీడుస్తున్న అనేక భయాల్లో ఒకటి 'భవిష్యత్తును గూర్చిన భయం'. తనకు వచ్చే రోగాల్ని బట్టి, కుటుంబ సమస్యలను బట్టి, గత జీవితాన్ని గురించి భయపడేది కేవలం పది శాతమైతే మిగతా తొంభైశాతం భయం భవిష్యత్తులో ఏం జరగబోతుంది... అనే దానిపై ఆధారపడి ఉంటుందని మానసిక శాస్త్రవేత్తల వివరణ. భవిష్యత్తును గూర్చి తెలీదు గనుక దాని గురించి భయపడడం సహజం. అయితే కొందరు ప్రతి చిన్నదానికి భయపడి తమ చుట్టూ ఉన్నవారిని భయపెడుతుంటారు. దినదినం మానవుడు భయం గుప్పిట్లోకి వెళ్ళిపోతున్నాడన్నది వాస్తవ దూరం కాదు. భయంతో మనిషి తన జీవితాన్ని ఆస్వాదించలేకపోతున్నాడు. ఆనందమయం చేసుకోలేకపోతున్నాడు.

భయం మనిషిలో ఉన్న స్వాభావిక ధైర్యాన్ని నిర్వీర్యం చేస్తుంది. భయం వలన మానవుడు తాను చేయాలనుకున్న పనులు చేయలేడు. అనేక మంచికార్యాలను నిలువరించే శక్తి భయానికి మాత్రమే ఉంది. భవిష్యత్తు చాలా అందమైనది. సర్వశక్తుడైన క్రీస్తులో అది సురక్షితమైనది. భవిష్యత్తు మీద ఉన్న ఆశలను నిర్వీర్యం చేసేది నీలో ఉన్న భయమే. జీవితంలో కొన్ని కొన్ని విషయాల్లో కొన్ని నిర్దిష్ట పరిధుల్లో భయం ఉండడం సహజమే కానీ కొంతమంది భయ కారణం లేని చోట కూడా విపరీతంగా భయపడుతూ ఉంటారు.

ప్రభువైన యేసుక్రీస్తు ఈ లోకానికి రావడానికి గల కారణాల్లో ఒకటి మనిషిలో ఉన్న భయాన్ని పోగొట్టుట. రాత్రివేళ తమ మందను కాచుకొంటున్న గొర్రెల కాపరులకు ఇయ్యబడిన వాగ్దానం భయపడకుడి. వారికున్న భయం బహుశా ఇంకెంత కాలం ఈ గొర్రెలను మేపుతూ ఉండాలి? వాటిని ప్రజల పాపపరిహారార్థమై దేవాలయానికి తరలించాలి? దూత చెప్పిన వర్తమానం వారి కోసం రక్షకుడు వచ్చాడు. ఆయన సర్వలోక పాపాన్ని మోసికొని పోవు దేవుని గొర్రెపిల్ల. దేవుని వాక్యమైన బైబిల్‌లో అనేకచోట్ల భయపడకుడి అనే వాగ్దానం స్పష్టంగా కనిపిస్తుంది. మనిషి గుండెల్లో గూడు కట్టుకుపోయిన భయాన్ని రూపుమాపడానికే దేవుడు ఈ లోకానికి అరుదెంచాడు. ఆయన ధైర్యవంతుడు గనుకనే ఆయనలో ఉన్న ధైర్యాన్ని ఉచితంగా మనకు ఇవ్వాలని ఆశిస్తున్నాడు.

యేసుక్రీస్తు నీ హృదయంలో ఉంటే 'దేవుడు నాకు వెలుగును రక్షణయునై యున్నాడు నేను ఎవరికి భయపడుదును' అని దావీదు వలే నువ్వు కూడా చెప్పగలవు (కీర్తన 27:1). శత్రువులతో తరుమబడినప్పుడు తల దాచుకోవడానికి కూడా అవకాశం లేని సందర్భాల్లో దేవునియందు విశ్వాసముంచి తనలో ఉన్న ప్రతి భయాన్ని జయించిన దావీదు ధన్యజీవిగా మారాడు. నీవు దేవునియందు నమ్మికయుంచి ధైర్యంతో ముందుకు సాగిపో మిత్రమా!

– డా. జాన్ వెస్లీ, క్రైస్ట్ వర్షిప్ సెంటర్

ప్రేమ కోసం ప్రేమగా

మంచి మాట

ధనం వృద్ధి పొందటానికి కొంత సమయం పడుతుంది. విత్తనాన్ని భూమిలో నాటితే ఫలం చేతికి అందటానికి సమయం పడుతుంది. కానీ క్షణంలో ఫలితాన్ని అందజేసేది ప్రేమ ఒక్కటే.

ప్రేమతో కూడిన ఒక్క మాట, ఒక చర్య అద్భుతాలను సృష్టిస్తుంది.

ఈ ప్రేమకు వయసుతో పనిలేదు. రక్తసంబంధం ఉండాలని నియమం లేదు. కుల మతాల ప్రసక్తే లేదు.

మరో గొప్ప విషయం ఏమిటీ అంటే ఇచ్చే వారికీ, పుచ్చుకునే వారికీ సంతోషం కలిగించే శక్తి కేవలం ప్రేమకు మాత్రమే ఉంది.

ఒక్కసారి ప్రేమ గొప్పతనం అర్థం అయ్యాక, ప్రేమను పంచటంలోని మాధుర్యం అనుభవం అయిన తరువాత కఠినంగా కఠోరంగా ఉండటం సాధ్యం కాదు.

పరిస్థితుల దృష్ట్యా కొన్నిసార్లు కావాలని కఠినంగా ఉండాలని ప్రయత్నించినా రాతి అడుగున దాగిన నీటి బుగ్గలాగా పెల్లుబికి వస్తుంది ప్రేమ.

మట్టితో కూడిన చెరువు నీటి కుండలో చిన్న పటిక ముక్క వేస్తే మట్టి విడిపోయి స్వచ్ఛమైన నీరు తయారవుతుంది.

అనేక సమస్యలు, ఒత్తిడులతో మనశ్శాంతికి దూరం అయిపోతున్న నేటి సమాజంలో శాంతిని చేకూర్చగల ఏకైక మార్గం ప్రేమ.

కేవలం యువతీ యువకుల మధ్య కలిగేదే ప్రేమ అనే భ్రమ నుంచి బయటపడితే ప్రతిజీవి తోటి వారి అందరిపట్ల పశుపక్ష్యాదుల పట్ల, ప్రకృతి పట్ల చూపించేది అంతా ప్రేమే.

ఒక కర్మాగారం చాలా చిక్కు సమస్యలలో మునిగి పోయింది. కార్మికుల మధ్య తగులాటలు, శత్రుత్వాలు. అప్పటివరకు ఉన్న అధికారి ఆ ఒత్తిడిని తట్టుకోలేక పదవికి రాజీనామా చేసి వెళ్లిపోయాడు. అతని స్థానంలో మరొక అధికారిని నియమించారు. కొద్దికాలంలోనే కర్మాగారం పరిస్థితి చక్కబడింది.

మునుపటి శత్రుత్వం నిండిన వాతావరణం మారిపోయి చక్కని వాతావరణం ఏర్పడింది.

పైవారు కొత్త అధికారిని ప్రశంసలతో ముంచెత్తారు.

ఇటువంటి మార్పు కోసం ఆ కొత్త అధికారి ఉపయోగించిన ఏకైక ఆయుధం ప్రేమ.

ఉదయం రాగానే అందరినీ ఒక్కొక్కరినీ పిలిచి ప్రేమగా పలకరించేవాడు. వారి యోగక్షేమాలను విచారించేవాడు. మీకు ఏ కష్టం వచ్చినా చెప్పండి నేను ఉన్నాను. మనందరం ఒక కుటుంబం అని ప్రేమగా మాట్లాడేవాడు. ఆ చిన్న పని వల్ల ఆయన అందరికీ ఆత్మీయుడిగా మారిపోయాడు.

ఆయన సంతోషం కోసం అందరూ గొడవలు మానేసి పరస్పరం స్నేహంగా ఉండటం ప్రారంభించారు.

మనం ప్రస్తుతం నివసిస్తున్న ఈ సమాజంలో అన్నీ వుండి కూడా కాస్తంత ప్రేమ కోసం అలమటించే వారు ఎందరో ఉన్నారు. అయిన వారందరూ దూరప్రాంతాలకు తరలిపోగా ఒంటరితనంతో బాధపడుతూ కాస్తంత ఆప్యాయత కోసం, తపించి పోయే వారికి ఊరట కలిగేలా మనకు ఉన్న సమయంలో కొద్ది సమయం ఇటువంటి వారికోసం కేటాయించి ప్రేమతో నాలుగు మాటలు మాట్లాడితే వారికి ఎంతో ఉత్సాహం కలుగుతుంది. జీవితం పట్ల ఆసక్తి నశించిపోయి జీవించే వారికి జీవితం పట్ల ఆసక్తి కలుగుతుంది. అంతేకాదు, ప్రేమను చవిచూసిన వారు ఇతరులకు ప్రేమను పంచగలుగుతారు.

మన దైనందిన జీవితంలో మనకు సేవలందించే వారిపట్ల ప్రేమతో నాలుగు మంచి మాటలు మాట్లాడితే, వారంతా మనకు మరింత దగ్గరవుతారు. వారితోపాటు మన జీవితం కూడా ఆనందమయంగా మారుతుంది.

– పొత్తూరి విజయలక్ష్మి

గురువాణి

ఆ రుతువు వచ్చేవరకూ ఆగాలి... తప్పదు



మామిడి కాయలంటే ఇష్టం. మొక్క తెచ్చావు. నీళ్ళుపోసావు... ఇంకా కాయలు రాలేదని రోజూ బిందెలకు బిందెలు నీళ్ళు పోస్తే కాయలు రావు. మొక్క చెట్టు కావాలి... అయినా వసంత రుతువుకూడా రావాలి.. అప్పుడే పూత పూస్తుంది, అది పిందెగా మారుతుంది. ఆ పిదప కొంత కాలానికి కాయ... ఆ తరువాతే పండు... అప్పటిదాకా ఓర్పు ఉండాలి. వేచి చూడాలి. ఎప్పుడో కాయ కాస్తుందని ఇప్పటినుంచే నీళ్ళెందుకు పోయడం.. అని మానేస్తే మొక్క బతకదు... అంటే ఓర్పుతోపాటు నీ ప్రయత్నం కూడా పూర్తిగా ఉండాలి. ప్రతి దానికీ ఒక నియమం, ఒక సమయం ఉంటాయి. అప్పటిదాకా వేచి చూడగల ఓర్పు ఉండడంతో పాటూ ప్రయత్నం కూడా పూర్తిగా ఉండాలి. వెనకటికి ఓ రాజుపై శత్రువులు విరుచుకు పడ్డారు. రాజు ఓడిపోయాడు. నిరాశతో రాజు అన్నీ వదిలేసుకొని ఒంటరిగా వెళ్ళిపోతుంటే... సైనికులు, ఆంతరంగికులు అందరూ నచ్చచెప్పారు. మనం కొంతకాలం ఆగుదాం.. మళ్ళీ శత్రువుపై యుద్ధం ప్రకటిద్దాం.. అని చెప్పినా వినకుండా అడవుల్లోకి వెళ్ళిపోయాడు. ఓరోజున రాజు ఒక చెట్టుకింద కూర్చుని... దగ్గర్లోనే ఒక సాలెపురుగు గూడు అల్లడానికి నానా తంటాలు పడడాన్ని ఆసక్తిగా గమనించాడు.. అది గూడు అల్లే క్రమంలో చాలాసార్లు పోగు తెగి కిందపడిపోతున్నది... పలుమార్లు అలా చేసిన తరువాత చివరికి అది గూడు పూర్తిగా అల్లి మధ్యలో సౌకర్యవంతంగా కూర్చుని గూడుకు చిక్కుకున్న పురుగులను హాయిగా తింటున్నది. ఇది చూసిన రాజుకు జ్ఞానోదయమయింది. వెంటనే వెళ్ళి తన పరివారాన్ని చేరదీసి సర్వసన్నద్ధం అయ్యేవరకు ఆగి... ఓ రోజున యుద్ధం ప్రకటించాడు. శత్రురాజును సునాయాసంగా ఓడించి తిరిగి తన రాజ్యాన్ని పొందాడు. ప్రతిదానికీ ఒక నియమం ఉంటుంది. ఆ నియమాన్ని అర్థం చేసుకుని ప్రయత్నం ఎక్కడా ఆపకుండా పూర్తిచేయాలి, ఫలితం వచ్చేవరకూ ఓర్పుగా వేచి చూడాలి.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

తొలితరానికి చెందిన ప్రఖ్యాత భారతీయ శాస్త్రవేత్తల్లో ఒకరైన సర్ జగదీశ్ చంద్రబోస్ ఆంగ్లేయ ప్రొఫెసర్లతో సమానమైన అర్హతలు, ప్రతిభాపాటవాలు కలిగినా, వారితో సమానంగా తనకు వేతనం ఇవ్వనందుకు నిరసనగా జీతం ముట్టుకోకుండా తన వృత్తిని మూడేళ్ళపాటు ఆర్థికంగా ఇబ్బందులు పడుతూనే అదే అంకితభావంతో కొనసాగిస్తే... చివరకు అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం దిగొచ్చి ఆయన్ని సన్మానించి పెంచిన జీతం పాత బకాయిలతో సహా చెల్లించింది. కార్యసాధనలో ఓర్పు ఎంత ముఖ్యమో... ప్రయత్నాలను చివరిదాకా కొనసాగించడం కూడా అంతే ముఖ్యం.

పరలోక సాఫల్యం దిశగా...

ఇస్లాం వెలుగు

సృష్టిలోని ప్రతి జీవికీ మరణం తప్పదు. ఇది సృష్టిధర్మం, ఎవరూ తిరస్కరించలేని సత్యం. నాస్తికులూ, ఆస్తికులూ అందరూ మరణాన్ని నమ్ముతారు. దేవుడున్నాడా అనే విషయంలో భేదాభిప్రాయాలున్నాయి గాని, మరణం ఉందా.. లేదా..? అనే విషయంలో ఎటువంటి భిన్నాభిప్రాయమూ లేదు. కాని,'మరణం తథ్యం' అని తెలిసినా మనం దాన్ని పట్టించుకోం. బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు,స్నేహితులు, తెలిసిన వాళ్ళు, తెలియని వాళ్ళు ఎంతోమంది ప్రతిరోజు ఎక్కడో ఒకచోట పోతూనే ఉన్నారు. మనం వారి అంత్యక్రియల్లో పాల్గొని, స్వయానా మన భుజాలపై మోసి, సమాధిలో దించి, స్వహస్తాలతో వారిపై మట్టికప్పి వస్తున్నాం. వారు సంపాదించిన ఆస్తిపాస్తులు, ఆభరణాలు, హోదా, అధికారం ఏదీ వారు తమవెంట తీసుకు వెళ్ళడం లేదు. రిక్తహస్తాలతో వచ్చారు. అలానే వెళ్ళిపోతున్నారు.

పవిత్ర ఖురాన్ ఇలా అంటోంది: 'ఈ ప్రాపంచిక జీవితం ఒక ఆట, వినోదం తప్ప మరేమీ కాదు. అసలు జీవితం పరలోక జీవితమే. ఈ యథార్థాన్ని వారు అర్థం చేసుకుంటే ఎంత బాగుండు' (29-64) అందుకని ప్రపంచమే సర్వస్వంగా బతక్కూడదు. ధర్మాధర్మాల విచక్షణ పాటించాలి. మంచి పనులు చేయాలి. రేపు మనల్ని కాపాడేవి ఇవే. ఎందుకంటే, మనం సంపాదించిన డబ్బూదస్కం, ఆభరణాలు, ఆస్తిపాస్తులు సమస్తం ఊపిరి ఆగిన మరుక్షణమే మనతో సంబంధాన్ని తెంచుకుంటాయి. భార్యాబిడ్డలు, బంధుగణం, మిత్రబృందం... వీరంతా మనల్ని సమాధి వరకు మాత్రమే సాగనంపుతారు. సమాధిలో దించి, మట్టిలో కలిపేసి వెళ్ళిపోతారు. మన వెంట వచ్చేది, కాపాడేది కేవలం మనం చేసుకున్న మంచి పనులు మాత్రమే. అడ్డదారులు తొక్కి, వారినీ వీరినీ వంచించి సంపాదించేదంతా సుఖమయ జీవితం కోసమేగదా.. రేపటి మన సంతోషం, మన పిల్లల భవిష్యత్తు కోసమేగదా? అక్రమ సంపాదనలో నిజమైన సంతోషం ఉండకపోగా, అది ఎప్పుడూ మనసులో కెలుకుతూనే ఉంటుంది. అయినా అంతరాత్మను అణగదొక్కి అడ్డదారికే ప్రాధాన్యతనిస్తాం.



కేవలం కొన్ని సంవత్సరాల ప్రాపంచిక జీవితం కోసమే ఇంతగా ఆలోచించే మనం, మరి శాశ్వతమైన రేపటి (పరలోకం) కోసం ఏం సంపాదిస్తున్నామన్నది కూడా ఆలోచించాలి. ఈ 'రేపు' మూన్నాళ్ళ ముచ్చట. కాని ఆ 'రేపు 'శాశ్వతం. దానికోసం ఏం చేస్తున్నాం.. ఏం దాస్తున్నాం? ఇదికదా అసలు ప్రశ్న. ఇహలోక జీవితం ఎలా గడిచినా పరలోక సాఫల్యం లభిస్తే అంతకన్నా అదృష్టం ఇంకేముంటుంది. దాని కోసం ఆలోచించాలి. దానికోసం శ్రమించాలి. మంచీ చెడుల విచక్షణతో, ధర్మబద్ధంగా ముందుకు సాగితే, ఆ క్రమంలో ఎంత లభిస్తే అంతతో సంతృప్తి చెందితే అదే అసలు విజయం, అసలు సాఫల్యం.

– ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్

సినిమా

ముహూర్తం ఫిక్స్?



● ఎన్టీఆర్

'జనతా గ్యారేజ్' (2016) వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో ఎన్టీఆర్, దర్శకుడు కొరటాల శివ కాంబినేషన్‌లో మరో కొత్త సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఎన్టీఆర్ నటించనున్న ఈ 30వ చిత్రాన్ని నందమూరి కల్యాణ్‌రామ్, మిక్కిలినేని సుధాకర్ నిర్మించనున్నారు. కాగా ఈ సినిమా ప్రారంభోత్సవానికి ముహూర్తం కుదిరిందనే టాక్ ఫిల్మ్‌నగర్‌లో వినిస్తోంది. ఈ నెల 23న ఈ మూవీని గ్రాండ్‌గా లాంచ్ చేయనున్నారట ఎన్టీఆర్, కొరటాల శివ అండ్ కో. అలాగే మార్చి మూడోవారం నుంచి రెగ్యులర్ షూటింగ్‌కి యూనిట్ ప్లాన్ చేస్తోందట. ఇందుకోసం హైదరాబాద్ శివార్లలో ఓ పోర్టు సెట్‌ను కూడా వేస్తున్నారని సమాచారం. ఈ చిత్రానికి అనిరుధ్ సంగీతం అందిస్తున్నారు. ఇతర నటీనటులు, టెక్నీషియన్స్ వివరాలను త్వరలోనే వెల్లడించనున్నారట కొరటాల శివ. అయితే ఈ సినిమాలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తారనే ప్రచారం జరుగుతోంది. ఈ మూవీని 2024 ఏప్రిల్ 5న విడుదల చేయనున్నట్లు ఎన్టీఆర్ స్పష్టం చేసిన సంగతి తెలిసిందే.

ఆర్టిస్టులు కూడా మనుషులే!



● మృణాల్ ఠాకూర్

'సీతారామం'(2022) చిత్రంతో తెలుగు చిత్ర పరిశ్రమకు పరిచయమయ్యారు హీరోయిన్ మృణాల్ ఠాకూర్. తాజాగా ఆమెపై సోషల్ మీడియా వేదికగా కొద్దిపాటి ట్రోలింగ్ జరిగింది.. దీనిపై ఆమె కాస్త అసహనానికి లోనయ్యారు. సోషల్ మీడియాలో నెటిజన్లతో చిట్ చాట్ చేశారు మృణాల్. అయితే తనకు కాబోయే భర్త మంచి వ్యక్తిత్వం ఉన్నవాడు అయితే చాలు, అందం గురించి పెద్దగా ఆలోచించనని ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు మృణాల్. ఇటీవల జరిగిన ఓ షోలో పాల్గొని తనకు కాబోయే భర్త అందంగా ఉండాలని చెప్పారామె. రెండు విభిన్నమైన అభిప్రాయాల వీడియోలను కొందరు నెటిజన్లు షేర్ చేసి, 'కొద్ది రోజుల్లోనే కాబోయే భర్త గురించి విభిన్నమైన అభిప్రాయాలు చెప్పడం సరైంది కాదు' అంటూ మృణాల్‌ను ట్రోల్ చేశారు. దీనిపై మృణాల్ కూడా స్పందించారు. ''ఆర్టిస్టులు కూడా మనుషులే అనే విషయాన్ని కొందరు కొన్నిసార్లు ఎందుకో మర్చిపోతుంటారు. కొత్త విషయాలు నేర్చుకుంటూ ప్రజలు తెలివైనవారు అవుతున్నారు. అయినా జీవితాంతం ఒకే ఆలోచనకు కట్టుబడి ఉండాల్సిన అవసరం లేదనుకుంటున్నా'' అన్నారు మృణాల్.

హ్యాపీ హ్యాపీగా...



● రకుల్, తేజస్

రకుల్ ప్రీత్‌సింగ్ ప్రధాన పాత్రలో సుమిత్ వ్యాస్, సతీష్ కౌశిక్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'ఛత్రీవాలి'. తేజస్ ప్రభ విజయ్ దేవాస్కర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం గత నెల 20 నుంచి ఓ ప్రముఖ ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ సినిమాకు వీక్షకుల నుంచి మంచి పాజిటివ్ రెస్పాన్స్ వచ్చిందని హ్యాపీగా ఫీలవుతున్నారు రకుల్. కొత్త ఏడాది తొలి విజయం దక్కడంతో ఆమె ముంబయ్‌లోని సిద్ధి వినాయక స్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆమెతో పాటు తేజస్ ప్రభ విజయ్ దేవాస్కర్ కూడా ఈ పూజల్లో పాల్గొన్నారు. ఈ ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేశారు రకుల్. కాగా కమల్‌హాసన్ హీరోగా నటిస్తున్న 'ఇండియన్ 2'లో చిత్రంలో రకుల్ కీలక పాత్ర చేస్తున్నారు.

ఫారిన్‌లో ఫైట్



● అఖిల్

ఫారిన్‌లో యాక్షన్ ప్లాన్ చేశారు 'ఏజెంట్'. అఖిల్ హీరోగా సురేందర్ రెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న స్టైలిష్ యాక్షన్ స్పై థ్రిల్లర్ 'ఏజెంట్'. ఇందులో సాక్షీ వైద్య హీరోయిన్. ఏకే ఎంటర్‌టైన్మెంట్స్, సురేందర్ 2 సినిమా పతాకాలపై అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ తుది దశకు చేరుకుంటోంది. ఇందులో భాగంగా ఓ ఫారిన్ షెడ్యూల్‌ను ప్లాన్ చేశారట యూనిట్. ఓ ఫైట్ సీక్వెన్స్ కోసం వచ్చే వారంలో చిత్ర బృందం విదేశాలకు వెళ్లనుందట. ఈ షెడ్యూల్‌తో 'ఏజెంట్' షూటింగ్ దాదాపు పూర్తవుతుందట. అయితే ఈ విషయాలపై అధికారిక సమాచారం అందాల్సి ఉంది. కాగా ఏప్రిల్ 28న 'ఏజెంట్' రిలీజ్ కానుంది. మమ్ముట్టి కీలక పాత్ర చేస్తున్న ఈ సినిమాకు సహ నిర్మాతలు: అజయ్ సుంకర, దీపా రెడ్డి, కెమెరా: రసూల్ ఎల్లోర్, సంగీతం: హిప్ హాప్ తమిజా.

కొత్త కబురు



● మాధవన్

హీరో మాధవన్ కొత్త కబురు చెప్పారు. తన తర్వాతి సినిమా డైరెక్టర్ మిత్రన్‌తో చేయనున్నట్లు పేర్కొన్నారాయన. తమిళ చిత్ర పరిశ్రమలో గత ఏడాది హిట్ కొట్టిన చిత్రాల్లో 'తిరుచిత్రంబలం' (తెలుగులో 'తిరు') ఒకటి. ధనుష్ హీరోగా నటించిన ఈ సినిమాకు మిత్రన్ ఆర్.జవహర్ దర్శకత్వం వహించారు. ఆ సినిమా హిట్ కావడంతో మిత్రన్‌కి మరో మంచి అవకాశం లభించింది. మాధవన్ హీరోగా ఆయన దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనుంది. ''దర్శకుడు మిత్రన్‌తో సినిమా చేయడానికి ఆసక్తికరంగా ఎదురు చూస్తున్నాను'' అన్నారు మాధవన్. త్వరలోనే ఈ సినిమా షూటింగ్ మొదలు కానుంది.

ఫ్యామిలీ ఎంటర్‌టైనర్



● శశిధర్, శరణ్ కుమార్, ఊర్వీ సింగ్, బీఎన్ రావు, యశ్విక

దివంగత నటి, దర్శక–నిర్మాత విజయనిర్మల మనవడు శరణ్ కుమార్ (నటుడు నరేశ్ కజిన్ రాజ్ కుమార్ తనయుడు) హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'మిస్టర్ కింగ్'. శశిధర్ చావలి దర్శకత్వం వహించారు. యశ్విక నిష్కల, ఊర్వీ సింగ్ కథానాయికలు. హన్విక క్రియేషన్ బ్యానర్‌పై బీఎన్ రావు నిర్మించిన ఈ మూవీ ఈ నెల 24న విడుదలకానుంది. శరణ్ కుమార్ మాట్లాడుతూ– ''మిస్టర్ కింగ్ నా మొదటి సినిమా. ప్రేక్షకుల ప్రేమ, సపోర్ట్ కావాలి. మా సినిమాని చూసి ఆశీర్వదించాలి'' అన్నారు. ''యూత్‌ఫుల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రమిది. అమ్మాయి ఉన్న ప్రతి కుటుంబం, ఆత్మగౌరవం ఉన్న ప్రతి అబ్బాయి చూడాల్సిన మూవీ'' అన్నారు శశిధర్ చావలి. ''మా చిత్రాన్ని అందరూ థియేటర్‌లో చూడాలి'' అన్నారు బీఎన్ రావు. ఈ కార్యక్రమంలో యశ్విక నిష్కల, ఊర్వీ సింగ్, కెమెరామేన్ తన్వీర్, నటుడు రాజ్ కుమార్ మాట్లాడారు. ఈ చిత్రానికి సహ నిర్మాత: రవి కిరణ్ చావలి, సంగీతం: మణిశర్మ.

18 నుంచి సీసీఎల్ సందడి



● సుశాంత్, ప్రిన్స్, అఖిల్, సుధీర్ బాబు, అశ్విన్ బాబు

పాన్ ఇండియా 'సెలబ్రిటీ క్రికెట్ లీగ్' (సీసీఎల్) సందడి మళ్లీ మొదలు కాబోతుంది. ఈ నెల 18 నుంచి సీసీఎల్ ప్రారంభం కానుంది. ఎనిమిది చలన చిత్ర పరిశ్రమలకు చెందిన బిగ్గెస్ట్ స్టార్స్ జట్లు పోటీపడనున్నాయి. రాయ్‌పూర్, బెంగళూరు, హైదరాబాద్, జోధ్‌పూర్, త్రివేండ్రం, జైపూర్ నగరాలు 19 గేమ్‌లకు ఆతిథ్యం ఇవ్వనున్నాయి.

సీసీఎల్ జట్లు ఇవే.. సల్మాన్ ఖాన్ బ్రాండ్ అంబాసిడర్‌గా రితేష్ దేశ్‌ముఖ్ కెప్టెన్‌గా ముంబై హీరోస్, ఆర్య కెప్టెన్‌గా చెన్నై రైనోస్, వెంకటేష్ కో ఓనర్– అఖిల్ కెప్టెన్‌గా తెలుగు వారియర్స్, మనోజ్ తివారీ కెప్టెన్‌గా భోజ్‌పురి దబాంగ్స్, మోహన్ లాల్ కో ఓనర్‌గా కుంచాకో బోబన్ కెప్టెన్‌గా కేరళ స్ట్రైకర్స్, బోనీ కపూర్ కో ఓనర్‌గా జిసుసేన్ గుప్తా కెప్టెన్‌గా బెంగాల్ టైగర్స్, సుదీప్ కెప్టెన్‌గా కర్ణాటక బుల్డోజర్స్, సోనూసూద్ కెప్టెన్‌గా పంజాబ్ దే షేర్.

సినీ రచయిత యడవల్లి మృతి



● యడవల్లి

తెలుగు, కన్నడ భాషల్లో పలు చిత్రాలకు రచన చేసిన యడవల్లి వెంకట లక్ష్మీ నరసింహశాస్త్రి (వైవీఎల్ఎన్ శాస్త్రి) (75) అనారోగ్యంతో విజయవాడలో శనివారం రాత్రి తుదిశ్వాస విడిచారు. నెల్లూరుకు చెందిన యడవల్లి విజయవాడలో స్థిరపడ్డారు. నిర్మాత రాధాకృష్ణమూర్తి తెలుగుకి, నటీమణి లక్ష్మి కన్నడ సినీపరిశ్రమకు యడవల్లిని పరిచయం చేశారు. యడవల్లి ప్రస్తుతం కేంద్ర సెన్సార్ బోర్డ్ (సీబీఎఫ్‌సీ) సభ్యునిగా, లాంగ్వేజ్ ఎక్స్‌పర్ట్‌గా కొనసాగేవారు. ఆదివారం విజయవాడలో యడవల్లి అంత్యక్రియలు జరిగాయి.

పాము నిద్ర లేస్తే?

లిక్వెన్ లుఒ, వాంగ్ జియోలాంగ్, వెంకీ జాఓ, గాఓ షెంగ్వు కీలక పాత్రల్లో గుఓ మింగర్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'బిగ్ స్నేక్ కింగ్'. గత ఏడాది మే 11న చైనాలో విడుదలైన ఈ చిత్రం మార్చి 3న ఇండియాలో విడుదలకానుంది. తెలుగులో యేలూరు సురేంద్ర రెడ్డి సమర్పణలో బుద్ధ భగవాన్ పతాకంపై రిలీజ్ చేస్తున్నారు. ఈ సినిమా తెలుగు ట్రైలర్‌ని మంగళవారం విడుదల చేస్తున్నారు. ''చైనాలోని ఒక గ్రామానికి చెందిన లీ అనే వ్యక్తి అక్రమ తవ్వకాల కోసం కొంతమందిని ఓ గుహ వద్దకు తీసుకెళతాడు. వారి కారణంగా ఆ గుహలో నిద్రపోతున్న అతిపెద్ద పాము నిద్ర లేస్తుంది? ఆ తర్వాత ఏం జరిగింది? అనే కథ ఆసక్తిగా ఉంటుంది'' అన్నారు యేలూరు సురేంద్ర రెడ్డి.



● 'బిగ్ స్నేక్ కింగ్' పోస్టర్

మహంకాళి వస్తోందయ్యా...



● హ్రిదు హరూన్

ప్రముఖ నృత్య దర్శకురాలు బృందా గోపాల్ డైరెక్షన్‌లో రూపొందిన పాన్ ఇండియా చిత్రం 'థగ్స్'. ఈ చిత్రం ద్వారా నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ శిబు తమీన్స్ కుమారుడు హ్రిదు హరూన్ హీరోగా పరిచయమవుతున్నారు. హెచ్ఆర్ పిక్చర్స్ బ్యానర్ సమర్పణలో జియో స్టూడియోస్‌తో కలిసి శిబు నిర్మించారు. ఈ చిత్రం తెలుగులో 'కోనసీమ థగ్స్' పేరుతో విడుదలకానుంది. శామ్ సీఎస్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'వీర శూర మహంకాళి వస్తోందయ్యా...' అంటూ సాగే ఈ పాటని విడుదల చేశారు. వనమాలి సాహిత్యం అందించిన ఈ గీతాన్ని కాలభైరవ పాడారు.

స్పోర్ట్స్



సెమీస్‌లో పోరాడి ఓడిన సాకేత్ జోడీ

డాలస్ ఓపెన్ ఏటీపీ-250 టెన్నిస్ టోర్నీలో సాకేత్ మైనేని-యూకీ బాంబ్రీ (భారత్) జోడీ సెమీఫైనల్లో ఓటమి పాలైంది. పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో సాకేత్-యూకీ ద్వయం 6-7 (11/13), 5-7తో లామోన్స్-విత్రో (అమెరికా) జోడీ చేతిలో ఓడింది. గంటా 43 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సాకేత్-యూకీ మూడుసార్లు బ్రేక్ పాయింట్ అవకాశాలను వృథా చేసుకున్నారు. సాకేత్-యూకీలకు 12,230 డాలర్ల (రూ. 10 లక్షలు) ప్రైజ్‌మనీ, 90 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.



ఫైనల్ చేరిన తొలి చైనా ప్లేయర్‌గా...

మహిళల టెన్నిస్‌లో చైనా నుంచి గ్రాండ్‌స్లామ్ చాంపియన్స్ ఉన్నా... పురుషుల టెన్నిస్‌లో మాత్రం ఇప్పటివరకు ఒక్కరు కూడా కనీసం ఏటీపీ టోర్నీలోనూ ఫైనల్‌కు చేరుకోలేకపోయారు. అయితే డాలస్ ఓపెన్‌లో 23 ఏళ్ల యిబింగ్ వు ఈ లోటును తీర్చాడు. ఈ టోర్నీ సెమీఫైనల్లో 97వ ర్యాంకర్ యిబింగ్ వు 6-7 (3/7), 7-5, 6-4తో 8వ ర్యాంకర్ టేలర్ ఫ్రిట్జ్ (అమెరికా)ను ఓడించి ఏటీపీ టోర్నీలో ఫైనల్ చేరిన తొలి చైనా ప్లేయర్‌గా గుర్తింపు పొందాడు.

నేడు డబ్ల్యూపీఎల్ వేలం

మధ్యాహ్నం గం. 2:30 నుంచి స్పోర్ట్స్ 18 చానెల్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ముంబై: బీసీసీఐ ఆధ్వర్యంలో తొలిసారి నిర్వహించనున్న మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 టోర్నీ క్రికెటర్ల వేలం కార్యక్రమం నేడు జరగనుంది. మధ్యాహ్నం 2 గంటల 30 నిమిషాలకు మొదలయ్యే ఈ కార్యక్రమాన్ని స్పోర్ట్స్ 18 చానెల్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు. మహిళా లీగ్ వేలం మహిళ మల్లిక సాగర్ నేతృత్వంలో జరగనుండటం విశేషం. మల్లిక 2021లో ప్రొ కబడ్డీ లీగ్ వేలం కార్యక్రమాన్ని నిర్వహించింది. మొత్తం 90 బెర్త్‌ల కోసం 409 మంది క్రికెటర్లు వేలం బరిలో ఉన్నారు. ఇందులో భారత్ నుంచి 246 మంది... విదేశీ జట్ల నుంచి 163 మంది ఉన్నారు. హర్మన్ ప్రీత్ కౌర్, స్మృతి మంధాన, షఫాలీ వర్మ, దీప్తి శర్మ, రేణుక సింగ్, రిచా ఘోష్ (భారత్), ఎలీస్ పెర్రీ, బెత్ మూనీ, అలీసా హీలీ, మేగన్ షుట్ (ఆస్ట్రేలియా), నాట్ సివెర్, సోఫీ ఎకిల్‌స్టోన్ (ఇంగ్లండ్), డియాండ్ర డాటిన్ (వెస్టిండీస్) తదితరులకు భారీ మొత్తం లభించే అవకాశముంది. ముంబై ఇండియన్స్, ఢిల్లీ క్యాపిటల్స్, ఆర్‌సీబీ, గుజరాత్ జెయింట్స్, యూపీ వారియర్జ్ జట్లు పాల్గొంటున్న డబ్ల్యూపీఎల్ మార్చి 4 నుంచి 26 వరకు ముంబైలో జరుగుతుంది.

ధర్మశాల టెస్టు వైజాగ్‌లో?

భారత్, ఆస్ట్రేలియా మూడో టెస్టు వేదిక మార్పు!



న్యూఢిల్లీ: భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య మార్చి 1 నుంచి ధర్మశాలలో జరగాల్సిన మూడో టెస్టు వేదిక మారనుంది. హిమాచల్ ప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌పీసీఏ)కు చెందిన ఈ మైదానంలో అసంపూర్తి పనులవల్ల మ్యాచ్ వేదికను మార్చాల్సి వస్తుందని బీసీసీఐ ఉన్నతస్థాయి వర్గాలు తెలిపాయి. ధర్మశాల స్టేడియంలోని అవుట్ ఫీల్డ్ సహా పిచ్‌పై పచ్చికను కొత్తగా పరిచారు. పిచ్‌ను ఇంకా పరీక్షించలేదు. అక్కడక్కడ పనులు ఇంకా పూర్తవలేదు. ప్యాచ్ వర్క్ అలాగే మిగిలిపోయింది. అందువల్లే ఐదు రోజుల ఆట (టెస్టు మ్యాచ్)ను అసంపూర్ణమైన మైదానంలో నిర్వహించడం సమంజసం కాదని బీసీసీఐ భావిస్తోంది. మూడో టెస్టుకు ప్రత్యామ్నాయ వేదికలుగా వైజాగ్, బెంగళూరు, ఇండోర్, రాజ్‌కోట్‌లను బోర్డు పరిశీలిస్తోంది.

మన అమ్మాయిలు...

అదరగొట్టారు

గత మెగా టోర్నీ రన్నరప్ భారత్... ఈ టి20 ప్రపంచకప్‌లో పాకిస్తాన్ పనిపట్టి శుభారంభం చేసింది. చిరకాల ప్రత్యర్థి నుంచి క్లిష్టమైన లక్ష్యమే ఎదురైనా... కీలకమైన ఈ మ్యాచ్‌కు డాషింగ్ ఓపెనర్ స్మృతి మంధాన గాయంతో గైర్హాజరైనా... టాపార్డర్ బాధ్యతాయుతమైన బ్యాటింగ్‌తో భారత మహిళలు చక్కని విజయం సాధించారు.

- పాక్‌పై 7 వికెట్లతో భారత్ జయభేరి
- రాణించిన జెమీమా, షఫాలీ, రిచా
- బిస్మా మారూఫ్ శ్రమ వృథా
- మహిళల టి20 ప్రపంచకప్ టోర్నీ


జెమీమా విజయ గర్జన


రిచా

కేప్‌టౌన్: భారత్ మహిళల జట్టు ముందున్న లక్ష్యం 150. కానీ 93 పరుగుల వద్ద 14వ ఓవర్లో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (16; 2 ఫోర్లు) అవుటైంది. 16వ ఓవర్లో రిచా ఘోష్‌ను ఎల్బీగా అంపైర్ ప్రకటించింది. భారత్ రివ్యూకెళ్లింది. స్కోరేమో 109/3. విజయానికి 24 బంతుల్లో 41 పరుగులు కావాలి. ఈ దశలో రివ్యూలో బంతి రిచా గ్లౌజ్‌ను తాకినట్లు తేలడంతో బతికిపోయింది. అక్కడి నుంచి టీమిండియా ఆట మారిపోయింది. కాస్త కఠినమైన సమీకరణాన్ని జెమీమా-రిచా జోడీ 19వ ఓవర్లోనే ముగించింది. దాంతో టి20 ప్రపంచకప్ టోర్నీ గ్రూప్ 'బి' మ్యాచ్‌లో భారత్ 7 వికెట్ల తేడాతో పాకిస్తాన్‌పై గెలిచింది. టాస్ గెలిచిన పాక్ 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 149 పరుగులు చేసింది. పాకిస్తాన్ 12.1 ఓవర్లలో 68 పరుగులకే కీలకమైన 4 వికెట్లను కోల్పోయిన దశలో కెప్టెన్ బిస్మా మారూఫ్ (55 బంతుల్లో 68 నాటౌట్; 7 ఫోర్లు), అయేషా నసీమ్ (25 బంతుల్లో 43 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్సర్లు) ఆదుకున్నారు. వీరిద్దరు అబేధ్యమైన ఐదో వికెట్‌కు 81 పరుగులు జోడించారు. అనంతరం భారత్ 19 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 151 పరుగులు చేసి గెలిచింది. ప్రపంచకప్ మ్యాచ్‌లో భారత్‌కిదే అత్యధిక ఛేదన కావడం విశేషం. ఓవరాల్‌గా టి20 ప్రపంచకప్‌లో పాకిస్తాన్‌పై భారత్‌కిది ఐదో విజయం. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' జెమీమా రోడ్రిగ్స్ (38 బంతుల్లో 53 నాటౌట్; 8 ఫోర్లు), రిచా ఘోష్ (20 బంతుల్లో 31 నాటౌట్; 5 ఫోర్లు) గెలిపించారు. భారత్ తమ తదుపరి మ్యాచ్‌ను ఈనెల 15న వెస్టిండీస్‌తో ఆడుతుంది.

గెలిపించిన జెమీమా

ఓపెనింగ్‌లో షఫాలీ వర్మ (25 బంతుల్లో 33; 3 ఫోర్లు) మెరుగ్గానే ఆడినప్పటికీ... యస్తిక భాటియా (17) తక్కువ స్కోరుకే వెనుదిరిగింది. క్రీజులోకి జెమీమా రాగా భారీ షాట్లపై గురిపెట్టిన షఫాలీ... సిద్రా అమీన్ చక్కని క్యాచ్‌కు పెవిలియన్ చేరింది. రెండు బౌండరీలతో ఊపు మీదున్న కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌ను నష్రా సంధు బోల్తా కొట్టించింది. దీంతో రిచా ఘోష్ క్రీజులోకి రాగా... 15వ ఓవర్లో జట్టు స్కోరు వంద పరుగులు దాటింది. కలిసొచ్చిన రివ్యూతో రిచా, మరోవైపు జెమీమా బౌండరీలతో జట్టు విజయాన్ని సులువు చేశారు. జెమీమా బౌండరీతో భారత విజయాన్ని ఖరారు చేసింది.


అయేషా నసీమ్
బిస్మా మారూఫ్

స్కోరు వివరాలు

పాకిస్తాన్ ఇన్నింగ్స్: మునీబా (స్టంప్డ్) రిచా (బి) రాధ 12; జవేరియా (సి) హర్మన్‌ప్రీత్ (బి) దీప్తి 8; బిస్మా మారూఫ్ (నాటౌట్) 68; నిదా దార్ (సి) రిచా (బి) పూజ 0; సిద్రా అమీన్ (సి) రిచా (బి) రాధ 11; అయేషా (నాటౌట్) 43; ఎక్స్‌ట్రాలు 7; మొత్తం (20 ఓవర్లలో 4 వికెట్లకు) 149. వికెట్ల పతనం: 1-10, 2-42, 3-43, 4-68. బౌలింగ్: రేణుక సింగ్ 3-0-24-0, దీప్తి శర్మ 4-0-39-1, రాజేశ్వరి గైక్వాడ్ 4-0-31-0, రాధా యాదవ్ 4-0-21-2, పూజ 4-0-30-1, షఫాలీ వర్మ 1-0-3-0. **భారత్ ఇన్నింగ్స్:** యస్తిక (సి) ఫాతిమా (బి) సాదియా 17; షఫాలీ (సి) సిద్రా (బి) నష్రా సంధు 33; జెమీమా (నాటౌట్) 53; హర్మన్‌ప్రీత్ (సి) బిస్మా (బి) నష్రా సంధు 16; రిచా ఘోష్ (నాటౌట్) 31; ఎక్స్‌ట్రాలు 1; మొత్తం (19 ఓవర్లలో 3 వికెట్లకు) 151. వికెట్ల పతనం: 1-38, 2-65, 3-93. బౌలింగ్: ఫాతిమా 4-0-42-0, సాదియా 4-0-25-1, ఐమన్ 3-0-33-0, నిదా దార్ 4-0-36-0, నష్రా సంధు 4-0-15-2.

'రికార్డు'తో మెరిసిన జ్యోతి

- ఆసియా ఇండోర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో రజతం
- 60 మీటర్ల హర్డిల్స్‌లో కొత్త జాతీయ రికార్డుతో రెండో స్థానం
- ఈ ఘనత సాధించిన తొలి భారతీయ మహిళా అథ్లెట్‌గా గుర్తింపు



అస్తానా (కజకిస్తాన్): కొన్నాళ్లుగా అంతర్జాతీయస్థాయిలో నిలకడగా రాణిస్తున్న భారత యువ అథ్లెట్, ఆంధ్రప్రదేశ్ అమ్మాయి జ్యోతి యర్రాజీ తన కెరీర్‌లో గొప్ప విజయం సాధించింది. ఆసియా ఇండోర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో జ్యోతి మహిళల 60 మీటర్ల హర్డిల్స్ విభాగంలో రజత పతకం గెల్చుకుంది. వైజాగ్‌కు చెందిన 24 ఏళ్ల జ్యోతి ఫైనల్ రేసును 8.13 సెకన్లలో ముగించి రెండో స్థానంలో నిలిచింది. ఈ క్రమంలో జ్యోతి ఈ విభాగంలో మళ్లీ కొత్త జాతీయ రికార్డును నమోదు చేసింది. ఈ ఏడాది 60 మీటర్ల హర్డిల్స్‌లో జ్యోతి జాతీయ రికార్డును నెలకొల్పడం ఇది ఐదోసారి కావడం విశేషం. శనివారం జరిగిన హీట్స్‌లో జ్యోతి 8.16 సెకన్లతో జాతీయ రికార్డు సృష్టించగా... రోజు వ్యవధిలోనే తన పేరిటే ఉన్న రికార్డును ఆమె సవరించడం విశేషం. ఫైనల్లో మాసుమి ఆకో (జపాన్; 8.01 సెకన్లు) అందరికంటే వేగంగా లక్ష్యాన్ని దాటి స్వర్ణ పతకం సొంతం చేసుకోగా... చెన్ జియామిన్ (చైనా; 8.15 సెకన్లు) కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. ఆదివారం ముగిసిన ఈ మెగా ఈవెంట్‌లో భారత్ ఒక స్వర్ణం, ఆరు రజతాలు, ఒక కాంస్యంతో కలిపి మొత్తం ఎనిమిది పతకాలు సాధించి నాలుగో స్థానంలో నిలిచింది.

1 తాజా ప్రదర్శనతో జ్యోతి 19 ఏళ్ల ఆసియా ఇండోర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ చరిత్రలో 60 మీటర్ల హర్డిల్స్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన భారతీయ అథ్లెట్‌గా నిలిచింది. 2008లో దోహా ఆతిథ్యమిచ్చిన ఆసియా ఈవెంట్‌లో భారత్‌కే చెందిన లీలావతి వీరప్పన్ 9.21 సెకన్లతో మూడో స్థానంలో నిలిచి కాంస్యం సాధించింది. జ్యోతి రజతం గెలిచి ఈ ఘనత సాధించిన తొలి భారత అథ్లెట్‌గా గుర్తింపు పొందింది.

రంజీ ట్రోఫీ ఫైనల్లో సౌరాష్ట్ర, బెంగాల్


సౌరాష్ట్ర జట్టు

బెంగళూరు: రంజీ ట్రోఫీ క్రికెట్ టోర్నీలో మాజీ చాంపియన్స్ సౌరాష్ట్ర, బెంగాల్ జట్లు ఫైనల్లోకి దూసుకెళ్లాయి. బెంగళూరులో ఆదివారం ముగిసిన సెమీఫైనల్లో సౌరాష్ట్ర నాలుగు వికెట్ల తేడాతో కర్ణాటక జట్టును... ఇండోర్‌లో జరిగిన మరో సెమీఫైనల్లో బెంగాల్ 306 పరుగుల తేడాతో డిఫెండింగ్ చాంపియన్ మధ్యప్రదేశ్‌పై గెలుపొందాయి. ఈనెల 16 నుంచి కోల్‌కతాలో జరిగే ఫైనల్లో సౌరాష్ట్ర, బెంగాల్ తలపడతాయి. ఆట చివరిరోజు ఓవర్‌నైట్ స్కోరు 123/4తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన కర్ణాటక 234 పరుగులకు ఆలౌటైంది. అనంతరం సౌరాష్ట్ర 115 పరుగుల లక్ష్యాన్ని ఆరు వికెట్లు కోల్పోయి ఛేదించింది. మరోవైపు బెంగాల్ నిర్దేశించిన 548 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడానికి బరిలోకి దిగిన మధ్యప్రదేశ్ రెండో ఇన్నింగ్స్‌లో 241 పరుగులకు ఆలౌటైంది.

మోతీ మాయాజాలం



బులవాయో: వెస్టిండీస్ ఎడంచేతి వాటం స్పిన్నర్ గుడకేశ్ మోతీ (7/37) మాయాజాలానికి... రెండో టెస్టులో జింబాబ్వే తొలి ఇన్నింగ్స్‌లో 40.5 ఓవర్లలో 115 పరుగులకే కుప్పకూలింది. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన వెస్టిండీస్ ఆట ముగిసే సమయానికి 4 వికెట్లకు 133 పరుగులు చేసింది. రీఫెర్ (53; 4 ఫోర్లు, 1 సిక్స్), తేజ్‌నారాయణ్ (36; 4 ఫోర్లు) రాణించారు. కైల్ మేయర్స్ (8 బ్యాటింగ్), రోస్టన్ ఛేజ్ (5 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.

భవిత

టీఎస్‌పీఎస్సీ గ్రూప్-4 స్టడీమెటీరియల్, సిలబస్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, కరెంట్ అఫైర్స్, ఆన్‌లైన్ టెస్టులు మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు.

- గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- కరెంట్ అఫైర్స్ కోసం

ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com


సివిల్స్-2023

టార్గెట్ ఐఏఎస్

యూపీఎస్సీ.. సివిల్స్ ఎగ్జామ్..పరిచయం అక్కర్లేని పరీక్ష! ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్‌ఎస్ వంటి..అత్యున్నత సర్వీసులకు మెరికల్లాంటి అభ్యర్థులను ఎంపిక చేసే.. పరీక్ష! తాజాగా..యూపీఎస్సీ సివిల్స్-2023 నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం 1,105 పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ ప్రారంభించింది. ఈ నేపథ్యంలో..సివిల్స్ ఎంపిక విధానం, పోస్టుల సంఖ్య, భర్తీ చేయనున్న సర్వీసులు, విజయానికి అనుసరించాల్సిన వ్యూహాలు..

» సివిల్ సర్వీసెస్ ఎగ్జామ్-2023 నోటిఫికేషన్
» 1,105 పోస్టులు భర్తీ చేయనున్న యూపీఎస్సీ
» ఐఏఎస్, ఐపీఎస్,ఐఎఫ్‌ఎస్ సహా 21 సర్వీసులు
» ఈ ఏడాది కొత్తగా పాండిచ్చేరి పోలీస్ సర్వీస్
» మే 28న తొలి దశ ప్రిలిమినరీ ఎగ్జామ్

21 సర్వీసులు..1,105 పోస్టులు

సివిల్స్ 2023 ద్వారా 21 సర్వీసుల్లో మొత్తం 1,105 పోస్టులను భర్తీ చేయనున్నారు. గత ఏడాది సివిల్స్-2022 సవరణ నోటిఫికేషన్‌లో చేర్చిన ఇండియన్ రైల్వే మేనేజ్‌మెంట్ సర్వీస్‌ను ఈ ఏడాది కూడా కొనసాగిస్తున్నారు. అదే విధంగా పాండిచ్చేరి పోలీస్ సర్వీస్ గ్రూప్-బిని ఈ ఏడాది నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. గతేడాది కంటే పోస్టుల సంఖ్య పెరగడం అభ్యర్థులకు కలిసొచ్చే అంశంగా చెప్పొచ్చు. గత సంవత్సరం 1,011పోస్టులనే భర్తీ చేశారు.

అర్హతలు

- బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి. 2023 చివరి సంవత్సరం పరీక్షలకు హాజరవుతున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే వారు మెయిన్ పరీక్షలకు దరఖాస్తు చేసుకునే సమయానికి ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది.
- **వయసు:** ఆగస్టు 1, 2023 నాటికి 21 నుంచి 32 ఏళ్ల మధ్యలో ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు అయిదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.

అయిదు లక్షలకు పైగా

గత కొన్నేళ్లుగా సివిల్స్ తొలిదశ ప్రిలిమ్స్‌కు దాదాపు అయిదు లక్షల మంది హాజరవుతున్నారు. వాస్తవానికి దరఖాస్తులు పది లక్షలకు పైగా ఉంటున్నాయి. పరీక్షకు హాజరయ్యే వారి సంఖ్య మాత్రం 50 శాతానికి కొంచెం అటు, ఇటుగా ఉంటోంది. పోస్టుల సంఖ్యను.. పోటీ పడే వారి సంఖ్యను దృష్టిలో పెట్టుకుంటే.. ఒక్కో పోస్టుకు దాదాపు అయిదు వందల మంది పోటీ పడుతుంటారు. వీరిలో రెండో దశ మెయిన్‌కు ఎంపికయ్యే వారి సంఖ్య.. 13 వేల వరకు ఉంటోంది. అంటే.. తొలి దశ ప్రిలిమ్స్‌లో రాణించడమే అత్యంత కీలకమైన ఘట్టంగా పేర్కొనొచ్చు.

దరఖాస్తు ఉపసంహరణకు నో ఛాన్స్

ఈ ఏడాది సివిల్స్‌లో దరఖాస్తు ఉపసంహరణ అవకాశాన్ని తొలగించారు. దీంతో అభ్యర్థులు దరఖాస్తు దశలోనే ఎంతో అప్రమత్తంగా వ్యవహరించాల్సిన ఆవశ్యకత నెలకొంది. పరీక్ష రాయదలచుకున్న మాధ్యమం, ఆప్షనల్ సబ్జెక్ట్స్ పేర్కొనడం వంటి విషయాల్లో ముందుగానే పూర్తి స్పష్టత ఏర్పరచుకుని దరఖాస్తుకు ఉపక్రమించాలి.

మూడు దశల్లో ఎంపిక ప్రక్రియ

- సివిల్ సర్వీసెస్ ఎంపిక ప్రక్రియను మొత్తం మూడు దశల్లో నిర్వహిస్తారు. అవి..
- ప్రిలిమినరీ పరీక్ష, మెయిన్ ఎగ్జామినేషన్, పర్సనల్ ఇంటర్వ్యూ(పర్సనాలిటీ టెస్ట్).

400 మార్కులకు ప్రిలిమ్స్

- సివిల్స్ ఎంపిక ప్రక్రియలో తొలి దశ ప్రిలిమ్స్ పరీక్ష రెండు పేపర్లలో నాలుగు వందల మార్కులకు నిర్వహిస్తారు. అవి..
- **పేపర్-1:** జనరల్ స్టడీస్: 100 ప్రశ్నలు-200 మార్కులు.
- **పేపర్-2:** ఆప్టిట్యూడ్ టెస్ట్: 80 ప్రశ్నలు-200 మార్కులు; ప్రిలిమినరీ పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో మల్టిపుల్ ఛాయిస్ కొశ్చన్స్‌తో నిర్వహిస్తారు.
- ప్రిలిమ్స్ పేపర్-1(జనరల్ స్టడీస్)లో నిర్దిష్ట కటాఫ్ మార్కులను సాధించిన వారిని రెండో దశ మెయిన్ ఎగ్జామినేషన్‌కు ఎంపిక చేస్తారు.
- పేపర్-2లో కనీసం 33 శాతం మార్కులు సాధించాలనే నిబంధన కూడా ఉంది.
- ప్రిలిమ్స్ నుంచి మెయిన్స్‌కు.. ఒక్కో పోస్ట్‌కు 12 లేదా 13 నిష్పత్తిలో ఎంపిక చేస్తారు.

మెయిన్ ఏడు పేపర్లు..1750 మార్కులు

- సివిల్స్ ఎంపిక ప్రక్రియలో రెండో దశ పరీక్ష మెయిన్‌లో రెండు లాంగ్వేజ్ పేపర్లు, ఒక జనరల్ ఎస్సే పేపర్, నాలుగు జనరల్ స్టడీస్ పేపర్లు, రెండు ఆప్షనల్ పేపర్లతో నిర్వహిస్తారు. అర్హత పేపర్లలో సాధించిన మార్కులను తుది జాబితా రూపకల్పనలో పరిగణనలోకి తీసుకోరు. కానీ వీటిలో తప్పనిసరిగా కనీస అర్హత మార్కులు సాధిస్తేనే మెయిన్ ఎగ్జామ్‌లోని మిగతా పేపర్లను మూల్యాంకన చేస్తారు.
- **అర్హత పేపర్లు:** పేపర్ ఏ-ఇండియన్ లాంగ్వేజ్ 300 మార్కులకు, పేపర్ బీ-ఇంగ్లిష్ 300 మార్కులకు ఉంటాయి. ఇండియన్ లాంగ్వేజ్, ఇంగ్లిష్ పేపర్లు కేవలం అర్హత పేపర్లే. ఇండియన్ లాంగ్వేజ్‌కు సంబంధించి అభ్యర్థులు 21 భాషల్లో పరీక్ష రాయొచ్చు. ప్రతి పేపర్‌లోనూ తప్పనిసరిగా 25శాతం మార్కులు సాధించాలి.
- **మెయిన్.. ర్యాంకింగ్ పేపర్స్:** పేపర్ 1 జనరల్ ఎస్సే(1)- 250 మార్కులు, పేపర్ 2 జనరల్ స్టడీస్-1(ఇండియన్ హెరిటేజ్, కల్చర్, హిస్టరీ అండ్ జాగ్రఫీ ఆఫ్ ద వరల్డ్ అండ్ సొసైటీ) 250 మార్కులకు; పేపర్ 3 జనరల్ స్టడీస్-2(గవర్నెన్స్,కాన్‌స్టిట్యూషన్, పాలిటీ, సోషల్ జస్టిస్, అండ్ ఇంటర్నేషనల్ రిలేషన్స్) 250 మార్కులకు; పేపర్-4 జనరల్ స్టడీస్-3(టెక్నాలజీ, ఎకనామిక్ డెవలప్‌మెంట్, బయో డైవర్సిటీ, ఎన్విరాన్‌మెంట్, సెక్యూరిటీ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్) 250 మార్కులకు; పేపర్-5 జనరల్ స్టడీస్-4 (ఎథిక్స్, ఇంటిగ్రిటీ, ఆప్టిట్యూడ్) 250 మార్కులకు; పేపర్-6 ఆప్షనల్ సబ్జెక్ట్ పేపర్-1 ,250 మార్కులకు; పేపర్-7 ఆప్షనల్ సబ్జెక్ట్ పేపర్-2, 250 మార్కులకు ఉంటాయి.
- మొత్తం ఏడు పేపర్లలో 1750 మార్కులకు పూర్తి డిస్క్రిప్టివ్ విధానంలో మెయిన్ పరీక్ష ఉంటుంది. మెయిన్‌లో అర్హత పేపర్లు కాకుండా.. మిగతా పేపర్లనే మెరిట్ జాబితా రూపకల్పనలో పరిగణనలోకి తీసుకుంటారు.
- మెయిన్ ఎగ్జామ్ తర్వాత చివరగా పర్సనాలిటీ టెస్ట్ నిర్వహిస్తారు.
- మెయిన్‌లో ప్రతిభ ఆధారంగా ఒక్కో పోస్ట్‌కు ఇద్దరు లేదా ముగ్గురిని(1:2 లేదా 1:3 నిష్పత్తిలో) పర్సనాలిటీ టెస్ట్‌కు ఎంపిక చేస్తారు.
- పర్సనాలిటీ టెస్ట్‌కు కేటాయించిన మార్కులు 275.
- మెయిన్‌తోపాటు పర్సనాలిటీ టెస్ట్‌లోనూ చూపిన ప్రతిభ ఆధారంగా తుది విజేతలను ప్రకటించి సర్వీసులు కేటాయిస్తారు.

ప్రిలిమ్స్ సన్నద్ధత

తొలిదశ ప్రిలిమ్స్‌లో పేపర్-1(జనరల్ స్టడీస్)లో.. హిస్టరీ, జాగ్రఫీ, పాలిటీ, ఎకానమీ, సైన్స్ అండ్ టెక్నాలజీ, కరెంట్ అఫైర్స్ ఇంటర్నేషనల్ ఈవెంట్స్‌కు సంబంధించిన ప్రశ్నలు ఉంటాయి. రెండో పేపర్ సీశాట్‌లో.. రీడింగ్ కాంప్రహెన్షన్, న్యూమరికల్ ఎబిలిటీ, డెసిషన్ మేకింగ్ అంశాల నుంచి ప్రశ్నలు ఉంటాయి. విద్యార్థులు బేసిక్ ఇంగ్లిష్ గ్రామర్,పదోతరగతి స్థాయి మ్యాథమెటిక్స్, అర్థమెటిక్ అంశాలపైనా అవగాహన పెంచుకోవాలి.

సమకాలీనంపై పట్టు

సివిల్స్ ప్రిలిమ్స్‌కు సన్నద్ధమయ్యే అభ్యర్థులు కరెంట్ అఫైర్స్‌కు ప్రాధాన్యం ఇవ్వడం ఉపయుక్తంగా ఉంటుంది. కారణం.. గత మూడు, నాలుగేళ్లుగా కరెంట్ అఫైర్స్‌కు సంబంధించిన ప్రశ్నలు కొంత పెరుగుతున్నాయి. అదేవిధంగా కరెంట్ అఫైర్స్ అంశాలను కోర్ టాపిక్స్‌తో అన్వయం చేసుకుంటూ ప్రిపరేషన్ సాగించాలి.

విశ్లేషణాత్మక దృక్పథం

సివిల్స్‌కు సన్నద్ధమయ్యే అభ్యర్థులు పూర్తిగా విశ్లేషణాత్మక దృక్పథంతో ఆయా సబ్జెక్ట్‌లను అధ్యయనం చేయాలి. ఆబ్జెక్టివ్ విధానంలో ఉండే ప్రిలిమ్స్ పరీక్షకు కూడా ఈ దృక్పథాన్ని అనుసరించాలి. ఫలితంగా ఒక విషయంపై అన్ని కోణాల్లో అవగాహన లభిస్తుంది. ఇది మెయిన్స్ ప్రిపరేషన్‌ను సులభతరం చేస్తుంది.

సమ్మిళిత అధ్యయనం

ప్రిలిమ్స్ ప్రిపరేషన్‌లో భాగంగా అభ్యర్థులు ఒక సబ్జెక్ట్‌ను మరో సబ్జెక్ట్‌తో అనుసంధానం చేసుకుంటూ అధ్యయనం చేయాలి. ఉదాహరణకు పాలిటీనే పరిగణనలోకి తీసుకుంటే.. పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బిల్లులు.. అవి ఆర్థికంగా, సామాజికంగా ప్రభావం చూపిన పరిస్థితులను ఒకే సమయంలో చదివే అవకాశం ఉంటుంది. అభ్యర్థులు ఈ దృక్పథాన్ని అలవర్చుకోవాలి. గత అయిదారేళ్లుగా ప్రిలిమ్స్‌లో అడుగుతున్న ప్రశ్నల తీరును గమనిస్తే.. ప్రభుత్వం తీసుకున్న శాసన నిర్ణయాలు.. ఆర్థికంగా వాటి ప్రభావం ఎలా ఉంటుంది అనే విధంగా ఉంటున్నాయి.

వీటికి ప్రాధాన్యం

ప్రిలిమ్స్‌లో అభ్యర్థులు ప్రిపరేషన్ సమయంలో సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎకాలజీ, జాగ్రఫీలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఇటీవల కాలంలో చర్చనీయాంశంగా మారిన పర్యావరణ కాలుష్యం, అందుకు సంబంధించి అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో చేపడుతున్న చర్యలు వంటి అంశాలపై ప్రశ్నలు అడుగుతున్నారు. సైన్స్ అండ్ టెక్నాలజీకి సంబంధించి ఇటీవల కాలంలో మన దేశం ప్రయోగించిన ఉపగ్రహాలు, వాటి లక్ష్యాలు వంటి వాటి గురించి తెలుసుకోవాలి.

పేపర్-2(సీశాట్-ఆప్టిట్యూడ్ టెస్ట్)కు.. ఇలా

అర్హత పేపర్‌గానే పేర్కొంటున్న పేపర్-2 ఆప్టిట్యూడ్ టెస్ట్‌పై అభ్యర్థులు ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఈ పేపర్‌లో కనీసం 33 శాతం మార్కులు సాధిస్తేనే పేపర్-1ను మూల్యాంకన చేస్తారు. దాని ఆధారంగా మెయిన్స్‌కు అభ్యర్థుల ఎంపిక జరుగుతుంది. పేపర్ 2 కోసం అభ్యర్థులు బేసిక్ ఇంగ్లిష్ గ్రామర్, రీడింగ్ కాంప్రహెన్షన్‌లపై పట్టు సాధించాలి. ఇంగ్లిష్ దిన పత్రికలను చదవడం అలవాటు చేసుకోవాలి. న్యూమరికల్ ఎబిలిటీకి సంబంధించి పదో తరగతి స్థాయిలో మ్యాథమెటిక్స్, ప్రధానంగా అర్థమెటిక్‌కు సంబంధించిన అంశాలపై పట్టు సాధించాలి.

మెయిన్స్‌తో కలిపి

ప్రిలిమ్స్ ప్రిపరేషన్ సమయంలోనే మెయిన్‌తో అనుసంధానం చేసుకుంటూ చదవాలి. ప్రస్తుతం సిలబస్‌ను పరిగణనలోకి తీసుకుంటే.. మెయిన్‌లో ఆప్షనల్ సబ్జెక్ట్ పేపర్లు, ఎథిక్స్ పేపర్ మినహా మిగతా అన్ని పేపర్లు ప్రిలిమ్స్ జనరల్ స్టడీస్‌లో నిర్దేశించిన విభాగాలకు సంబంధించినవే. కాబట్టి ఆయా సబ్జెక్ట్‌లను డిస్క్రిప్టివ్ అప్రోచ్‌తో చదివితే మెయిన్‌కు కూడా ఉపయుక్తంగా ఉంటుంది. అంతేకాకుండా ఒక టాపిక్‌ను నేపథ్యంతోపాటు సమకాలీన పరిణామాలతోనూ అనుసంధానం చేసుకుంటూ చదివితే.. ప్రిలిమ్స్‌లో అడుగుతున్న విభిన్న శైలి ప్రశ్నలకు సమాధానం ఇచ్చే సంసిద్ధత లభిస్తుంది.

ఇలా చేస్తే మేలు

సిలబస్‌పై స్పష్టత

ప్రిలిమ్స్ అభ్యర్థులు ముందుగా సిలబస్‌పై స్పష్టత ఏర్పరచుకోవాలి. సిలబస్‌లో పేర్కొన్న అంశాలు, సదరు అంశాల్లో తమ వ్యక్తిగత సామర్థ్య స్థాయి తెలుసుకోవాలి. ఫలితంగా తాము ఎక్కువగా దృష్టి సారించాల్సిన అంశాలపై అవగాహన ఏర్పడుతుంది. దీనిద్వారా సదరు అంశాలకు ఏ స్థాయిలో సమయం కేటాయించాలి? ఏ పుస్తకాలు చదవాలి? అనే విషయాలపైనా స్పష్టత వస్తుంది.

ప్రామాణిక పుస్తకాలు

అభ్యర్థులు పుస్తకాల ఎంపికలో అప్రమత్తంగా ఉండాలి. సిలబస్‌కు అనుగుణంగా ప్రామాణిక పుస్తకాలను చదవాలి. ముఖ్యంగా ఒకట్రెండు పుస్తకాలకు పరిమితం అవడం మేలు. అదే విధంగా.. గత ప్రశ్న పత్రాలను పరిశీలించి.. ప్రశ్నల శైలిపైగా అవగాహన పెంచుకోవాలి.

టైమ్ మేనేజ్‌మెంట్

నిర్దిష్ట సమయ పాలన పాటిస్తూ ప్రిపరేషన్ సాగించాలి. ప్రతి రోజు కనీసం ఎనిమిది గంటలు ప్రిపరేషన్ సాగించే విధంగా సమయ ప్రణాళిక రూపొందించుకోవాలి.ప్రతిరోజు అన్ని సబ్జెక్ట్‌లను చదివే విధంగా వ్యవహరించాలి.ఒక సబ్జెక్ట్ పూర్తయ్యాక మరో సబ్జెక్ట్ చదువుదాం అనే ధోరణి సరికాదు.

రివిజన్‌కు ప్రాధాన్యం

అభ్యర్థులు సిలబస్ అంశాల అధ్యయనంతో పాటు వాటి రివిజన్‌కు కూడా ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రిలిమ్స్ పరీక్ష తేదీకి నెల రోజుల ముందు నుంచి పూర్తిగా రివిజన్‌కే సమయం కేటాయించాలి. అదేవిధంగా మాక్ టెస్ట్‌లు, మోడల్ టెస్ట్‌లకు హాజరు కావడం కూడా మేలు చేస్తుంది.

పట్టు సాధించాల్సిన అంశాలు

- **చరిత్ర:** ఆధునిక చరిత్ర; జాతీయోద్యమం; ప్రాచీన, మధ్యయుగ చరిత్రకు సంబంధించి సాహిత్యం, కళలు, మత ఉద్యమాలు, రాజకీయ-సామాజిక- ఆర్థిక చరిత్ర అంశాలు.
- **పాలిటీ:** రాజ్యాంగం: రాజ్యాంగ పరిషత్, రాజ్యాంగ సవరణ ప్రక్రియ, పీఠిక, ముఖ్య రాజ్యాంగ సవరణలు, రాష్ట్రపతి, గవర్నర్, పార్లమెంట్, రాష్ట్ర శాసనసభలు, సుప్రీంకోర్టు, హైకోర్టు, ఎన్నికల కమిషన్, ఆర్థిక కమిషన్, పబ్లిక్ సర్వీస్ కమిషన్లు, అటార్నీ జనరల్, అడ్వకేట్ జనరల్,పంచాయతీరాజ్ వ్యవస్థ; కేంద్ర-రాష్ట్ర సంబంధాలు; ఇటీవల కాలంలో చర్చనీయాంశంగా మారిన అంశాలు.
- **ఎకానమీ:** ఆర్థికాభివృద్ధిలో సహజవనరులు-మూలధన వనరుల పాత్ర; ఆర్థిక వ్యవస్థలో వివిధ రంగాల ప్రగతి(వ్యవసాయ రంగం, పారిశ్రామిక రంగం, సేవారంగం); ఆర్థిక సంస్కరణల నేపథ్యంలో దేశంలో ఆర్థిక-సాంఘికాభివృద్ధి; పారిశ్రామిక తీర్మానాలు-వ్యవసాయ విధానం; నీతి ఆయోగ్; బ్యాంకింగ్ రంగం ప్రగతి-సంస్కరణలు; తాజా మానవాభివృద్ధి, ప్రపంచ అభివృద్ధి నివేదికలు; ఎకనామిక్ సర్వే, బడ్జెట్.
- **సైన్స్ అండ్ టెక్నాలజీ:** పరీక్షకు ముందు ఏడాది కాలంలో ఇస్రో ప్రయోగించిన ఉపగ్రహాలు; ఇటీవల కాలంలో సంభవిస్తున్న వ్యాధులు-కారకాలు; ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అందుకు సంబంధించి ప్రభుత్వ పరంగా తీసుకుంటున్న చర్యలు; రక్షణ రంగంలో కొత్త మిస్సైల్స్ ప్రయోగాలు; ముఖ్యమైన ఘట్టాలు, సంఘటనలు; ఏడాది కాలంలో జరిగిన జాతీయ, అంతర్జాతీయ పరిణామాలు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలి
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** ఫిబ్రవరి 21, 2023
- **ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ:** ఫిబ్రవరి 22-28, 2023
- **ప్రిలిమ్స్ పరీక్ష తేదీ:** మే 28, 2023
- **తెలుగు రాష్ట్రాల్లో ప్రిలిమ్స్ పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, వరంగల్, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, అనంతపురం
- **వెబ్‌సైట్:** www.upsc.gov.in

చార్‌దాం యాత్ర

📞 7032666921, 8106201230, 9100090873, 7032666925

అమర్ నాథ్ యాత్ర

📞 7032666927, 9642381234, 9121143963, 9100090934

గంగా పుష్కరాలు

స్పెషల్ ఫ్లైట్ ప్యాకేజీ కలవు

📞 9154086389, 9100090864, 9121143960

బ్యాంకాక్ ఫ్లైట్ 32,999/-

3N/4D | Per Person

📞 9177333673, 7055705538, 7032666922

ముక్తినాథ్-నేపాల్

📞 7032666925, 8106201230, 7032666921, 9100090873

2023 ట్రావెల్ ఎక్స్‌పో జరుగుతున్నది. ఈ ఎక్స్‌పో లో బుక్ చేసుకున్నవారికి భారీ డిస్కౌంట్ కలదు.

: OUR PACKAGES :

- సిమ్లా - మనాలి
- గ్యాంగ్‌టక్ - డార్జిలింగ్
- గౌహతి - షిల్లాంగ్
- శ్రీనగర్ - కాశ్మీర్
- కేరళ
- కర్ణాటక
- తమిళనాడు టూర్
- గుజరాత్ దర్శన యాత్ర
- రాజస్థాన్ యాత్ర
- సింగపూర్ - మలేసియా
- కంబోడియా - వియాత్నం
- దుబాయ్ స్పెషల్ టూర్
- శ్రీలంక స్పెషల్ టూర్
- బాలి - ఇండోనేషియా
- యూరప్ టూర్
- కైలాసమానస సరోవర యాత్ర

R.V. TOURS AND TRAVELS PRIVATE LIMITED

HYDERABAD | VIJAYAWADA | VISHAKAPATNAM | TIRUPATI

Cell : 9100090938, 9100090875, 9121143964, 9121143957



స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	124	60,683
నిఫ్టీ ▽	37	17,856

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం ముగింపు)			
నాస్‌డాక్	11,718	▽	71
డోజోన్స్	33,869	△	169
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,882	△	29
డాక్స్	15,308	△	215
షాంఘై	3,261	▽	10
నికాయ్	27,671	△	87

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	80.67	84.35
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	86.60	90.50
€	యూరో	ఎస్‌బీఐ	97.57	102.35
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	50.00	76.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.74	59.55
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	59.83	64.37
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.00	22.68
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.56	23.36
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.99	13.07

ఇల్లు కొనాలా.. అద్దెకు ఉండాలా..?

రెండింటికీ పన్ను ప్రయోజనాలు
- అవసరాన్ని బట్టి నిర్ణయం
- వేర్వేరుగా పన్ను భారం
- రుణంపై ఇంటితో ఆస్తి సమకూరినట్లే
- కానీ అద్దెతో పోలిస్తే రుణ ఈఎంఐ అధికం

సొంతంగా ఇల్లు సమకూర్చుకోవాలా..? లేదంటే అద్దె ఇంట్లో ఉంటే ప్రయోనమా? ఈ విషయంలో చాలా మంది అయోమయాన్ని ఎదుర్కొంటూ ఉంటారు. నిజానికి గణాంకాల సహితంగా తెలుసుకుంటే కానీ, తీరే సందేహం కాదు ఇది. అప్పు తీసుకుని అయినా ఇల్లు సమకూర్చుకోవాలని, అదే లాభదాయకమని కొందరు బలంగా నమ్ముతుంటారు. భూమి ధర ఎప్పటికైనా పెరిగేదే కదా, దీనితో ఆస్తి విలువ ఇతోధికం అవుతుందని భావిస్తుంటారు. కానీ, గతంలో ఉన్నంతగా భూమి విలువ వృద్ధి ఇక ముందూ ఉంటుందని చెప్పలేం. అలాగే, సొంతిల్లు పనిచేస్తున్న ప్రదేశానికి సమీపంలో ఉంటుందని కూడా చెప్పలేం. ఇదే నిజమైతే కార్యాలయానికి వచ్చి వెళ్లేందుకు రోజూ అదనపు సమయం, ఇంధనం రూపేణా అధికంగా ఖర్చు చేయాల్సి వస్తుంది. అయినా కానీ, ఇల్లంటే నాలుగు గోడలు కాదు.. ఎన్నో జ్ఞాపకాలు, కలల నిలయం అని ఎక్కువ మంది చెబుతారు. కనుక సొంతింటి కలను రుణం రూపంలో నెరవేర్చుకుంటే లేదా అద్దె ఇంట్లో ఉంటే పన్ను కోణంలో ఉండే లాభ, నష్టాలను తెలుసుకుందాం.





సొంతింటి కల..

రుణంపై సొంత ఇంటిని సమకూర్చుకుంటే మంచి పన్ను ఆదా ప్రయోజనాలు 'ఆదాయపన్ను పాత విధానం'లో ఉన్నాయి. నెలవారీ చెల్లించే ఈఎంఐ మొత్తంలో అసలు, వడ్డీ రెండు భాగాలు. ఈఎంఐలో భాగంగా చెల్లించే రుణం అసలును సెక్షన్ 80సీ కింద క్లెయిమ్ చేయొచ్చు. అలాగే, ఇంటి కొనుగోలుకు చెల్లించిన స్టాంప్ డ్యూటీ చార్జీలు, రిజిస్ట్రేషన్ ఫీజులను కూడా సంబంధిత ఆర్థిక సంవత్సరంలో సెక్షన్ 80సీ కింద చూపించి పన్ను మినహాయింపు ప్రయోజనాన్ని పొందొచ్చు. వడ్డీ విషయానికొస్తే.. కొనుగోలు చేసిన ఇంట్లోనే నివాసం ఉండే వారు ఇంటి రుణంపై చెల్లించే వడ్డీ భాగం ఒక ఆర్థిక సంవత్సరంలో గరిష్ఠంగా రూ.2 లక్షల మొత్తంపై పన్ను చెల్లించక్కర్లేదు. అంటే ఆదాయంలో రూ.2 లక్షల మేర గృహ రుణానికి చెల్లిస్తున్న వడ్డీ కింద మినహాయింపు చూపించుకోవచ్చు. ఒకవేళ ఇంటిని అద్దెకు ఇచ్చినట్టయితే.. ఆ ఇంటి రుణానికి ఒక ఆర్థిక సంవత్సరంలో చెల్లించే వడ్డీతో పాటు ఆ ఇంటికి చెల్లించే మున్సిపల్ ట్యాక్స్, అద్దె ఆదాయంలో 30 శాతాన్ని స్టాండర్డ్ డిడక్షన్ కింద క్లెయిమ్ చేసుకోవచ్చు. ఇక మొదటిసారి ఇంటిని కొనుగోలు చేసిన వారు అదనంగా రూ.1.5 లక్షల వడ్డీ చెల్లింపులను సెక్షన్ 80ఈఈఏ కింద పన్ను మినహాయింపు క్లెయిమ్ చేసుకోవచ్చు. కాకపోతే సదరు రుణం 2019 ఏప్రిల్ 1 నుంచి 2022 మార్చి 31 మధ్య కాలంలో మంజూరై ఉండాలి. ఇంటి స్టాంప్ డ్యూటీ విలువ రూ.45లక్షలు మించకూడదన్నది షరతు. ఇప్పటి వరకు చెప్పుకున్న ప్రయోజనాలు ఆదాయపన్ను కొత్త విధానంలో లేవు.

ఎవరికి ఎలా ప్రయోజనం..?

ఎక్స్ అనే వ్యక్తి స్థూల వార్షిక ఆదాయం రూ.20లక్షలు. నెలవారీగా అద్దె కింద రూ.30వేలు చెల్లిస్తున్నాడు. వై అనే వ్యక్తి వార్షిక ఆదాయం కూడా రూ.20 లక్షలే. కానీ, అతడు సొంత ఇంట్లో నివసిస్తున్నాడు. ఇంటి రుణంపై ఏటా రూ.3 లక్షలు వడ్డీ కింద, రూ.1.5 లక్షలు అసలు కింద చెల్లిస్తున్నాడు. ఇప్పుడు వీరికి నికర పన్ను భారం (ఆదాయపన్ను పాత విధానం కింద) ఎలా ఉంటుందని చూస్తే.. (పక్క బాక్స్‌లో) ⟶

	ఎక్స్	వై
మూల వేతనం (రూ.లలో)	10,00,00	10,00,000
హెచ్ఆర్ఏ	5,00,000	5,00,000
స్పెషల్ అలవెన్స్	5,00,000	5,00,000
స్థూల వేతనం	20,00,000	20,00,000
హెచ్ఆర్ఏ మినహాయింపు	-2,60,000	...
స్టాండర్డ్ డిడక్షన్	-50,000	-50,000
నికర వేతనం	16,90,000	19,50,000
ఇంటిపై ఆదాయం	...	-2,00,00
స్థూల మొత్తం ఆదాయం	16,90,000	17,50,000
80సీ డిడక్షన్	1,50,000	1,50,000
నికర పన్ను ఆదాయం	15,40,000	16,00,000
మొత్తం పన్ను	2,85,480	3,04,200

సెటాఫ్, క్యారీఫార్వార్డ్

రుణంపై కొనుగోలు చేసిన ఇంటిలో సొంతంగా నివసించే వారు అద్దె రూపంలో ఎలాంటి ఆదాయం లేనట్టయితే.. ఇంటి రుణంపై చెల్లించే వడ్డీని నష్టంగా చట్టం పరిగణిస్తుంది. దీన్ని వేతనం, ఇతర రూపాల్లో వచ్చే ఆదాయం కింద సర్దుబాటు చేసుకోవచ్చు. గరిష్ఠంగా రూ.2లక్షల మొత్తంపై పన్ను మినహాయింపు క్లెయిమ్ చేసుకోవచ్చు. వడ్డీ మొత్తం ఇంతకంటే ఎక్కువ ఉంటే, ఆ నష్టాన్ని తదుపరి ఎనిమిది ఆర్థిక సంవత్సరాల్లో (క్యారీ ఫార్వార్డ్) ఇతర ఆదాయంతో సర్దుబాటు చేసుకునేందుకు అవకాశం ఉంది. ఒక వ్యక్తి రెండు కంటే ఎక్కువ ఇళ్లు కలిగి ఉంటే నోషనల్ రెంట్ అంశం తెరపైకి వస్తుంది. రెండు ఇళ్లనూ సొంతానికి వినియోగించుకుంటున్నారని అనుకుంటే, మిగిలిన ఇళ్లను అద్దెకు ఇచ్చినా ఇవ్వకపోయినా.. చట్టం కింద ఇచ్చినట్టుగానే పరిగణిస్తారు. మార్కెట్లో ఉన్న సగటు అద్దె ధరలపై పన్ను చెల్లించాల్సి ఉంటుంది.

అనుకూలతలు: అద్దె ఇంటితో పోలిస్తే సొంతిల్లు తీసుకోవడం వల్ల ఆస్తి సమకూరుతుంది. ఇంటి రుణానికి చేసే అసలు, వడ్డీ చెల్లింపులపై పన్ను మినహాయింపు ప్రయోజనాలు పొందొచ్చు.

ప్రతికూలతలు: రుణంపై తీసుకున్నప్పటికీ, పన్ను చెల్లింపుదారుడు డౌన్ పేమెంట్ కింద తన వంతు వాటా కట్టాల్సి ఉంటుంది. ప్రాపర్టీ ట్యాక్స్‌లను ఏటా చెల్లించాలి. రిజిస్ట్రేషన్, స్టాంప్‌డ్యూటీ చార్జీలు అదనం. ఇంటికి మరమ్మతుల కోసం వెచ్చించాలి. విక్రయించాలంటే వెంటనే అమ్ముడుపోకపోవచ్చు. అంటే లిక్విడిటీ తక్కువ. ప్రాపర్టీ ధర పెరుగుతుందని, గణనీయంగా పెరుగుతుందని కచ్చితంగా చెప్పలేం. ఉద్యోగం లేదా ఆదాయం నిలిచిపోయినా రుణం, దానిపై వడ్డీ చెల్లించాల్సిందే. చిన్న ఇంటికి వెళ్లి అద్దె భారం తగ్గించుకునే అవకాశం ఉండదు.

అద్దె ఇంట్లో ఉండే వారికి

కంపెనీలు తమ ఉద్యోగులకు హౌస్ రెంట్ అలవెన్స్ (హెచ్ఆర్ఏ) ని వేతనంలో భాగంగా ఇస్తుంటాయి. ఈ భాగానికి పన్ను ప్రయోజనం ఉంటుంది. స్థూల పన్ను వేతనంలో గరిష్ఠంగా రూ.5,000 వరకు ఉంటుంది. కాకపోతే హెచ్ఆర్ఏకి పన్ను మినహాయింపు పొందాలంటే పనిచేస్తున్న కార్యాలయం ప్రాంతంలోనే సొంత ఇల్లు కలిగి ఉండకూడదనేది షరతు.

పన్ను ప్రయోజనాలు: అద్దె ఇంట్లో ఉండే వారు, వేతనంలో భాగంగా పొందిన హెచ్ఆర్ఏపై పన్ను మినహాయింపును క్లెయిమ్ చేసుకోవచ్చు. కాకపోతే, హెచ్ఆర్ఏపై పన్ను మినహాయింపునకు కొన్ని షరతులు ఉన్నాయి. మూల వేతనం, కరువు భత్యం మొత్తంలో 10 శాతం. లేదంటే ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నైలో నివసించే వారు వేతనంలో 50 శాతం, మిగిలిన పట్టణాల్లో నివసించే వారు 40 శాతాన్ని హెచ్ఆర్ఏ పన్ను మినహాయింపు కింద చూపించుకోవచ్చు. లేదా అసలు హెచ్ఆర్ఏ రూపంలో తీసుకున్న మొత్తం.. ఈ మూడింటిలో తక్కువ మొత్తంపైనే పన్ను మినహాయింపును క్లెయిమ్ చేసుకోవడానికి ఆదాయ పన్ను చట్టం అనుమతిస్తుంది.

అనుకూలతలు: రుణంతో ఇల్లు కొనుగోలు చేస్తే చెల్లించాల్సిన ఈఎంఐ కంటే, అద్దె ఇంటి కోసం చెల్లించే మొత్తం తక్కువగా ఉంటుంది. అద్దె ఇల్లు అయితే పనిచేసే ప్రాంతానికి అతి సమీపంలో లేదా కావాల్సిన చోట ఉండొచ్చు. సొంతిల్లు అయితే అందుబాటు ధర కోసం, పట్టణానికి వెలుపలి ప్రాంతాల్లో కొనుగోలు చేయాల్సి (ఎక్కువ మంది విషయంలో) వస్తుంది. అద్దె ఇలు అయితే కోరుకున్నప్పుడు ఇల్లు మారిపోవడం సులభం. చెల్లించే అద్దెపై పన్ను మినహాయింపు తీసుకోవచ్చు.

ప్రతికూలతలు: అద్దె ఇంట్లో ఉంటే ఆస్తి సమకూరదు. ఏటా అద్దె పెరుగుతూ ఉంటుంది. నచ్చినట్టుగా ఇంటిని నిర్మించుకోలేరు. ఇంటి యజమానికి నచ్చకపోయినా ఖాళీ చేయాల్సి వస్తుంది.

మిరే అసెట్ నుంచి గోల్డ్ ఈటీఎఫ్



మిరే అసెట్ మ్యూచువల్ ఫండ్ గోల్డ్ ఈటీఎఫ్ పేరిట కొత్త ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్‌ను (ఈటీఎఫ్) ఆవిష్కరించింది. ఇది ఫిబ్రవరి 15 వరకూ పెట్టుబడులకు అందుబాటులో ఉంటుంది. అలాట్‌మెంట్ తర్వాత అయిదు రోజుల్లో ఈటీఎఫ్‌ను లిస్ట్ చేస్తారు. ఫిబ్రవరి 21 నుంచి ఈ ఈటీఎఫ్ యూనిట్ల క్రయవిక్రయాలు ప్రారంభమవుతాయి. కనీసం రూ. 5,000 నుంచి ఇన్వెస్ట్ చేయొచ్చు. ప్రతీ యూనిట్ విలువ 0.01 గ్రాము బంగారానికి సరిసమానంగా ఉంటుంది. ద్రవ్యోల్బణానికి హెడ్జింగ్ సాధనంగా బంగారాన్ని పరిగణిస్తారు. ప్రస్తుతం ద్రవ్యోల్బణం పెరుగుతుండటం, దాన్ని కట్టడి చేసేందుకు రిజర్వ్ బ్యాంక్ వడ్డీ రేట్లను పెంచుతుండటం వంటి అంశాలు బంగారానికి ఊతంగా ఉండగలవని అంచనాలు నెలకొన్నాయి. షేర్ల తరహాలోనే స్టాక్ ఎక్స్ఛేంజీల్లో అమ్మడం, కొనడానికి వీలుగా ఉండటం, భౌతిక బంగారంతో పోలిస్తే సురక్షితంగా డిజిటల్ ఫార్మాట్‌లో భద్రపర్చుకునే వెసులుబాటు ఉండటం తదితర ప్రయోజనాలు గోల్డ్ ఈటీఎఫ్‌లలతో ఉంటాయని సంస్థ హెడ్ (ఈటీఎఫ్ ప్రోడక్ట్) సిద్ధార్థ్ శ్రీవాస్తవ తెలిపారు.

యాక్సిస్ 2027 గిల్ట్ ఫండ్




యాక్సిస్ మ్యూచువల్ ఫండ్ తాజాగా యాక్సిస్ క్రిసిల్ ఐబీఎక్స్ 50:50 గిల్ట్ ప్లస్ ఎస్‌డీఎల్ సెప్టెంబర్ 2027 ఇండెక్స్ ఫండ్‌ను ప్రకటించింది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ ఫిబ్రవరి 21తో ముగుస్తుంది. కనీసం రూ. 5,000 నుంచి ఇన్వెస్ట్ చేయొచ్చు. ప్రస్తుతం కీలక వడ్డీ రేట్లు గరిష్ఠ స్థాయికి చేరుకున్న నేపథ్యంలో రుణ సాధనాల్లో పెట్టుబడులు పెట్టడం ద్వారా మధ్య, దీర్ఘకాలంలో అధిక రాబడులను అందించేందుకు ఈ ఫండ్ ప్రయత్నిస్తుందని సంస్థ ఎండీ చంద్రేశ్ నిగమ్ తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

13-2-2023	
విశాఖ	440-00
చిత్తూరు	448-00
విజయవాడ	408-00
12-2-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	380-00
వరంగల్	382-00
రిటైల్ ధర	4.40

స్టాక్స్ వ్యూ

ఫెడరల్ బ్యాంక్ | యాక్సిస్ సెక్యూరిటీస్ | కొనొచ్చు



ప్రస్తుత ధర: రూ. 132 టార్గెట్: రూ. 170

ఎందుకంటే: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2022-23) మూడో త్రైమాసికంలో ఫెడరల్ బ్యాంక్ ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. వార్షికంగా అడ్వాన్సులు(రుణాలు) 19 శాతం వృద్ధి చూపగా.. వీటిలో ఆటో 27 శాతం, సీవీ 65 శాతం, కార్పొరేట్ బుక్ 19 శాతం చొప్పున పుంజుకున్నాయి. నికర వడ్డీ ఆదాయం(ఎన్ఐఐ) 27 శాతం జంప్‌చేసింది. నికర వడ్డీ మార్జిన్లు 0.22% బలపడి 3.49 శాతాన్ని తాకాయి. కీలకమైన ఫీజు ఆదాయంలో సైతం 32 శాతం వృద్ధి నమోదైంది. దీంతో వడ్డీయేతర ఆదాయం 10% మెరుగుపడింది. ప్రొవిజన్లు మందగించగా.. క్రెడిట్ వ్యయాలు 0.47 శాతంగా నమోదయ్యాయి. దీంతో క్యూ3లో బ్యాంక్ లాభదాయకత ఊపందుకుంది. వెరసి నికర లాభం 54 శాతం దూసుకెళ్లింది. పటిష్ట రికవరీల కారణంగా రుణ నాణ్యత స్వల్పంగా మెరుగుపడింది. అయితే పునర్వ్యవస్థీకరించిన రుణాల నుంచి స్లిప్పేజీలు, రిటైల్ విభాగంలో స్వల్పంగా పెరిగాయి. రుణ వృద్ధిలో జోరు, అత్యధిక ఈల్డ్స్ అందించే ప్రొడక్టుల వాటా పెరగడం, క్రమంగా తగ్గుతున్న నిర్వహణా వ్యయాలు, మందగిస్తున్న క్రెడిట్ వ్యయాల ప్రభావంతో ఆర్‌వోఏ, ఆర్‌వోఈ పెంచుకునే బాటలో సాగుతోంది.

అపోలో హాస్పిటల్స్ | మోతీలాల్ ఓస్వాల్ | కొనొచ్చు



ప్రస్తుత ధర: రూ. 4,408 టార్గెట్: రూ. 5,600

ఎందుకంటే: గత ఐదేళ్లుగా ఆరోగ్య పరిరక్షణ దిగ్గజం అపోలో హాస్పిటల్స్ అత్యుత్తమ పనితీరు చూపుతోంది. వార్షికంగా సగటున నిర్వహణా లాభం(ఇబిటా) 24 శాతం చొప్పున పుంజుకోగా.. నికర రుణ భారాన్ని సగానికి తగ్గించుకుంది. మరోపక్క తక్కువ పన్ను రేటు కారణంగా లబ్ధి పొందుతోంది. రానున్న మూడేళ్ల(2023-25) కాలంలో హెల్త్‌కేర్ సర్వీసుల విభాగం ఔట్‌లుక్ అత్యంత ఆశావహంగా కనిపిస్తోంది. భారీ వృద్ధిని సాధించే అవకాశముంది. వార్షికంగా నిర్వహణ లాభం 17 శాతం మెరుగుపడే వీలుంది. ఇందుకు స్థూల ఆర్థిక అంశాలు, సంస్థ పటిష్ట నిర్వహణ ఇందుకు దోహదం చేయనున్నాయి. బీమా ఆధారిత పేషంట్లు, విదేశీ కస్టమర్ల మిక్స్ ద్వారా ఆదాయం పుంజుకునే అవకాశముంది. హెల్త్‌కేర్ విభాగం ఆదాయంలో బీమా ఆధారిత రోగుల విభాగం నుంచి 45 శాతం సమకూరుతోంది. అంతర్జాతీయ పేషంట్ల సర్వీసుల నుంచి 6 శాతం లభిస్తోంది. ఇది పడక (బెడ్) నిర్వహణ సగటు ఆదాయాన్ని(ఏఆర్‌పీవోబీ) మెరుగుపరిచే వీలుంది. ఈ ఏడాది(2022-23) తొలి అర్ధభాగంలో ఆక్యుపెన్సీ 64 శాతానికి చేరింది. రానున్న ఐదేళ్లలో 2,000 పడకల సామర్థ్యాన్ని పెంచుకునేందుకు సంస్థ భారీ పెట్టుబడులు వెచ్చించనుందని కంపెనీ వర్గాలు పేర్కొంటున్నాయి.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

రిలయన్స్ 'హెల్త్ ఇన్ఫినిటీ' ప్లాన్‌లో డిస్కౌంట్



హైదరాబాద్: ఆర్థిక సామర్థ్యం దిశగా కస్టమర్లను ప్రోత్సహించేందుకు రిలయన్స్ జనరల్ ఇన్సూరెన్స్ పరిశ్రమలోనే ఓ కొత్త ప్రయత్నానికి నాందీ పలికింది. మంచి క్రెడిట్ స్కోర్ ఉన్న వారికి రిలయన్స్ హెల్త్ ఇన్ఫినిటీ ప్లాన్ ప్రీమియంలో 7.5 శాతం తగ్గింపునిస్తోంది. బాడీ మాస్ ఇండెక్స్ ఆరోగ్యకర స్థాయిలో ఉండే వారికి కూడా ప్రీమియంలో డిస్కౌంట్ ఇస్తోంది. తద్వారా మంచి ఆరోగ్య అలవాట్ల దిశగా పాలసీదారులను ప్రోత్సహించనుంది. ముందస్తు వ్యాధి నిరోధక టీకాలను తీసుకునే కస్టమర్లకు కూడా ప్రీమియంలో 2.5 శాతం డిస్కౌంట్ ఇస్తోంది. న్యూమోకొక్కల్, హ్యూమన్ పాపిలోమా వైరస్ తీసుకున్న వారు సైతం ప్రీమియంలో తగ్గింపు పొందొచ్చు.

మంచి ఫండ్‌ను గుర్తించడం ఎలా?

Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్





ఫ్లెక్సీక్యాప్, లార్జ్ అండ్ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ ఫండ్స్‌లో ఒకేసారి, ఒకటికి మించిన ఫండ్ విభాగాల్లో ఇన్వెస్ట్ చేయవచ్చా? – వెంటక రమణ

మీరు సంక్లిష్టతను ఇష్టపడే వారు అయితే అప్పుడు ఒకటికి మించిన విభాగాల్లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. కాకపోతే నిర్ణీత కాలానికి ఒకసారి పోర్ట్‌ఫోలియోని రీబ్యాలన్స్ (సమీక్ష/మార్పులు, చేర్పులు) చేసుకోవడం మర్చిపోవద్దు. ఇలా ఎన్నో విభాగాల మధ్య వర్గీకరించినప్పుడు అది గజిబిజీగా, పన్ను పరంగా అనుకూలం కాకపోవచ్చు. దీనికి ప్రత్యామ్నాయంగా ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఎందుకంటే ఈ పథకాలు వివిధ మార్కెట్ విలువ కలిగిన కంపెనీల్లో (స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్, లార్జ్‌క్యాప్) ఇన్వెస్ట్ చేస్తుంటాయి. కాకపోతే ఆయా విభాగాలకు కేటాయించే మొత్తం వేర్వేరుగా ఉండొచ్చు. సాధారణంగా ఫ్లెక్సీక్యాప్ పథకాలు తమ నిర్వహణలోని పెట్టుబడుల్లో 70-75 శాతాన్ని లార్జ్‌క్యాప్ పథకాల్లో ఇన్వెస్ట్ చేస్తుంటాయి. మిగిలిన పెట్టుడులను మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ పథకాలకు కేటాయిస్తుంటాయి. కనుక మీరు రెండు నుంచి మూడు ఫ్లెక్సీక్యాప్ పథకాల్లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఫ్లెక్సీక్యాప్ పథకాలు ఎక్కువ మొత్తాన్ని లార్జ్‌క్యాప్ కంపెనీల్లో ఇన్వెస్ట్ చేస్తాయి. కనుక మీరు విడిగా లార్జ్‌క్యాప్ ఫండ్స్‌ను ఎంపిక చేసుకోవాల్సిన అవసరం లేదు. పెట్టుబడుల విషయంలో మరింత దూకుడుగా, రిస్క్ తీసుకునే వారు, ఫ్లెక్సీక్యాప్‌నకు అదనంగా 10-15 శాతం పెట్టుబడులను మిడ్, స్మాల్‌క్యాప్‌నకు కేటాయించుకోవడం ద్వారా ఎక్కువ రాబడులు సొంతం చేసుకోవచ్చు.

మంచి మ్యూచువల్ ఫండ్‌ను గుర్తించడం ఎలా? అలాగే, ఏడాది కోసం ఒక మంచి పథకాన్ని సూచించగలరు. ఏడాదికి 12 శాతం కాంపౌండెడ్ రాబడి నా లక్ష్యం. – ఇమ్రత్ సూతర్

చాలా విస్తృత శ్రేణిలో వేలాది పథకాలు ఉన్నప్పుడు సరైన పథకం ఎంపిక అన్నది కష్టమైన పనే. అయితే మంచి పథకం ఎంపికకు రాబడులు ఒక్కటే ప్రామాణికంగా తీసుకోకూడదు. పెట్టుబడి పెట్టడానికి ముందు మీ లక్ష్యాలను గుర్తించాలి. మీ పెట్టుబడుల లక్ష్యం ఆధారంగానే ఎలాంటి పథకం ఎంపిక చేసుకోవాలన్నది ఆధారపడి ఉంటుంది. దీర్ఘకాలంలో సంపద సృష్టించుకోవాలన్నది మీ లక్ష్యం అయితే అందుకు ఈక్విటీ పథకాలపై దృష్టి పెట్టాలి. అలా కాకుండా క్రమం తప్పకుండా ఆదాయం కోరుకుంటుంటే స్థిరాదాయ పథకాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుంది. ఇక రిస్క్ ఎంత తీసుకోగలరు? అన్నది కూడా ముఖ్యమైన అంశం అవుతుంది. మీ పెట్టుబడులు విలువ పడిపోతూ, పెరుగుతూ ఉన్నా ఫర్వాలేదని అనుకుంటే అప్పుడు ఈక్విటీలు అనుకూలం. లేదా రిస్క్ లేని రాబడులు కోరుకుంటే డెట్ విభాగం అనుకూలం. అధిక రాబడులు ఇచ్చే సాధనాలు ఏవైనా అందులో అధిక రిస్క్ ఉంటుందని మర్చిపోవద్దు. రిస్క్, రాబడుల మధ్య సమతుల్యం అవసరం. పెట్టుబడులను ఎంత కాలం కొనసాగించాలని అనుకుంటున్నారు? లిక్విడిటీ సమస్యలు సమీప భవిష్యత్తులో ఉన్నాయా? తదితర అంశాలను చూడాలి. మ్యూచువల్ ఫండ్స్ అన్నవి మార్కెట్ రిస్క్‌పై ఆధారపడి నడుస్తుంటాయి. అందుకని కనీసం ఐదేళ్లకు తక్కువ కాకుండా ఈక్విటీ పెట్టుబడులు కొనసాగించుకోవాలి. ఈ అంశాలన్నింటినీ దృష్టిలో పెట్టుకుని, వీటికి సరితూగే పథకాన్ని ఎంపిక చేసుకోవాలి. ఇక ఏడాది కాలానికి 12 శాతం రాబడి కోరుకుంటే అది అసాధ్యమనే చెప్పుకోవాలి. ఎందుకంటే మార్కెట్లు కరెక్షన్‌లోకి వెళితే రాబడులు అటు ఉంచి, పెట్టుబడి విలువ తగ్గిపోతుంది. ఏడాది కోసం అయితే, ఎఫ్‌డీ తదితర సంప్రదాయ సాధనాలనే చూడాల్సి ఉంటుంది. వీటిల్లో మీరు కోరుకున్నంత రాబడి రాదు.

డిజీలాకర్‌తో ఫిన్‌టెక్ సేవలు విస్తృతం



అమర్‌దియో సింగ్
అడ్వైజరీ హెడ్, ఏంజెల్ వన్ లిమిటెడ్

భారత ఫిన్‌టెక్‌ను ఐదు విభాగాలుగా వేరు చూసి చూడొచ్చు. క్యూఆర్ కోడ్ తదితర చెల్లింపులు, బిల్లుల చెల్లింపులు, ఇతర అగ్రిగేటర్ సేవలు, బై నౌ, పే లేటర్ సహా రుణ సదుపాయం, రుణాలిచ్చే ప్లాట్‌ఫామ్‌లు, డిజిటల్ బ్యాంకింగ్ ప్లాట్‌ఫామ్‌లు, ఇన్సూరెన్స్ ప్లాట్‌ఫామ్‌లు, వెల్త్ మేనేజ్‌మెంట్ సంస్థలు. ఈ ప్లాట్‌ఫామ్‌లకు సంబంధించి సేవలు పొందాలంటే ప్రజలు గుర్తింపు పత్రాలను సమర్పించాల్సి (కేవైసీ) ఉంటుంది. గత కొన్నేళ్ల కాలంలో కేవైసీ ప్రక్రియను ఫిన్‌టెక్ సంస్థలు ఎంతో సులభతరం చేశాయి. ఫిన్‌టెక్ సంస్థలు డిజీలాకర్‌లో ఉన్న డాక్యుమెంట్లను పొందే అవకాశం కల్పిస్తామని 2023-24 బడ్జెట్‌లో భాగంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించడం నిజంగా ఒక పెద్ద మార్పు వంటిదే. డిజిటల్ ఇండియా మిషన్‌కు అనుగుణంగా భారత ప్రభుత్వం దేశంలో ఫిన్‌టెక్ పరిశ్రమ వృద్ధికి ఎన్నో సదుపాయాలు కల్పించింది. ఆధార్, పీఎం జన్ ధన్ యోజన, వీడియో కేవైసీ, యూపీఐ వంటివి ఎన్నో చేపట్టింది. ఫలితంగా భారత ఫిన్‌టెక్ పరిశ్రమ 2025 నాటికి 1.3 ట్రిలియ్ డాలర్ల స్థాయికి చేరుకోనుంది.



డిజీలాకర్

ప్రస్తుతం డిజీలాకర్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన డాక్యుమెంట్ల డిజిటల్ కాపీలు స్టోర్ చేసుకునేందుకు వినియోగిస్తున్నారు. ప్రభుత్వం తాజా నిర్ణయం ఇతర డాక్యుమెంట్లను సైతం డిజీలాకర్‌లో స్టోర్ చేసుకునే దిశగా ప్రోత్సహిస్తుంది. వెబ్‌బ్రౌజర్, మొబైల్ యాప్ రూపంలో అందుబాటులో ఉన్న డిజీలాకర్‌ను డిజీయాత్ర యాప్‌పై ఐడెంటిటీ వెరిఫికేషన్‌కు అనుమతిస్తున్నారు. దీంతో దేశీ విమానాశ్రయాల్లో కాంటాక్ట్‌లెస్ చెకిన్‌కు వీలు లభిస్తోంది.

డైనమిక్ కేవైసీ

డిజీలాకర్ సాయంతో కేవేసీ ప్రక్రియను మరింత సులభతరం చేయాలన్న ప్రభుత్వం నిర్ణయంతో కేవైసీ ప్రక్రియ క్రియాశీలంగా మారుతుంది. ఆధార్, పాన్ డేటా ఆధారంగా రిస్క్ సమీక్ష సాధ్యపడుతుంది. డిజిటల్ ఇండియా కార్యక్రమం దేశంలో మరింత విస్తరిస్తుంది. రుణాల లభ్యతను పెంచుతుంది. భారత ఫిన్‌టెక్ పరిశ్రమ దీర్ఘకాల వృద్ధికి బడ్జెట్ ఎంతో ముందడుగు వేసింది సాంకేతిక, విజ్ఞాన ఆధారిత వృద్ధి ప్రాధాన్యతను బడ్జెట్ గుర్తించింది. వివిధ ప్రభుత్వ ఏజెన్సీలు, నియంత్రణ సంస్థలు కలిగి ఉండే పౌరుల డేటా విషయంలో ఏకీకృత పరిష్కారంపై దృష్టి సారించింది. నేషనల్ డిజిటల్ లైబ్రరీ సహా ఇతర చర్యలు ఫిన్‌టెక్ పరిశ్రమ వృద్ధికి ఎంతో లబ్ధి కలిగిస్తాయి. క్రెడిట్ కార్డులు యూపీఐతో లింక్ చేయడానికి ఆర్‌బీఐ తీసుకున్న నిర్ణయం కూడా ఆహ్వానించతగినది.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.
Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.